# ద్వాదశాదిత్యులు

(శ్రీనాథ - పెద్దన - తిమ్మన - భట్టుమూర్తులు)

2
భాగము

ప్రణేత

కావ్య స్వరూప సారజ్ఞ - సారప్రకాశ నాభిజ్ఞ

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# ద్వాదశాదిత్యులు

(శ్రీనాథ - పెద్దన - తిమ్మన - భట్టుమూర్తులు)

## రెండవ భాగము

ప్రణేత

కావ్య స్వరూప సారజ్ఞ - సారప్రకాశ నాభిజ్ఞ

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

| | | |
|---|---|---|
| గ్రంథ నామము | : | ద్వాదశాదిత్యులు (రెండవ భాగము) |
| ప్రణేత | : | యల్లంరాజు శ్రీనివాసరావు |
| ముద్రణము | : | ప్రథమము |
| ముద్రణ కాలము | : | విరోధి - మార్గశిరము<br>డిసెంబర్ - 2009 |
| గ్రంథ మూల్యము | : | రూ. 100/- |
| ప్రతులు | : | 500 |
| డి.టి.పి. | : | రితిక్ ఇమేజస్<br>విజయవాడ - 520 002<br>సెల్: 9490 33 4097 |
| ముద్రాపకులు | : | శ్రీ పరమేశ్వరి ప్రెస్<br>విజయవాడ - 2 |
| ప్రాప్తి స్థానము | : | 1. యల్లంరాజు శ్రీనివాసరావు<br>F1, వేంకటసాయి టవర్స్,<br>పాపరాజు వీధి, సత్యనారాయణపురం<br>విజయవాడ - 520 011<br>ఫోన్ : 0866-2538526<br><br>2. చిట్టా కృష్ణ బ్రహ్మం<br>మానవ మందిరం రోడ్డు, భవానీపురం<br>విజయవాడ - 12<br>ఫోన్: 0866 - 2417891 |


Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# విషయ సంగ్రహము


1. శ్రీనాధుని - సార్వభౌమత్వము ........................ 5


2. అల్లసానివారి అల్లిక జిగిబిగి........................ 81

3. ముక్కు తిమ్మన ముద్దు పలుకు........................ 161

4. భట్టుమూర్తి - చిత్రకవిత్వము ........................ 229


Yallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

# అంకితము



పిచ్చయ్యగారు

నిచ్చలు కావ్యజాత కమనీయ కథారస పాత్ర భావనా
భ్యుచ్చయ శోభితం బయిన యుల్లము - ధర్మ పథానుగామియౌ
సచ్చరితంబు - సౌమ్య మృదు సాంత్వన భాషణ భూషణంబులౌ
పిచ్చయగారి కీ కృతిని ప్రీతిగ నిచ్చెద మామగారికిన్

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# శ్రీనాథుని - సార్వభౌమత్వము

పోతన మహాకవికి వీడ్కోలిచ్చి పంపామో లేదో వెంటనే లోపలికి వస్తున్నాడొక మహానుభావుడు. ఎలా ఉన్నదా విగ్రహం. ఏమి చెబుతారు లెండి. మొగానికి విభూతి రేఖలు – చెవులకు మణికుండలాలు. మెడలో పెద్ద పెద్ద రుద్రాక్షమాలలు. చేతులకు మకరతోడాలు. కాలికి గండపెండేరం. శరీరానికి చెంగావి పట్టువస్త్రం. దానిపై జరీ ఉత్తరీయం. జులుపాల జుట్టులో దాగి ఉన్న చిన్నశిఖ. ధవళ ధవళమైన యజ్ఞోపవీతం – పోతే పాదాలకు రత్నపాదుకలు. కుడిచేత ఒక మంచి బంగారు పొన్నుకఱ్ఱ పట్టుకొని ఒక దబ్బపండు వంటి పచ్చని ఛాయగల విగ్రహమది. ఆ ఠీవి చూస్తేనే తెలిసిపోతుంది ఒక మామూలు కవి కాడు. కవి లోక సార్వభౌముడని.

ఇంతకూ ఎవడా సార్వభౌముడు. ఎవడున్నాడిక శ్రీనాథకవి సార్వభౌముడే. సందేహం లేదు. సార్వభౌముడనే మాట ఆయనకే చెల్లు. మరెవరికీ గాదు. సార్వభౌముడంటే ఏమని అర్థం. సర్వభూమీ తనదేనని చాటేవాడు సార్వభౌముడు. సాహిత్యక్షేత్రమే ఇక్కడ సర్వభూమి. అదంతా

నాదేనని అందులో ఎక్కడబడితే అక్కడ వీరవిహారం చేసే వాడెవడో వాడే కవులలో సార్వభౌముడు. మిగతా కవుల కతడంతు పట్టడు. వారు కవులైతే తాను వారికి సార్వభౌముడు గదా. ఎలా అంతుపడతాడు. ఈ మాటే అన్నాడు శ్రీనాథుడు తన పరోక్ష గురువైన శ్రీహర్షుడనే మహాకవిని గూర్చి. **'కవికులా దృష్టాధ్వ గమనాధ్వనీను'**డట ఆ శ్రీహర్షుడు. కవితార్కిక చక్రవర్తి అని ఆ సంస్కృత మహాకవి చెప్పుకొన్న తన చిరునామా. అదే చిరునామా మన శ్రీనాధునిదీ.

నిజంగా ఒక సార్వభౌముడికెలాటి రాచఠీవి ఎలాటి దర్పమూ దర్జా ఉంటుందో లోకంలో- అలాటి దర్జాకే మాత్రమూ తీసిపోని దర్జా ఈ మహాకవిది. అది కొట్టవచ్చినట్టు కనిపిస్తుందతని రచనలలో ఎక్కడ చూచినా, రచన ఏమిటసలు. ఆయన జీవితంలోనే అలాంటి రాజసం మనకు కండ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఒక కళాకారుడి మనస్తత్త్వం అతని అభిరుచులూ జీవితంలో ఎలా కనిపిస్తుంటాయో అవే చాలావరకూ అతని మాటల్లో రచనల్లో కూడా సాక్షాత్కరిస్తాయి. ఆ మాటలే ఆయా సందర్భాల్లో అతని నోట పలికిన చాటువులు. ఆ రచనలే ఆయన పనికట్టుకొని వ్రాసిన గ్రంథాలు. **'కాటుక కంటినీరు - ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి - బాల రసాలసాల** - అనే పద్యాలు జనుల నోళ్లలో ఇంకా నలుగుతున్నాయంటే దానినిబట్టి పోతనామాత్యుని మనస్తత్త్వమేమిటో మనకర్థం కావటం లేదా. దాని కనుగుణంగానే కనపడటం లేదా ఆయన భాగవత రచన.

మరి ఆ బావగారిలాంటి వాడే ఈ మఱిదిగారు కూడా. తేడా ఎక్కడంటే బావగారిలో సాత్త్వికం పాలెక్కువ. రాజసం చాలా తక్కువ. ఈయనలో

Yalamanchili Brahmasri / www.advaitavedanta.in / Srinivasa Rao

అలా కాక రాజసమే నూటికి 90 వంతులు. సాత్త్వికం పది వంతులు. అది కేవలం అపరంజి అయితే ఇది కొంచెం రాగి కలిపిన బంగారం. అలా కలపకపోతే గట్టిలేదంటారు బంగారానికి. మంచి మంచి నగలు చేయించు కోవాలంటే ఎంత సువర్ణమైనా మరో వర్ణం కొంతకు కొంత కలిసి తీరవలసిందే నంటాడు శ్రీనాథుడు. అదే ఈ మహాకవిలో చోటు చేసుకొన్న రాజసం. సార్వభౌమ అనే బిరుదాన్ని ప్రసాదించింది కూడా అదే. ఆ రాజస స్వభావమే. ఈ బిరుదాయన స్వయంగా తగిలించుకొన్నది కాదు. **'చంద్రశేఖర క్రియాశక్తి రాయల యొద్ద - పాదుకొల్పితి సార్వభౌమ బిరుద'**మని ఆయనే కంఠోక్తిగా చెప్పుకొన్నాడు. క్రియాశక్తి ఒడయారులని పేరుగాంచిన రా యలాయన పాండిత్యానికీ కవితా ప్రాగల్భ్యానికీ మెచ్చి ఇచ్చిన బిరుదమట. ఒకడివ్వకపోయినా తనపాటికి తగిలించుకొనే బాపతా కవి. అంతటి ఆత్మవిశ్వాస మున్నవాడు. అలాంటిది గుణదోష వివేచనా దక్షుడైన ఒక దక్షిణాధీశు డొసగిన బిరుదయి నప్పుడిక చెప్పేదేముంది.

మొత్తానికి కవి సార్వభౌము డంటే శ్రీనాథుడే. ఒక సార్వభౌముడి కున్న రాజస మెలాంటిదో అలాంటిదీ ఈ కవిసార్వభౌముడి రాజసం కూడా. అది కావ్యరచనలే గాక అక్కడా ఇక్కడా ఆశువుగా దొరలిన ఆయనగారి చాటు పద్యాలే ఎంతగానో చాటి చెబుతున్నాయి మనకని గదా వాక్రుచ్చాము. చూడండి. రాజస స్వభావ మున్నవాడు తన జీవితం హాయిగా సాఫీగా నడిచేప్పుడెలా కనిపిస్తాడో అది బరువుగా కష్టంగా సాగుతున్నప్పుడు కూడా అలాగే కనిపిస్తాడు. బెంబేలు పడుతున్నట్టు బేజారయి పోయినట్టు పైకి ఏమాత్రమూ ప్రదర్శించడు. మేకపోతు గాంభీర్యంతోనే మాటాడుతుంటాడు.

శ్రీనాథుని జీవితం విషాదాంతంగానే ముగిసింది చివరకు. వినోద కాలం విషాద కాలంగా మారింది. అప్పుడు కూడా దైన్యం కనిపించదతని మాటల్లో.

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.anvaiyaarula.in

కవి రాజు కంఠంబు కౌగిలించెను గదా
పురవీధి నెదురెండ పొగడదండ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్లగుండు.
ఆంధ్ర నైషధ కర్త యంఘ్రి యుగ్మంబునఁ
దగిలి యుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెను గదా వెదురుగుదియ

చూచారా. ఏడునూర్లు శిస్తు చెల్లించలేదని శ్రీనాధునికి సర్కారువారు శిక్ష విధించారు. మెడకు పొగడదండ - కాళ్ళకు సంకెళ్ళు - చేతులకు వెదురు గుదియ - భుజం మీద ఇనుపగుండు పెట్టి తీసుకెళ్ళుతుంటే అప్పుడు కూడా ఎంత పట్టీ పట్టనట్టు సరదాగా కబుర్లు చెబుతున్నాడో చూడండి. ఆ కబుర్లలో ఎంత కవిత్వమున్నదో చూడండి. పొగడలత ఒకలతాంగి లాగా రాజుగారి కంఠాన్ని కౌగిలించుకొన్నదట. నైషధంలాంటి గొప్ప కావ్యసృష్టి చేసిన తన పాదాలకు సంకెల కాదది. పాదాల కభివాదనం చేస్తున్న రసికాగ్రగణ్యుడు. మరి ముంజేతికి తగిలిన వెదురు గుదియ ఏమిటో తెలుసా. తగలటం కాదది తన్ను వియ్యమందు కొంటున్నదట అది. పోతే భుజంమీది ఇనుపగుండు. తాను సార్వభౌముడు గదా. సార్వభౌములు మూపుమీద లోడీలు గరిడీలు తిప్పుట మలనాటు. అలాగే

ఒక గుండు భుజం మీద కెక్కించుకొని గరిడీ తిప్పటమది – అని దర్జాగా చెప్పుకొంటాడు. అవమానాన్ని కూడా తనలాటి ఒక మహాకవికి చేసిన సమ్మానంగా భావిస్తూ వ్యంగ్యంగా చెప్పిన ఈ మాటలలో కవితా కళ ఇంతగా తొంగి చూస్తున్నదంటే మహాద్భుతం.

ఇంతేనా. ఆఖరుకు జీవితావసానంలో కూడా బెంబేలు పడ్డవాడు కాదు శ్రీనాథుడు. అలాటి విషాద యోగంలో కూడా ఒక మహారాజు రాజసం తొంగిచూస్తూనే ఉందాయనలో. ఏమంటాడో తెలుసా **'కలి యుగంబున నికనుండఁ గష్టమనుచు – నరుగుచున్నాఁడు శ్రీనాథుఁడమర పురికి.'** ఈ పాడు కలికాలం తనలాటి గొప్పవ్యక్తి ఉండటానికి లాయకు కాదట. కనుక ఈ ప్రపంచాన్ని వదిలేసి అమరలోకానికి వెళ్లిపోతున్నాడట. స్వర్గమనక అమరపురి అనటం ఎంతో సాభిప్రాయం. అమర అంటే మరణం లేనిది. ఇహంలోనే గాని పరంలో మరణం లేదు. అది అమరం. అక్కడికి వెళ్లి ఎంతకాలమైనా దర్జాగా బ్రతకవచ్చు. అప్పుడే శ్రీనాథ మహాకవి బయలుదేరి వస్తున్నాడనే వార్త టీవీలో చూచి ఇక నాకు పరువు ప్రతిష్ఠ ఏముంటుందని ముందుగానే గుండెలు తట తట కొట్టుకొంటున్నాయట. ఎవరికి – అక్కడ ఉన్న మహాకవికి. ఎవరాయన. ఇంకెవరు. దేవతల ఆస్థాన విద్వాంసుడైన బృహస్పతి. ఇన్నాళ్లు ఎదురు లేకుండా జీవిస్తున్నాడిప్పుడు శ్రీనాథుని అంతటి కవిసార్వభౌముడు వస్తే ఇక తన ఆటలు సాగుతాయా చెప్పండి. ఇదీ శ్రీనాథుని దర్జా అంటే –

ఇందులో కూడా ఒక చమత్కార మేమంటే పద్యం పూర్తిగా వింటే మీకే తెలుస్తుంది.

కాశికా విశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబులే రాయఁడిచ్చు
కైలాస గిరిఁబండె మైలారు విభుఁడేగి
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు
రంభంగూడెఁ దెనుంగు రాయ రాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సన మంత్రి మరి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు

చూచారా. తనకు మిత్రులూ ఆప్తులూ అయిన వారందరూ తన కళ్ల ముందే కాలం చేశారని దిగులు పడుతున్నట్టు పైకి కనిపిస్తున్నా వారు లేనందువల్ల తనకు దక్కవలసిన భోగభాగ్యాలన్నీ దక్కకుండా పోయాయే. తనకిక రాజోపచారాలన్నీ ఎలా జరుగుతాయా అనే భావం కూడా వ్యంగ్యంగా స్ఫురిస్తుం దాయన మాటల్లో. ఏమిటా భోగాలు. రత్నాంబరాలూ- తాను చేసే దినవెచ్చం తీర్చటం - కస్తూరి లోనగు సుగంధ ద్రవ్యాలూ - బంగారు కంచంలో షడ్రసోపేతమైన భోజనం. ఇంతకూ వారు లేకపోయినందుకా పరితాపం - వారు తనకు చేసే ఉపచారాలు లేనందుకా - ఏదైనా కావచ్చు.

ఒక మహారాజులాగా బ్రతికాడు బ్రతికినంత కాలమూ ఈ కవిరాజు. రాజుగారిలాగానే భోగానుభవానికి బాగా అలవాటుపడిన ప్రాణి. ఒక్కసారిగా అవి దక్కకపోతే తట్టుకోగలడా. ఏమగు చచ్చినా బ్రతికినా ఖరీదే. జీవితాంతంలోనే గాంభీర్య మేమాత్రమూ సడలని ఈ మహానుభావుడిక

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

జీవిత మధ్యంలో ఎంత రాజసంగా బ్రతికి ఉంటాడో ఆలోచించండి. తనకు కస్తూరి కరవయిందని విచారించిన సందర్భం చూచాము గదా. మరి అంతకు పూర్వమదే కస్తూరి నెంత దర్జాగా అడిగి పుచ్చుకొన్నాడో చూడండా తెనుగు రాయని దగ్గర.

**అక్షయ్యంబుగ సాంపరాయని తెనుంగా ధీశ - కస్తూరికా**
**భిక్షా దానము సేయరా - సుకవిరా డ్బృందారక శ్రేణికిన్**
**దాక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరోభామినీ**
**వక్షో జద్వయ కుంభి కుంభములపై వాసించుఁదద్వాసనల్**

అక్షయంగా ఇస్తూ ఉండాలట తనకు కస్తూరి. తనకొకడికే గాదు సుమా. తనతో పాటు వచ్చిన వారందరికీ. ఎవరు వారు. కవులు కారు. కవిరాట్టులు. కవిరాజులకు దేశమేలే రాజే ఇవ్వాలది. భిక్షా దానము చేయాలట. భిక్షానికి వచ్చినా బెట్టు తప్పదు. కవి రాజు గదా తాను. మరొక రాజును ఎలా యాచిస్తాడు దేహి అని. అతడే అర్థం చేసుకొని తన కోరిక తీర్చాలి. తీర్చాలోయని డిమాండు చేస్తున్నాడు. ఎంత చనవో చూడండి రాజుల దగ్గర ఈ కవిరాజుకు. మరి ఆ కస్తూరి తన కిస్తే ఏం చేస్తాడు. ఏమి చేస్తాడో వాచా చెప్పడు. వ్యంగ్యంగా సూచిస్తున్నాడు. దాని వాసనలు దాక్షారామ భీమవర వేశ్యాజనం వక్షోజాలమీద అది విరజిమ్ముతుందట. అంటే వారి సాంగత్యంలో అది చరితార్థ మవుతుందని అర్థం.

ఇంత నాజూకైన మనిషికి పల్లెటూళ్లా అక్కడ మొరటుగా బ్రతికే మనుషులూ వారి భోజన భాజనాలూ వారి మాటలూ అలవాట్లూ నచ్చుతాయా చెప్పండి. ఏ మాత్రమూ రుచించవు. పచించవు. అందుకే

పలనాటి వీరులంటే గౌరవమున్నా - పలనాటి చరిత్ర వ్రాసిన వాడైనా- అక్కడి తిండి తీర్థాలూ ఆచార వ్యవహారాలూ భరించలేక పోయాడీ కవిరాజు.

**జొన్న కలి జొన్న యంబలి- జొన్నన్నము జొన్నపిసరు జొన్నలెతప్పన్**
**సన్నన్నము సున్న సుమీ - పన్నుగ పలనాటి సీమ ప్రజలందఱికిన్**

జొన్నన్నం తప్ప సన్నన్నమే లేదుగదా అని విసుక్కొంటాడు. ఎంత హుందాగా బ్రతికినవాడైనా ఏమి చేస్తాడు పాపం - అనువుగాని చోట నధికుల మనరాదన్నట్టు ఎక్కడికక్కడ సరిపుచ్చుకోక తప్పదని తన నిర్వేదం వెలిబుచ్చుతాడు.

**రసికుఁడు పోవఁడు పల్నా - డెసగంగా రంభయైన నేకులెవడుకున్**
**వసుధేశుఁడైన దున్నును - కుసుమాస్త్రుండైన జొన్నకూడే గుడుచున్**

నాగరికంగా నాజూకుగా బ్రతికిన రసజ్ఞుడెవడూ పల్నాటికి పోయి బ్రతకలేడట. ఏమి కారణమంటే బయటపెడుతున్నాడు. రంభ లాంటి అప్సరస అయినా అక్కడికి వస్తే ఏకులు వడుకుతూ జీవించవలసిందే. ఎంత మహారాజైనా పొలం దున్ని బతకవలసిందే. ఆఖరుకు వాడు మన్మథుడైనా సరే. జొన్నకూటితో తృప్తి పడవలసిందేనట. ఏమి హాస్యం. ఏమి రాజసం. రాజాగా బ్రతికిన వాడికి కాకుంటే రాజసమెవరి కుంటుంది. అలాంటి మాటలెలా వస్తాయి.

ఆఖరుకు త్రిమూర్తులలాంటి దేవతలను కూడా పోనీయడీ మహానుభావుడు. వారిని కూడా సవాలు చేస్తాడు- మీకే ఇలాంటి పరిస్థితి ఏర్పడితే తట్టుకోగలరా అని.

**ఫుల్ల సరోజనేత్ర యలపూతన చన్నుల చేదు ద్రావినా**

**డల్లదవాగ్ని మ్రింగితి నటంచును నిక్కఁగఁబోకు తింత్రిణీ**

**పల్లవ యుక్తమై యుడుకు బచ్చలి శాకము జొన్నకూటితో**

**మెల్లన యొక్క ముద్ద దిగమ్రింగుము - నీపసగాన నయ్యెడున్**

కృష్ణా - నీవవతార పురుషుడవే కావచ్చు. అప్పుడెప్పుడో ద్వాపర యుగంలో పుట్టి గొప్ప ఫీట్లు చేసి ఉండవచ్చు. విషపూరితమైన పూతన పాలు త్రాగి ఉండవచ్చు. దావానలం మ్రింగి చెక్కు చెదరక పోవచ్చు. కాని ఈ కలియుగంలో ఇప్పుడు మాతో పోటీ పడగలవా. చింత చిగురు బచ్చలి కూర రెండూ కలిసిన పులుసు కూర వేసుకొని ఈ జొన్నకూడు ఒక ముద్ద తినవయ్యా. తిని జీర్ణించుకోవయ్యా. నీ పస బయట పడుతుందని సవాలు చేస్తాడు.

మరి నీళ్లు లేక చస్తుంటే జనం - తనకూ అది గండగత్తెర అయితే ఈశ్వరుణ్ణే నిలదీసి అడుగాతాడీ కవి. ఏమని-

**సిరిగల వానికిఁజెల్లును - దరుణులఁబదియాఱువేలఁ దగఁ బెండ్లాడన్**

**తిరిపమున కిద్దఱాంద్రా - పరమేశా గంగ విడువు పార్వతి చాలున్.**

ఈశ్వరుడూ విష్ణువూ ఇద్దరూ మీరు స్నేహితులే. అందులో కృష్ణుడు బాగా శ్రీమంతుడు కాబట్టి పదివేల మంది భార్యల నంటఁగట్టుకొన్నా పోషించగలడు. నీకేముందయ్యా. పైసా లేని వాడవు. భిక్షాటనం చేసి బ్రతికేవాడికి నీకెందు కిద్దరు కాంతలు. వారిలో పార్వతి ఒకతె చాలు నీవు పోషిస్తే గీషిస్తే. తగుదునమ్మా అని మరొకదాన్ని గంగనెందుకు నెత్తిన పెట్టుకొన్నావు. ఆవిడను విడిచి పెట్టరాదూ - మేమైనా బ్రతికిపోతాము.

Vallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

ఎంత హాస్యం. ఎంత సత్యమిది. ఎంత వక్రోక్తి – ఎంత శిల్పం. ఎంత చనవు – ఎంత విసురు. శ్రీనాథుడిలాంటి కవిసార్వభౌముడికే చెల్లు నిలాటి ప్రసంగం. మామూలు కవి జంకుతాడిలా మాటాడటానికే. **పలనాటికి మాటికిఁబోవ నేటికిన్ – చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు నాగులేటి నీళ్లు నాపరాళ్లు – సజ్జ జొన్న కూళ్లు – సర్పంబులును తేళ్లు – పల్లెనాటి సీమ పల్లెటూళ్లు. వస్తూ చూస్తిమి రోస్తిమిన్ పడమటన్ వ్యాపారులం గ్రూరులన్ – రుచుల దోసం బంచుఁ బోనాడితిన్ – తల్లీ కన్నడ రాజ్యలక్ష్మి దయలేదా నేను శ్రీనాథుడన్ – మేతఁ గఱిపిల్ల పోరున మేకపిల్ల – పాఱుఁబోతు తనంబున పందిపిల్ల – యెల్ల పనులను జెఱుపఁగఁ పిల్లిపిల్ల – యందమునఁ గోతిపిల్ల యీ యఱవ పిళ్ళ** – ఇలా తిట్లూ దీవనలతో మరే కవి అయినా విసురుగా మాటాడగలడా మందలించగలడా లోకాన్ని. అది ఆ మహాకవికే దక్కిన అధికారం.

ఆ మాటకు వస్తే లోకాన్నే గాదు. సాటి పండిత కవి లోకాన్ని కూడా లెక్క చేయడు సమయం వస్తే. వారికి కూడా జవాబు చెప్పి నోరు మూయించగలడు. కుకవి నిరాకరణ మనే పేర ఎంతో మంది కవులూ – ఆఖరుకు తిక్కన సోమయాజితో సహా – ఎన్నో విధాల దుయ్యబట్టారు తెలిసీ తెలియని రచయితలను. కానీ శ్రీనాథుని ఉపాలంభంలోని తీరేవేరు. వారిలో ఉండే లోపాలను బయటపెట్టి మీరే చెప్పండి ఇలాటి వారి నేమనాలోనని సహృదయులైన పాఠకులకే వదిలేస్తాడు నిర్ణయాధికారం. అంతేగాని వారి స్థాయికి దిగజారి వారితో నోరు కలిపి త్వంశుంఠః అంటే త్వంశుంఠః అని వాదించటానికి పూనుకోడు. అదీ కవి సార్వభౌముని దర్జా.

**బోధ మల్పం బు గర్వ మభ్యున్నతంబు - శాంతి నిప్పచ్చరంబు మచ్చరము ఘనము**

**కూప మండూకములుబోలె కొంచెమెఱిగి - పండితమ్మన్యులైన నైతండికులకు**

పూర్తిగా తెలుసునంటారా తెలియదు వీరికి. అహంకారమా దానికి కొదవ లేదు - అలాంటప్పుడు మౌనంగా ఉంటారా ఉండరు. దానికి తోడు మాత్సర్య మెక్కువ. పాపం కూపస్థ మండూకాలు. తమకు తెలిసిన ఆ కొంచెమే సర్వస్వమని తమ్ము తామే భావించి మూర్ఛబోయే పండితులు.

**నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ**
**నదరి కాకులు బిట్టుగా నఱచి నప్పు**
**డదధిరాయంచ యూరక యుంటలెస్స**
**సైపరాకున్న నెందేని జనుట యొప్పు**

అయినా ఈ పండితమ్మన్యులు. పండితమ్మన్యులేగాక వైతండికులు కూడా గనుక దగ్గర జేరి మాబోటి వారితో ఏదో ప్రసంగించబోతారు. అది మాకు కర్ణకఠోరం. ఏమి చేస్తాం. కాకులు చుట్టూ చేరి కాకా అని గోల పెడితే వాటి మధ్యలో ఉన్న రాజహంస ఏం చేస్తుంది పాపం దానికి రెండే మార్గాలు. ఏమీ మాటాడక ఊరకుండటమో - లేక భరించలేకపోతే ఆ స్థలం వదిలేసి మరెక్కడికైనా వెళ్ళిపోవటమో. మరో దారిలేదు. అంతేగాని నీవా నేనా అని వాటితో వాదం పెట్టుకోరాదు. అప్పుడే అది రాజహంస అనిపించుకొంటుంది. అలాగే కాకుల లాంటి ఈ కాకవులతో కూడా మాటకు మాట బదులు చెప్పకుంటే నే నేను కూడా రాజకవి అనే పేరు నిలబెట్టు కోగలనని కవి హృదయం.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

అంతే కాదు. నీ కవిత్వమేమిటి నీ రచన ఏమిటీ ఇంత హడావుడిగా ఉంది అడ్డదిడ్డంగా ఉంటుందని ఎవరైనా ఆక్షేపిస్తే వారి కాయన ఇచ్చే జవాబేమిటో తెలుసా.

**ప్రౌఢిఁబరికింప సంస్కృత భాషయండ్రు**

**పలుకు నుడికారమున నాంధ్ర భాషయందు**

**రెవ్వ రేమండ్రుగాక నాకేమి కొఱత**

**నా కవిత్వంబు నిజము కర్ణాట భాష'**

నా రచనలో ప్రౌఢీ గాంభీర్యం ఎక్కడ కనిపిస్తే అది సంస్కృత మనుకోండి. నుడికారమూ సారళ్యమూ ఎక్కడ కనిపిస్తే అది అచ్చమైన తెలుగు భాష అనుకోండి. తెలిసీ తెలియక మీరేమని భావిస్తే నాకేమిటి నష్టం. నా రచన ఎలాంటిదో నాకు తెలుసు. మీరు నాకు చెప్పనక్కర లేదు. ఏమిటా తెలిసిన దంటారా. నా కవిత్వం నిజానికి తెలుగూ కాదు. సంస్కృతమూ కాదు. కర్ణాటకమది. ఏమిటీ మాట. అంతే మరి. కవి రేవ విజానాతి కవేః కావ్యపరిశ్రమ మన్నారు పెద్దలు - అది తలపిస్తున్నది మనకీ శ్రీనాథ కవి జవాబు. అయినా తెలుగూ గాక సంస్కృతమూ గాక ఈ తెలుగు కవి తన భాష కర్ణాటమనట మేమిటా అని మీకాశ్చర్యం. కర్ణాటమంటే కన్నడం. కన్నడం తెలుగు కేమీ దూరం కాదు. చాలావరకు తెలుగే లిపితో సహా. అంతేగాదు. సంస్కృత పదజాలంతో తెలుగు కెంత బాంధవ్యముందో అంతే చుట్టరికముంది కన్నడానికి కూడా. అంతే కాక రెండూ దాక్షిణాత్య భాషలే. కర్ణాటక సంగీతమంటే కన్నడమనా అర్థం. దాక్షిణాత్యమని. అలాగే దాక్షిణాత్య భాషలో వ్రాస్తున్నాను. అది తెలుగా మరొకటా అనే వివక్ష దేనికి మీకు అని గడుసైన జవాబిది.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అంతే కాదింకా లోతైన రహస్యముంది ఈ మాటలో. సంస్కృత మేమిటి. తెలుగేమిటి. కన్నడమేమిటి. అసలే భాషలో మహాకవి రచన చేసినా అది కర్ణాటకం అంటే కర్ణ రసాయనంగా ఉండాలి గాని కర్ణ కఠోరమైన అది ఇటు తెలుగూ గాదు. అటు సంస్కృతమూ గాదు. అంతా పంచకోల కషాయమే సుమా అనే హెచ్చరిక కూడా ఉంది ఇందులో. పెడసరంగా చెప్పినట్టు కనిపించినా ఆలోచిస్తే ఎంత హుందాగా ఎంత వాస్తవాన్ని చాటి చెప్పాడో చూడండి మహాకవి.

ఇలాంటి హుందాతనం దర్జా దర్పం మామూలు కవుల కెవరికీ నూటికి 90మందికి చూడబోము. అది కవితార్కిక చక్రవర్తి అని పేరు గాంచిన భట్టహర్షునితో పోటీ పడ్డ ఈ ఆంధ్ర కవిసార్వ భౌముని కొక్కనికే దక్కిన అదృష్టం. సార్వభౌముడయి నందుకాయన చూపున కెక్కడ చూచినా ఏది చూచినా హుందాగానే ఉదాత్తంగానే దర్జాగానే కనిపిస్తుంది. అది ఆయన అలవోకగా అక్కడక్కడ తన జీవితంలో తానే చాటి చెప్పిన చాటువులలోనే గమనించాము మనం. నిజ జీవితంలోనే ఇంత నీటూ ఘూటూ చూపుతూ వచ్చిన ఆ కవిరాజు రాజసమిక ఆయనగారి కావ్య జీవితంలో చోటు చేసుకోవటంలో ఆశ్చర్యమేముంది. అభ్యంతరమేముంది. అద్దంలో ప్రతిబింబించి నట్టెక్కడ చూస్తే అక్కడ తొంగి చూస్తూనే ఉంటుందది. ఎటువచ్చి అలా చొచ్చి చూచే చూపుండాలేగాని మనకు. చిన్నారి పొన్నారి వయసు మొదలు కొని తన ప్రాయంకై వ్రాలే వరకూ ఈ మహాకవి రచించి లోకాని కందించిన రచన లిన్నీ అన్ని కావు. చాలా ఉన్నాయి. ఒక మరుత్తరాట్చరిత్రేమిటి. గాథాసప్త శతేమిటి. శృంగార నైషధమేమిటి. హరవిలాసమేమిటి. భీమఖండమేమిటి. కాశీఖండమేమిటి.

అసలు చెప్పక వదిలేసిన పలనాటి చరిత్ర క్రీడాభిరామాదు లేమిటి. ఇందులో కొన్ని లభ్యం. కొన్ని అలభ్యం. లభ్యమైనవే చాలు మనకు. అన్నీ అన్నే. బంగారు బొమ్మలు. ఆయనే అన్నాడొకచోట

**కంచియఅవత లసమాస్త్రు ఖడ్గలతలని**

అలాంటి అసమాన రాజసగుణాన్విత లాయన రచనలు.

మరి వాటిలో చెప్పుకోదగ్గ విశేషా లెన్నైనా ఉండవచ్చు. కాని మనం చూడదగ్గ ఒకే ఒక విశేషమేమంటే కవిసార్వభౌము డన్నందు కాయన వల్ల వాటిలో సంక్రమించిన ఆయన రాజస స్వభావం. అది ఆయన రచించిన ప్రతి కావ్యంలో ప్రతి పాత్రలో ప్రతివర్ణనలో ప్రతి సన్నివేశంలో ఒక రాజముద్రలాగా పడిపోయి మనకండ్లకు కొట్టవచ్చినట్టు అడుగడుగునా సాక్షాత్కరిస్తుంది. సందేహం లేదు. సార్వభౌముడు దిద్ది తీర్చింది ప్రతిదీ సార్వభౌముడిలాగే దర్శనమిస్తుంది. అది ఎలాగో పరిశీలించి చూడటమే ఇప్పుడు మన డ్యూటీ.

**మహీతల స్పర్శన మాత్ర భిన్న**

**మృద్ధంహి రాజ్యం పద మైంద్ర మాహుః**

అన్నాడు మహాకవి కాళిదాసు. ఒక్క భూమండలం మీద ఉందని పేరేగాని ఒక మహారాజు రాజ్యభోగం స్వర్గంలోని దేవేంద్ర భోగానికే మాత్రమూ తీసిపోదు. స్వర్గమైనా భూతల స్వర్గమైనా రెండూ ఒకటే. దాన్ని అనుభవించే న రేంద్రుడు దేవేంద్రుడి లాంటి వాడేనట. అలాగే కవి లోకాలకూ అధీశ్వరులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులేమి. దేవలోకాధీశుడైన దేవేంద్రుడేమి. అందరూ సహాధ్యాయులూ ప్రాణ సమానులైన సహోదరులా ఏమని భావించవలసి వస్తుంది వారిమీద ఆయనగారి కున్న చనువు చూస్తే.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**గజచర్మ మెన్నడో కాని - నిచ్చలుఁగట్టు**

**పసిఁడి కమ్మల పట్టు పచ్చడంబు**

**భసిత మెన్నఁడొ కాని - ప్రతిదినంబు నలందు**

**మలయజంబు కురంగ మదము గూర్చి**

**నిడుద పాముల రాజు తొడవులెన్నఁడొ గాని**

**తారహారములు నిత్యము ధరించు**

**నృ కరండ రుండ మాలిక లెన్నడో గాని**

**ధరియించు కల్హారదామ మెపుడు**

కాటినడి చక్కినెన్నడో గాని యుండు - దక్షవాటి సువర్ణ సౌధముల మీఁద - నెన్నడొ పిశాచులనుగాని యిందు ముఖుల- నెల్లకాలంబుదలచు భీమేశ్వరుండు.

ఇది భీమేశ్వర పురాణంలోని పద్యం. ఈశ్వరుని వర్ణిస్తున్నాడు మహాకవి. మామూలుగా అయితే ఆ దేవుడు గజచర్మ ధారి విభూతిధారి - నాగభూషణుడు. కపాల మాలాలంకృతుడు - పైగా శ్మశానవాసి. చుట్టూ భూత ప్రేతాదులను పెట్టుకొని తిరుగుతుంటాడు. అదీ ఆదేవుడి వేషం. వ్యవహారం. అలాటి ఆ మూర్తిని చూడట మిష్టం లేదు శ్రీనాథుడికి. ఎంత నిర్లిప్తుడైనా నిరాంబరుడైనా ఇంత మొరటుగా ఉంటే ఎలా. ఆయన భక్తుడైన తానే మహారాజులా బ్రతుకుతుంటే తన స్వామి అని భావించే ఆ దేవుడు కూడా రాజాధిరాజుగా కనిపించాలి. లేకుంటే మనసొప్పదు చూడటానికి. అంచేత కరికాలుడనే తన తోడి రాజ కవికి చెప్పి ఈ కవిరాజు ఆ దేవుని వేషాన్ని మార్పించి సరి కొత్తగా అలంకారాలు చేయిస్తున్నాడు. చేయిస్తే

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

ఆయన దేమి పోయింది. అలాగే అలంకార సేవ చేయండిరా. నాకూ అది దర్జాయేనంటాడా దేవుడు. వెంటనే గజచర్మాన్ని తీసి వేసి పసిడి కమ్ముల పచ్చడం కట్టుకొన్నాడట. విభూతి దేనికని గంధమూ కస్తూరి పూసుకున్నాడు శరీరానికి. ఈ పాడు పాములేమిటి నాకని మంచి ముత్యాల హారాలు ధరించాడు. ఈ కపాల మాలికలేమిటి మరీ అన్యాయమని చెప్పి చక్కని కల్హార దామాలే తాలుస్తాడు. అసలీ పిశాచాలేమిటి నావెంట బడ్డాయని త్రోసివేసి చక్కని ముద్దుగుమ్మలను వెంటబెట్టుకొని తిరుగుతున్నాడట - అంతేకాదు -

**'ఒకవేళ ధరియించు యువనాశ్వుడిచ్చిన**
**కట్టాణి ముత్యాల కంఠమాల**
**మాంధాతృ డిచ్చిన మాణిక్యఖచిత కే**
**యూరంబు ధరియించు నొక్కవేళ**
**నిక్ష్వాకుఁడిచ్చిన హీరాంకురంబుల**
**యుంగరంబు ధరించు నొక్కవేళ**
**ఘన చక్రవర్తి యిచ్చిన ప్రవాళంబుల**
**యొడ్డాణము ధరించు నొక్కవేళ**

వేడ్క ధరియించు నొక్కొక్క వేళయందు - భరత దుష్యంతరంతి నాభాగ నహుష నలభగీరథ నృగమహీనాథ దత్త - హేమమణి భూషణములు భీమేశ్వరుండు.

చూచారా వారాల సొమ్ములన్నట్టు ఆయా మహారాజులందరూ కప్పం చెల్లించినట్టు తన కర్పించిన హార కేయూరాంగులీయ మేఖలాది

ఆభరణాలన్నీ. రోజుకొకటి ధరించి కనపడకపోతే శ్రీనాథుడు భరించలేడు. అన్ని విధాలా అలంకరించుకొని మన్మథుడిలాగా కనపడాలా పరమేశ్వరుడు. కవిసార్వభౌముడు తానే అన్ని భోగాలూ అనుభవిస్తుంటే తన స్వామి ముల్లోకాలకు సార్వభౌముడయి కూడా ఏ భోగమూ లేకుండా సాదాసీదాగా కనిపిస్తే ఏమి బాగుంటుంది. **'శ్రీ కాశీ నగరాధి రాజ్య పదవీ సింహాసనా ధ్యాసి'** అని గదా వర్ణించాడా స్వామిని. అలాటి రాజాధిరాజుకు కనీసం కవిరాజుకున్న భోగాలైనా లేకుంటే ఏమి మర్యాద. కనుకనే నేమో అలంకారాలతో పాటు అంగనామణులను కూడా అంటగడతా డాయనకు. చూడండి.

**దక్షపురిసాని కూతులందవిలినాడు -**
**విశ్వలోక కుటుంబి భీమేశ్వరుండు**

ఎంత కుటుంబ భారమైనా భరించగలడా స్వామి. కనుకనే సానికూతులను దగిలాడు. అంతేనా.

**ఎనయం గల్గిన కూర్మి భృంగిరిటిగానీ తండుగానీ నికుం**
**భునిగానీ కయిదండ పట్టుకొని సంభోగేచ్ఛ నంతః పురాం**
**దనలం గన్ను మొఱంగి - యప్పురమునం గన్నే రు కాదారి ప్రా**
**ద్దున భీమేశుండు సానివాడకరుగున్ ధూర్త ప్రకారంబునన్'**

అని ఆస్వామి వారితో వీరితో కలిసి రహస్యంగా ఎక్కడెక్కడ సానివాడలలో తిరుగుతుంటాడో అది కూడా చాటు నుంచి గమనించి ఆయన గుట్టు బయటపెడతాడు శ్రీనాథుడు. ఇంతకూ ఆ తిరిగింది భీమశంకరుడా తానా. తాను చేసిన లీలలన్నీ పరమేశ్వరుడి కంటగట్టట

Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

మెంత సాహసం. సాహసం కాదిది. స్వామి తనవాడే. తన కభిన్నుడైన ఆ స్వామి తనకున్న భోగాలన్నీ అనుభవించాడని చెబితే గాని తృప్తి లేదు. కవిరాజు తానే అన్నీ అనుభవించ గలిగినప్పుడు రాజాధిరాజు పరమేశ్వరు డనుభవించటంలో ఆశ్చర్యమేముంది - అభ్యంతర మేముందని కవిసార్వ భౌముని ఉదారమైన ఆశయం.

ఈ ఆశయ మెంత వరకు పోయిందంటే పరమేశ్వరుడు పార్వతిని వివాహమై కొంతకాల మలాగే ఇల్లట ముండిపోయాడు హిమవంతుడి ఇంట. అప్పుడల్లుడైన తాను దర్జాగా కనపడాలని బంగారు జన్నిదాలేమిటి. పట్టు పుట్టా లేమిటి. చందన కస్తూర్యాద్యను లేపనా లేమిటి. తారహారాలేమిటి. అంగరంగ వైభోగంగా తయారయ్యాడట. చుట్టూ ప్రమధగణాలు బలిసి సేవిస్తుంటే వారిని వెంటబెట్టుకొని ఒక మహారాజులాగా వాహ్యాళి బయలుదేరుతాడు. ఆయనగారి అండ చూచుకొని ఇక ఆ శివ లెంకలు చూడండి ఎంత రౌడీచేష్టలు చేస్తూ పోయారో. విద్యాధరాంగనా విటగణాన్ని పులి కళాసాలతో మోది దూరంగా పారదోలటమే గాదు. గంధర్వాంగనలు తమకు దక్కకుండా అడ్డు తగులుతున్నారని వారి కాముకులను లాతాలతో మోదటమే గాదు. కకపాలలోని బూది చల్లి అప్సరః పల్లవులను బాధించటమే గాదు - ఎంత దానికైనా వెనుదీయటం లేదా ఆకతాయు లంటాడు శ్రీనాధుడు. ఇలా చేయటమీ కవిరాజుకూ ఇష్టమే. ఆ భూతరాజుకూ ఇష్టమే. స్వామికి ఇష్టభృత్యులు గదా. లైసెన్సిచ్చి ఉంటాడు బహుశా ఏమి చేసినా చేయండని. ఆయన ఇవ్వకున్నా ఇప్పిస్తాడు మన కవిసార్వభౌముడు.

తానూ బాగా ముస్తాబు చేసుకొని తయారయ్యాడు దారుకావనంలో దేవతా మిధునాలతోపాటు జల్సా చేసుకుందామని ఆదేవ దేవుడు. ఇక ఆయన నాకర్షించాలని ఆ బృందారక సతుల శృంగార చేష్టలిన్ని అన్నీ గావు. ఆఖరుకు మునిపత్నులు కూడా తెగించి శృంగారవతులయి పోయా రున్నట్టుండి. నందీశ్వరాదుల నటూ ఇటూ వారి ఇష్టానుసారంగా వారిని సాగనంపి భిక్షాటనమనే నెపంతో వేశవాటం ప్రవేశిస్తాడా పరమ శివుడు. అప్సరసల ఇల్లిల్లూ తిరుగుతుంటాడు. రాపుజన్నుల కెలన రారాజు పట్టి పట్టి యొత్తిన నఖరేఖ బయలుపడగా రంభ వచ్చి భిక్ష పెడుతుంది. పయ్యెద ఒకింత జాటి చన్కట్టు లలాటలోచనుని కన్నులు మూటికి విందు సేయగా తిలోత్తమ పెడుతుందట భిక్ష. వీగు పాలిండ్లు పయ్యెద నసలే వదిలేసి సహజన్య అనేది బాగా పెడుతుంది బిక్ష. అది చాలక మునికాంతల ఇండ్లన్నీ తిరిగి భిక్ష అనే వంకతో వారి మానాన్ని దోచుకుంటాడా కుసుమ శరహరుడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ నంటాడు కవి. ఇది హర విలాసమా శ్రీనాధ కవి వరవిలాసమా.

వసంతోత్సవం వస్తే చాలు. పట్టలేమిక మహాకవిని. మరి మహాకవి మహాదేవుణ్ణి పట్టలేడు. ఈ కవిసార్వభౌముడు తన శృంగార భంగిమలన్నీ ఆ దేవతా సార్వభౌముడికే పట్టించి ఆయన ఆవేశంతో చేసే పనులన్నీ తాను చూస్తూ మనకు చూపుతూ ఎంత వినోదిస్తాడో చెప్పలేము. కాశీశ్వరుడు భీమవరానికి వచ్చి భీమేశ్వరు డయ్యాడో లేదో ఆయనగారిని సేవించటానికి వస్తాడు వసంతుడు. ఇక ఏమి చెబుతారు లెండి. వెంటనే వసంతోత్సవం అంటే హోలీ పండగ జ్ఞాపకం వచ్చింది కవిగారికి. పూర్వం రాజులే పాల్గొనే వారు వసంతోత్సవంలో. భీమరాజుకు మనకవిరాజు ప్రక్కనే ఉండి

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఆయనకు సైగచేసి ఉంటాడు. ఇక చూడండి. పండు వెన్నెల కాస్తుంటే దక్షవాటికా వేదుల మీద కనక వీణలు మీటుతూ అప్సరసలు తయారయ్యారు. కొందరా దేవుని మీద పుష్పబాణాలు వేస్తున్నారు. చుట్టూ చేరి రంగునీళ్లతో ఆయనను ముంచేశారు. మీరూ ఊరక నిలబడి పోకండి. వేడుక చేసుకొండని అందరికీ అనుజ్ఞ ఇస్తాడాయన. ఇకేముంది.

**హేరాళ ముగఁ జల్లె నెలనాగ యొక్కర్తు**
**కుంభోదరుని మీఁదఁ గుసుమరజము**
**కుటిల కుంతల భృంగిరిటి మోమునం దోర్తు**
**తాకించె నోలగందంపుఁ బసపు**
**పక్షంబు లక్షించి వైచె గందపుటుండ**
**వీరభద్రుని నొక్కనీర జాక్షి**
**చెవిలోనఁ బాఅంగఁ జిమ్మె గొజ్జగ నీటఁ**
**గాలభైరవు నొక్క కలువ కంటి**

కొమ్మయొక్కతె యందంద కొమరసామి - యౌదలల యందు జవ్వాది యసలు గలిపె - పునుగు మణికుంభమున నించి పోసి నొక్క - పొలతి విఘ్నేశ్వరుని కుండ బొజ్జ మీద. గౌరిదేవి తొల్పట్టి గణేశ్వరుడేమీ తక్కువ తినలేదు - సురభామిను లోలమునం దొ దుంగగా మధూత్సవ విహారము సల్పాడట. మరి మేనకారంభా మంజు ఘోషాదులు కూడా రెచ్చిపోయి పునుగూ జువ్వాజీ కస్తూరీ మిశ్రితమైన సుగంధ జలం చల్లుతూనే వచ్చారట పరమేశ్వరుడి పైన.

ఎంతో విరక్తి నటించే శివుడే ఇంత వేడుక చేసుకొంటుంటే ఆయన మిత్రుడు కేశవుడేమి తక్కువా. బ్రహ్మదేవుడంత కన్నా తీసిపోయాడా ముగ్గురూ ముగ్గురే. **'అచ్యుతుని మీఁద జల్లె దు గ్ధాబ్ధికన్య. భారతీదేవి పద్మజుపైనిఁజల్లె శచి మహేంద్రుని జల్లె వసంతకేళి - గంధ కర్పూర కస్తూరికా జలం'**బని వర్ణిస్తాడు మన కవిరాజు. రాజన్నందు కన్నీ రాజభోగాలే. దేవతలకు కూడా రాజోపచారాలే. తనకున్నప్పుడు వారికి లేకపోతే ఎలాగా. ఏమి మర్యాద. ప్రభాత సేవ దగ్గరి మంచి ఏకాంత సేవ వరకూ షోడశోపచారాలూ యథావిధిగా జరగవలసిందే. చూడండి. శ్రీమహావిష్ణువు శయనైకాదశినాడు పడుకొన్న వా డుత్థానై కాదశినాడు నిద్ర లేచాడు. లేచాడో లేదో ఇక చూడండా రాచమర్యాదలు.

**అభినవోన్మేష చిహ్నం బైన తొలుచూపు**
**కౌస్తుభాలోక రేఖలకు నలఁగ**
**సాంగభంగం బైనయావులింతకు వేల్పు**
**లంగుళి స్ఫోటంబు లాచరింప**
**సౌఖ శాయనికులై సంవర్త భృగ్వాది**
**మునులు హస్తాంభోజములు మొగుడ్ప**
**ధృత చేతనంబులై దివ్యాయుధంబులు**
**జయజయధ్వనులతో సంస్తుతింప**

కలువ రేకులు వోని పెంజిలువ తేని - యరటి కుబుసంబు పొరలు మైనంటి యుండ. నిదుర మేల్కాంచి కూర్చున్నా'డట క్షీరసాగర మధ్యంలో మహావిష్ణువు. ఏమి రాజఠీవి ఇది. ఏమి వైభోగం. ఏమి ఐశ్వర్యం.

శ్రీనాథునిదా ఇది. శ్రీమహావిష్ణువుదా. శ్రీనాధుడు శ్రీనాధుడేగా. ఇక అడగటం దేనికి.

అయ్యగార్ల కింత రాచమర్యాదలు జరిపే కవి సార్వభౌముడమ్మ గార్లనూరక పోనిస్తాడా. వారు మహారాజులైతే వారి దేవేరులు మహారాణులు. వారి కన్నా వీరి కెక్కువగా జరగాలి మర్యాదలు ఆ మాటకు వస్తే. మాతృదేవోభవ అని గదా అన్నారు. మాతృదేవో భవ అయిన తరువాతనే పితృ దేవోభవ. మరి ఎందరున్నారు పితలు. ఎందరున్నారు మాతలు. త్రిమూర్తులు ముగ్గురూ ఒక మూర్తి అయినట్టే వారి స్త్రీమూర్తులు కూడా ఒకే మూర్తి శ్రీనాధుని దృష్టిలో. జగతః పితరౌ వందే. జగత్తుకంతా తల్లీ తండ్రీ ఒక్కరే. బ్రహ్మ అయినా విష్ణువైనా శివుడైనా తండ్రి ఒక్కడే. అలాగా సరస్వతి – అయినా లక్ష్మి అయినా పార్వతి అయినా తల్లీ ఒక్కతే. జగజ్జనకు డొకడయినట్టే జగజ్జనని కూడా ఒక్కతే మహాకవి దృష్టికి. కనుక వారి ముగ్గురిలో ఎవరి నెక్కడ ప్రస్తావించినా వర్ణించినా అలాగే వర్ణిస్తూ పోతాడు. ఐశ్వర్యమంతా అక్కడే రాశీభూతమై కనిపిస్తుందాయన దృష్టికి.

చూడండి. నైషధంలో దమయంతీ స్వయంవరం చాటించాడు ఆవిడ తండ్రి భీమ భూపతి. రాజులందరూ విదర్భ దేశానికి మందీ మార్బలంతో తరలి వచ్చారు. సకలోపచారాలూ చేశాడు వారికి విదర్భాధిపతి. ఇక స్వయం వరం జరగబోతున్నది. మరి దమయంతికే దేశాధిపతి ఎవరో ఆయన గుణగణాలేమిటో బలపరాక్రమాలేమిటో విశదంగా వర్ణించి చెప్పాలిగదా. ఎవరందుకు సమర్థులు. వారూవీరైతే లాభం లేదు. అందుకు సమర్థురాలు సాక్షాత్తూ తమ కులదేవత '**త్రైలోక్య జనని నిత్య ప్రగల్భ వాచాల భగవతి భారతీదేవి దక్కం దక్కిన** వారు లేరని విచారించాడట ఆయన. అలా

విచారించి ఆవిడను సాక్షాత్కరింప జేసుకోటానికా మహాశక్తిని కీర్తిస్తాడు. ఏమని. **'జయ జయ జనయిత్రి – కళ్యాణ సంధాత్రి – విద్యామయీంత్వాం భజే – వందేతమాం త్వామహం – నమస్సర్వ గీర్వాణ చూడామణి శ్రేణి శోణ ప్రభాజాల బలాతపస్మేర పాదాంబుజాయై – నమస్తే శరణ్యే – నమ శ్శర్మదాయై – నమోనర్మదాయై – నమస్తే నమస్తే నమః** – అని ఒక దీర్ఘమైన దండకం చదువుతాడు. వెంటనే **'జగతీనాథుని ముందటన్నిలిచె సాక్షాత్కారముంబొందియా జగదేకస్తవనీయ శారద** అని ముగిస్తాడు కవి. ఆ దివ్య సుందర విగ్రహాన్ని చూచి అప్రయత్నంగా సభాసదులందరూ లేచి నిలబడి శిరస్సులు వంచి ప్రణామం చేస్తారట.

ఇది భారతీదేవి వర్ణన అయితే ఇక మహాలక్ష్మినెలా వర్ణిస్తాడో వింటారా ఈ మహాకవి. కాశీఖండంలో అగస్త్యుడు తన భార్యలోపా ముద్రను వెంటబెట్టుకొని దేశ దేశాలూ ఆయా దేశాలలో నెలకొన్న పుణ్యక్షేత్రాలూ దేవాలయాలూ దేవతా విగ్రహాలనూ సందర్శిస్తూ వస్తాడు. చివరకు మహారాష్ట్రలోని కొల్హాపూరు వచ్చి అక్కడ అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన కొల్హాపుర మహాలక్ష్మిని దర్శించి ఆ మహాశక్తినిలా స్తోత్రం చేస్తాడు. **భద్రకాళికయై ఘోర పరశుధారఁ గోల దైత్యుని బొరిగొన్న ఘోరమూర్తి** అట ఆవిడ. ఈవిడ లక్ష్మీదేవా పార్వతీదేవా. ఏమో శ్రీనాథునికే తెలియాలి దీని భావం. **హృల్లేఖామంత్రో పని షల్లతికా కుసుమమట** పైగా. **అంబురుహ నాభుదేవి కనాది శక్తి కింది రకు లోక మాతకు'** మ్రొక్కగంటినంటాడు. ఆవిడాలోక మాతే ఈవిడా లోకమాతేనా. ఆవిడా అనాదిశక్తీ ఈవిడా అనాది శక్తేనా. ఎంతమంది లోకమాతలు. ఎందరనాది శక్తులు. **'కంబు కంఠి**

**నీవుగల వాడు కలవాడు - లేనినాడు నీవు లేనివాడట.** నిజమే మరి లక్ష్మి గదా. ఆవిడ ఉంటేనే మానవుడికి బ్రతుకు. లేకుంటే ఆ బ్రతుకు బండలే. ధనమనే గాదు. శక్తి కూడా గనుక శక్తి ఉంటేనే జీవితం లేకుంటే జీవన్మరణమేనని కూడా నిగూఢార్ధం.

ఇక ఆ మహాశక్తి దర్జా ఏమిటో చూస్తారా. ఎలా వర్ణిస్తాడో.

**పరిపూర్ణ హేమ కుంభములు హస్తంబుల**
**ధరియించి యిరువంకc గరులు గొలువ**
**బలగమై వరశంఖ పద్మ మహాపద్మ**
**మకరాది నిధులు నేమమున గొలువ**
**వింజామరలు దాల్చి వెనుక దిక్కున దేవ**
**గంధర్వ గుహ్యకాంగనలు గొలువ**
**నెలవంక బలువంక నింద్రాది దివిజులు**
**సేవాంజలులు మౌళిcజేర్చి కొలువ**
**భర్మ పంకజ కర్ణికా భద్ర పీఠి**

కాగ్రమున నిండు కొలువుండి యఖిలలోక రక్షణము సేయు నిన్నేను బ్రస్తుతింతు' నని కీర్తిస్తాడు కవి. కవిసార్వభౌముడు గదా. ఆయన దృష్టి కంతా రాజులే రాణులే దర్శన మిస్తుంటారు. ఒక రాణీ గారెలా గొప్పగా కొలువు దీర్చి చుట్టూ మంత్రులూ సామంతులూ పరివారమూ తన్ను సేవిస్తుంటే ఎంత ఠీవిగా కనిపిస్తుంటుందో అలాటి రాచఠీవితో కనిపిస్తారు ఆయన కాయా దేవతా మూర్తులు కూడా. అందుకే కండ్లకు కట్టినట్టు

Brahmasri Vallamaraju Srinivasa Rao www.advaitavedanta.in

నిండుగా కనిపిస్తుంటుంది - మనమనోనేత్రాని కా మహాకవి ఎవరిని వర్ణించినా. ఎలా వర్ణించినా. ఆ తరువాత ఒక గద్య ఉన్నదందులో పరాపశ్యం తీ మధ్యమా అని మాటలు దొర్లుతుంటాయి. అక్కడా సందేహమే. ఇది లక్ష్మీ వర్ణనా పార్వతీ వర్ణనా అది.

పోతే ఇక పార్వతీ వర్ణన చెప్పనే అక్కరలేదు. పాశుపత దీక్షా ధురంధరుడు గదా తాను. ఆ మహాదేవిని వర్ణించేటపుడిక మైమరచి పోతాడు. వీరావేశంతో వర్ణిస్తాడు. ఎవరావిడ. తన ఇష్టదైవతమైన పశుపతి పట్ట మహిషి. ఎలాంటి వాడాయన. కవిసార్వభౌముని దృష్టిలో ఆయన ఒక జగదేక సార్వభౌముడు. కాశీఖండం మొదటి పద్యంలోనే కనిపిస్తాడా సార్వభౌముడు మనకు. ఎలాగా **శ్రీ కాశీ నగరాధి రాజ్య పదవీ సింహాసనాధ్యాసిగా. రాజ్యపదవి - సింహాసనం -** దానిమీద అధ్యాసనం. ఇదీ వర్ణన. ఇలా వర్ణిస్తేగాని తృప్తి లేదా మహాకవికి. తానే సార్వభౌము డయినప్పుడా మహాదేవుడెంతటి మహాసార్వభౌముడు కావాలి. పోతే ఆ మహాదేవుడి పట్టమహిషి మహాశక్తి ఎలా కనపడాలి మనకంటికి. అలా ఇలా కనపడితే ఏమి మర్యాద. పైగా పార్వతి అంటే ఎవరని. లక్ష్మీ సరస్వతుల చేత కూడా సేవలందుకొనే మహాశక్తి. హయగ్రీవుల వారి నడిగితే చెబుతారు. **'సచామర రమావాణీ సవ్య దక్షిణ సేవితా'** వింజామరలు పుచ్చుకొని లక్ష్మీ సరస్వతులిద్దరూ ఆ మహాశక్తికి పరిచర్యలు చేస్తున్నారట.

కాదా మరి. ఆ మహాదేవుడు కాశీ పురసింహాసనాధ్యాసి అయితే ఆవిడ తక్కువ తిన్నదా. ఆవిడా కాశికా నగర హాటక పీఠ శిఖాధిరూఢే. శ్రీనాథునికి ఒక్క కాశికా నగరమేమిటి. లోకైకారాధ్యు డాయనైతే -

లోకైకారాధ్యే ఈవిడా. కాశతే ప్రకాశతే ఇతికాశీ. లోకమంటే ప్రకాశమేనని అర్థం చెబుతారు భగవత్పాదులు. అప్పటికి లోకాలన్నీ కాశీ పట్టణాలే. కాశీకి ప్రభువులంటే సమస్త లోకాలకూ ప్రభువులే ఆ పురాణ దంపతులు. అందుకే ఆవిడ వేదవ్యాసుని తన దగ్గరికి రమ్మని పిలిచేటపుడెలా కనిపించిందో తెలుసా. '**వేద పురాణ శాస్త్రపదవీ నదవీయసి యైన పెద్ద ముత్తైదువ**'లాగా కనిపించింది. సమస్త వాఙ్మయమూ ఆవిడ కధీనమే. పరాపశ్యంతీ రూపమైన శబ్దమేగదా శక్తి అంటే. అందులోనూ ఆదిమ శక్తి, పరాస్య శక్తి ర్వి విధైవ శ్రూయతే అన్న దుపనిషత్తు. అది వస్తుతః ఏకరూపమైనా అనేక రూపాలు ధరించి కనపడగలదు. అదే శక్తి అనే మాట కర్థం.

అలాటి మహాశక్తి పార్వతి అంటే. పర్వత పుత్రిక అంటే జడశక్తి రూపంగా పైకి దర్శనమిస్తున్నా ఆంతర్యంలో అది చిచ్ఛక్తే. కనుకనే దానికాది ఎలాలేదో – అంతమూ అలాగే లేదు. సతీదేవి. అంటే సద్రూపిణిగా ఎప్పుడూ నిలిచి ఉంటుంది. ప్రమేయరూపంగా సత్తు. ప్రమాణరూపంగా చిత్తు. రెండూ తానే గనుక అవినాశిని. ఈ రహస్యాన్ని సతీదేవి దక్షయజ్ఞంలో దగ్ధమయ్యే టపుడు మహాదేవి చేసిన వర్ణనే మనకు చాటి చెబుతుంది. చూడండి.

**'పాదపద్మము లందు ప్రభవించు నప్పుడు**
**ప్రత్యగ్ర యావక ద్రవము చెలువు**
**కటి మండ లంబు పైఁ గను పట్టునప్పుడు**
**కనక కాంచీ దామకంబు దాలు**
**వలుద చన్నుల మీద మొలతెంచు నప్పుడు**

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

కాశ్మీర జాంగరాగంబు పొలుపు
సీమంత పదమునఁ జిగురొత్తు నప్పుడు
రమణీయ సిందూర రజము సొబగు
ప్రోది సేయుచు భగ్గన భుజగహారు
రాణివాసంబు దివ్య విగ్రహము నందు
రవులుకొని మండె నా స్థాన రంగ భూమి
నధిక రోషోత్థితంబు యోగానలంబు

ఇదీ అమ్మవారి వర్ణన. ఎంత కలాత్మకంగా వర్ణించాడో చూడండి. అగ్ని ఆవిడను దహించలేదు. మామూలు అగ్ని అయితే గదా దహించటానికి. యోగాగ్ని అది. అగ్నిగాని అగ్ని. కనుకనే అది కూడా ఆవిడను సేవిస్తున్నది. ఎలాగా. ఆమె పాదాలకది పారాణి అయింది. కటిమండలానికి కాంచీదామ మయింది. స్తనమండలానికి కుంకుమ రాగమయింది. సీమంత సీమకు సిందూర మయింది. అగ్నిదేవుడు కూడా ఆ దేవి కింకరుడే. ఎవరావిడ. మహాదేవుడి రాణివాసం భౌతికం కాదది. దివ్య విగ్రహం. రాణిగారు గనుక ఆస్థాన పీఠ మారోహించి ఉంది. ఎంత దర్జా. ఎంత హుందా.

ఇలాటి హుందా ఇలాటి ఠీవి జగన్మాతకు గాక ఎవరికుంటుంది. కనుకనే ఎవరినైనా దబాయించగలదు. మందలించగలదు. మహర్షులైనా లెక్కలేదు. దేవతలైనా లెక్కలేదు. కటాక్ష కింకరీ భూతాలే సమస్త భూతాలూ. వ్యాసుడంతవాడు బేల అయి పోయాడావిడ దగ్గర. అందరూ ఆ మహాశక్తి బాల బచ్చాలే గదా. అందులోనూ ఆదిమశక్తి ఆయె. ఆ మహర్షి బ్రహ్మనిష్ఠ ఎలాటిదో పరీక్షించాలను కొన్నది. అన్నపూర్ణ అయినా విశాలక్షి కాబట్టి

విశాలమైన దృష్టితో చూచిందా నిష్ఠ ఎలాటిదో. ఏడురోజులన్నం పుట్టకుండా చేసింది కాశీపట్టణంలో. ప్రాణాలు కడబట్టి కాశీనే శపించాలని పూనుకొన్నాడా ఋషి. గమనించింది. మానిని హస్తమూఁది యొక మాంజుల భాషిణి దోచె వీధికిన్. ఎవరా మంజుల భాషిణి. తరుణి అనుకొన్నారేమో. తరుణి గాదు. **'వేనలి పాట పాట నరవెంద్రుక'** తో కనిపించే వృద్ధురాలు. తరుణి అయినా ఆవిడే వృద్ధ అయినా ఆవిడే. మహాశక్తి గదా. వయసుతో నిమిత్తమేముంది.

వయసు చిన్నదైనా అస్త్రావిస్త్రంలో పడ్డవాడా మహర్షి. దగ్గరికి రమ్మని పిలిచినట్టే పిలిచి ఇక పెట్టింది చీవాట్లు చూడండి.

ఏడు దినంబులన్నమున కెడ్డెము పుట్టిన యంత మాత్రలో నేడుచు చున్నావాడవు మునీశ్వరనేడును - నీదు ధీరతల్ పాడటి పోయెనే.

**'ఎట్టు పురాణము ల్పదియు నెన్మిది జెప్పితి వెట్టు వేదము**

**ల్గట్టితి వేర్పతించి - సుడికారము సొంపెసలార భారతం**

**బెట్టు రచించి - తీవు ఋషి వెట్టయి - తొక్క దినంబు మాత్రలో**

**పొట్టకు లేక తిట్టెదవు పుణ్యగుణంబుల రాశిఁగాశికన్.**

**ఆ కంఠంబుగ నీవు మాధుకర భిక్షాన్నంబు భక్షింపఁగా లేకున్నం గడునంగ లార్చెదవు - మేలే లెస్స శాంతుండవే నీకంటెన్ మతిహీనులే కటకటా నీవార ముష్టింపచుల్ శాకాహారులు కందభోజులు శిలోంఛ ప్రక్రమ ల్తాపసుల్**

**ఓయి మునివర్య వినవయ్య యున్నయూరు**

**కన్నతల్లియు నొక్క రూపన్న రీతి'**

అలాంటి కాశీపట్టణానికి తొందరపడి శాపమిస్తానని కూచున్నావా. నాలుగు రోజులన్నం లేకపోతే తట్టుకోలేవా. అంత తట్టుకోలేని వాడవు నీవు ఋషి వెట్టయ్యావు. వేద వేదాంగా లెలా విభజించగలిగావు. మహాభారతాది గ్రంధాలెలా వ్రాయగలిగావు. ఒకరికి చెప్పటాని కేనా నీతులు– నీకక్కర లేదా. నీకే ఇంత కోపమైతే ఎంత కోపించునో **యింత కిందుమౌళి – విప్రుడవుగాన నేరము వెదకఁజన**' దని నేనూరకున్నా ఆయన ఊరకుంటాడో లేదో చెప్పలేను. సరే ఇదంతా ఇక దేనికి గాని '**భిక్ష గొనరమ్ము**' వడ్డిస్తానని తిడుతూనే దీవిస్తుందా మహాతల్లి.

తిడితే తిట్టింది తల్లికా మామాత్రం పిల్లల మీద అధికారం లేదా అని తనకు తానే సర్ది చెప్పుకొని వేదవ్యాసుడు '**తల్లీ యిన్ని దినాలకేనియు సుధాధారా రసస్యందియై యుల్లం బుందని యింపఁ జేయు పలుకెట్లో వింటి నిప్వీటిలో పెల్లా కొన్న కతాన** – ఏదో ఆకలి భరించ లేక పిచ్చి పని చేశానేమీ అనుకోవద్దమ్మా – భోజనం పెడతానని పిలిచావు అంతే చాలు తల్లీ – మరి మావాళ్లు చాలామంది ఉన్నారందరికీ పెడతావా అని అడిగి పరవాలేదు రండని ఆవిడ బరవసా ఇస్తే వచ్చి కూచుంటారందరూ భోజనానికి. కూచుంటే ఆవిడ కనపడిందా. లేదు. రాగానే కనపడటాని కామె ఎవరనుకొన్నారు. ముల్లోకాలనూ ఏలే మహాశక్తి. అలాంటి మహారాజ్ఞి వెంటనే దర్శనమిస్తుందా. అంచేత '**ఆసార ప్రసారంబులు సేయు శంభలీ జనంబుల చేత తమరాక యెఱింగించిన నచ్చోట హాటకమయంబైన గొడుగు పావలు గిలకులు గులుకరింపఁ గుసుమ కోదండ సమ్మోహన కాండంబునుంబోని యొక్క రెండవ వయసు తాంబూల కరండ వాహినిం గైదండ పట్టుకొని యేతెంచి రండు విచ్చేయుండని సబహు మానంబుగా,**

**దోడ్కొని పోయిందని'** వర్ణిస్తాడు మహాకవి. ఇదంతా చూస్తే ఎలా ఉందంటే ఏదో ముసలిది మనలను భోజనానికి పిలిచిందే గాని సగరొప్ప గలదా అని ఇంకా ఆ మహర్షి సందేహిస్తుంటే నీవు భావించే ముసలి దెవరను కొన్నావు. నీ భావన కతీతమైన జగదేక మహాశక్తి. ఇంతమైమరపా నీకు. చూడు నా వైభవ మిక నైనా బుద్ధి తెచ్చుకోమని హెచ్చరిస్తున్నట్టుదా మహర్షిని. తిట్టినా దీవించినా తల్లికే ఉంది అధికారం మరెవరికీ గాదు. తిట్టు మన తప్పు బయటపెట్టటానికైతే దీవన మనకు కావలసినవన్నీ సమకూర్చి సంతృప్తులను చేయటానికి. మామూలు తల్లికే ఇలాటి గుణముంటే జగన్మాత కింకా ఎంత ఉండాలో ఎంత వైభవోపేతంగా కనపడాలో గమనించండి అని ఆ దేవతా వైభవాన్ని కండ్లకు గట్టినట్టు చూపుతున్నాడు కవిసార్వ భౌముడు.

అమ్మ కోపమైనా భరించవచ్చు గాని అయ్యగారి కోపమునే భరించలేము. తిట్టినప్పుడు తిట్టినా మళ్లీ మెత్తబడుతుంది తల్లి. పిల్లలు దిగులు పడతారేనని జాలి చూపుతుంది. చేసిన తప్పు మన్నించి మరచి పోతుంది. కాని తండ్రి అలా కాదు. కోపిస్తే మహా కోపం. అనుతాపమేలేని కోపమది. భోజనానంతర మందరూ వచ్చి వీధి అరుగుల మీద ఆసీనులయ్యారు వ్యాసుడూ ఆయన శిష్యవర్గమూ. ఉన్నట్టుండి ఒక సందడి ఒక హడావుడి. ఎవరు ఎక్కడి నుంచి. అభ్యంతర మందిరం నుంచి. ఎవరు వారు. గౌరీ విశ్వనాధులు. ఎవరు వారిద్దరా. కాదు. ఒక్కరే. ఎలా ఉన్నారు. వారి దర్జా వర్ణిస్తున్నాడు కవిరాజు చూడండి.

**'చంద్రబింబానన చంద్రరేఖా మౌళి**
**నీలకుంతల భార నీలగళుడు**
**ధవళాయ తేక్షణ ధవళాఖిలాంగుండు**

**మదన సంజీవని మదన హరుడు**

**నాగేంద్ర నిభయాన నాగకుండలధారి**

**భువన మోహన గాత్ర భువన కర్త**

**గిరిరాజ కన్యక గిరిరాజ నిలయుండు**

**సర్వాంగ సుందరి సర్వగురుడు'**

ఒకరి చెట్ట లొకరు పట్టుకొని వచ్చారట బయటికి. అర్ధనారీశ్వర విగ్రహాన్ని చూడండి ఎంత గొప్పగా వర్ణిస్తున్నాడో మహాకవి. శ్రీనాధుని సీసమంటారు. సీసంలో ఆరితేరిన హస్తమది. అందులో ఒక భాగం పరమేశ్వరికి ఒక భాగం పరమేశ్వరుడికి పంచిపెట్టి వర్ణిస్తున్నాడు. ఇద్దరని పేరేగాని ఒకరికొకరు తీసిపోరు. ఒకే గుణా లిరువురివీ. ఇందులో చమత్కార మేమంటే నీలకుంతలా లాయనకు లేకున్నా నీల గళమున్నది. మదనహరుడైనా ఆవిడ మదన సంజీవని. ఆవిడ నాగేంద్ర నిభయాన అంటే గజరాజ గమన అయితే ఆయన నాగేంద్రాన్ని పోనీయలేదు. నాగమంటే అక్కడ ఏనుగైతే ఇక్కడ సర్పమని అర్థం. శబ్దమొకటే అయినా అర్థంలో భేదం. చూడండి. జగజ్జననీ జనకుల లోకోత్తర వైభవం. ఎంత మనోజ్ఞంగా దర్శనమిస్తున్నదో. కవి సార్వభౌముడే చూపగలడిలాటి జగదేక సార్వభౌముడి ఐశ్వర్యం – అంతేనా – మహారాజుగారు రాణీగారితో వేం చేస్తున్నారంటే సామాన్యమా అది. ఎలా వస్తున్నారట మరి.

**'జయయు విజయయు నొక వంక సరసరారు**

**నంది కేశుండు ముందట నడచి రాడు**

**ప్రధమ దంపతు లేమి సంభ్రమము లేక**

**యరుగు దెంచుట యద్భుత మయ్యెమాకు'** అంటాడు వ్యాసుడు. ముందు వెనకల మందీ మార్బలంతో వస్తున్నారేమోనని మన మాలోచిస్తుంటే అలా రాలేదు వారు. మామూలుగా అయితే వచ్చేవారే ఇప్పుడలా ఎందుకు రాలేదంటే వ్యాసుని చీవాట్లు పెట్టాలని వస్తున్నాడా విశ్వేశ్వరుడు. ఆ సందర్భంలో తన పరివారం వినగూడదా మాటలు. మహర్షి మరీ చిన్నబుచ్చుకొంటాడని భయం. ఆగ్రహంలో కూడా ఔచిత్యం. కాని శ్రీనాధునికి కొరతే రాజ వైభవంతో రాలేదే రాజాధిరాజని. అందుకే వీరు రాలేదు వారు రాలేదని వాపోతున్నాడు.

అసలు వారిని చూచేసరికే గుండె గుభేలు మన్నదా మహర్షికి. అందులో అమ్మను చూస్తే కొంత ఊరట. అయ్యను చూస్తే ఆరట. అదీ చెబుతాడు మనకు మహాకవి.

**'గౌరింజూచిన యప్పుడంచిత మహాకారుణ్యసంపత్తియుం**

**దారానాయక మౌళిఁ జూచినపుడుద్య త్క్రోధ సంరంభ ముం**

**దోరంబై'** కనిపిస్తున్నదట - రాజాస్థానాలలో రాజుగారి వ్యవహార మెంతగా చూచాడో ఎంత అనుభవ మున్నవాడో శ్రీనాధుడు. రాజుల ఆగ్రహానుగ్రహా లెలాటివో ఆయనకు చెప్పాలా మనం.

ఇంతకూ చెప్పవచ్చే దేమంటే బయటికి వచ్చి నింపాదిగా వేదికమీద కూచున్నవాడా విశ్వనాథు డున్నట్టుండి వేదవ్యాసుడి ముఖం చూడగానే ఎక్కడలేని కోపావేశంతో మండిపడి ఎలాటి తిట్లు తిడతాడో తెలుసా. శ్రీనాథుడి మాటల్లో మనకు వినిపించే తిట్లవి - ఏమని

Brahmasri Yellamraju Srinivasa Rao www.advaitavedanta.in

'ఓరి దురాత్మ నీవార ముష్టింపచా
భాస! యోజనగంధి ప్రథమ పుత్ర
దేవర న్యాయ దుర్భావనా పరతంత్ర
బహుసంహితా వృధాపాఠ పఠన
భారత గ్రంథ గుంభన పండితమ్మన్య
నీవామదీయ పత్నికి నశేష
కైవల్య కళ్యాణ ఘంటా పథమునకు
కాశికాపురికి నిష్కారణంబ
శాపమిచ్చెదనని యనాచార సరణి
నడుగు వెట్టిన వాడ వహంకరించి
పొమ్ము నిర్భాగ్య మాయూరి పొలము విడిచి
యెచటికే శిష్యులును నీవు నీక్షణంబ'

ఇంతకన్నా తిట్టవలసిందేముంది. వ్యాసుని ప్రవర్తన అంతా బయటపెట్టే తిట్లవి. అందులోనూ ఎంత నాజూకైన తిట్లో సహృదయులు మీరే ఆలోచించండి తెలుస్తుంది. ఎంత నీటో అంత ఘాటు. ఎంత ఘాటో అంత నీటు.

అంతేగాదు. నీటు కూడా వదిలేసి అసలే ఘాటుగా నిర్మోహమాటంగా కూడా తిడతా డీశ్వరుడు. ఈశ్వరుడా. కాదు. ఆ బురఖాలో శ్రీనాథ కవీశ్వరుడు. ఏమని.

Vallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

పోక నడగొట్టి తేనియు

రాకింతుఁ జూమీ మొగంబు రాచట్టుపయిన్

శ్రీకాశిక నిందించిన

నీకింతట నేలపోవు నీచ చరిత్రా

నేను పొమ్మన్న వెంటనే నీవీ ఊరు విడిచి పోకుంటే ఏమవుతుందో తెలుసా. నీ మొహం పెద్ద బండరాయి మీద వేసి రాచి పారేస్తా ఏమను కొన్నావో. నీబోటి నీచుడికి వేయవలసిన శిక్ష ఇదేనని దారుణంగా మాటాడుతాడు. ఎవడు. పరమేశ్వరుడా. పాపమాయన అన్ని మాటలన్నాడో లేదో గాని ఆయన గారన్నాడని చెప్పి శ్రీనాథుడే ఆయన నోరు పెట్టుకొని అంటున్నాడా అని తోస్తుంది మనబోటి పాఠకులకు.

ఇంతకూ ఇదంతా ఎవరెవరితో మొరబెడుతున్నారో తెలుసా మీకు. తన్ను విశ్వేశ్వరుడిలా నిష్ఠురమాడి కాశి నుంచి వెళ్లగొడితే చేసేది లేక వెంటనే బయలుదేరి దక్షిణ కాశి అయిన భీమేశ్వరం వచ్చానని అగస్త్య మహర్షితో తన గోడు వెళ్లబోసుకొంటాడు వేదవ్యాసుడు. ఇదీ సందర్భం.

అగస్త్యాది మహర్షులు కూడా తక్కువ వారేమీ గాదు. సార్వభౌముడందరికీ సార్వభౌమత్వాన్ని సమానంగానే పంచి పెట్టాడు. అసలు వారెక్కడున్నారు ఆ దేవతలు గాని మహర్షులు గాని. అన్నీ కవి తన దృష్టితో నిర్మించిన చిత్ర విచిత్రమైన పాత్రలేగా. కవి దృష్టి ఎలా ఉంటే అలాంటిదే అవుతుందాతని సృష్టి. కవి ఇక్కడ సార్వభౌముడు గదా. అందుకే తన రాజసానికి తగినట్టే తయారయిందా పాత్రలలో కూడా రాజసత్వం. అది దేవాది దేవుడైన విశ్వేశ్వరుడైనా ఒకటే. తదుపాసకులైన అగస్త్యాది

మునీశ్వరులైనా ఒకటే. దానికి తగినట్టే వారి మాటలూ చేష్టలూ కూడా. వేషం మారినా రోషం మారలేదు ఆస్వామికి. కిరాత వేషంలో అర్జునుణ్ణి పరీక్షించటానికి వచ్చాడు విశ్వనాధుడు. వచ్చి ఎంత రాజసం ఒలకబోస్తాడో చూడండి.

**'ఎవ్వడవు రోరి నీవు నా యెదుర( బాణ**
**పంది నేసితి బాహుదర్పంబు మెఱసి**
**యెఱుఁగవుర యోరి నన్ను నీ యింద్ర కీల**
**పర్వతం బేలు వనచర సార్వభౌము'**

చూడండి. తానొక సార్వభౌముడట. తన్ను గుర్తించక పోవటమతని అపరాధమట. ఎప్పటి నుంచీ తానక్కడి వనచరులకు సార్వభౌముడు. ఏమిటా దబాయింపు. అదీ ఎలాటి భంగిమలో **'ఓంకార చాపంబు నిలువంబెట్టి - తదీయ శిఖరంబున నఱచేయి వూపి యొఱిగి యొయారంపు నిలకడ నిలిచి వలకేల వాలమ్ము ద్రిప్పుచు** - నని వర్ణిస్తాడు కవి. ఏమి రాజసం - ఏమి నిర్లక్ష్యం - ఆ నిలుచున్న తీరులోనే తెలుస్తున్నదది.

అంతేకాదు. **ఏనును నా కుటుంబమగు నీ తరళాక్షియు వేట వచ్చి యే నీ నిశితాస్త్ర పాతమున నిక్కిటిఁగూల్చె దనంచు వాక్రుతి జ్ఞానియమంబున న్వెనుక జాడగ వస్తూ ఉంటే యెవ్వడవు రోరినా పంది నేయ నీవు - మండెడు బలునార సమున గుండియపగులం గనేసి కూల్చితి దీనిన్** - నాబాణంతోనే చనిపోయిందిది. అలాంటప్పుడు వెండి ప్రయోజనమేదీ రండాసుత దీని పైశరము నిగిడింపన్. మరలా రెండవ బాణం వేశావే ఏమిటీ ప్రయోజనం ఓరి రండా సుత అని బండ తిట్లు తిడతాడా కిరాతుడు.

ఇది కిరాత సార్వభౌముడి తిట్టా. ఆ వేషంలో దాగి ఉన్న కవిసార్వభౌముడి తిట్టా. ఏదైనా కావచ్చు.

ఆ తిట్లే పుడికి పుచ్చుకొని ఉంటారు మహర్షులని గదా పేర్కొన్నాను. వారూ సార్వభౌముని పాత్రలే గదా. అలా నిర్లక్ష్యంగా గాక ఎలా మాటాడుతారు. అగస్త్యునితో మొరబెడతాడు వేదవ్యాసుడు.

**'అనవధానత యూ వగింజంత సూవె**

**పర్వతంబంత యప రాధ భరము గొలిపి**

**కాశి వెదలంగ'** మొత్తాడా విశ్వనాధుడు నన్ను

**కాలభైరవు చిత్తంబు కఠిన పాక**

**మీరసము పెద్ద డుంఠి విఘ్నేశ్వరునకు**

**కాశి మనబోంట్ల కెల్లను గాని బ్రతుకు**

**ముక్కు మొగంబు చూడకొక మోసపు మాటకు విశ్వనాయకుం డెక్కడికైనఁ బొమ్మనుచు నెట్టిని చూడ్కులఁజూచి యల్కతో ధిక్కరణం బు సేయఁ జనుదెంచితి. దోసము పెద్ద లేదనక ధూర్జటి నిష్ఠుర కంఠ హుంక్రియా భ్యాసము మై. నీకును జన్మాన్యైక చారిత్ర యూచిగురుం బోడికి నాకునుంగట కటా చేద్పాటు వాటిల్లె నీముగురం గూర్చినముండ దైవమునకున్ మోమోటలే దోసుమీ** - మన ముగ్గురికీ పట్టిన దురవస్థ ఇది. ఇలా ముగ్గురినీ దురవస్థ పాలుచేసిన ఆ ముండ దైవానికి మొగమాటమేమైనా ఉందేమో చెప్పమని నిష్ఠూరంగా మాటాడుతాడు. సరిపోయింది. స్వామివారక్కడ రండాసుత అంటే ఈ మునిస్వామి ఇక్కడ ముండదైవ మనటం.

అగస్త్యుడేమి తక్కువా. ఇద్దరూ తాము చేసేదేమీ లేకపోయినా పౌరుషానికేమీ లోటు లేదు. వ్యాసుని విద్యా పాటవాన్ని ప్రశంసిస్తూ ఎందుకయ్యా దిగులు పడతావు. కాశీ నివాసం మనకు లేకపోతే పోవుగాక. మనకేమి తక్కువ. అపర స్వర్గమైన దక్షారామం చాలదా మనకు. ఒక్క భగీరథుని వెంట వచ్చిన గంగ కంటే సప్త మహర్షులు తీసుకు వచ్చిన సప్త గోదావరం చాలు మనకు. అసలు దక్ష వాటంబునకు మోక్షధామమునకు భోగజన్మ స్థలమున కేపురముసాటి- అని తమలో తాము సగర్వంబుగా చెప్పుకొని ఇద్దరూ తృప్తి పడతారు. ఎంత పౌరుషమెంత అలుసో చూడండా మహర్షులకు.

అగస్త్యుడి లాంటివాడే దధీచి అనే మహర్షి కూడా. ఈయనలాగే ఆయనా పరమ మహేశ్వరుడే. మహేశ్వరుణ్ణి పిలవకుండా యజ్ఞం చేయ తలపెట్టాడు దక్షుడు. వాడొక రాజసుడు. అహంకారి. అదీ చూపా డెలాంటిదో మన సార్వభౌముడు.

**'అరణి సంగ్రహ మొనరించి యజిని పట్టి**
**పెద్ద కొలువుండె ముత్యాల గద్దె యెక్కి**
**చుట్టు బలసి కూర్చుండిరి సురలు మునులు**
**వింధ్య మాఁకిడినట్లుండె విశ్వసభయు'**

ఎలా ఉందో చూడండి వాడి రాజసం. నిజంగా తాను ప్రజాపతినేనని విర్రవీగుతున్నాడు. అప్పుడు లేచి చూచాడు దధీచి ఇటూ అటూ దృష్టి సారించి. ఎక్కడా దర్శనమీయ లేదు తన స్వామి. ఇక పెట్టాడు చూడండి చీవాట్లు. ఎవరిని దక్షుడినా. ఒక దక్షుడేమిటి. అక్కడి కాహూతులై వచ్చిన

Vallamasri Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

వారందరినీ. ఆఖరుకు విష్ణుదేవుని కూడా పోనీయలేదు. '**మఖమునకుఁ దన్నుఁజీరిన మాత్రన్ త్రిపురాంతకుఁబలిపింపక.**

**యుపదర్శన మాచరించు టుచితమె హరికిన్**

**వా మాంగము వైకుంఠుఁడ**

**మాంగము వేధ మదన వైరికి** – బ్రహ్మ విష్ణువులు శివునికి కుడి యెడమలు గదా – నీకు బుద్ధి లేక పిలవక పోతే మాత్ర మాయనను పిలిపించ వలసిన బాధ్యత లేదా వీరిద్దరికీ. అంతేగాక.

**శితికంఠునకును నెచ్చెలికాడు గాడొకో**

**యటమటీడైన యీ యక్ష భర్త**

**యహి కం కణునకు మూడవ కన్నుగాడొకో**

**ప్రాల్మాలు నట్టియీ పావకుండు**

**పురవైరి కవతంస పుష్పంబు గాడొకో**

**నిర్భాగ్యుడైన యీ నీరజారి**

**గంగాధరునకు లెంకల లెంకగాడొకో**

**పెనుగూళయైన యీ యనిమిషేంద్రుఁ**

**డేమి గుడువంగ వచ్చినారిండ్లు విడిచి**

**హరుని వెలివెట్టి నట్టియీ యాగమునకు**

**పంచ వదనుని కను జేవు తించెనేని**

**తత్ క్షణమునంద తమయాంధ్ర త్రాళ్లు తెగవె**

**ఏలవచ్చినవాడు బాలేందు మౌళి**

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

**విరహితంబైన యా యాగ విధికి జముడు**

**మఱచెనే శూలి డాకాలి మడమ తాఁపు**

**దీర్ఘ నిర్ఘాత సంపాత నిర్ఘృణంబు**

ఏమి తిట్లో ఎన్ని బండ బూతులో చూడండి. దేవత లేమిటి మహర్షులేమిటి. బ్రహ్మ విష్ణువులేమిటి. అందరినీ ఒక గాట గట్టి ఎవరికి పెట్టవలసినవి వాళ్లకు మొగం వాచేటట్టు పెట్టాడు వాతలా దధీచి. దధీచి పెట్టాడా. కాదు. ఆ మహర్షి చేత పెట్టించాడు శ్రీనాధుడు. కవిరాజు రాజస స్వభావమెంత దూరం పోయిందో ఎంతగా తొంగిచూస్తున్నదో చూడండి ఆయా పాత్రలలో. సంయమీంద్రుల సంగతే ఇలా ఉంటే ఇక సాక్షాత్తూ లయకాల రుద్రుని క్రోధాగ్నిలో ఆవిర్భవించిన వీరభద్రుని ఆర్భాట మెలా ఉంటుందో ఊహకే అతీతం. మూలగ్రంధంలో ఉన్నా లేకున్నా నిర్మొహమాటంగా వర్ణించాడు వీరభద్రుడి విజృంభణాన్ని యజ్ఞవాటంలో.

**తనమీద వైవంగ దంభోళి యెత్తిన**

**జెలగి సంస్తంభించె జిష్ణు భుజము**

**కైట భారాతి చక్రము ప్రయోగించిన**

**వెసఁ జక్కిలముఁబోలె విఱిచి బొక్కె**

**పటు చపేటంబున పండ్లు డుల్లగ మొత్తి**

**పూషార్కు వదనంబు బోసి పుచ్చె**

అంతేగాదు. ధాతసతి ముక్కు సోణంబు దాక గోసె. పోతే ఇక దక్షుడి అల్లుండ్ల నందరినీ దామెనలు గట్టి నడిపించె. పసుల కదుపులను

తోలినట్టు తోలుతూ పోయాడట. అతడలా చేశాడంటే శ్రీనాధుడలా చేయించాడతని చేత. తాను సృష్టించిన పాత్రే గదా అది. ఆ మాత్రం తన కచ్చె తన రీవి ఆ పాత్ర కబ్బక పోతే ఎలా.

ఆ మాటకు వస్తే కవిసార్వభౌముడి రాజసమూ రీవీ ప్రతి సన్నివేశంలో ప్రతి పాత్రలో మనకు పదహారు కళలతో సాక్షాత్కరిస్తుంది. అది దేవతలే గాదు. దానవులే గాదు. మానవులేగాదు. మహర్షులే గాదు. చివరకు నదీ పర్వత పట్టణాదులేగాదు. అందరికీ అది అంతో ఇంతే పంచి పెడుతూనే వస్తాడు. అందరూ వారి వారి స్థానానికి తగినట్టు సార్వభౌములుగానే కనిపిస్తారు మన మనోనేత్రానికి.

దేవతా సార్వభౌముడైన మహేశ్వరుణ్ణి వర్ణించిన ఘట్టాలు చూచాము గదా. స్వస్వరూపంలోనే గాదు. ఆఖరుకు కిరాత వేషం ధరించినా ఆయన దర్జాకు లోపం లేదు. అష్టైశ్వర్యాలూ వశమయి ఉన్నవాడికి లోపమేమిటి కాకపోయినా. కృత్రిమంగా సీదా సాదాగా ఒక వేషం దాల్చినా అది తన సహజ రూపానికేమీ తీసిపోదు.

**వికట పాటల జటా మకుటికా భారంబు**
**కలికైన జుంజురు నెఱులు గాగ**
**చారు సుధా ధామ శకలావతంసంబు**
**పెడకొప్పుపై నొప్పు పీకెగాగ**
**ఘన లలాటంబునఁగను పట్టు కను చిచ్చు**
**గైరిక ద్రవ తిలకంబు గాగ**

భుజ మధ్యమునఁగ్రాలు భుజగ హారంబులు
  గురిజ పూసల గుబ్బసరులు గాగ
శంకరుండు కిరాత వేషంబు దాల్చి
  యగజ చెంచెతయై తోడ నరుగుదేర
పాణి నోంకార దివ్యచాపము ధరించి
  వచ్చె విచ్చవ్చు పరతపోవనము కడకు.

కిరాత వేషంలో వచ్చినా చూడండి. ఎంత ఠీవిగా ఉందో వేషం. అదే జటాజూటం - అదే చంద్రరేఖ - అదే ఫాలనేత్రం. అవే నాగభూషణాలు. అప్పుడొక భంగిమలో కనిపిస్తే ఇప్పుడింకొక భంగిమ. మరి దానికి తగినట్టే అమ్మవారి వేషం. చేతిలో ధనుస్సు మాత్రం అప్పుడు ఇప్పుడూ ఒకటే. పోతే అప్పుడు దేవతా సార్వభౌముడైతే ఇప్పుడు వనచర సార్వభౌముడు. సార్వభౌముడు సార్వభౌముడే.

అంతేనా. భిక్షాటనం బయలుదేరినా బిగువు తప్పని ఠీవి చూపుతాడా మహాత్ముడు. ఎలాగో వర్ణిస్తాడు చూడండి కవి.

'మువ్వన్నె పులితోలు మొలదిండుగాఁగట్టి
  కర్కోట కాహి పాగా బిగించి
చిలువపోగులను వ్రేల్చెపులకీలనచేసి
  వలరాచనీఱుమైఁగలయనలది
చిన్నారిపొన్నారి శిశిరాంశు తలదాల్చి
  కొనగోటి జుత లేటి కొదమఁబూని

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

పచ్చియేనిక తోలు పచ్చడంబు ధరించి
గిలుక మువ్వల కోలc గేలcబట్టి
పసిడి జల పోసనముతోడ నెసక మెసగు
బిసరుహాపసు పుటీయ కప్పెర ధరించి'

బయలుదేరుతాడట దారుకావనంలో భిక్షాటనార్ధ మా పరమేశ్వరుడు. ఇది భిక్షుకుడి వేషమా. ఆదిభిక్షువైన పరమాత్మ వేషమా. **'ప్రాకామ్యం తేవిభూతిషు'** అని వర్ణించాడు కాళిదాసు. అష్టైశ్వర్య సంపన్నుడు ఆయన గారి ఇష్టం. ఏ వేషమైనా వేయగలడు. ఎంత కాలకూటమైనా నేరెడు పండును బోలెనుండయై ఆయన హస్త సరోరుహ మెక్కవలసిందే. కటుక మగు విషమునైనా విషధర కటకం బగు కేలcబూని రసఘుటిక యునుంబోలె మ్రింగి జీర్ణించుకోగల మహాశక్తి ఆయనది.

అలాటి మహేశ్వర భక్తులయి దివ్యజ్ఞాన సంపన్నులైన నారదాది మహర్షుల ఐశ్వర్యమిక చెప్పేదేముంది వారు ఏమి తక్కువవారు గారు. కవి సార్వభౌముని దృష్టిలో అందరూ సార్వభౌములే. రాచఠీవి చూపవలసిన వారే. చచ్చూ పుచ్చూ ఎక్కడా పనికిరాదు. నారద మహర్షి దర్జా చూడండి ఎలా చూపుతున్నాడో శ్రీనాథుడు. తీర్థాలన్నీ సేవించి ఆయనగారు క్రమంగా గోదావరీ తీరంగా వస్తూ దారిలో వింధ్య పర్వతాన్ని చూచాడట. పర్వతం దగ్గరికి వస్తూ ఉంటే రేవా నదీ తరంగ శీకర శిశిర మారుతాల కాయన జడలిటూ అటూ చలిస్తున్నాయట. ఆయన పాదాంభోజ యుగళ చిహ్న శ్రేణులలో ఆ పర్వత శిలా పట్టాలు పావన మవుతున్నాయట. మరి ఊరక ఒంటరిగా ఎవరూ తోడు లేక వస్తున్నాడా ఆ తపస్వి అయినా. ఆయన

రాచతపస్వి. అలాంటప్పుడు తోడు లేకుండా వస్తాడా. వస్తే ఒప్పుకొంటాడా శ్రీనాథుడు. ఎవరు తోడని అడుగుతారా. ఇదుగో చూడండి.

'త్రపరేణు పరిమాణ ధాతు ధూళీపాళి
యళికంబునకు వింత చెలువు నొసఁగ
ఘనమైన రారాపు చనుదోయి రాయిడి
నిఱుపేద నడిమికి వెఱపు చూప
తొలుకాఱు మెఱుగు దీగెల నేలు కన్నులు
పడదాకి యొక్కింత వాడు పాఱ
సింధూర తిలకంబు చెమట చిత్తడి దాకి
యలిక భాగంబునం దసలు కొనగ
కనకమేఖల జఘన చక్రమున జాఱ
నీవి బంధంబు నాభిపై నెమ్మి వదల
మహతి ధరియించి యొక తను మధ్య తన్ను
ననుసరించుచు గాంధర్వ మభ్యసింప'

అది ఒక గంధర్వాంగన అయి ఉంటుంది. గాంధర్వ విద్య నభ్యసించాలని ఆ గురువు గారి వెంట వస్తున్నదట. నారదుడు బ్రహ్మచారిగదా. ఆయన వెంట ఎప్పుడు గాని ఏ ఆడమనిషి రావట మెక్కడా చూడలేదే అంటే అందుకు మనబోటి పాఠకుల కిచ్చే సమాధానమిది మహాకవి. శిష్యురాలు అని ఋజువు చేయటాని కావిడ చేతికా మహర్షి వీణ మహతి అనేది కూడా ఆ గురువుగా రిచ్చాడో లేదో గాని ఇప్పించాడు

శ్రీనాథుడు. అది కూడా శిష్యురాలైనది శిష్యురాలుగా కనిపిస్తున్నదా. దాని విలాసం చూడండి. రారాపు చన్నులూ సన్నని నడుమూ కిందికి జాతే మొలనూలూ అంతకన్నా క్రిందికి జాతే చీరముడీ. ఏమిటీ వాలకం. విద్య నేర్చుకొంటున్నదా, విలాసాలు చూపుతున్నదా. అందులో నారదుడిలాటి బ్రహ్మచారి గురువు దగ్గరా. అయితేనేమి. ఎంత మహర్షి అయినా ఎంత బ్రహ్మచారి అయినా రాజమర్యాదలు ఏమి జరగక పోయినా తట్టుకోలేదు సార్వభౌముని మనస్సు.

ఇంకొక చమత్కారమేమిటో తెలుసా. నారదుడంటే సాధారణంగా విష్ణుభక్తుడు. నారాయణ నారాయణ అని స్మరిస్తూ నామాలు పెట్టుకొని అచ్చం నారాయణ మూర్తిలా కనిపిస్తాడు మన కంటికి. ఇప్పుడేమిటో తెలుసునా అండీ.

**'దివిజముని నర్మదానదిఁ దీర్థమాడి**
**విమల భస్మంబు నిఖిలాంగకముల నలది**
**యమిత రుద్రాక్ష మల్యంబు లనువు పఱచి**
**భవుని నోంకార నాథునిఁ బ్రస్తుతించి**

అని శివస్తోత్రం చేసేటప్పు డాయన రూపాన్నే మార్చేశాడు శ్రీనాథుడు. ఏగాలి కాచాప నారదుడంటే. త్రిలోక సంచారిగదా. త్రిమూర్తులూ ఆయనకొకటే. హరిహరా భేద మామాత్రం చూపకపోతే ఎలాగా.

ఇక తన ఇంటికి విజయం చేశాడో లేదో ఆ మహర్షి. ఆయనకు సకల రాజోపచారాలూ చేశాడా పర్వతరాజు. పాదాంబు జాలకు ప్రణతి

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

చేయటమే గాదు. పృథు హేమపీఠం పెట్టటమే గాదు. అర్ఘ్య మివ్వటమే గాదు. అంఘ్రి సంవాహనమే గాదు. సకల విధములైన రాజోపచారాలూ సాగించాడు. మహర్షులైనా మహారాజులే కవిసార్వభౌముడి దృష్టికి.

ఒక నారదుడేమిటి. అగస్త్యుడేమి తక్కువవాడా. ఆయనగారి దింకా దర్జా. ఈయన ఇంకా బ్రహ్మచారి అయితే ఆయన గృహస్థుడు కూడా. అందులోనూ ఆయన భార్య ఎవరో తెలుసా. సాక్షాత్తూ క్షత్రియ కాంత. పేరు లోపాముద్ర. ఆరోజుల్లోనే చూడండి వర్ణాంతర వివాహాలు ఎలా జరిగిపోయాయో. ఎంత ప్రగతి పథంలో ఉన్నవాడో అగస్త్యుడు. కొంచెమ ప్రస్తుత మనుకోకపోతే ఒక రహస్యం చెప్పవలసి ఉన్నదిక్కడ. లోపాముద్ర అంటే స్త్రీ అనిగాదు అర్థం. అది ఒక సంకేతం. శ్రీ విద్యకే లోపాముద్ర అని పేరు. లఉపధ. లకార ముపధగా అంటే పూర్వాక్షరంగా ఉన్న ముద్ర. లకారం ముందున్నదేది. హ్రీ మ్మనే మంత్రం. క ఏ ఈ ల హ్రీం హసకహల హ్రీం– సకల హ్రీం – అనే పంచదశి మూడు కూటాలలో ప్రతి కూటమూ హ్రీంతో అంత మవుతుంది. దానికి ముం దనివార్యంగా ల అనే అక్షర మావృత్త మవుతున్నది. కనుక హ్రీం కారం లోప అయింది. లోపా అంటే అప్పటికి హ్రీంకార మన్న మాట. అదే ముద్ర శ్రీ విద్యోపాసకులకు. కనుక లోపాముద్ర అంటే పంచద శీ మహామంత్రం. అది స్వాధీనమయి అందులో సిద్ధి పొందిన వాడగస్త్యుడు. అదీ లోపాముద్ర ఆయనకు భార్య అని పేర్కొనటంలో ఆంతర్యం.

ఆస్తామేతత్ – ప్రకృత మనుసరామః. మరి ఆ జన్మాంత బ్రహ్మచారి– దేశ దిమ్మరి – తాడూకోలా లేని నారదుడికే ఇన్ని మర్యాదలు జరుగుతుంటే గృహస్థుడూ రాజకన్యనే పరిణయమాడిన వాడూ మంత్ర ద్రష్టా అయిన

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

అగస్త్యుడికి జరగక పోతే ఏమి మర్యాద. అది అగస్త్యుడు సరి పెట్టుకొన్నా అలా సరిపెట్టుకొనే బాపతుగాదు శ్రీనాథుడు. అన్ని రాజోపచారాలూ సక్రమంగా జరగవలసిందే. అందులో రాజకన్య కూడా ప్రక్కనే ఉంది. ఆయన కోసం కాకపోయినా ఆవిడ కోసమైనా.

బ్రహ్మ నియోగంతో దేవతలు వచ్చి దర్శిస్తా ర గస్త్యుణ్ణి. ఎలా ఉన్నాడాయన. **రుద్రాక్ష భూతి ముద్రా ముద్రిత నిఖిలావయవుడు – మంత్ర జపధ్యాన పరాయణుడు – పాశుపత విద్యారాజ పీఠస్థుడు. ప్రణవ పంచాక్షరీ మంత్ర పరమ సిద్ధుడు.** అలాంటి వాడితో నేరుగా దేవతలు మాటాడనేరక బృహస్పతిని కోరితే ఆయన కూడా సవినయంగా అగస్త్యునికీ అనసూయా రుంధతులకు సరి దీటైన లోపాముద్రకూ కుశల ప్రశ్నపూర్వకంగా విన్నవించుకొంటాడు. వింధ్యగిరి విజృంభణ మాన్పటానికి మీరు తప్ప మరెవ్వరూ సమర్థులు కారని ప్రార్థిస్తాడు. అలాగేనని చెప్పి ఎట్టకేలకు కాశీపట్టణం వదలి బయలుదేరుతారు ముని దంపతులిరువురూ.

వింధ్య మాయనగారి శిష్యుడే. గురువుగారిని చూడగానే సవినయంగా ఎదురువచ్చి ఏమి ఆజ్ఞ అని అడగగానే నాయనా దక్షిణా పథంలో తీర్థాటనం చేయటానికి వెళ్లుతున్నాము. పెద్ద వయసు గావున లావు చాలదు. ఎక్కటం దిగటం కష్టం కాబట్టి నీ అభ్రంకషమైన శిఖరాలు బాగా చిఱుత పఱిచి నాకు తెరువు చూపు. మరలా మేము వచ్చేదాకా నీవిలాగే ఉండాలి సుమా అని సున్నితంగానే దాన్ని మందలించి దక్షిణా పథం చేరుతాడు. అక్కడ ఆయా తీర్థాలు వారు తిరుగుతుంటే చూడండి. ఎన్ని ఉపచారాలో వారికెన్ని రాజమర్యాదలో. దండకావన వాయువులు చల్లగా వీచి వారికి అలసట లేకుండా తాపశాంతి చేస్తున్నాయట. అంతే

కాదు ఆటవిక సేనాధీశ సీమంతిను లంతా వచ్చి లోపాముద్రా సహితంగా ఆయనగారిని దర్శిస్తారు. ఎలాటివారా సీమంతినులు. మొరటు వేషాలతో వస్తే ఒప్పుకోడు శ్రీనాథుడు. **'వ్యామగ్రాహ్య పయోధర ల్కుటిల నీలా గ్రాలక ల్లథ్య మిథ్యా మధ్యస్థిత మధ్య'** లట వారందరూ.

అంతేగాదు. ఆ తరువాత ఇంకా ఎన్ని రాజోపచారాలో ఆ ముని దంపతులకు. ఏమిటి. ఎలాగంటారు.

**'ముని చూడామణి యెల్లసత్క ళలకున్ మూర్ధాభి షిక్తుండు గా**
**వునఁ జారీకరణాంగ హారముల తావు ల్మెచ్చి కీర్తించుచున్**
**శనివారోత్సవ వేళఁగన్గొనియె నాస్థానంబునన్ రాజనం**
**దనయుం దానును దేశి మార్గముల గంధర్వాప్సరో నృత్తముల్'**

గంధర్వాంగనలూ అప్సరసలూ అందరూ వరుసగా వచ్చి తమ తమ గానంతో పాటు నృత్యం కూడా ప్రదర్శిస్తున్నారాయన ఎదుట. ముని అంటే ఏదో ముక్కు మూసుకొని మూలగూచున్నా డనుకొంటున్నారా. కాదు. చూడామణి ఆయన. అన్ని కళలలో విద్యలలో ఆరితేరినవాడు. పైగా రాజనందన తన్ను సేవిస్తుంటే ఆస్థానంలో ఆసీనుడై ఉన్నాడు. మరి మర్యాదలన్నీ రాజులకు జరిగినట్టే జరిగి తీరాలి. పైగా ఏదో వారు అభినయిస్తుంటే ఊరక గుడ్లప్పగించి చూచే వాడు కాదాయన. నాట్యభంగిమలూ ముద్రలూ వాటి స్థానాలూ అన్నీ తెలిసినవాడు. కాబట్టి ఎప్పుడే ముద్ర చూపితే వారా ముద్ర తిలకించి ఆహా అని పులకించే స్వభావమున్నవాడు. చారీకరణ అంగహార అనేవన్నీ నాట్యంలో పారిభాషిక పదాలు. నాట్యకళా కోవిదుడు కాబట్టి వాటిని ప్రదర్శించినప్పుడల్లా

అభినందించగలడు. చూడండి. ఈయన తపస్వా - కళా తపస్వా. రెండూనని కవిసార్వభౌముని జవాబు. అందుకేనేమో ముని చూడామణి యెల్ల సత్కళలకున్ మూర్ధాభిషిక్తుండని ముందుగానే ఒక గొప్ప కితాబిచ్చాడా మహర్షికి. అలాంటప్పుడాయా కళాకౌశలాన్ని మెచ్చుకోటంలో అభ్యంతర మేముంది ఆశ్చర్యమేముంది.

అసలు దేవతలేమిటి - మహర్షులేమిటి. మానవులేమిటి చివరకు పశుపక్షి జాతులేమిటి - జడపదార్థాలైన నదీ పర్వత పట్టణాదులేమిటి. అన్నీ ఒకటే శ్రీనాథుడికి- అన్నింటిలో తనకున్న రాజ సత్వమే ప్రతిఫలించి కనిపిస్తుంటుందా కవిరాజు దృష్టికి. ఆ మాటకు వస్తే తాను మానవుడు గనుక అందరిలో మానవత్వమే - తాను రాజసంగా బ్రతికిన వాడు గనుక అందరిలో రాజసత్వమే - దర్శిస్తాడా అనిపిస్తుంది. అలా దర్శించే స్వభావం గనుకనే ఒక పక్షి కూడా పక్షిగా కనపడదు. పక్షిరాజది. ఒక పర్వతంగా కనిపించదు. పర్వత రాజది.

నైషధంలో హంస నలుడితో ఏమంటుందో తెలుసా **'ఎఱుగనె నీవు ప్రాంతము న నింతట నంతట ను న్కి యింత యే మఱుదునె'** నీవిక్కడ ఉన్న సంగతి నాకు తెలియ దనుకొన్నావా అంత ఏమరుపాటుతో లేను. అయినా నీవు **'విశ్వజన మాన్యుడవు గదా'** ఇంత హింస కొడిగడతావా అని నా బరవాసా. చంపదలచుకొంటే ఎంతమంది లేరు శత్రురాజులు. ఒక రాజహంస కావలెనా నీకు. అసలు నేనెవరో తెలుసా ఇక్కడి కెందుకు వచ్చానో తెలుసా నీకు. **నానా నదీ నదకాంతార పురీశిలోచ్చయాలన్నీ** సంచరిస్తూ విదర్భ దేశంలో ఒక చంద్రబింబం లాంటి సుందరిని చూచా. ఆకన్య కనురూప లావణ్య రేఖా సంపన్నుడైన పిన్న వయసు రాకొమరుడెవరా

అని విశ్వమంతా పరిభ్రమించి అందరినీ పూర్వపక్షం చేసి **యిచ్చోట నిన్ను గనుంగొని సిద్ధాంతీకరించితి** నేమనుకొన్నావో. అమ్మా నవతిని నిన్నుంగూర్చ నాకు నేర్పుగలదు. నన్నుంబనిగొమ్ము. కార్యంబున నార్యులు నిజ ప్రయోజనం బెఱింగింతురు గాని మాటలంబ్రకటింపరని ఎంత ఠీవిగా మాటాడుతుందో చూడండి. దానికి నలుడే మురిసిపోయి దాన్ని విడిచిపెడితే మరలా దమయంతి దగ్గరికి వచ్చి ఆవిడితో ఏమంటుందో తెలుసా. అమ్మాయీ నేనెవరను కొంటున్నావు.

**నలిన సంభవు వాహనము వారువంబులు**
**కులము సాములు మాకు కువలయాక్షి**
**చదలేటి బంగారు జలరుహంబుల తూండ్లు**
**భోజనంబులు మాకు పువ్వు బోడి**
**సత్యలోకము దాక సకల లోకంబులు**
**నాట పట్టులు మాకు నబ్జవదన**
**మధురాక్షరములైన మా మాటలు వినంగ**
**నమృతాంధసు లె యోగ్యులనుపమాంగి**
**భారతీదేవి ముంజేతి పలుకుంజిలుక**
**సమదగజయాన సబ్రహ్మచారి మాకు**
**వేదశాస్త్ర పురాణాది విద్యలెల్ల**
**తరుణి నీయాన ఘంటాపథంబు మాకు**

చూచారా దాని రాజసం - దర్పం - ఠీవి. దాని పెద్దలు బ్రహ్మవంశజు లట. మందాకినీ కాంచన కమలాలే దాని కాహార మట. భూలోకం నుంచి సత్యలోకం దాకా అన్ని లోకాలూ దాని విహార స్థలాలట. దాని మాటలు వినాలంటే అమరులే దానికి యోగ్యులట. ఇక వేదశాస్త్ర పురాణాది వాఙ్మయమంతా దానికి కంఠస్థమట. ఇవి హంస మాటలా రాజహంస మాటలా. శ్రీనాథకవి రాజహంస మాటలా. తన రాజసమే ఆ రాజ హంస ద్వారా వినిపిస్తున్నాడు కవి. రాజభోజనం చేసిన వాడు తాను - దేశ దేశాలూ తిరిగినవాడు. సర్వత్రా తన సాహిత్య సౌరభాన్ని వెదజల్లినవాడు. తానుగాక ఎవరా హంసరాజు.

ఇదిగాక ఇంతే దర్జాగా ఒక మాట అంటుందా హంస. ఏమని.

**'అడిగితి నొక్కనాడు కమలాసను తేరికి వారువంబనై**
**నడచుచు - భూమిలో నిషధనాధున కెవ్వతె యొక్కొ భార్యయ**
**య్యెడునని - చక్రఘోషమున నించుక యించుక గాని యంతయే**
**ర్పడ వినఁగాని - నీవయని పల్కిన యట్టులెతోచు మానినీ' -**

ఒకనాడు తాను బ్రహ్మదేవుడి రథానికి వారు వమై నడుస్తున్నదట. అలా నడుస్తూ మాటల సందర్భంలో అడిగిందట ఆ పెద్దాయనను. అయ్యా భూలోకంలో దమయంతి అనే కన్యకెవడు భర్త అవుతాడని. రథ చక్ర ధ్వనిలో అంత స్పష్టంగా వినపడలేదు గాని పోల్చుకొంటే నీవే నన్నట్టు తెలిసిపోయింది నాకంటుంది. ఎంత మాట నేర్పు. పెద్దల దగ్గర తన కెంత చనవు. బ్రహ్మ దగ్గర గదా తానున్నది. బ్రహ్మ మాట కిక తిరుగేమున్నది.

ఆ చెప్పే తీరు చూడండి. ఎంత చమత్కారంగా ఎంత ఠీవిగా ఉందో గమనించండి.

పక్షిరాజు ప్రసంగమిలా ఉంటే ఒక పర్వతరాజు ప్రసంగ మెలాంటిదో చూస్తారా. పర్వతమంటే అచేతనం గదా దానికేమిటి మాటలను కొంటారేమో. దాని మాటలు ఎలాటివో కవిసార్వభౌమునికి బాగా తెలుసు. పర్వతం పట్టణమని లేదు. అందరూ రాజులే కవిరాజు దృష్టికి. వింధ్య పర్వతం మేరు పర్వతంతో పోటీపడి తానూ దానిలాగే పెరిగిపోయి తన పెద్దరికాన్ని చాటాలను కొన్నది. దానికా బుద్ధి పుట్టించిన వాడెవరో గాదు. నారదుడు. **'విబుధముని మాట చెవికి క్రొవ్వేడిగా'** సోకింది దానికి. ఇక అది పడే మధన చెప్పనలవి గాదు.

**కంటికి నిద్ర వచ్చునె సుఖంబగునే రతికేళి జిహ్వకున్**
**వంటక మించునే యితర వర్తనము ల్మది వేలు మానసం**
**బంటునె - మానుషంబు గల యట్టి మనుష్యున కెన్న డేనియుం**
**గంటకుఁడైన శాత్రవుఁడొకండు తనంతటి వాడు గల్గినన్**
**ఎవ్వనితో నెచ్చోటం**
**జివ్వకుఁ జేసాఁపవలదు - చేసాఁచినచో**
**నవ్వల నివ్వల నెవ్వరు**
**నవ్వకయుండంగ పగఱ నణగింపఁదగున్**

చూడండి. ఏమి మాటలో ఇవి. ఒక పర్వతం మాటాడే మాటలా. ఎవడైనా తనంతటి వాడు పోటీకి వస్తే వాణ్ణి మట్టుపెట్టే వరకూ కంటికి

కునుకు పట్టదు. సంసార సుఖం మీద ఇచ్ఛా లేదు. ఆహారం రుచించదు. మరే విషయమూ మనసుకు రాదు. ఎవరికట. మానుషంగల మనుష్యుడికి. పౌరుషమున్న వాడికి. మనుష్య డంటుందేమిటి ఆ పర్వతం. పర్వతమా తాను మానవుడా. మానవస్వభావం తన కారోపించుకొని మాటాడుతున్నది. కాదు. అలా మానవత్వాన్ని దాని కాపాదించి మానవ స్వభావాన్ని వ్యంగ్యంగా చాటుతున్నాడు కవి సార్వభౌముడు. అంతేకాదు. ఒక కళాకారుడి కుండే ఆత్మాభిమానమూ ఆత్మ విశ్వాసం కూడా ఎంతగానో ధ్వనిస్తున్నదీ మాటల్లో మనకు.

ఇక్కడ ఒక రహస్యముంది మనం చెప్పుకోవలసింది. అచేతనమనీ చేతనమనీ విభాగం లేదసలు. చైతన్యమంతటా పరచుకొని ఉన్నది. సర్వం ఖల్విదం బ్రహ్మ అని గదా వేదాంత సిద్ధాంతం మరి అచేతన మేమిటి. అచేతన మనేది పయి ఉపాధి. దానికే భూతమని Manifest పేరు. పోతే దానిలో గుప్తంగా ఉన్న చేతనాంశకు దేవత అని పేరు. హిమాలయమంటే భూతం. హిమవంతుడంటే దేవత. అందుకే **'అస్త్యుత్తరస్యాందిశి దేవతాత్మా హిమాలయో నామ న గాధి రాజః'** అని వర్ణించాడు కాళిదాసు. శ్రీనాథుడికి బాగా తెలుసు నీ రహస్యం. అందుకే కాళిదాసులాగా స్థావర జంగమ రూపాలను రెండూ భావించాడు పర్వతానికి. స్థావరంగా అలాగే ఉంటుంది. జంగమంగా అన్ని వ్యవహారాలూ సాగిస్తూ ఉంటుంది. ఈ ఆధ్యాత్మిక రహస్యం మనకు తెలియదేమోనని గుర్తు చేస్తున్నాడు చూడండి మహాకవి.

**స్థావరం బైన రూపంబు జలదవీధి**

**నావరించుచు మొదల నున్నట్ల యుండ**

**జంగమంబైన రూపంబు సవదరించి**

**యెదురుగా వచ్చె వింధ్య మహీధరంబు**

కాళిదాసు కుమార సంభవంలోని భావ మీ పద్యంలో ఎలా తొంగిచూస్తున్నదో చూడండి. సప్తమహర్షులతో హిమవంతుడిలా అంటాడు.

**జంగమం ప్రేష్యభావేవః - స్థావరం చరణాంకితం**

**విభక్తాను గ్రహం మన్యే - ద్విరూప మపి మేవపుః**

అయ్యా నా జంగమ రూపం మీకు పరిచర్య చేస్తుంది. మరి నా స్థావర రూపం మీ పాదన్యాసంతో పవిత్రమయింది. నా రెండు రూపాలకూ మీరు మీ అనుగ్రహాన్ని పంచిపెట్టారు. సంతోషం.

పోతే మరి రాజ భోజనమన్నారు - రాజభోగాలన్నారు. దేనిలోనూ కొఱత లేదు మన సార్వభౌముడికి. ఎందులోనూ తీసిపోడు దేశమేలే రారాజులకు. భోజనం దగ్గరి నుంచీ అన్నీ నిండుగా ఉండవలసిందే. విస్సన మంత్రి సహపంక్తిలో కూర్చొని బంగారు పాత్రలో భోజనం చేసిన వాడు గదా. ఎవరైనా అలా సకలోపచారాలతో సమృద్ధిగా చేయవలసిందే. ఏడురోజు లన్నానికి మొగం వాచిన వ్యాసమహర్షికైనా అమ్మవారు పుష్కలంగా వడ్డించకపోతే ఒప్పుకోడు. అరటాకుల దగ్గరి నుంచీ ఎంతో పరిశుభ్రంగా ఉండాలి సుమా. ఎలాంటివవి.

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

**మొగి విరిసి కఱకు గూడక**

**పగులక వెడలుపును నిడుపు పసిమియు గలలేఁ**

**జిగురరటాకులు వెట్టిరి**

అంటాడు. అందులో ఎలాటి భోజనం వడ్డించా లనుకొన్నారు.

**'ద్రాక్షాపానక ఖండ శర్కరలతో రంభాఫల శ్రేణితో**

**గోక్షీరంబులతోడ మండెగలతో క్రొన్నేతితో పప్పుతో**

**నక్షయ్యంబగు నేరుఁబ్రాల కలమాహారంబు**

వడ్డిస్తూ పోవాలి. ఏవని ఎన్నని. నీవు లెక్కపెట్ట గలిగినన్ని – ఏమిటది అని అడుగుతారా. శ్రీనాధు డేకరువు పెడుతున్నాడు చూడండి. **'అపూపంబులు లడ్డువంబులు నిడ్డెనలు కుడుములు నప్పంబులు నిప్పట్లు జిల్లేడు కాయలు దోసియలు సేవియలు నంగర పూవియలు సారెసత్తులు జొత్తరలు చక్కిలంబులు మణుగుబూవులు మోరుండలు పుండ్రేక్షు ఖండంబులు పిండ ఖర్జూర ద్రాక్షా నారికేళ కదళీ పనస జంబూ చూత లికుచ దాడి మీ కపిత్థ కర్కం ధూ ఫలంబులు గసగసలు పెసరుపుల గములు చెఱకు గుడములు పడిదెములు పులుపలు పులి వరుగులు నప్పడంబులు పప్పులు రొట్టియలు చాపట్లు పాయసంబులు కర్కరీ కారవేల్ల కూష్మాండ నిష్పావక పటోలికా కోశాత క్యలాబూ శిగ్రూదుంబర వార్తాక బింబికా రవింద శలాటువులును – కందయు బొందయు చారులు తియ్యగూరలు పచ్చడులు బజ్జులు గిచ్చడులు గిజ్జిణులు గడియంబులు కడియంబులు కాయంబులు తోయంబులు సుంద్రాలు నానబ్రాలు అనుములు మినుములు బుడుకులు నడుకులు నిడిమియు జిలిమిడియును**

ద్రెబ్బడయు వడయు నుక్కెరలుఁ జిక్కెరలు నేతులు దేనె తొలలు పిట్టును గట్టును దోరులు పూరులు మోదకంబులు శుద్ధోదకంబులు - షాడబంబుల తోడ పానకంబుల తోడ తిమ్మనంబుల తోడ దధి పిండ ఖండంబులతోడ మీగడలతోడ మజ్జిగల తోడ రసావళులతోడం గూడ - భుగ భుగం బొగపు గంపుల తోడం బ్రతి ఘటించు రామఠామోదంబును - రామఠామోదంబుతో మంతనం బాడు మెంతుల నెత్తావులు - మెంతుల నెత్తావుల తో బిత్తరించు జీరకంబుల సౌరభ్యంబులును - జీరకంబుల సౌలభ్యంబులతోడం బ్రస్తరించు కుస్తుంబరీ కిసలయ వాసనలును - కుస్తుంబరీ కిసల యు వాసనలతోడం బిసాళించు కఱివేపాకు పరిమళంబును కఱివేపాకు పరిమళంబుతో సంబంధించు కమ్మకసింద గంధంబును - కమ్మ కసింద గంధంబు తోడం దార్కొను నేలకుల సౌరభంబులును - నేలకుల సౌరభంబులతో సాళగించు కాలాగురు కురంగనాభి కర్పూర గంధసార నీహారవాః పూరంబుల వలపులును - కాలాగురుకురం గనాభి కర్పూర గంధాదుల తోడం గల హించు మహి సాక్షి గుగ్గులు ధూపధూమంబుల కమ్మదనంబును - భోజనాగార గవాక్ష మార్గంబుల వెడలి కాశికా నగర ఘంటా వీధులం బౌరనాసికా పుట కుటీరంబులకు కుటుంబకంబుగా మిరయంపు పెరిమయు పసపు పసయు సొంటి సొబగు నావ తేవయు చెందుప్పు చేగయు కారాపువ్వు మవ్వంబును పిప్పలి యొప్పును నల్లంబు మొల్లంబును చింత గ్రొజ్జు రజ్జును పేలపిండి మెండును నిప్పవూ మొగ్గల యగ్గలికయు వెన్న పెన్నాటకంబును గలిగి యొక్కొక్క మఱి తనకు దాన నులివేడికట్టావితో నావిర్భవించిన' దట.

ఏమి భోజనమిది. ఎంత భోజనం. వ్యాసమహర్షి మీద నెపం పెట్టి తనకున్న భోజన ప్రియత్వమంతా బయట పెడుతున్నాడు శ్రీనాథుడు. రాజ భోజనం చేశాడు జీవితంలో. ఎడతెగకుండా ప్రతిదినమూ ఎంత గొప్పగా చేస్తూ వచ్చాడో. ఎన్ని దినుసులు వర్ణించాడు. ఎన్ని వంటకాలు వర్ణించాడు. అందులోనూ ఎంత చమత్కారం. యమకమూ అనుప్రాస ముక్తపదగ్రస్తమూ - ఇలాటి శబ్దాలంకార పురస్సరంగా ఎంత పుష్కలంగా వర్ణించాడో చూడండి. వాటిలో కొన్ని మనకర్థమయ్యే వున్నాయి. మరికొన్ని ఈనాటి వారి కర్థం కానివీ ఉన్నాయి. పైగా ఎంత ఉబలాటమో ఎంత ఉత్సాహమో చూడండా మానవుడి కాయా పదార్థాలు తలుచుకుంటుంటే, టూకీగా వర్ణించినా ఎంత హాయిగా వర్ణిస్తాడో చూడండి.

'**ఆజ్య ధారా ప్రవాహంబును శర్కరా క్షోద సికతిలంబును పాయసాపూప సంపన్నంబును కలమాన్న పూర్ణంబును ద్రాక్షాగోక్షీర క్షౌద్ర పుండ్రేక్షు ఖండ మండితంబును రంభా నారికేళ ఫలశాక సాకల్య కల్యంబును షాడబరసావళీ పానక ప్రచురంబును శరచ్చంద్ర చంద్రికా ధవళ దధి సమృద్ధంబును నైన భోజన మహోత్సవ**'మట. అంతే మరి **బ్రాహ్మణా భోజనప్రియాః** అందులోనూ బ్రాహ్మణుడే గాక కవీశ్వరుదు కూడా అయి కూచున్నాడు తాను. కంఠదఘ్నంగా షడ్రసోపేతంగా భోజనం చేయటమే గాక దాన్ని చిలువలు పలువలు పెట్టి వర్ణిచటంలో కూడా అందె వేసిన చేయి. అలా వర్ణిస్తుంటే మనబోటి శ్రోతలకు కూడా అలాటి మృష్టాన్న భోజనం చేసినంత తృప్తి కలుగుతున్నది. ఎలాటి తృప్తో అది కూడా వర్ణిస్తున్నాడాయన శిష్యుల మీద నెపం పెట్టి. **వైశంపాయన మనః ప్రమోద సంప త్సంపాదన లంపట** మట. సుమంతు సంతోష కారణంబట.

**పైలరసనా తపః ఫలమట - జైమిని కామనా కామధేనువట. దేవలము దావహమట - రోమహర్షణ హర్షో త్కర్షావహ** మట. **సూతకౌతూహల హేతుభూత** మట. పోతే ఇక నా సంగతి చెప్పనే అక్కరలేదు. **అస్మన్మనోరధ విహారఘంటా పథ** మని ఘంటాపథంగా చాటుతాడా వ్యాసుడు.

ఇలాటి భోజనం ఆనాడు వ్యాసాది మహర్షులు చేశారో లేదోగాని శ్రీనాథుడు మాత్రం తన జీవితాంతం చేసి ఎప్పటికప్పుడు సంతృప్తి చెంది తాను చెందుతూ వచ్చిన సంతృప్తినే ఇలా సంతృప్తిగా వర్ణిస్తున్నాడు. సందేహం లేదు. ఒక్క ప్రొద్దుగాదు రెండు ప్రొద్దులు గాదు. మూడు ప్రొద్దులూ ఇలాగే చేయండి. నాలాగే మీరూ దర్జాగా నని మనందరికీ సలహా ఇస్తున్నట్టు కూడా తోస్తుంది నాకు నైషధంలో ఒక పద్యం చదువుతుంటే.

**మృదు మృష్టాన్నము లీ ప్రకారమున నెమ్మిన్ వారు ముప్రొద్దు కొన్ని దినంబు లుభుజియించు చుండిరి సమున్నిద్రాను రాగంబుతో.**

ఆరాగం భోజనం మీద నైనా కావచ్చు. లేక పదునాతేడుల పూవుబోడుల మీదనైనా కావచ్చు మహాకవి మాటలు వింటుంటే. భంగ్యంతరంగా యువతీ యువకులకు భోజన సేవనంలో ఎలాటి మంత్రోపదేశం చేస్తున్నాడో చూడండి. ఆఖరుకు శాకాహారమే కాదు. మాంసాహారాన్ని వర్ణించినా అదీ సమృద్ధిగానే వర్ణించకుంటే తృప్తి లేదు శ్రీనాథుడికి. చిఱు తొండనంబి భార్య తన తనయుడు సిరియాళుణ్ణి పాకం చేసి పరమశివుని కర్పణ చేసే భోజనంలో కూడా **మిరియము నుల్లియుంబసపు మెంతియు నింగువ జీరకంబు శర్కరయును చింతపండును కరాంబువు కమ్మని నేయి తైలముంబెరుగును మేళవించి**

వండకపోతే ఒప్పుకోడు శ్రీనాథుడు. ఎలాటి వంటకమైనా ఎక్కడైనా దానికి తగినట్టు లోపం చేయకుండా అన్ని హంగులతోనూ వంట చేయవలసిందే. అరగొరగా ఏదీ పనికిరాదు.

సార్వభౌముడైన వాడెప్పుడూ స్వతంత్రంగానే జీవించాలని కోరుకొంటాడు. ఒకరి దయాధర్మం మీద ఆధారపడడు. కవిసార్వభౌముడు కూడా అలాగే సర్వస్వతంత్రుడు. ఎన్ని కావ్యాలు రచించినా వాటిమీద శ్రీనాథుని ముద్రే ఉంటుంది. స్వతంత్రంగా వర్ణించిన ఘట్టాలైనా అంతే. ఇతరుల గ్రంథాల నెక్కడైనా అనుకరించినా అంతే. అనుకరణ కూడా అల్లాటప్పా కవుల ననుకరించడు మరలా. యాఙ్ఞా మోఘా వరమధిగుణే అన్నట్టు తనతో సమానులూ తనకన్నా గొప్పవారైన మహాకవులనే అనుసరిస్తాడు. వారెవరు. ఆంధ్ర కవులా. ఆంధ్ర కవులే గాదు. సంస్కృత మహాకవులు కూడా. సంస్కృతంలో కాళిదాసన్నా మయూరుడన్నా చివరకు తాను సాక్షాత్తుగా అనువదించిన నైషధ కర్త భట్ట హర్షుడన్నా ఎనలేని గౌరవం శ్రీనాథుడికి. అందులో హర్షనైషధాన్ని సాక్షాత్తుగా అనువాదమే చేశాడు గదా. చేశాడంటే మక్కీకి మక్కీ కనుకొన్నారా ఏమి. కాదు. అలాటి గుడ్డి అనువాద మెప్పుడూ చేయడు. నన్నయ తిక్కనాదుల అనువాదం లాంటిదది. అంతేకాదు. ఎంత హర్షుడైనా నీవా నేనా అని అతనితో పోటీపడి వ్రాసి భేషనిపించు కోగలడు రసజ్ఞ లోకంచేత.

అసలు నైషధమంటే విద్వదౌషధమని పేరు. వ్రాసినవాడు సామాన్యుడు కాడు. కవి తార్కిక చక్రవర్తి. ఇటు కవిత్వంలోనూ అటు శాస్త్ర పాండిత్యంలోనూ అద్వితీయుడు. **యత్కావ్యం మధు వర్షి ధర్షిత పరాస్తర్కేషు**

**యస్తోక్తయః** ఆయన కావ్యమెంత సహృదయ రంజకమో హేతుబద్ధమైన తర్కమంత ప్రతివాది భంజకం - శ్రీనాథుడే కితాబిచ్చా డాయనకు. **కవికులా దృష్టాధ్వ గమనాధ్వనీనుడని - కాశ్మీర నృప సభాకమల హేళి** అని. అంతేగాదు. నారికేళ ఫలపాకమునం జవియైన భట్టహర్షుని కవితాను గుంభముల సోమరిపోతులు కొందఱయ్యు లౌనని కొనియాడ నేరరని. మరి అలాటి వాటి గ్రంథం తెలుగులోకి అనువదించాలంటే ఎంత ధైర్యసాహసాలుండాలీ తెలుగు కవికి. అయితే ఈ తెలుగు కవీ సామాన్యుడు కాడు గదా. అతడెంత అసాధ్యుడో ఇతడంత అఖండుడు. గౌరవం గౌరవమే. పోటీ పోటీయే. అనువదించినా అది ఒక విమర్శలాంటిది. వ్యాఖ్యానం లాంటిది. అది సూత్రమైతే ఇది భాష్యం. అది భాష్యమైతే ఇది సూత్రమన్న ఫక్కీలో నడుస్తుంది. స్పర్ధయా వర్ధతే విద్యా అన్నారు. పోటీ పడినప్పుడే రాణిస్తుంది ఏ విద్య అయినా. అనువాదమైనా తన అనువాదంలో ఉన్న విశేషమేమిటో ధైర్యంగా చాటుతాడు చూడండి శ్రీనాథుడు.

> **భావంబు పలక్షించియు - రసంబు పోషించియు - నలంకారంబుల భూషించియు - నౌచిత్యం బాదరించియు - ననౌచిత్యంబు పరి హరించియు నని**

ఒక పక్క అభినందిస్తూనే మరొక పక్క దాని లోపాలనెలా బయట పెడతాడో చూడండి.

అనౌచిత్యమన్నందు కొక చిన్న సన్నివేశం చూడండి. మీకే తెలిసిపోతుంది. దమయంతీ స్వయంవరంలో ఆ కన్య కాయా రాజుల మంచి చెడ్డలు వర్ణించి చెప్పటానికెవరా సమర్థులని ఆలోచించి విదర్భరాజు

విష్ణువును ప్రార్థిస్తే ఆయన సరస్వతినా పనికి వినియోగించాడని వ్రాశాడు హర్షుడు - అది ఏ మాత్రమూ సబబుగా తోచలేదు శ్రీనాథుడికి. అది స్వయంవరం. అందులో కన్యకు తోడు రావలసింది సరస్వతే సందేహం లేదు. కాని ఆవిడను గాక విష్ణువును ప్రార్థించట మేమిటి ఆ భీమభూపతి. ఆయన సరస్వతిని ఆదేశించట మేమిటి. ఎంత కోడలైనా తనకేమిటి అధికారం. ఆమె భర్త బ్రహ్మదేవుడా పని చేయలేడా. పైగా దానికి విష్ణువు సిఫారసేమిటి. ఏమైనా బాగుందా. బాగు లేదనిపించే శ్రీనాథుడా సన్నివేశాన్ని మార్చిపారేశాడు. విష్ణువును గాక ఆ రాజు నేరుగా సరస్వతీదేవినే ప్రార్థిస్తాడు. ప్రార్థిస్తే ఆవిడే స్వయంగా సభాభవనంలో అందరి ఎదుటా సాక్షాత్కరిస్తుంది. అలా ప్రత్యక్షమైన ఆ మహాదేవిని చూచి సాష్టాంగ నమస్కారం చేసి ఆ మహారాజు ఆవిడను స్తోత్రం చేస్తాడు. ఏమిటి తెలుగులోనా. కాదు సంస్కృత భాషలోనే. అది ఎలా ఉంటుందో తెలుసా. నీవే గాదయ్యా సంస్కృతంలో నేనూ వ్రాయగలను. కేవలం తెలుగే వచ్చు వీడికి సంస్కృతం రాదను కొన్నావా ఏమి అని సుకుమారంగా భట్టహర్షుని హెచ్చరించినట్టుంటుంది. అయితే చాలావర కతని శ్లోక భావాలే తన దండకంలో తొంగి చూస్తూంటా యనుకోండి. అది వేరేమాట. కాని శ్రీనాథుని ఔచిత్యం చూడండి ఎంత గొప్పగా ఉందో. ఇంకా అనవసరమైన అతి దీర్ఘమైన ప్రసంగాలెన్నో దొర్లాయి మూలగ్రంథంలో. అవన్నీ పరిహరించి ఎంతో సంగ్రహించాడు కావ్యాన్ని. ఎంతగా సంక్షిప్తం చేశాడో గాని 22 సర్గల సంస్కృత కావ్యం 8 ఆశ్వాసాల తెలుగు కావ్యమయింది. దీన్నిబట్టి చూచినా పోల్చుకోవచ్చు మన తెనుగు కవి ఔచిత్య పాలన మెలాంటిదో.

ఇక పోటీ పడటమంటారా. అడుగడుగుకూ కనిపిస్తుందది. **నిపీయ యస్యక్షితి రక్షిణః కథామని - రసైః కథాయస్య సుధావధీరిణీ** అని **పవిత్ర మత్రాతనుతే జగద్యుగే** అని - మూడు శ్లోకాల్లో వర్ణిస్తాడు నల చక్రవర్తి వైభవం మూలకారుడు. అదంతా కలిసి ఒక సీసపద్యంలోకి దించేశాడు శ్రీనాథుడు. అందులో కూడా సువర్ణ దండమని కీర్తి మండలమనీ రెండు మాటల్లో ఉన్న ఔచిత్యాన్ని విస్మరించకుండా తపనీయ దండైక ధవళాత పత్రి తోద్దండ తేజః కీర్తిమండలుండని బహు చమత్కారంగా సర్ది పారేయట మెంతో ముచ్చట గొలుపుతుంది. ఎందుకంటే నలుని తేజస్సు ఆయన గొడుగు కామ అయితే కీర్తి ఆ గొడుగు వస్త్రమయిందని గదా కవి కల్పన. ఒకటి పొడవు ఒకటి వెడల్పు. అది సూచించటానికే దండం - మండలమనే మాటలు. అందుకే ఉద్దండ అని మండలమని జారిపోకుండా యథాతథంగా పట్టుకు వచ్చాడు.

ఇలాగే ఎక్కడ మాతృకలో మంచి మాట వచ్చినా పోనీయడు. కొన్ని చాలా నేర్పుగా పట్టుకు వస్తాడు. **యదగార ఘటాట్ట కుట్టిమ స్రవదిందూపల తుందిలాపయా ముముచే న పతివ్రతౌచితీ - ప్రతి చంద్రోదయ ముభ్రగంగయా-** అని మూలకారుడు వర్ణిస్తే దాన్ని ఒక చిన్న కంద పద్యంలోకి దించి అందులోనే ఆయనగారు వాడిన అగార ఘటాట్ట కుట్టిమస్రవ దిందూపల తుందిలాప అనే ఒక దీర్ఘమైన సమాసమూ - **పతివ్రతౌచితీ** అనే మరొక చిన్న సమాసమూ - ఎలా ఇరికించి తన నేర్పు చాటుతాడో చూడండి.

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**నెలపొడుపుల సురనది ని**

**ర్మలతదగార కుట్టిమ స్రవ దిందూ**

**పల తుందిలాప యగుచుం**

**దెలివొందు పతివ్రతౌచితీ సంపత్తిన్**

ఇక శ్లోకాలకు పద్యాలే పోటీ పడే ఘట్టమొకటి చూపమంటారా.

**సరసీః పరిశీలితుం మయా - గమి కర్మీకృత నైక నీవృతా**

**అతిధిత్వ మనాయి సాదృశోః - సదసత్సంశయ గోచరోదరీ**

ఇది శ్రీహర్షుని శ్లోకం. ఆయా సరోవరాలన్నీ అన్ని దేశాల్లో గాలిస్తూ హంస విదర్భ దేశంలో తిరుగుతూ ఉండగా ఆ సమయంలో దమయంతి తన కనులకు పండువుగా కనిపించిందని నలునితో చెబుతుంది. ఇందులో **గమి కర్మీకృత నైకనీవృత్తనే మాట - సదసత్సంశయ గోచరోదరీ** అనే మాట - రెండూ ప్రౌఢమైన మాటలు. వాటిని పోనీయకుండా పట్టుకు రావాలనుకొన్నాడు తెలుగులోకి. అవి రెండూ అలాగే అనువదిస్తే అందం లేదు. శ్రీహర్షుని ముద్రేగాని శ్రీనాథుని ముద్రగాదది. ఆ ముద్ర ఉంటూ ఉండగానే తన ముద్ర కూడా పడాలి ఆ ఉత్తరం మీద. అందుకే ఒక శ్లోకానికి రెండు పద్యాలు వ్రాశాడు తాను. ఎలాగంటే చూడండి. మీకే తెలుస్తుంది. '**మృదురీతిం బ్రతి వాసరంబు గమి కర్మీభూత నానా నదీ నదకాంతార పురీ శిలోచ్చయుడనై నైకాద్భుత శ్రీ జిత త్రిదివంబైన విదర్భ దేశమున నారీ రత్న ముం గాంచితిన్ సదసత్సంశయ గోచరోదరి - శరత్సం పూర్ణ చంద్రాననన్ కమలేందీవరషండ మండిత లసత్కాసార సేవారతిన్ గమికర్మీకృత నైక నీవృతుడనై కంటిన్ విదర్భంబునన్**

**రమణింబల్లవపాణిఁ బద్మనయనన్ రాకేందు బింబాననన్ సమపీనస్తని-నస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరిన్'**

చూచారా. మన కవిసార్వభౌముని ప్రౌఢి. గమికర్మీకృత నైక నీవృత్తనే మాట రెండవ పద్యంలో అలాగే పట్టుకు వచ్చాడు. కాని అంతటితో తృప్తిపడక మొదటి పద్యంలో అదే మాట గమికర్మీభూతగా మార్చి దాన్ని నానా నదీ నద కాంతారపురీశిలో చ్చయ వరకూ సాగదీశాడు. పోతే 'నైక' నీవృతా అనేగాక నైకాద్భుత అనే మరో శబ్దాన్ని సృష్టిస్తాడు. అలాగే సదసత్సంశయ గోచరోదరీ అనే దాన్ని అనువదించినట్టే అనువదించి దానికి దీటుగా **అస్తినాస్తి విచికిత్సాహేతు శాతోదరిన్** అని మరొక విశ్వామిత్ర సృష్టి చేస్తాడు. నీవే గాదు మహానుభావా నేనూ చేయగల నిలాంటి శబ్ద సృష్టి - కావాలంటే మా కాశీఖండం చూడు తెలుస్తుంది. **తథ్యమిథ్యా మధ్యస్థిత** మధ్యలని ఆటవిక స్త్రీలను ప్రదర్శిస్తాడు. అక్కడ హర్షునితోపాటు **వ్యామగ్రాహ్య పయోధర** లని మురారి భట్టును కూడా రంగంలోకి లాక్కు వస్తాడు. మురారి అనర్ఘ రాఘవంలో **వ్యామగ్రాహ్య స్తనీభి శ్శబర యువతిభిః** అనే మాట ఆకర్షించినట్టుంది శ్రీనాథుణ్ణి. అది తప్పించుకు పోకుండా **వ్యామగ్రాహ్య పయోధరల్కుటిలనీలాగ్రాలకల్ తథ్య మిథ్యామధ్యస్థిత మధ్యలాటవిక సేనాధీశ సీమంతిను** లని ప్రయోగించి భట్టహర్ష భట్టమురారు లిద్దరి చేతా భేష్ భేషనిపించు కొన్నాడు.

ఈ భట్టు లిద్దరికీ తోడు మరొక భట్టున్నాడు సంస్కృత కవులలో. ఆయన పేరు భట్టమయూరుడు. మయూరుని సూర్య శతకం చాలా పెద్ద పేరుగాంచిన శతకం. **కతిపయ శ్లోక సమ్మోదిత సూరుమయూరుం గొనియాడి** అని పోతనగారి చేత కూడా కొనియాడ బడినవాడు. ఆయనగారి

శతకం కూడా చాలా ప్రౌఢ గంభీరమైన రచన. ప్రౌఢి శబ్దంలో. గాంభీర్య మర్థంలో. అలాంటి దాన్ని ఆపోశనం పట్టాడు మన శ్రీనాథుడు. నూనుగు మీసాల నూత్న యౌవనంలో ఎంతగా చదివాడో ఎంతగా తన మనసు మీద చెఱగని ముద్ర వేసిందో అది – దాన్ని మొత్తం ఆంధ్ర భాషలోకి అనువదించి ఉంటాడు సందేహం లేదు. ఉంటాడని ఎందుకంటు న్నానంటే – కాశీఖండ భీమఖండాదులలో సూర్యోదయ వర్ణనలన్నీ పోగు చేస్తే మయూరుడి శతకంలోని పది పద్యాలుగు స్రగ్ధరా వృత్తాలకు అనువాదాలు కనిపిస్తాయి. అన్నీ సీసపద్యాలే. అవి స్రగ్ధరలైతే ఇవి సీసాలు. శతకానికి శతకమే అనువదించక పోతే ఇలా జరగదు. అయితే శ్రీనాథుని ఆ శతక మేమయిందని అడగవచ్చు. కాలగర్భంలో మరుగుపడి మాసిపోయి ఉంటుంది. అందులో ఏవో 14 మిగిలాయి. అదైనా తన కావ్యాలలో తలదాచు కొన్నాయి కాబట్టి ఇప్పుడైనా మనకంటికి కనపడుతున్నాయి. అది కూడా ఎంత వన్నె చిన్నెలు పెట్టి అనువదించాడో తెలుసా శ్రీనాథుడు. మచ్చుకు ఒకటి చూపుతాను చూడండి.

**శాతః శ్యామాలతాయాః పరశు రివ తమోరణ్య వహ్నేరి వార్చిః**
**ప్రాచ్యేవాగ్రేగ్రహీ తుం గ్రహకుముదవనం ద్రాగుదస్తోఽ గ్రహస్తః**
**ఐక్యం భిందన్ ద్యు భూమ్యో రవధిరివ విధాతేవ విశ్వ ప్రబోధం**
**వాహానాంవో వినేతా వ్యపనయతు విపన్నామ ధామా ధిపస్య**

ఇది సూర్యరథ సారధి అనూరుడి వర్ణన. దీనినెంత చికిలీ పెడుతున్నాడో చూడండి శ్రీనాథుడు.

**'చిఱుసాన బట్టించి చికిలి సేయించిన**
**గండ్ర గొడ్డలి నిశాగహనలతకు**

కార్కొన్న నిబిడాంధకార ధారా చ్ఛటా
సత్త్రవాటికి వీతి హోత్ర జిహ్వ
నక్షత్ర కుము ద కాననము గిల్లెడు బోటి
ప్రాచి యెత్తిన హస్త పల్లవాగ్ర
మరసి మింటికి మంటి కైక్య సందేహంబు
పరిహరింపంగఁ బాల్పడ్డ యవధి

చీకటి అనే తీగను ఛేదించటానికి గొడ్డలి - తమస్సనే అరణ్యానికి కారుచిచ్చు లాంటి వాడరుణుడని ఇలా వర్ణిస్తాడు మూలకారుడు. దానికి మన తెనుగు కవి వన్నె చిన్నెలు చూడండి ఎంత దిద్ది తీరుస్తాడో. అదా ఇదా అన్నట్టు నడుస్తాయన్ని పద్యాలూ.

మరి కాళిదాసు కుమారసంభవంలో శ్లోకాలూ ఎక్కడబడితే అక్కడే దర్శనమిస్తాయి శ్రీనాథుని రచనలో. హరవిలాసంలో పార్వతి తపశ్చర్యా- కపట బ్రహ్మచారి ఆగమనం - ఆయన సంభాషణ - పార్వతి కోపం - తుదకు ఈశ్వర సాక్షాత్కారం. అంతా కాళిదాసే మరో అవతారంలో కనిపిస్తాడు. అసలు 7 ఆశ్వాసాల ప్రబంధంలో మూడూ నాలుగూ - రెండాశ్వాసాలు కుమార సంభవం 2, 3, 4, 5 సర్గలు నాలుగింటికీ చాలావరకను వాదమే ననుకోవచ్చు. ఎక్కడ మూలగ్రంధాన్ని కుదించి వ్రాస్తాడో తెలియదు. ఎక్కడ పొడిగిస్తాడో తెలియదు. ఎక్కడ ఉన్నదున్నట్టు వ్రాస్తాడో అదీ తెలియదు. కవి హృదయం కవికే తెలియాలి. మచ్చుకు కొన్ని ఉదాహరిస్తాను చూడండి.

పురే తావంతమే వాస్య తనోతి రవి రాతపం
దీర్ఘికా కమలోన్మేషో యావన్మా త్రేణ సాధ్యతే

అని మూలంలో ఉంటే

**దానవుని వీటిలోన మార్తాండు డెండ**
**యంత మాత్రంబ కాని కాయంగ వెఱచు**
**నెంత మాత్రము నందేని నెలమిఁబొందు**
**కేళి దీర్ఘిక లందుఁ బంకేరుహములు**

ఇలాంటివి యధాతధంగా తెనిగించిన పద్యాలు. పోతే ఇది చూడండి. ఈ అనువాదమెలా ఉందో.

**అథ స లలిత యోషి ద్భ్రూలతాచారు శృంగే**
**రతివలయ పదాంకే చాప మా సజ్య కంఠే**
**సహచర మధుహస్త న్యస్త చూతాంకురాస్త్రః**
**శతమఖ ముపతస్థే ప్రాంజలిః పుష్పధన్వా**

అని మన్మధుడు దేవేంద్రుడి సభకు వచ్చిన పోజు ముద్దుగా కాళిదాసు వర్ణిస్తే- దాన్ని తెనిగిస్తూ ఎంతగా సాగదీస్తాడో చూడండి మూడు మాటల్లో శ్రీనాధుడు.

**కాంతా జనంబుల కతివంక బొమలతో**
**ప్రతివచ్చు పుష్పచాపంబు తోడ**
**కోకిల వ్రాతంబు గ్రుక్కిళ్ల మ్రింగించు**
**క్రొమ్మావి చిగురాకు గొడుగు తోడ**
**రతిదేవి నిడు సోగ క్రాలుగన్నుల డాలు**
**దలపించు మీన కేతనముతోడ**

భుజగ లీలావతీ భుక్త శేషము లైన
  గంధ వాహ కిశోరకములతోడ
చందురునితో వసంత మాసంబు తోడ
  రాజకీరరథం బెక్కి ప్రాభవమున
వచ్చె వల రాజు చిత్తాను వర్తనముగ
  సంభ్రమముతో మహేంద్రు నాస్థానమునకు

ఎంత సాగదీశాడో చూడండి ఆ శ్లోక భావాన్ని ఈ పద్యబంధంలో. కాళిదాసు భావాలు పోనీయకుండా వాటికి తోడు తన భావాలు జతల కలిపి నడుపుతాడు. అందులోనూ వలరాజు గదా మన్మథుడు. రాజు కాబట్టి రాజసంగా రథమెక్కి మందీ మార్బలంతో దర్జాగా బయలుదేరి వస్తాడు. అక్కడా తన సార్వభౌమత్వాన్ని చూడవలసిందే మహాకవి. మరి బ్రహ్మచారి వేషంతో వచ్చి శివుడు పార్వతి నడిగే ప్రశ్నలు చూడండి.

1. భవత్యనిష్టా దపినామ దుస్సహా
   న్మనస్వినీ నాం ప్రతిపత్తిరీదృశీ
2. అలభ్యశోకాభి భవేయ మాకృతి
   ర్విమాననా సుభ్రుకుతః పితుర్గృహే
3. కిమిత్యపాస్యా భరణాని యౌవనే
   ధృతం త్వయా వార్ధక శోభి వల్కలం
4. దివం యది ప్రార్థయసే వృథా శ్రమః
   పితుః ప్రదేశా స్తవ దేవభూమయః

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**5. నివేదితం నిశ్వసి తేన సోష్మణా**

**మనస్తుమే సంశయమేవ గాహతే**

**6. అహో స్థిరః కోపి తవేప్సితో యువా'**

– అని ఇలా ఆరు శ్లోకాలలో కాళిదాసు ఆవిష్కరించిన భావాల నన్నింటినీ పద్యాలలో గాక ఒకే ఒక గద్య భాగంలో బిగించి ఎంత చక్కగా వ్రాస్తాడో చూడండి శ్రీనాథుడు.

**పితృగేహంబున నవమానంబు పుట్టదు గదా –**

**పన్నగ ఫణారత్నంబు మీద జెయి సాచువాడు గలండే**

**నిండు జవ్వనంబు నకుం దగిన విభూషణంబులు తొలంగం బెట్టి**

**వార్ధకోచితంబులగు వల్కలంబు లెట్టులు ధరించితివి.**

**దేవలోక నివాసంబున కాసపడెదేని నది వృథా శ్రమంబు – నీ పుట్టి నిల్లు దేవ భూమియ గదా – తగిన వరుని గామించి సమాధి వహించితి వేని నదియు నీకుం దగదు. రత్నంబొరునిచే నన్వేషింపబడుం గాని యొరు నన్వేషించునే – వేడి నిట్టూర్పు గాడ్పులచే దుర్లభ జనాను రాగంబు నీయందు దేట పడుచున్న యది. అట్టి కఠిన హృదయు డెవ్వండొకో – వాడెవ్వండేని నీవు తపంబు సేయుబూని కులమాగ్ర పింగళంబగు జటా భారంబు ధరియింప నుపేక్షించునే** – అని బ్రహ్మాండంగా వ్రాస్తాడు గద్య. పద్యమెంతో గద్య అంతే శ్రీనాథుడికి.

పోతే రఘువంశ మహాకావ్యంలోని ఒక శ్లోకానికి దీటుగా వ్రాసిన పద్యం చూడండి. ఎంత ముచ్చట గొలుపుతుందో. రావణాసురుడి బాధలు పడలేక దేవతలూ ఋషులూ క్షీరసాగరానికి వెళ్ళి స్వామివారిని దర్శించే

సందర్భమది. అప్పుడే నిద్ర లేచిన ఆ స్వామి ఎలా ఉన్నాడో వర్ణిస్తున్నాడు కాళిదాసు. అది శరత్కాలంలో ఉత్థానైకాదశినాడు శ్రీ మహావిష్ణువు యోగనిద్ర నుంచి లేచిన దృశ్యంగా భావన చేస్తాడు మన మహాకవి. అలా భావించి ఆయన వ్రాసిన అన్ని శ్లోకాలూ గాక కొన్నిటిలో కొన్ని భావాలు మాత్రం తీసుకొని మరి ఒకటి రెండు తన భావాలు జోడించి ఆ రసాన్ని తన సీసాలో దించి ఎలా మన చేతి కందిస్తాడో చూడండి.

**ప్రబుద్ధ పుండరీకాక్షం – బాలా తప నిభాంశుకం**

**దివసంశారద మివ – ప్రారంభ సుఖదర్శనం –**

ఇది అనువాదం చేయలేదు.

**ప్రభానులిప్త శ్రీవత్సం – లక్ష్మీ విభ్రమ దర్పణం**

**కౌస్తుభాఖ్య మ పాంమధ్యే – బిభ్రాణం బృహ తోరసా**

ఇదీ చేయలేదు.

**బాహు భి ర్విటపాకారైః** – అనే శ్లోకం కూడా చేయలేదు.

**దైత్యస్త్రీ గండ లేఖనాం – మదరాగవిలోపిభిః**

**హేతిభిశ్చేతనావద్భి రుదీరిత జయ స్వనం**

ఇదీ అంతగా చేయలేదు.

**ముక్తశేష విరోధేన** – ఇది అసలే చేయలేదు. పోతే

**యోగనిద్రాంత విశదైః పావనై రవలోకనైః**

**భృగ్వాదీ నను గృహ్ణంతం – సౌఖశాయని కాన్ ద్విజాన్**

ఇది చేశాడు అనువాదం.

Vallabhajosyula Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

మొత్తంమీద అన్ని శ్లోకాలనూ పూర్తిగా వదిలేయలేదు. వదిలేయకా పోలేదు. అక్కడక్కడ కొన్ని మాటలు పుడికి పుచ్చుకొని వాటికి తోడు తన సొంత భావమొకటి జోడించి ఎలా వ్రాస్తాడో చూడండి ఒక పద్యం.

**అభినవోన్మేష చిహ్నం బైన తొలుచూపు**

**కౌస్తుభాలోక రేఖలకు నలగ**

కౌస్తుభ కాంతులకు అప్పుడప్పుడే చూచే కను చూపు నలిగిపోతున్నదట స్వామివారికి. ఇక్కడ కౌస్తుభమనే మాట మాత్రమే తీసుకొన్నాడు శ్లోకంలో.

**సాంగ భంగం బైన యావులింతకు వేల్పు**

**లంగుళి స్ఫోటంబు లాచరింప**

స్వామి నిద్ర లేచి ఆవులిస్తుంటే దేవతలు చుట్టూ చేరి చిటికె వేస్తున్నారట. ఇది మన కవిగారి సొంత కవిత్వం. మూల శ్లోకం లేదు దీనికి. కాగా

**సౌఖశా యానికులై సంవర్త భృగ్వాది**

**మునులు హస్తాం భోజములు మొగుడ్చ**

ఇక్కడ **'భృగ్వాదీ నను గృహ్ణాంతం సౌఖశాయనికాన్ ద్విజాన్'** అనే మూలాని కనువాదం చక్కగా చేశాడు. మరి

**ధృత చేతనంబు లై ది వ్యాయుధంబులు**

**జయ జయ ధ్వనులతో సంస్తుతింప**

**ఇది హేతిభి శ్చేతనావద్భి**

**రుదీరిత జయస్వన** మనే శ్లోకార్థానికి చక్కని ఆంధ్రీ కరణం. పోతే

**కలువతేకులు వోని పెంజీలు వ తేని యరటి కుబుసంబు**

**పొరలు మైనంటి యుండ**

అనే తేటగీతి పాదాలు రెండూ **భోగి భోగాసనాసీన** మనే కాళిదాసు ఒక్క మాటను పెక్కు మాటలలో ఊహించి చేసిన ఊహాగానం.

ఇలా ఎన్నని చెప్పమంటారు. ఎన్ని ఉదాహరణలని ఇవ్వమంటారు. సంస్కృత మహాకవుల నందరినీ తలస్పర్శిగా తడవి చూచినవాడు శ్రీనాథుడంటే. తెలుగు కవుల కవితా గుణాలన్నీ పోగు చేసుకొన్నవాడు. అలాగని ఎవరినీ అంధంగా అనుకరించడు. సంస్కృతానికి తెనుగు ముద్ర వేయగలడు. ఆంధ్రానికి సంస్కృత ముద్ర వేసీ చూపగలడు. అంతా మళ్లీ తెలుగే అనిపించగలడు. అందుకే అన్నాడేమో ప్రౌఢిఁబరికింప సంస్కృతమని పలుకు నుడికారమున తెలుగని తన రచన. ఎక్కడా తాను సార్వభౌముడే. నిండైన జీవితం జీవించినవాడు. ఎందులోనూ కొంచెమనేది పనికిరాదు. ఆఖరుకు ఒక ఆడుదాని కన్నీరు వర్ణించినా నిండుగానే ఉండాలది. ఎలాగను కొన్నారు.

**'కొసరి వసంత కాలమున కోయిల క్రోల్చిన భంగి నేడ్చెన**

**బ్జసరుహ నేత్ర గొంత చతీ పెద్ద యెలుంగున వెక్కి వెక్కి వె**

**క్కసమగు మన్యువేగమున కాటుక కన్నుల నీరు సోనలై**

**యుసిరిక కాయలంతలు - పయోధరము ల్దిగజాతి పర్వగన్**

ఏడ్చినా అది పెద్ద యెలుంగున ఏడవాలి. వెక్కి వెక్కి ఏడవాలి. అంతే కాదు. ఆ జారిపడే కన్నీటి బొట్లు ఒక్కొక్కటీ ఎంత మోతాదులో ఉండాలను కొన్నారు. ఉసిరి కాయలంత ఉండాలి సుమా. లేకుంటే

శ్రీనాథునికి తృప్తి లేదు. కన్నీటి బిందువు లుసిరిక సైజులో ఉంటాయా ఎక్కడైనా. ఉంటాయో లేదో. అలా ఉంటాయని చెబితేనే తృప్తి కవికి. అసలేదైనా ఇంతే. భోజన భాజనాదుల దగ్గరి నుంచి శాస్త్ర కళా పాండిత్యం వరకూ జీవితంలో అంత పరిపూర్ణత నందు కొన్నవాడు శ్రీనాథుడు. సాధ్యమైనంత వరకన్ని కళలూ అన్నీ విద్యలూ అభ్యసించినవాడు. **'ఎల్ల సత్కళలకున్ మూర్ధాభిషిక్తు'** డగస్త్య మహర్షి గాదు. శ్రీనాథుడే. **నిత్య ప్రగల్భవాచాల** సరస్వతిగాదు. శ్రీనాథుడే. వేద పురాణ శాస్త్ర పదవీన దవీయసి అమ్మవారు గాదు శ్రీనాథుడే. వేమ భూపాలుని ఆస్థానంలో విద్యాధికారి శ్రీనాథుడంటే సామాన్యుడు గాదు. ఈనాటి బిరుదులాంటిది గాదది. విద్యాధికారి అంటే విద్యాధికారే. అన్ని విద్యలలో ప్రవేశముండి తీరాలి. ఎంత ప్రావీణ్యం లేకపోతే ఉద్భట వివాద ప్రౌఢితో గౌడడిండిమ భట్టు కంచు ఢక్కపగుల గొట్టించ గలడా చెప్పండి. భాషించినాడవు బహుదేశ బుధులతో విద్యా పరీక్షణ వేళలందు - అని బెండపూడి అన్నయ మంత్రి మాట. ఎన్ని విద్యలలో ఎంత మంది పండితులను పరీక్షించాడో - ఎంత శాస్త్రార్థ చర్చ చేసి ఉంటాడో ఆలోచించండి. దక్షిణా ధీశు ముత్యాల శాలలో దీనారటంకాల తీర్థ మాడగలడా చెప్పండి. శారదాంబ అనుగ్రహానికి పాత్రుడైనవాడు. పాశు పతవ్రత దీక్షా పరాయణుడు.

ఆ పరాదేవత అనుగ్రహ బలంతోనే అన్ని విద్యలూ సాధించాడు. అన్నింటిలో అంతగా రాణించ గలిగాడు. అతని విద్యా పాటవానికి ప్రత్యక్ష సాక్షి అతని బావమరిది దగ్గుపల్లి దుగ్గనామాత్యుడే. అతడూ కవిత్వం చెప్పటంలో దక్షుడే. అతడు రచించినదే నాచికేతూ పాఖ్యానమనే ప్రబంధం. అందులో స్పష్టంగా పేర్కొన్నాడు తన బావగారి వైదుష్యం.

**సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య**
**భాషా పరిజ్ఞాన పాటవంబు**
**పన్నగ పతి సార్వభౌమ భాషిత మహా**
**భాష్య విద్యాసమభ్యాస బలము**
**నక్షపాద కణాద పక్షిలో దీరిత**
**న్యాయ కళా కౌశలా తిశయము**
**శ్రుతి పురాణాగమ స్మృతి సాంఖ్య సిద్ధాంత**
**కబళన వ్యుత్పత్తి గౌరవంబు**
**పూర్వకవి ముఖ్య విరచితా పూర్వ కావ్య**
**భావరస సుధా చర్వణ ప్రౌఢిమయును**
**కందళింపంగ కాశికా ఖండ నైష**
**ధ ప్రముఖ వివిధ ప్రబంధము**

లొనర్చిన ధీశాలి – మా బావగారంటే ఎవరను కొన్నారో నని హెచ్చరిస్తాడు మనలను.

అసలొక్క మాట. నిజమైన అద్వైతి శ్రీనాథుడంటే. ఎంత శాస్త్రజ్ఞానమో అంత కళాజ్ఞానం. ఎంత ఆత్మ సంభావన ఉన్నవాడో అంత మిగతా నన్నయాది కవుల పట్ల అంత సంభావన ఉన్నవాడు. ఎంత శృంగార లోలుడో అంత భగవద్భక్తి రసలాలసుడు. ఎంత భోగ భాగ్యాలను భావించాడో అంత అకించన భావాన్ని చవిచూచినవాడు. ఆఖరుకెంత ఇహచింతన ఉన్నవాడో అంత పరచింతనలో కూడా మునిగి తేలినవాడు ఎంత రాజసుడో అంత సాత్త్వికుడు. ఎంత సాత్త్వికుడో అంత రాజసుడు.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

దబాయించగలడు. మెచ్చుకోగలడు. ఒకవిధంగా శ్రీహర్షుడి లాంటివాడే శ్రీనాధుడు.

శ్రీహర్షుడికి కవి తార్కిక చక్రవర్తి అని పేరు. మన శ్రీనాధుడూ కవి పండిత సార్వభౌముడే. అతడెవరినీ లెక్క చేయడు. మనవాడూ అంతే. అతడు మహారాజుల దగ్గర ఎంత గౌరవ ప్రతిష్ఠ లార్జించాడో మన శ్రీనాధుడూ అంతే. శాస్త్రమెంతో కావ్యమంతే ఇద్దరికీ. జోడు గుఱ్ఱాల స్వారీ. కాశ్మీర రాజు సన్నిధిలో అతడైతే రెడ్డిరాజుల సమ్ముఖంలో ఇతడు.

**తాంబూల ద్వయ మాసనంచ లభతేయః కాన్యకుబ్జేశ్వరాత్**

**యస్సాక్షాత్కురుతే సమాధిషు పరం బ్రహ్మ ప్రమోదార్ణవమ్**

**యత్కావ్యం మధువర్షి ధర్షిత పరాస్తర్కేషు యస్యోక్తయః'**

ఇదీ శ్రీహర్షుని దర్జా. కన్యాకుబ్జాధీశ్వరుడి దగ్గరి నుంచి ఒకటి గాదు రెండు కర్పూర తాంబూలాలు స్వీకరించినవాడు ఆయన. ఆయన కావ్యం వ్రాస్తే అది అమృతవర్షి. శాస్త్రంలో వాదిస్తే ఆ హేతువాదానికి పండిత లోకంలో జవాబులేదు. అంతేకాదు. వ్యవహారంలో ఎంత ఉద్దండుడో పరమార్ధ చింతనలో అంత ఉత్తీర్ణుడు. బ్రహ్మతత్త్వాన్నే ఆత్మస్వరూపంగా దర్శించగల వాడని తానే స్వయంగా చెప్పుకొంటాడు.

సరిగా ఇలాటి ఆత్మవిశ్వాసంతో చెప్పుకొన్నవాడే మన శ్రీనాధుడు కూడా.

**బ్రాహ్మీ దత్త వర ప్రసాదుడ వురు ప్రజ్ఞా విశేషోదయా**

**జిహ్మ స్వాంతుడ నీశ్వరార్చన కళాశీలుండ వభ్యర్థిత**

**బ్రహ్మాండాది మహాపురాణచయ తాత్పర్యార్థ నిర్ధారిత**

**బ్రహ్మజ్ఞాన కళానిధాన మవు నీ భాగ్యంబు సామాన్యమే**

అని అన్నయ మంత్రి తనతో అన్నాడంటే తనకా లక్షణమెంతగా ఆరూఢమయి ఉండాలి. ఈశ్వరార్చన - బ్రహ్మజ్ఞానమనే రెండు మాటలూ గమనించండి. సగుణ నిర్గుణ జ్ఞాన సంపన్నుడనే భావం స్ఫురించటం లేదా మనకు. ఇలాటి నిండైన జీవితం జీవించాడు గనుకనే తాను నిర్మించిన పాత్రలను కూడా అలా నిండుగానే చూపుతాడు మనకు. అది మానవుడైనా సరే. దేవతలైనా సరే. మహర్షులైనా సరే. కడకు నదీ పర్వత పట్టణాదులైనా సరే. కవిసార్వభౌముడి రాజముద్ర అన్నిటిలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

ఇంతెందుకు. కాశీఖండంలో ఆయన శివశర్మ పాత్ర నొకటి చూస్తే తెలుస్తుంది - చాలావరకు మన సార్వభౌముని ఐహికాముష్మిక జీవితమెలా నడచి ఉంటుందో. వినండి.

'శివశర్మయను విప్రోత్తముండు గలండు. అతండు వేదంబులు సదివి తదర్థంబు లెఱింగి ధర్మశాస్త్రంబులు పఠించి - పురాణంబు లధిగమించి యంగంబు లభ్యసించి తర్కంబు లాలోడించి మీమాంసా ద్వయం బాలోకించి ధనుర్వేదం బవగాహించి యాయుర్వేదంబు విచారించి నాట్యవేదంబు గ్రహించి యర్థశాస్త్రంబులు ప్రాపించి మంత్ర శాస్త్రంబులు తెలిసి భాషలు గఱచి లిపులు నేర్చి యర్థంబు లుపార్జించి ధర్మంబులు చేపట్టి భాగ్యంబులను భవించి పుత్రుల నుత్పాదించి వారి కర్థంబు విభజించి యిచ్చి - యౌవనంబు పోకకు ముదిమి రాకకు శోకించి వ్యాకులండయి నిజాంతర్గతంబున

**నానాశాస్త్రము లభ్యసింపగ ననంత ద్రవ్య మార్జింప సం**
**తానంబుం బడయంగ పుత్రులకు నర్థంబు ల్విభాగించి యీఁ**
**బౌనః పున్యమునన్ సుఖంబను భవింపం బోయె కాలంబు గౌ**
**రీ నాథున్ భజియింప నేరనయితిన్ ...**

ఈ హర్మ్యములీ తురగము
లీహేమము లీభుజిష్య లీధాన్యము లీ
దేహము నాతో వచ్చునె

బహుధా విప్రతి పత్తి ధీ విషయము ల్పాడైన శాస్త్రార్థముల్
సంతాపంబునఁ బొంద నేమిటికి నీ సంసార యాత్రా వృథా
చింతా భారము పూని జూర్తిదహనార్చిర్దాహముల్ సాలవే
చింతింతున్ మది విశ్వనాయకుని - చింతింతున్ సరసీరు
హాక్షునిమదిన్ - ఏల చింతింప నిహము నందెల్ల సుఖము
లను భవించితి - పరము నందు విముక్తి సంపదయు గలిగె

ఇవి శివశర్మ మాటలా. శ్రీనాథుని మాటలా. ఇది శివశర్మ జీవితమా. తన జీవితమా. తన జీవితమే ఆ పాత్రలో తొంగి చూస్తున్నది. ఉభయ కూలంకషమైన ఒక నదీ ప్రవాహంలాగా ఉభయ తారకమైన నిండు జీవితం శ్రీనాథ మహాకవిది. నిండు దనమాయన జీవిత మన్ని దశలలో రుచి చూచిన మహానుభావుడు. క్రీడాభిరామాదులను చూచి ఆయన ఒక శృంగార క్రీడా పరాయణుడని భావించవచ్చు. ఆ శృంగారంలో వైరాగ్యం వైరాగ్యంలో శృంగారం రెండూ మేళవించి చూడగల మేటి అని చాలామందికి తెలియదు. మొత్తానికి రాజసంగానే సాగిందా మహాకవి జీవితం. రాజసంగానే సమాప్తమయింది. దైన్యంలో కూడా ధైర్యంతో నిలబడ్డవాడు. ఈ విషయంలో కాళిదాసే కాళిదాసు శ్రీనాథుడే శ్రీనాథుడు. శృంగారాది రససాగరంలో ఎంత నిమజ్జనమో అంత ఉన్మజ్జనం చెంద గలవాడు. దానికి నిదర్శనమెక్కడ ఏది వర్ణిస్తున్నా దాన్ని హాస్యంగా తేలికగా నిర్లిప్తంగా చూచే చూపు పెట్టుకొని వర్ణించటమే. ఇది ఆయన రచనలో అనివార్యంగా కనపడే సత్యం. ఇంత సమగ్రమైన సరసమైన సర్వతోముఖమైన సముత్తీర్ణమైన జీవితం జీవించి అలాటి తన జీవితాన్నే కావ్య జీవితంగా కూడా మలిచి మనకు ప్రదర్శించాడు గనుకనే సార్వభౌముడైనా శ్రీనాథుడే. కవిసార్వభౌముడైనా శ్రీనాథుడే.

# అల్లసానివారి అల్లిక జిగి బిగి

అయింది. కవిసార్వభౌముణ్ణి అందల మెక్కించి ఆయనను స బహుమానంగా వీడుకొలిపామో లేదో – అప్పుడే ప్రత్యక్షమయ్యాడు మరొక మహానుభావుడు. పైగా అందరి ముఖాలూ చూచి అడుగుతున్నాడు. ఇంతకూ నేనెవరో మీరు పోల్చుకొన్నారా లేదా అని. మీపాటికి మీకు గుర్తు రాకుంటే ఒకసారి ఇటూ అటూ చూడండి. నన్నేమని కీర్తిస్తున్నారో. కవి **యల్లసాని పెద్దన కవి తిక్కన సోమయాజి గణుతింపంగా కవి నేను రామకృష్ణుడనని** ఒకరూ – అలాగే **పెద్దనవలె కృతి చెప్పిన పెద్దనవలె కాని వాని పెద్దన వలెనా** అని ఒకరూ – నాలాంటి కవులే ఇద్దరు వంది మాగధులలాగా నన్ను కీర్తిస్తుంటే కూడా గుర్తు రావటం లేదా నేనెవరో మీకు – అని నలుగురినీ దబాయిస్తున్నాడు. ఇప్పు డర్థ మయింది ఆయన

ఎవరో గాదు. రాయలవారి అష్టదిగ్గజాలలో ఐరావతంలాంటి పెద్ద దిగ్గజ మల్లసాని పెద్దనామాత్యుడని.

ఇక వారూ వీరూ చెప్పటం దేనికా మహాకవిని గూర్చి. ఆయనగారే చెప్పుకొన్నాడు గదా తన్ను గూర్చి రాయలవారితో. ఎప్పుడని – ఎక్కడని. కృష్ణదేవ రాయలొక మంచి బంగారు పెండెరం చేయించి ఈ గండ పెండేరం కాలికి తొడగదలచాను దాని కర్హత ఉన్న మహాకవి ఎవడున్నాడిక్కడ నని అడిగితే – సభా మధ్యంలో లేచి నిలబడి ఏమన్నాడా మహాకవి. **పెద్దనం బోలు సత్కవులు పృధ్విని లేరని నీవెఱుంగవే. పెద్దన కీఁదలంచినను పేరిమి నాకిడు కృష్ణరాణ్ణృపా.** అందరికన్నా పెద్ద కవి ఎవరని అడుగుతున్నారా మహారాజా పెద్దన నేను దప్ప అందరికన్నా పెద్ద కవి ఎవడుంటాడని మీ అనుమానం. పెద్దన్నకే కదా ఇవ్వదలచావు. పెద్దన్నను నేనే – పెద్దకవి నైనా నేనే – నీకు తెలియదా ఒక్క తెలుగు కవులేమి. సంస్కృత భాషలో పండిపోయిన కవులకు గూడా జవాబు చెప్పినవాడను. **'ఆంధ్ర భాషామయం కావ్యమయోమయ విభూషణ'** మని మన తెనుగు కావ్యాల నొక సంస్కృత కవి ఆక్షేపిస్తే అతని మొహం మీద కొట్టినట్టేమని జవాబిచ్చాను నేను. **'సంస్కృతారణ్య సంచారి విద్వన్మత్తేభ శృంఖలమ్'** కాని అది ఎందుకుపయోగ పడుతుందో తెలుసా. సంస్కృతమనే అరణ్యంలో తిరుగుతూ ఉన్న విద్వత్కవులనే మదగజాలను కట్టివేయటానికి పనికి వచ్చేదని నోరు మూయించానా లేదా. ఇంకా సందేహిస్తా వేమిటి. నిస్సంకోచంగానే ఆ పెండెరం బహూకరించమంటే కవులూ పండితులూ అందరి సమక్షంలో స్వయంగా లేచి వచ్చి పెద్దనగారి పాదానికి తొడిగాడా లేదా. ఇంత గొప్ప సన్మానం కవి సార్వభౌముడైన శ్రీనాధుడి కైనా లభించిందో లేదో. దక్షిణాధీశు

డాయనను దీనారటంకాలతో తీర్థమాడిస్తే– ఈ మహాకవికా దక్షిణాధీశుడైన కృష్ణరాయలు సాక్షాత్తూ గండపెండేరమే తొడిగాడు పాదానికి.

ఇదీ పెద్దనగారి పెద్దఱికం. ఆంధ్ర కవితా పితామహుడనే బిరుదు కూడా కృష్ణదేవరాయలే ఇచ్చి ఉంటాడీయనకు. **'ఆంధ్ర కవితా పితామహుండ వెవ్వరీడు పేర్కొన నీకున్'** అని ఆ పేరుతోనే సంబోధిస్తాడు కూడా. అంతే కాదు. రాయల అనంతరం కొంతకాలం జీవించి ఉన్నాడీ మహాకవి. దానికెంతో బాధ పడుతూ చెప్పుకొనే మాటలలో కూడా **'ఆంధ్ర కవితా పితామహ అల్లసాని పెద్దనామాత్య యని నన్ను బిలుచునట్టి కృష్ణరాయలతో దివికేగ లేక బ్రతికియున్నాడ** నని పలవించేటప్పుడు సైతమాయన తనకు ప్రసాదించిన ఆ బిరుదును మరచిపోకుండా గుర్తు చేసుకొని బాధపడతాడు. పితామహ అంటే బ్రహ్మదేవుడు. దేవతా జ్యేష్ఠుడని పేరాయనకు. ముక్కోటి దేవతలకూ తండ్రి కశ్యపుడైతే ఆయనకు తండ్రి బ్రహ్మ. కనుక దేవతా పితామహు డాయన. అలాగే ఆంధ్ర కవి దేవతా కోటికి జ్యేష్ఠుడు గనుక పితామహుడయి ఉండవచ్చు పెద్దనామాత్యుడు. అసలు పెద్దన అంటే జ్యేష్ఠుడనే గదా అక్షరార్థం. కాబట్టి అలా చెప్పుకొన్నా చెప్పుకోవచ్చు– ఇంతకూ కవితా పితామహు డంటే కవిబ్రహ్మ.

మరి కవి బ్రహ్మ అని తిక్కనగారికి కూడా ఉంది గదా ఆ పేరు. ఆ మాటకు వస్తే అంతకు ముందు నన్నయభట్టుకే ఉంది గదా. ఆయనగారికి వాగమశాసనుడని పేరు. వాగను శాసనుడంటే వాణీ వల్లభుడు బ్రహ్మ అనే గదా అర్థం. పోనీ శబ్ద లక్షణానికి అను శాసనమంటే ఆంధ్ర శబ్ద చింతామణి అనే లక్షణ గ్రంథం వ్రాశాడు కాబట్టి ఆ పేరు వచ్చిందనుకొన్నా **'విద్యాదయితుండని'** తరువాత తిక్కనగారే ఆయనను ప్రశంసించాడు గదా.

విద్యాదయితుడంటే బ్రహ్మదేవుడనే గదా అర్థం చెప్పవలసింది. మరి తనకంటే ముందే ఇద్దరు మహాకవుల కుంది కవి బ్రహ్మ లేదా మరొక మాటలో చెబితే కవిపితామహుడనే బిరుదు. అంతేగాక ఇటీవలి పరిశోధకులొక విషయం బయటపెడుతున్నారు. గణపతి దేవ చక్రవర్తికి గురువైన శివదేవయ్య అనే కవి పురుషార్థ సారమని ఒక గ్రంథం రచించాడు. అతడు పెద్దన కంటె పూర్వుడు. ఆ కవి కుందట ఈ బిరుదు. అలాగే కొఅవి సత్యనారాయణ అనే కవికి కూడా ఈ బిరుదున్నట్లు కొఅవి గోపరాజనే కవి సింహాసన ద్వాత్రింశిక అనే తన కావ్యంలో పేర్కొన్నాడు.

అలాంటప్పుడు అల్లసాని వారికే ఇది అపురూప మైనదెలా అయింది. అలా కాదు. ఆంధ్ర కవితా ప్రపంచాన్ని క్రొత్తగా సృష్టించాడు గనుక ఈ బిరుదు వచ్చిందను కొందామా. అదీ కుదరదు. **'మహిమున్ వాగను శాసనుండు సృజియింపన్'** అన్నాడు రామరాజ భూషణుడు. మొట్టమొదట సృష్టించిన వాడు నన్నయభట్టు. అది జగద్విదితం. మహాభారత సృష్టి ఆయనదే గదా. మహా అయితే అందులో మూడు పర్వాలే వ్రాశాడాయన. మిగతా పదిహేను పర్వాలు తిక్కన సోమయాజి గదా రచించాడన్నారా. అయితే ఆయనగారి ననవచ్చు కవిబ్రహ్మ అని. అప్పుడా ఇద్దరికే సార్థకమా పితామహుడనే బిరుదం. అంతేగాని ఆ తరువాత వచ్చిన పోతన శ్రీనాథాదులుండగా వారిని కూడా కాదని ఒక్క అల్లసాని వారినే కీర్తించట మేమిటి ఆంధ్ర కవితా పితామహ అని.

పైకి చూస్తే అర్థం కాదిది. ఇది కొంత లోతుకు దిగి విచారించవలసిన విషయం. నిప్పు లేనిదే పొగ రాజదు. నిష్కారణంగా ఏర్పడదేదీ. పెద్దన కింత గొప్ప బిరుదిచ్చారంటే ఏదో ఉండాలందులో ఆంతర్యం. ఏమిటది.

కవి పితామహ అనలేదు. కవితా పితామహ అన్నారు. గమనించండి. అప్పటికి నన్నయాది కవులందరికీ గొప్పవాడనే అపోహ తొలగి పోయింది. మరి ఎందులో చెబుతారు గొప్పతనం. ఆంధ్ర కవులలో గాదు. ఆంధ్ర కవిత్వంలో. అంటే అర్థం. నన్నయాది కవులంతకు ముందు ఆంధ్ర కవిత్వాన్ని ఒక మార్గంలో నడుపుతూ పోయారు. సోమనాధాదులు కొంత విలక్షణంగా సాగించినా చాలావరకదే అనుసరిస్తూ వచ్చారు. పోతే రాయల యుగం వచ్చేసరి కాంధ్ర కవిత్వ పంధా మారిపోయింది. చాలావరకు అభినవత్వాన్ని సంతరించుకొన్నది. కృష్ణరాయ లభినవ భోజుడయినట్టే పెద్దన అభినవ కవిరాజయినాడు. అందుకే ఆయన తనకొక కావ్యం వ్రాసి అంకితం చేయమని కోరితే ఈ కవి ఒక నవీన కావ్యరచన చేయవలసి వచ్చింది. నవీనమేమిటి. అంతకు ముందు నవీనత లేదా నాచన సోమనాధాదులలో. ఉంది. అది గుణాలలోనే. కావ్య నిర్మాణంలో కాదు. పురాణచ్ఛాయలూ ఇతిహాసచ్ఛాయలూ వదలని ప్రబంధాలవి. పౌరాణిక చ్ఛాయలు 60 వంతులైతే ఒక 40 వంతులు వారి కల్పనలు. శ్రీనాధుని వరకూ అంతే. ఇప్పుడలా కాదు. పురాణకధలు తీసుకొన్నా అవి కేవల మస్థిపంజరాలే. వాటికి ప్రాణం పోసి సర్వాంగ సుందరంగా మలచి సరిక్రొత్త తళుకు బెళుకులతో చూపుతారీ రాయలనాటి ప్రబంధ కవులు. అదొక యుగ మిదొక యుగం. యుగాంతంలో ప్రళయం వచ్చి మరలా ఒక క్రొత్తయుగం సృష్టి అయినట్టే - ఆంధ్ర కవితలో కూడా అప్పటివరకూ సాగిన ఒక యుగమంతరించి మరి ఒక క్రొత్త యుగ మావిర్భవించిం దనుకోండి. అది పురాణ యుగమైతే ఇది ప్రబంధ యుగం. ఈ భావాన్నే మనసులో పెట్టుకొని చాలా వ్యంగ్యంగా సూచిస్తున్నా డొకచోట మనుచరిత్రలో పెద్దనగారు.

**విలయ కృశానుకీలముల వేఁడిమి పోఁడిమి మాలి వెల్మిడిం**
**గలిసిన భూత ధాత్రి మతిక్రమ్మఱ రూపయినిల్చి యోషధు**
**ల్మొలవగఁ జేయునట్టి న యముం బ్రతికల్పము నెట్లుగాంచు- నీ**
**చలిమల వల్లనుల్ల సిలు చల్లదనంబును బూనకుండినన్**

హిమలయాన్ని వర్ణిస్తున్నాడు ప్రవరాఖ్యుడు. ప్రళయకాలాగ్ని జ్వాలలకు ప్రతి కల్పాంతంలో ఈ భూమండలం కాలి బూడిద అయిపోతుంది. ఆ రూపమిక మనకు కనపడదు. అయితే అది సర్వనాశనం కాదు. మరలా ఇంకొక రూపం ధరించి జరాయు జాండజ స్వేద జోద్భిజ్జాదుల కాశ్రయమిస్తుంది. అలా జరగాలంటే ఆ మంటల వేడిమిని శాంతింప జేసే చల్లదనం సప్లై కావాలంటే - అది సరఫరా చేసేంత చల్లదనం ఈ హిమాలయంవల్ల దక్క మరెక్కడి నుంచి రావాలని వర్ణిస్తాడు.

ఇదేదో పర్వత వర్ణనలాగా కనపడుతున్నా కవి హృదయం వేరే ఉన్నది. హిమవంతు డెవరో కాదు. కృష్ణదేవ రాయలే. ఆయన ఆశ్రయ మొకటి ఉంటే చాలు. పురాణ కాలం కనుమరుగైనా ప్రబంధ కాలం మరలా పురుడు పోసుకొని బయటపడగలదు. అది మరలా నవీన కాంతులతో మన మనోనేత్రానికి సాక్షాత్కరింప గలదని ఇంత నిగూఢమైన భావమిమిడి ఉందీ పద్యంలో. ఇది ఒక విధంగా విక్రమోర్వశీయంలో కాళిదాసు వర్ణించిన శ్లోకధ్వనికి ప్రతిధ్వని అనికూడా తోస్తుంది నాకు.

**వేదాభ్యాస జడః కథం ను విషయ వ్యావృత్త కౌతూహలో**
**నిర్మాతుం ప్రభవే న్మనోహర మిదం రూపం పురాణోమునిః**

Vallamalli Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఈ ఊర్వశి అనే అప్సరస నారాయణ ముని ఊరువుల నుండి జన్మించిందంటారు గాని నాకు నమ్మకం లేదంటాడు పురూరవుడు. దీని శరీరాకృతికి కర్త కళానిధి చంద్రుడైనా అయి ఉండాలి. శృంగార నికేతనుడైన మన్మథుడైనా కావాలి. లేదా కుసుమ పేశలుడైన వసంతుడైనా కావాలి. అంతేగాని వేదజడుడూ విషయ సుఖ పరాఙ్ముఖుడైన ఆ పురాణముని ఎలా అవుతాడని ప్రశ్నిస్తాడు. ఇది పురూరవుడి ప్రశ్నగాదు. కాళిదాసు భావన. పురాణ యుగమయింది. ఇక మా కావ్య యుగం వచ్చింది. పురాణ **మిత్యేవ నసాధు సర్వం - నచాపి కావ్యం నవ మిత్యవద్యం.** ప్రాత దైన మాత్రాన అదే బంగారం గాదు. మాది క్రొత్తదని చిన్నచూపు చూడకండి అని సహృదయలోకాన్ని ఆ మహాకవి ఎలా హెచ్చరించాడో - అలాటి హెచ్చరిక ఇది పెద్దనగారిది. **అందుకే నవీన కావ్యరచనకు ననుకూల కథల్దలంచు నా సమయమునన్ -** స్వారోచిషమను సంభవం **భవచ్ఛుతరరచన కనుకూల** మని రాయలవారు సలహా ఇస్తే మార్కండేయ పురాణ కథను మనుచరిత్రమనే పేర ఒక సర్వాంగసుందరమైన ప్రబంధంగా మలచి ఒక నవీన భంగిమలో మనకు ప్రదర్శించాడు పెద్దనామాత్యుడు. ఇలాటి నవీన కవితా ప్రపంచానికి సృష్టికర్త అయినవాడు గనుక ఆంధ్ర కవితా పితామహుడనే బిరుదాయన కన్వితార్థం కాగలిగింది.

ఇదీ పెద్దన కవి పెద్దతనమూ వారి కవితాపితామహ అనే బిరుదానికీ మనమిచ్చుకొనే సంజాయిషీ. పోతే ఆంధ్ర కవితా పితామహుడయి ఆయన గారు చేసిన ఆ కవితా సృష్టి ఎలాంటిదో దానిలో ఆ మహాకవి చూపిన కావ్యకళా విశేషమేమిటో పరిశీలించవలసి ఉంది. నేను ముందే మనవి చేశాను. ఒక్కొక్క మహాకవిలో ఒక్కొక్క మహత్వ ముంటుందని. అదే మనం

చక్కగా పరిశీలించి ఆ కవి విశిష్టతను నిర్ణయించవలసి ఉంటుందని. ఆ దృష్టితో చూస్తే అల్లసానివారి విశిష్టత ఆయనగారి అల్లిక జిగిబిగి. ఇది కవులకు సంబంధించిన చాటు పద్యాలలో చాలా ప్రచారంలో ఉన్న మాట. అంతేగాక కాక మాని మూర్తి కవి తన పాంచాలీ పరిణయ కావ్యంలో అదేపనిగా ఈ మాట ప్రస్తావించి కూడా ఉన్నాడు. కాబట్టి అల్లసాని అనగానే అల్లిక జిగిబిగి గుర్తు రావటం సహజమయి పోయింది ఆంధ్ర పాఠక లోకంలో.

ఇంత బహుళంగా ప్రచారమయిందీ అంటే ఇది అంత నిరాధారంగా ప్రచారమయింది కాదు. పెద్దన కవితలో అది అతి సహజంగా అల్లుకొని పోయి ఉండాలా జిగిబిగి. బిగి ఆయన కావ్యనిర్మాణంలో అయితే జిగి దాని ఆవిష్కరణలో. దీనికి కవి రచించిన కావ్యమంతా ఉదాహరణమే. సంస్కృతంలో మాఘకవి ఒక మాట అన్నాడు.

**బహ్వాపి స్వేచ్ఛ యా కామం - ప్రకీర్ణ మభిధీయతాం**

**అనుజ్ఝితార్థ సంబంధః - ప్రబంధో దురుదాహరః**

ఎవడుగానీ తన ఇష్టానుసార మందికా పొందికా లేకుండా ఎంతైనా మాటాడవచ్చు. కాని వెనుక ముందులు బెసకకుండా కలుపుకొంటూ చెప్పటమనేది అందరికీ సాధ్యమైన పనిగాదని బలరాముడి మీద నెపం పెట్టి ప్రబంధ కవులనందరినీ హెచ్చరించాడా మహాకవి. అలా ఒకదాని కొకటి ముడిపెట్టు గొలుసుకట్టుగా కావ్యం నడిపినప్పుడే అది ప్రకృష్ట బంధమైన ప్రబంధమనిపించు కొంటుందని చాటుతాడు. ఈ గొప్ప సూత్ర మక్షరాలా పాటించిన ప్రబంధ కవి పెద్దన. ప్రబంధమంటే అల్లిక అనే

అర్థం. **అల్లిబిల్లిగ నల్లికొనిన యొకలతాగృహాంతరసీమన్** అని తానే వర్ణించా డొకచోట కావ్యంలో. నా దృష్టిలో అది వరూధినీ గంధర్వులు క్రీడించిన లతాగృహం కాదు. అల్లిబిల్లిగా అల్లిన కవిగారి కావ్యలతా గృహం. ఆ అల్లికలోని బిగువెలాంటిదో ఇప్పుడు గమనిద్దాము.

కథా నిర్మాణం దగ్గరి నుంచీ అక్షర విన్యాసం వరకూ పరచుకొని ఉందా గుణం పెద్దనగారిలో. మొదట కథా వస్తువునే తీసుకొని చూడండి. ఒక కథ గాదిది. నాలుగు కథలు. అసలు రాయల వారాయనకు సలహా ఇవ్వటంలో కూడా **రససమంచిత కథల న్విన నింపు కలిధ్వంసక** మనే పేర్కొంటాడు. మను సంభవ మొకటే అయినా దానికి దోహదం చేసేవప్పటికి నాలుగు వృత్తాంతాలు. కథలన్నని బహువచనం ప్రయోగించటంలోనే తెలిసిపోతున్నది. నాలుగు కథలైతే వస్త్వైక్య ముండదు గదా. వస్త్వైక్యం లేకుంటే ప్రకృష్టమైన బంధమెలా అయిందని అడగవచ్చు. దానికి సమాధాన మా పేరులోనే ఉన్నది. స్వారోచిషమను సంభవమని కావ్యానికి పెట్టిన పేరు. ఏదో వ్యావహారికంగా మనుచరిత్ర అన్నారంత మాత్రమే. ఎందుకంటే మనుచరిత్ర అన్నప్పుడు స్వారోచిషమనువు జీవిత వృత్తాంతమంతా వర్ణించి ఉండాలి కావ్యంలో. అలా జరగలేదు. అతని జన్మకు హేతుభూతమైన కథా సన్నివేశాలన్నీ వర్ణించాడు కవి. ఏమిటిది. ఇందులో ఏమిటి ఉపపత్తి అని అడుగుతారేమో. సంభవమనే మాటకు జననమని గాదు. అసలైన అర్థం దానికి సంగమం కలయిక అని. సహస్రనామాలలో **చిదగ్ని కుండ సంభూతా** అని ఒక నామం. చైతన్యంతో కలిసి ఉన్నదా శక్తి అని అర్థమక్కడ. అక్కడి నుంచి జన్మించిందని కాదు. తరువాత దేవకార్యం సాధించటానికి జన్మించిం దమ్మవారు. అందుకే ఆ వెంటనే **దేవకార్య సముద్యతా** అని

నామం. సముద్యతా అంటే చిదగ్నిలో నుంచి పైకి వచ్చింది. అక్కడ రెంటికీ తేడా చెప్పాడా లేదా.

అలాగే కుమార సంభవమని కాళిదాసు తన కావ్యానికి పేరు పెట్టాడంటే కుమారస్వామి జన్మ వృత్తాంతం వర్ణించలేదాయన కావ్యంలో. కేవలం దానికి పూర్వరంగమైన పార్వతీ పరమేశ్వరుల పరిణయంతో పరిణయానంతరం వారి విలాస యాత్రతో ముగించాడు కావ్యాన్ని. సంభవమంటే ఆదిమ దంపతుల కలయిక అనే అర్థమక్కడ. సరిగా పెద్దనామాత్యుడు కూడా ఈ దృష్టితోనే కావ్యానికి మను సంభవమని నామకరణం చేశాడు. ఇక్కడా స్వారోచిషుని జన్మకు పూర్వం జరిగినదంతా ఏకరువు పెట్టి కేవలమా మనువు జన్మించాడని శ్రీ మహావిష్ణువును గూర్చి తపస్సు చేస్తే ఆయన ప్రత్యక్షమైతే సాలోక్య మనుగ్రహించమని కోరాడని అది నీకు కాలాంతరంలో ప్రసాదిస్తాను అంతవరకూ రెండవ మనువువై ఈ భూమిని పాలిస్తూ ఉండమని మనుత్వాని కాయనను పట్టం కట్టి అంతర్ధాన మయ్యాడని మాత్రం కొంచెం పొడిగించి వ్రాశాడు కవి. అంత మాత్రమే గాని పూర్తిగా మనుచరిత్ర వ్రాయలేదు. అయితే ఆ మాత్రమైనా ప్రస్తావించాడు కాబట్టి మనుసంభవమనే గాక మనుచరిత్ర అని కూడా దీనికి ప్రసిద్ధి వచ్చింది.

ఇంతకూ ఒక మనువుకు సంబంధించిన వృత్తాంతమే చాలా ప్రధానమైన విషయం. పోతే ఆ మనువు ఆవిర్భావానికి ఆయా వ్యక్తులూ వారి వ్యవహారమూ ఎలా దోహదం చేస్తూ వచ్చాయో అందుకోసమాయా కథలు చెప్పవలసి వచ్చింది కవి. అన్నింటికీ ప్రయోజనం మనుజన్మ అనేది ఒకేఒక పరమార్థం కాబట్టి అలాంటి అర్థైక్యమే ఇక్కడ వస్త్వైక్యం కావ్యంలో.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

కాళిదాసు రఘువంశం లాంటిదిది. దిలీపుడి దగ్గరి నుంచి చివర అగ్నివర్ణుడి దాకా ఎంతోమంది రాజుల వృత్తాంతం వర్ణించాడాయన. ఎవరి జీవితం వారిదే అయినా అందరిదీ కలిసి ఒకే అన్వయం. ఆ వ్యక్తులూ వారి జీవితాలూ కావు. అన్వయమే అక్కడ ప్రధానం. రాజులందరి జీవితాలలో ఆ అన్వయ లక్షణలే యథాసంభవంగా తొంగి చూస్తుంటాయి. అన్వయమని వంశానికి ఎందుకు వచ్చింది పేరు. ఆయా లక్షణాలు వారిలో అన్వయిస్తూ వస్తుంటాయి కాబట్టి. అదే వస్త్వైక్య మక్కడ. అందుకే కాళిదాసు రఘు వంశమని పేరు పెట్టాడు రఘుచరిత్ర అనలేదు. **రఘూణా మన్వయంవక్ష్యే** అని ఆయన మాట. నేను రఘువంశరాజుల వంశచరిత్ర చెబుతాను వినమంటాడు. అందుకే వంశలక్షణా లెలాంటివో **యథావిధి హుతాగ్నీనా** మని మొదలుపెట్టి **శైశవే భ్యస్త విద్యానామనేంత** వరకూ 4, 5 శ్లోకాలలో ఆ లక్షణాలన్నీ వర్ణిస్తాడు. అవి మనం బాగా గమనిస్తే దిలీపుడు మొదలు అగ్నివర్ణుడి దాకా ఏయే రాజుల జీవితమెలా నడుస్తూ వచ్చిందో ఇక వేరే చెప్పనక్కర లేదు.

అలాగే మనూత్పత్తి ఎలా జరగాలో దాని కెవరెవరు ఎలా తోడ్పడాలో ఆ అంశం ప్రధానంగా మనసులో పెట్టుకొన్నాడు పెద్దనామాత్యుడు. ఈ దృష్టితో చూస్తే ప్రవరుడి చరిత్ర ప్రవరుడి కోసం కాదు. గంధర్వుడి ఉదంతం గంధర్వుడి కోసంగాదు. స్వరోచి వృత్తాంతం స్వరోచి కోసమూ కాదు. వారందరి గుణాలూ ఆ మనువు జీవితానికెలా సమగ్రత నిచ్చాయో అది చూపటం కోసం. ఇందులో మొదట ప్రవరుడి జీవితం ధర్మ ప్రధానమైనది. ధర్మకర్మ దీక్షా పరతంత్రత తప్ప మరోలోకం లేదతనికి. అలాటి ధర్మ పురుషార్థం కావాలి మొదట. తరువాత వచ్చిన గంధర్వుడి దృష్టి

అర్ధపరాయణమైనది. తన ప్రయోజనం నెరవేరేవరకే. నెరవేరిన తరువాత అతని కిక ఏదీ అక్కరలేదు. అలాటి అర్థ పురుషార్థమూ కావాలి. పోతే ఆ తరువాత వచ్చిన స్వరోచి కాముకుడు చాలావరకు. అయినా ధర్మా విరుద్ధమైన కామప్రవర్తన. కనుకనే ఎంత కామపురుషార్థం సేవించినా అందులో పడిపోక మేలుకోగలిగాడు. ఇప్పటికి ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలకూ ముగ్గురి జీవితాలు వర్ణించాడు కవి. పోతే నాలుగవది మోక్ష పురుషార్థం. అద్వైతుల మోక్షం కాకపోయినా ఇది వైష్ణవుల సాలోక్య సామీప్య సారూప్య రూపమైన మోక్షం. ఏదైనా మోక్షమనేది స్వానుభవైక వేద్యం. వాచ్యం కాదది. ప్రతీయమానం. అంటే మాటలతో చెప్పేది కాదు. ధ్వనిరూపంగా సూచన చేయాలి. దానికి సాక్షాత్తూ స్వారోచిష మను వృత్తాంతమే సంగ్రహంగా వర్ణించాడు మహాకవి.

ఈ నాలుగు పురుషార్థాలూ నలుగురి జీవితాలలో వర్ణించినా అది కూడా ఒక సంకేతమే. ఆంతర్యమేమంటే వారెవరో అలా జీవించారని కాదు మా వివక్షితం. అది ఆదర్శంగా తీసుకొని అధికారి అయిన మానవుడెవడికి వాడే తన జీవితాన్ని దాని కనుగుణంగా మలుచుకొని జీవించాలని మా సందేశమని ధ్వనింపచేస్తున్నాడు కవి. అది ఎలాటి ధ్వనో మీరే చూడండి.

**సకలాశాగతి నర్మకోప విరతి శ్రౌత క్రియారంభణా**
**త్మక వర్గత్రయికిన్ మదుచ్చరిత శబ్ద జ్ఞానమే మూల మిం**
**తకుఁబోలన్ వినుడంచుఁ దెల్పుగతి చెంతం గొండలం బల్లెలం**
**గృకవాకు ల్మొరసెన్ గృహోపరిఁ ద్రిభంగిన్ భుగ్నకంఠధ్వనిన్**

కోడికూతను వర్ణిస్తున్నాడు కవి. త్రిభంగిగా కూసిందట ఆకోడి. కొక్కురోకో అనే కూతలో మూడు విరుపులుంటాయి. అవి మూడూ ధర్మార్థ కామాలనే పురుషార్థాలను మూడింటినీ తన కంఠధ్వనితో సూచిస్తున్నదట కోడి. కోడి కంఠ ధ్వని కాదిది. కవి కంఠ ధ్వని. ఇందులో సకలశాగతి అర్థానికీ - నర్మకోపవిరతి కామానికీ - శ్రౌత క్రియారంభణం ధర్మానికీ - సంకేతాలు. పోతే మోక్షానికో. చెప్పాము గదా అది వాచ్యం గాదు వ్యంగ్యమని. అందుకే అది కూడా కంఠధ్వనిలో ధ్వనిరూపంగా కలిసి వచ్చిందని భావించమంటాడు పెద్దన.

ఇలా నాలుగు పురుషార్థాలనూ యథోచితంగా కలిపి పట్టుకొని జీవించినప్పుడే అది ఉత్తమ మానవ జీవితం. మానవులకు మూలపురుషుడు గదా మనువంటే. మనువలా పూర్ణ పురుషుడై జీవించాడు కాబట్టి మనమూ అలాగే పూర్ణమైన జీవితం జీవించి పురుషుల మనిపించుకోవాలని కవి హృదయం. అందుకే పేలపిండిలాగా విరిసి విడి విడియై పోకుండా ఈ చతుర్విధ పురుషార్థాలూ ఏకీభూతమై ఏకోన్ముఖంగా నడవాలని భావించి ఒకదానికొకటి దారి తీస్తున్నట్టు గొలుసుకట్టుగా వర్ణిస్తాడు. అది ఎలాగంటే ఆరాశ్వాసాల మనుచరిత్రలో మొదట ప్రవరుడనే పాత్ర మొదటి రెండా శ్వాసాలలోనే కనిపిస్తుంది మనకు. అతడు నిరంతర ధర్మనిష్ఠకు ప్రతీక. అతనిలో కావలసింది ధర్మపరాయణత్వమే కవికి. కనుక తృతీయాశ్వాసంలో ఆ పాత్రకిక ప్రవేశం లేదు. అతని ధర్మబుద్ధే కావాలి గనుక ఆ పాత్రనిక చూపడు కవి. వీడుకోలిచ్చాడు. పోతే మూడవ ఆశ్వాసంలో మాయా ప్రవరుడైన గంధర్వుణ్ణి ప్రవేశపెట్టాడు. అతడే అక్కడ కథానాయకుడు.

అర్థానికి ప్రతీక అతడు. అది ప్రధానమైతే కామ ముపసర్జనం. అయితే ధర్మానికి లోబడి ఉండాలవి. కనుక ప్రవరుడిలో ఉండే ధార్మికమైన తేజస్సును **శాంబరీ మహిమచే** ఆ గంధర్వుడు సంగ్రహించ వలసి వచ్చింది. అంటే ప్రవరుడి పాత్ర తొలగిపోయినా ఆయన ధార్మికత్వమను స్యూతంగా వస్తూనే ఉంది. అది గంధర్వుడిలో ప్రవేశించి తద్వారా వరూధినిలో సంక్రమించింది. శారీరం కాకపోయినా తైజసమైన సంక్రమణమిది. కవి అలాగే పేర్కొన్నాడు. **తత్ప్రవర దేహ సమిద్ధ శిఖి దీప్తిశాంబరీ మహిమచే సంగ్రహించి నట్టి గంధర్వమూర్తి సౌఖ్యానుభూతిఁ జలనమే దిన మాన సాబ్జమున నిలుప వెలసి తేజోమయంబైన** వృద్ధినని. అక్కడికి వరూధినీ గంధర్వుల అవసరమయి పోయింది. తృతీయా శ్వాసంతో వారినీ సాగనంపాడు కవి. కాని వారి అర్థ కామ లక్షణా లను వర్తిస్తూనే ఉన్నాయి. వాటిని తన గుప్పిట్లో పెట్టుకొని ప్రవరుడి ధర్మగుణమూ అనుసరించే ఉంది.

అలాటి **తేజం బబ్జ భవాండ గేహమునకున్ దీపాంకురచ్ఛాయమై రాజిల్లన్ స్వరు చిస్ఫురణను శశిభాస్కర పావక తారకా ప్రకాశము లెల్లన్ విరతములు** చేస్తూ వచ్చిందట. అందుకే స్వరోచి అనే నామంతో ఒక పాత్ర తయారయి రంగంలోకి వచ్చింది. చతుర్థ పంచమ షష్ఠాశ్వాసాలలో చాలావరకూ ఆ స్వరోచే కథానాయకుడై కథ నడచింది. పోతే ఆయనకు నామకరణం దగ్గరనుంచీ ఉపనయనాది సంస్కారాలన్నీ కావించిన వారు వరూధిని కాదు. గంధర్వుడు కాడు. మేనకా విశ్వామిత్రులలాగా వారెప్పుడో కనుమటు గయ్యారు. ఇక ఆ అరణ్యంలో ఉన్నదెవరు. కణ్వుని లాంటి మహర్షులు. తపస్సంపన్నులు. ప్రవర వరూధినీ గంధర్మ గతమైన ధర్మార్థ కామలక్షణాలతో పాటు మహర్షుల పెంపకం ద్వారా ఆర్ష తేజస్సు కూడా

ప్రవేశించిందా స్వరోచిలో. ఇలాంటి ధర్మార్థ కామ పురుషార్థాలను మూడింటినీ పుడికి పుచ్చుకొని నాలుగవ ఆశ్వాసం నుంచీ బరిలో దిగి మన కళ్ళకు కనిపించే ఏకైక పాత్ర ఈ స్వరోచే. స్వరోచి గనుకనే తన తల్లిదండ్రులు కనపడకుండా పోయినా మహర్షులన్నీ చేసినది చేసినా తనపాటికి తాను స్వతంత్రంగా ఉండగలిగాడు. అక్కడి ఆటవికు ల నందరినీ కూడగట్టుకొని వారికి నాయకుడయ్యాడు. ధనుర్విద్యాది క్షాత్ర విద్యలన్నిటిలో పారంగతుడై ఆటవిక రాజ్యమేలుతూ వచ్చాడు.

అక్కడికి సమసిపోతే లాభం లేదు. అజ్ఞాతంగా ఉండిపోతాడు. ఒంటరిగా ఏ అడవుల్లో కొండల్లో పడిపోగూడదంత గొప్ప క్షత్రియ వీరుడు. అతడొక గృహస్థుడు కావాలి. అందుకోసం వచ్చింది మనోరమ. రాజ్యపదస్థుడు కావాలి. అందుకోసం వచ్చాడు ఇందీవరాక్షుడనే గంధర్వరాజు. వారిద్దరి ద్వారా గొప్ప వెలుగులోకి వచ్చిందా పాత్ర. అంతే కాదు. ఒక్క మనోరమే గాక మరొక ఇద్దరు విభావసీ కళావతులనే వారు తోడయ్యారు. వారి ద్వారా ఆయన మృగపక్షి జాతుల భాషలన్నీ తెలుసు కొంటాడు. వారిచ్చిన పద్మిని అనే విద్య మూలంగా మానవలోకానికి కావలసిన సకలసౌఖ్యాలూ అప్రయత్నంగా అందుకో గలుగుతాడు. అంతకు ముందే మనోరమ వల్ల అస్త్రశస్త్రాది రహస్యాలన్నీ బోధించే విద్య కూడా సాధించి ఉంటాడు. ఇంకేమి ధర్మబద్ధమైన అర్థకామ సుఖాలన్నీ అనుభవిస్తూ యథేచ్ఛగా సంచరిస్తుంటాడా స్వరోచి. కాని కామమనేది తాత్కాలికంగా ధర్మంచేత అడగినట్లు కనిపించినా పొంచి ఉంటుంది ఎక్కడో పెద్దపులిలాగా. మనిషి నేమరించి పైన బడటానికి రెడీగా ఉంటుంది. అలాగే పడ్డది స్వరోచిమీద పరీక్షిత్తు మీద కలి పురుషుడిలాగా. అంత ధార్మికుడైన పరీక్షిత్తూ

కూడా ఎలా లోబడి పోయాడో కలి ప్రభావాని కలాగే ఈ స్వరోచి కూడా కామ ప్రభావానికి లోనయి తనకు హంసీ చక్రవాకీ మొదలగు తిర్యక్కులు బోధ చేస్తున్నావని పించుకోక ఆరు నూరు సురహాయనాలు కామకేళీ పరాయణుడయి తిరిగాడు ముగ్గురు భార్యలతో. చివరకు ఒక జింక చీవాట్లు పెట్టవలసి వచ్చిందాయనను. దానితో మరలా ధర్మగుణమనేది పైకి వచ్చి అది వైరాగ్యంగా పరిణమించి తత్ఫలితంగా బాల్యంలోనే సన్న్యసించి వెళ్ళిపోయాడు స్వారోచిషుడు. తపస్సు చేసి విష్ణువునే ప్రత్యక్షం చేసుకోగలిగాడు. చివరకు స్వారోచిషుడి దగ్గరకు వచ్చేసరికి వైరాగ్యంగా మారి మోక్షానికి దారి తీసింది. అందులో మొదటి మూడు పురుషార్థాలూ కలిసి వచ్చాయి. కనుకనే వ్యక్తులనెక్కడి కక్కడ సాగనంపుతూ వస్తాడు కవి. వారందరూ ఆయా వ్యక్తులుగా గాక వారి ధర్మార్థ కామ గుణాలుగా వైరాగ్యానికి ఉపకరించాలని ఉద్దేశం.

కనుకనే ఇప్పుడొకటి అర్థమవుతుంది మనకు. ప్రవరుడు వరూధిని తన్ను వలచి వచ్చినా పైన బడినా నిరాకరించి వెళ్ళిపోతాడు. ధర్మం వరకే ఆగిపోయాడు. ఈశ్వర సంకల్పాని కడ్డం తగిలాడు. పరిపూర్ణ గుణసంపన్నుడైన మనుజన్మకు తోడ్పడాలి ప్రతి ఒక్కరూ. అది ఒక్క ధర్మమేనని పట్టుకు కూచుంటే నెరవేరదు. అర్థకామాల అనుభవముండాలి మానవుడికి. అది కూడా ధర్మావిరుద్ధంగా. అదేగదా గీతలో భగవానుడి సందేశం. దాని కడ్డు తగిలాడు ప్రవరుడు. తనవరకే చూచుకొన్నాడు. అందుకే మను వంశానికి మూలపురుషుడైన సూర్యభగవానుడికీ కోపం వచ్చింది. **క్రూరుడై యరిగె మహీసురాధముడ హంకృతితోనని రోషభీషణ స్ఫురణ వహించెనోయనన భోమణి దాల్చె కషాయదీధితిన్** అని సంధ్యా

రాగం మీద నెపం పెట్టి ప్రవరుణ్ణి కవి ఘాటుగా ఉపా లంభించాడంటే అందులో ఆంతర్యమిదీ.

అలాగే వియచ్చర ప్రవరుడు విప్రవరుడైన ప్రవరుడి రూపం ధరించి కపటంగా వచ్చి వరూధినితో సాంగత్యం చేసినా అందులో ధార్మికుడైన ఆ విప్రుడి తేజస్సు నపహరించి తన మనసులో నిలుపుకొని ఆవిడతో క్రీడించి ఆవిడ గర్భంలో అది ప్రవేశపెట్టినా అది ఒక తప్పుగా కనపడలేదు మహాకవికి. ఎందుకని. అది ఈశ్వర సంకల్పమలాగే జరిగి తీరాలి. అందులకొక ప్రణాళిక మాత్రమే ఆ గంధర్వుడి ప్రవర్తన. అలాగే స్వరోచి అర్థకామాలను ధర్మబద్ధంగా సేవించినా చివరకా వ్యసనంలో పూర్తిగా పడకుండా ఛీ అని రోసి విరక్త చిత్తుడైనా మరలా ఒక హరిణి వచ్చి ప్రార్థిస్తే దానితో సాంగత్యం చేయక తప్పలేదు. ఎందుకంటే మనువు వారి ద్వారా జన్మించవలసి ఉంది. మనుజన్మకు వారి సంగమం కేవలమొక నిమిత్తమే. ఈ దేవ రహస్యం గుర్తించలేక పోయాడు ప్రవరుడు. ఒక్క ధర్మమే తప్ప మరేదీ పురుషార్థం కాదనుకొన్నవాడు కాబట్టి దైవ సంకల్పాన్ని గ్రహించేటంత చూపులేదా మానవుడికి. మాయా ప్రవరుడూ గుర్తించ లేకపోయాడు. తన పని సవరించుకోటం వరకే చూచాడు కాబట్టి. పోతే స్వరోచి ధర్మార్థకామాలు మూడింటినీ యథా ప్రధానంగా కలిపి పట్టుకొన్నాడు కాబట్టి ఐహిక భోగాలనుంచి విరక్తి చెంది ఆముష్మికం వైపు చూపు పెట్టగలిగాడు. అందుకే హరిణి తన్ను కౌగిలించుకో తరువాత నీకు విషయం తెలుస్తుందని చెబితే మారు మాటాడక దాన్ని వాటేసుకొన్నాడు. వెంటనే అది వనదేవతయై వారికి సాంగత్యమేర్పడింది. తద్ద్వారా మనువు జన్మించాడు. చూడండి. ఒక అపురూప సుందరి తానైవలచి వచ్చి మీద

బడినా అది ఎందుకో గుర్తించలేదు మొదట ప్రవరుడు. అదే ఒక తిర్యగ్జంతువు వచ్చి కోరితే కాదనకుండా సంగమిస్తాడు స్వరోచి. అతని దగ్గరికి వచ్చేసరికి ధర్మార్థ కామాలు మూడూ సమగ్రమై వైరాగ్యానికి తోడ్పడ్డాయి. కనుకనే అలా జరిగింది. దైవ సంకల్పమలా ఫలించిందన్న మాట. ఫలితం దగ్గరికి వస్తేనే అది పరిపూర్ణత. అదే స్వారోచిషుని జీవితం. అదే మనుజీవితం. మన జీవితం.

మనబోటి మానవులకు మహాకవి చేసే ఉపదేశమే ఇదంతా. పురుషుడుగా జన్మించటం కాదు గొప్ప. పూర్ణత్వమందు కొన్నప్పుడే నీవు పురుషుడవు. అది దైవమానుష ఆర్ష లక్షణాలే గాక ప్రకృతి గుణాలు కూడా సమపాళ్లలో సంక్రమించి ఉండాలి మన జీవితంలో. అందుకే ఒక మానవోత్తముడైన ప్రవరుడూ ఒక దేవయోని సంభవులైన వరూధినీ గంధర్వులూ – తపః ప్రభావ సంపన్నమైన ఒక ముని సమాజమూ – స్వరోచిలాంటి ఒక సుక్షత్రియుడూ – కడకు తిర్యగ్జాతులూ – వనదేవతలూ– ఇంతమంది అంశలు చేరవలసి వచ్చింది స్వారోచిష మనువులో. అదంతా దైవసంకల్ప మన్నందుకు చివరకు శ్రీ మహావిష్ణువే వచ్చి అతణ్ణి మనుత్వమునకు పట్టాభిషేకం చేసి వెళ్లిపోయాడు. ఆ మనువే మనబోటి మానవ జాతికంతా మూల పురుషుడు. కాబట్టి అలాటి పరిపూర్ణతే మనందరి జీవితాలకూ ఏకైక లక్ష్యంగా గమ్యంగా ఉండాలని తదనుగుణంగా జీవించి చివరకు భగవత్సాక్షాత్కార సుఖాన్ని కూడా అనుభవించి తరించాలని– ఇంత బ్రహ్మాండమైన ఆశయం దృష్టిలో ఉంచుకొని చేసిన కథా సృష్టి ఇది. అందులోనూ పూర్వోత్తర కథాంశాలొక దానికొకటి బిగి సడలకుండా మహాకవి ఒక ప్రణాళిక ప్రకారం నడుపుతూ వచ్చాడంటే ఎంత అల్లిక బిగో గమనించండి.

Brahmasri Vallampati Srinivasa Rao www.advaitavedanta.in

అంతేకాదు. కథాంశాలు మాత్రమే గాదు. అవి మరలా తెగిపోకుండా బలహీనపడకుండా ఎక్కడి కక్కడ ఒకదాని నొకటి అంటిపెట్టుకొని నడవటానికి రెండింటి నడుమా ఒక వంతెనలాగా పనిచేయటాని కెన్నో వర్ణనలు కూడా చేస్తూ వచ్చాడద్భుతంగా. అదీ అల్లసాని వారి అల్లికలో ఉన్న గొప్ప బిగి. కథ ఎంత ప్రధానమో వర్ణన లంత కన్నా ప్రధానం కావ్యానికి. కథా వస్తువాలంబనమైతే ప్రకృతి వర్ణనలు దానికుద్దీపన మన్నారు ఆలంకారికులు. శుష్కంగా సాగకూడదు కథ. అలా సాగిపోతే అది ఇతిహాసమో పురాణమో అనిపిస్తుందే గాని రసవంతమైన కావ్యమనిపించు కోదు. అందుకే రససమంచిత కథలని మొదటనే సూచన చేశాడు పెద్దనామాత్యుడు. కాగా ఈ వర్ణనలు కూడా కేవల మలంకారార్థమే గాక సప్రయోజనంగా కూడా ఉంటే మంచిది. అది కవి ఉద్దేశించిన లక్ష్యాని కెంతగానో పుష్టినిస్తుంది. మనబోటి సహృదయులకు తుష్టినిస్తుంది. ఈ వర్ణనలు కూడా రెండు విధాలు. బాహ్య ప్రకృతి వర్ణన ఒకటి. అంతః ప్రకృతి వర్ణన మరొకటి. రెండూ మరలా పేలపిండిలాగా దేనిపాటికది విరిసిపోగూడదు. బాహ్య ప్రకృతిని వర్ణించేటప్పుడు మానవుడి అంతః ప్రకృతి ధ్వనిస్తుండాలి. అది కథా పరమార్థాన్ని భ్యంగంతరంగా ధ్వనింప జేస్తూ పోవాలి. ఇది అల్లసానివారెలా సాధించారో ఎంత చాకచక్యంగా సాగించారో చూద్దాము.

మొదట కావ్య మాద్యంతాలను రెండింటినీ కలిపి ఎలా ముడివేశాడో చూడండి. కావ్యాంతంలో ఒక మాట ఉన్నది. విష్ణువు స్వారోచిష మనువుకు పట్టంగట్టి అదృశ్యమయి పోగానే ఆ మనువు ప్రజాపాలన మెలా చేశాడో వర్ణించాడు కవి. **శాస్త్ర వినిశ్చయ యుక్తి దండపాలనములు** చేశాడట.

ఇక్కడ మూడు మాటలు ప్రయోగించాడు కవి. చాలా విలువైన మాటలివి. ఒకటి శాస్త్ర వినిశ్చయం. రెండు దండం – మూడు పాలనం. పాలనమనేది రాజనీతి. అది జరగాలంటే దుష్టులను శిక్షించే దండనీతి ఆవశ్యకం. దానికి మార్గదర్శకం అర్థశాస్త్ర పరిజ్ఞానం. ఇవి మూడూ షరతులు ప్రజాను రంజకమైన పరిపాలనకు.

ఇప్పుడు కావ్యాంతంలో పేర్కొన్న ఈ మూడంశాలనూ కావ్యా రంభంలోనే సూచించాడా మహాకవి అని తోస్తుంది నాకు. అవి మూడూ త్రిమూర్తులను చేసిన ప్రార్థనా పద్యాలు. ప్రార్థనా వ్యాజంతో రాజ్యాంగాన్నే మూడు రూపాల్లో ధ్వనింపజేశాడు కవి. అందులో **శ్రీ వక్షోజ కురంగ నాభ మెడపైఁ జెన్నొంద** అని విష్ణువును మొదట కీర్తించాడు. శ్రీ దేవీ భూదేవీ సహితుడైన శ్రీ మహావిష్ణువు కృష్ణ దేవరాయలను శుభదృష్టితో కృతార్థుణ్ణి చేయాలనటంలో ప్రజానీకానికి ధన ధాన్యసంపత్తిలో ఎలాటి లోటూ రాకుండా పరిపాలన సాగించాలనే అంశం గుప్తమయి ఉంది. ఇది పాలన క్రిందికి వస్తే ఇక దండనీతి. అది **ఉల్లమునందు నక్కటిక మూనుట** అనే రెండవ పద్యంలో ఇమిడి ఉంది. ఎలాగంటే **శాంబరీ భిల్లుడైన శివుడు కిరీటిని పాశుపతాస్త్ర** మిచ్చి అనుగ్రహిస్తాడు. అస్త్ర శస్త్రాలెందుకు ఉపయోగపడతాయి. దుష్టజన శిక్షణ కేగా. ఇదే దండనీతిని సూచిస్తున్నది. పోతే ఇక బ్రహ్మను గూర్చి చేసినది మూడవ పద్యం. **నాలుగు మోములన్ని గమనాదము లుప్పతిలన్** అని వర్ణించటంలో వేదశాస్త్ర పురాణాది శాస్త్రజ్ఞానమంతా తొంగి చూస్తున్నది. ఇది శాస్త్ర వినిశ్చయమనే మాటకు జవాబు చెబుతుంది. అంటే ఏమన్న మాట. మొదట ఏది మంచి ఏది చెడ్డ ఏది ఎలా చేయాలనే శాస్త్రజ్ఞాన ముండాలి రాజుకు. దాని బలంతో దుష్ట

శిక్షణా శిష్ట రక్షణా పాటిస్తూ ప్రజాను రంజకంగా రాజ్యపాలన సాగించాలని తాత్పర్యం. ఇందులో కూడా చమత్కారమేమంటే విష్ణువు స్థితి కర్త. పాలన మాయనదే. శివుడు లయకర్త. దండన మాయనదే. బ్రహ్మ సృష్టికర్త. ఆ రెండింటికీ ముందుండ వలసింది శాస్త్రజ్ఞానం. దాని తరువాతనే దండ పాలన వ్యవహారమంతా. చూడండి. ఆద్యంతాల నెలా ముడివేసి గట్టిగా బిగించాడో కవి. ఇదే అల్లికలో బిగి అంటే.

పోతే వర్ణనలన్నాము గదా. అవి కథా సన్నివేశాలను కలుపుతూ పోయే పెద్ద పెద్ద మోకులలాగా ఎలా పనిచేస్తాయో అదీ చూద్దాం. మొదట ఆదర్శమైన నగరమెలా ఉండాలో వర్ణిస్తాడు కవి. అందులో ప్రజలందరూ ఆదర్శప్రాయులై ఉండాలి. అందులో వెలయాండ్రు ఉన్నా వారి వలలో చిక్కని ఆదర్శ జీవితం జీవించే ఉత్తమ బ్రాహ్మణుడూ ఉండాలి ప్రవరుడి లాంటివాడు. అందం లేదా చందం లేదా ఉంది పుష్కలంగా. అయినా జారకామినుల కది భోగబాహ్యమే. మరి వట్టి సౌందర్యమేనా. చదువు సంధ్యలో. భాషాపరశేష భోగి. అనారతా ధ్యాపన తత్పరుడు. విద్య లేకపోవట మేమిటి. విద్య ఉన్నా ఆచరణో. కావలసినంత. నిర్మల ధర్మకర్మ దీక్షా పరతంత్రుడు. సరస్వతీ ప్రసాదమేనా. లక్ష్మీ ప్రసాదం కూడా ఉందా. దానికీ కొఅత లేదు. **మాన్యక్షేత్రముల్ పెక్కు చందాలంబండు - నొకప్పుడుందఱు గ దింటం బాడియుం బంటయున్.** అయినా లోభి కావచ్చుగదా. కాదు. ఏ **భూపాలు డీవచ్చినన్ సాలగ్రామము మున్నుగాఁ గొనడు** అంత కర్మిష్ఠుడి కిల్లూ వాకిలీ ఆలూ బిడ్డా తల్లీ తండ్రీ అనే అభిమాన మేమైనా ఉందో లేదో. ఎందుకు లేదు. **కూరిమి సోమిదమ్మ సౌఖ్యావహయై** భజిస్తూనే ఉంటుంది. **సుఖులై తలిదండ్రులు దేవియుం దేవర వోలె**

**నుండియిలు** దీరుస్తూనే ఉంటారు. మరి శిష్యులైతే తోడు నీడలై సేవిస్తుంటారు. ఇక కావలసినదేమిటి మానవుడికి. ఇదీ ప్రవరుడి వర్ణన.

ఈ వర్ణనే మరలా ఎంతో చమత్కారంగా పునరావృత్త మవుతుంది. వియచ్చర ప్రవరుడి వర్ణనలో. ఇక్కడ అనులోమమైతే అక్కడ ప్రతిలోమం. ప్రతిలోమ మార్గం ద్వారానే అనులోమంగా చేసిందేదైనా గట్టి పడుతుంది. అంతకు ముందు ప్రవరుణ్ణి వర్ణిస్తూ **మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి** అని గదా పేర్కొన్నాడు కవి. అది సూత్రప్రాయంగా చెప్పిన మాట. ఇప్పుడు దానికి భాష్యంలాగా వివరణ ఇస్తున్నాడు.

**అర్థచంద్రుని తేట నవఘళించు లలాట**
**పట్టి దీర్చిన గంగ మట్టి తోడ**
**చెక్కుటద్దము లందు జిగి వెల్లువలు చిందు**
**రమణీయ మణి కుండలముల తోడ**
**పసిడిప్రాత చెఱంగు మిసిమి దోపంజెలంగు**
**నరుణాంశు కోత్తరీయంబుతోడ**
**సరిలేని రాకట్టు జాళువా మొలకట్టు**
**బెడగారు నీర్కావి పింజతోడ**
**ధవళ ధవళములగు జన్నిదములతోడ**
**కాశికాముద్రయిడిన యుంగరముతోడ**
**శాంతరస మొల్కు బ్రహ్మ తేజంబుతోడ**

ప్రత్యక్షమవుతాడా మాయాప్రవరుడు. ఈ ఆభాస ద్వారా వాస్తవమైన ఆ ప్రవరుడి రూపమెలా ఉంటుందో పోల్చుకోమని మనకు సలహా ఇస్తున్నాడు కవి. అక్కడ చెప్పిన మనోజ్ఞమూర్తి ఇదీ ఇలాంటిదీ అని మనం దీన్ని బట్టి వివరంగా తెలుసుకోవచ్చు. అంతే కాదు. మకరాంక శశాంకుల లాంటిదే అయితే ఆకారం- వారి వెంటనే పడవచ్చుగా వరూధిని. ఈ బ్రహ్మడి మీద ఎందుకంత వ్యామోహం. అంటే దానికీ జవాబిప్పిస్తున్నాడు ఆవిడ మాటల్లోనే.

**ఎక్కడి వాడొ యక్షతనయేందు జ యంత వసంత కంతులన్**
**చక్కదనంబునన్ గెలువఁ జాలిన వాడు మహీసురాన్వయం**
**బెక్కడ యీ తనూ విభవమెక్కడ**

ఆ మకరాంక శశాంకులను కూడా దాటిపోయిన సౌందర్యమిది. ఒక బ్రాహ్మణ వంశంలో పుట్టిన వాడేమిటి. ఇంత అందచందాలతో కనిపించటమేమిటి అని ఆశ్చర్యపోతుందా వరూధిని చూడండి. ఒక ప్రవరుడి సౌందర్య వర్ణనలోనే పూర్వాపరాల నెంత చక్కగా సమన్వయించి చూపు తున్నాడో కవి.

పోతే ఇక ప్రవరుడి జీవన విధానమా. అదీ యింతే. **శీలంబున్ కులమున్ - తఱుగ దింటం బాడియుం బంటయున్ - వండనలయదు వేవురు వచ్చిరేని - యౌవన మందు యజ్వయు ధనాఢ్యుఁడునై** అని అక్కడ వర్ణించాడా. అదే మాయా ప్రవరుడు వరూధిని నా మాటా ఈ మాటా చెప్పి తప్పించుకొనేటప్పుడు చేసిన వర్ణన చూడండి. దీనికది ప్రతిచ్ఛాయ. ఔషధ సిద్ధుడు మరలా కనిపించా డతడు మా సంసార స్థితులెల్లను జెప్పె-

పైపరామరిక చొప్పడమిఁ బక్వము దప్పి
  పండఁ బాఱిన పొల మెండఁ బాఱె
కట్టఁ గాపింప దక్షత లేమి నూరూర
  బందెలఁబడిపోయె పశుగణంబు
వంచనామతి బ్రాడ్వివాకులై శిష్యులో
  జ్జల కొప్పగించిరి చదువు లెల్ల
కికురించి రిచ్చి పుచ్చుకొను చోటుల వార
  లాకకు లోను గాకప్పు లీక
గ్రహణ సంక్రమణాదుల రాచనగర
  కాసువీసంబు వెడలమి గ్రాసమునకు
నాథి వెట్టిరి క్షేత్రంబు లందు కొన్ని
  లెస్స యుండునె గృహభర్తలేని బ్రతుకు

తన మాన్యక్షేత్రా లెలా బీడు పారిపోయాయో - పాడి ఆవులూ గేదెలూ ఎలా బందెల బడిపోయాయో - శిష్యులెలా చదువు లెగగొట్టి తిరుగుతున్నారో - కాసు వీసాలకెలా కరవయిందో - అంతకు ముందు దానికి ప్రతిగా ఎలా సాగుతున్నదో చూడండి ఈ వర్ణన. అంతేకాదు.

అదిగాకేనిట వచ్చిన
  యది మొదలుగ చింతచే నహర్నిశమును నా
కెదురెదురె చూచు చిద్దఱు
  ముదుసళ్లను పుత్ర మోహమున నగు నార్తిన్

తడి కంట నెపుడు తఱుగక

కడిదఱుగగ వడియు దతిగి గాసింబుడమిం

బడినంగనరాక మంచపు

తొడుగఱు లైరట్టెరుజలతో నేమందున్

అని తలిదండ్రుల దురవస్థ కూడా చెప్పుకొని వాపోతాడు. అంతకు ముందు '**సుఖులై దేవియుం దేవరవోలె నుండి యిలు దీర్చిన తల్లిదండ్రు లింతలోనే** ఇలాటి దుఃస్థితికి ఎలా వచ్చారు. అప్పుడు సుఖపడే రోజులైతే ఇప్పుడు కష్టపడే రోజులు. వస్తువునూ ఆభాసనూ అతికినట్లు రెండింటినీ అతికి చూపుతున్నాడు పెద్దన.

అంతేగాక మధ్యలో ప్రవరుడు పాదలేపం పోగొట్టుకొని తనలో తాను మథన పడుతున్నప్పుడు కూడా తన గార్హస్థ్య జీవితాన్ని తలచుకొని ఇలా విలపిస్తాడు.

'నను నిముసంబు గానక యున్న నూరెల్ల

నరయు మజ్జనకుండెంతడలు నొక్కొ

యెపుడు సంధ్యల యందు నిలువెళ్ల నీకన

న్నోమెడు తల్లి యెంతొఱలు నొక్కొ

యనుకూలగతి నాదు మనసులో వర్తించు

కులకాంత మదినెంత కుందు నొక్కొ

గెడ తోడునీడలై క్రీడించు సచ్ఛాత్రు

లింతకు నెంత చింతింతు రొక్కొ

యతిథి సంతర్పణంబు లేమయ్యె నొక్కొ

యగ్ను లేమయ్యె నొక్కొ

ఈ విధంగా మధ్యలో కూడా అతని దైనందిన జీవితాన్ని ఎలా వర్ణిస్తాడో చూడండి. మూడూ కలుపుకొని చూస్తే ఆదిమధ్యాంతాలు మూడు దశలలో మానవ జీవితమెలా నడుస్తుందో వరుసగా ఒక చిత్రపటంలాగా రసజ్ఞుల మనఃఫలకం మీద ఎలా ముద్రితమై కనిపిస్తుందో చూడండి. ఇదీ ఒక అల్లికే.

అసలొక మాట. ప్రవరుడికి నిజంగా తీర్థాటనం చేయాలని ఉందా. తీర్థాటనం చేయాలంటే ఒకటి రెండు రోజులలో ముగిసేది కాదు. అన్ని యాత్రలూ చేసి రావాలంటే నెలలూ సంవత్సరాలూ పడుతుంది. అది ప్రవరుడే అన్నాడు **ఇట్టివి యెల్ల చూచిరా నెఱకలుగట్టుకొన్న మఱి యేండ్లును పూండ్లును పట్టునని.** పోనీ పడితే పట్టింది వెళ్ళటానికేమి టంటారా. నిత్యాగ్నిహోత్రి అతడు. నిత్య కృత్యమది. అందుకే **'ఆ పురిబాయకుండు** నని మొదటనే వర్ణించాడు కవి. అంతే కాదు. **'ఇందుండగరాదు పోవలయు నూరికి – తూలు సమస్త ధర్మములు తొయ్యలి నేడిలు సేరకుండినన్** అని వరూధినితోనే అంటాడు. అదీగాక తాను నిమిషం కనపడకపోతే ఊరంతా వెతుకుతాడు తండ్రి. సంధ్యా సమయంలో కూడా ఇల్లు వెళ్ళనివ్వదు తల్లి. అలాంటప్పుడు యాత్ర చేసిరావాలని ఎలా ఆలోచించాడు. అది కేవలమొక ఉబలాటం. **అభిలాషమాత్మ నుప్పొంగ** అంటాడు కవి. అయితే మరి చేయవలసి వస్తే ఏమి చేస్తాడు. **అనుదినము తీర్థ సందర్శనాభిలాష** మంటాడు. అనుదినమంటే అర్థం ఏరోజు కారోజు వెళ్లి వెంటనే కర్మానుష్ఠానానికి కాలాతిక్రమణం జరుగకుండా ఇంటికి రావాలని భావం. అలా తన్నను గ్రహించే వాడెవడైనా ఉంటే చెప్పండి వెళ్లటానికి సిద్ధం.

వచ్చాడొక నాడొక ఔషధ సిద్ధుడు. వాడికా తిథ్యమిచ్చాడు. భోజనం పెట్టాడు. తాను మాత్రం చేసి ఉండడు. చేస్తే భుక్తికి వేళ యతి క్రమించెనని వరూథినితో ప్రస్తావించడు. మరి ఎప్పుడు వచ్చాడా సిద్ధుడు. ఎప్పుడితడు హిమాలయానికి వెళ్ళాడు. కుతపకాలంలో వచ్చాడట. అంటే ప్రాతఃకాలంలో. సరే స్నానపాన భోజనాదులతో సత్కరించాడతణ్ణి. ఎలాగా నాకూ యాత్ర చేసి రావాలని ఉంది. అయితే చాలా దూరం వెళ్ళి చాలా రోజులుండ లేను. **ఔషధమొండు గలదె - యుష్మదంఘ్రి రజోలేశ మొకటి దక్క** మరేదైన అని అడిగాడు. ఉందయ్యా అని చెప్పి ఒక పాదలేపం తానే స్వయంగా ఇతని పాదాలకు పూసి వెళ్ళిపోయాడు. పైగా దాని ప్రభావం కూడా చెప్పాడు. హుటా హుటి నడలతో ఎంతదూరమైనా రవ రవ లేకుండా ప్రయాణం చేయవచ్చు. అది కూడా **పవమానమానస తిరస్కారి త్వరా హంకృతిన్** ఒక్క క్షణంలో వెళ్ళిరావచ్చునని పేర్కొంటాడు. ఆ బరవసాతో భోజనం కూడా చేయకుండా వెంటనే బయలుదేరాడు. భోంచేయాలంటే కాళ్ళు చేతులు కడుగుకోవాలి. కడుగుకొంటే పాదలేపమప్పుడే కరిగిపోతుంది. అంచేత **ఆ మందిడియతడరిగిన భూమీసురుడరిగె** నంటాడు కవి.

అయితే హిమాలయానికే వెళ్ళాలని బుద్ధి ఎందుకు పుట్టింది. **వనధి పర్వత సరిత్తీర్థ మాహాత్మ్య** మెలాంటిదో తెలుసుకోవాలని గదా అతని కోరిక. పైగా ఆ సిద్ధుడు తాను చూచి వచ్చిన క్షేత్రాలు వర్ణిస్తూ **కేదారేశుభజించితిన్** అని అన్నీ ఉత్తరదేశ తీర్థాలూ క్షేత్రాలే వర్ణించాడు. కనుక హిమాలయం చేరితే అన్నీ ఒకేచోట చూచి రావచ్చుననుకొని ఉంటాడు బహుశా. అయితే మధ్యాహ్నానికి మరలా ఊరు చేరవచ్చునను కొన్నాడేగాని దైవవశాత్తూ రాలేకపోయాడు. కారణం పాదలేపమా మంచుకు కరిగిపోయింది. అది

తెలియదా మానవుడికి. కనుకనే **తలమే బ్రహ్మకునైన నీనగ మహత్త్వం బెన్నఁనేనియ్యెడం గల చోద్యంబులు తేపుగన్గొని యెదం గాకేమి నేఁడేగెదన్ – పయిపయిన్ మధ్యాహ్నమున్ దెల్పెడిన్** అని మరుసటి రోజుకు మరలా తన యాత్ర వాయిదా వేసుకొంటాడు కూడా. చూచారా. పెద్దనగారీ పూర్వాపరాంశాలలో ఏమాత్రం తేడా రాకుండా ఎలా కలుపుతూ వచ్చాడో. గొప్ప అల్లిక ఇది. ఇక అక్కడి వింతలూ విశేషాలూ వర్ణించటంలో కూడా ఎంతో వైచిత్రి ఉంది. ఒక పక్క చెట్లూ చేమలూ సెలయేళ్లూ నెమళ్లూ మృగాలూ పశువులూ – వీటిని వర్ణిస్తూనే మరొక పక్క పురాణేతిహాస ప్రసిద్ధమైన కథలనూ సన్నివేశాలనూ కూడా ప్రస్తావిస్తూ పోతాడు. నరనారాయణ చరణాంబురు హద్వయ ముద్రితమైన బదరీకాశ్రమంలో తిరుగుతుంటాడు. అందులో కూడా ప్రమథాధిపతి ఇంటి పట్టూ శచికీత గఱపుతూ జలకాలాడీ సురరాజు విలాసమూ– ఇలాటి విషయాలూ దొర్లుతాయి. ఆ తరువాత **లోయకు తలక్రిందుగా మలకలై దిగుకాలువ వెంట బూచు మల్లికలూ –** వాటిమీద వాలి ఝుంకారం చేసే తుమ్మెదలూ– గంగా నది సైకతాలూ – అక్కడ మొలచిన వృక్షాలూ – వాటి నాధారం చేసుకొని శబ్దం చేసే శుకశారికాదులూ – పరిమళాలు వెదజల్లే పూవుందీవులూ – గుత్తులు గుత్తులుగా వ్రేలాడే ద్రాక్షపందిళ్లూ – వాటిమధ్యలో కొంత దూరాన కనిపించే ఒక రత్నఖచిత సుందర దివ్య భవనం – కంటబడిందా ప్రవరుడికి. అక్కడి నుంచి మృగ మద సౌరభవిభవం ఘనసార సౌరభం వెదజల్లే తాంబూల వాసనా వాసితమైన ఒక మారుతమతని మీద వీచి ఎక్కడ చూస్తావిక్కడికిరా. ఇది జనాన్వితం వారి నడిగి దారి తెలుసుకోవచ్చునని ఆహ్వానించి నట్టున్నదట. అంతకు

Yallamraju Srinivasa Rao
www.avadhanavidya.in

ముందు ప్రత్యూష పవనాంకురములుపై కొంటే వామనస్తుతి పరత్వంతో లేచిన వాడిప్పుడు తాంబూల పరిమళభరితమైన మరుదంకురాలు పైకొంటే జనాన్వితమని భావించాడు. ఆజనం మహిళాజనమని తెలియుదా మానవుడికి. చూచారా. రాబోయే వరూధినీ వృత్తాంతానికీ వర్ణనలన్నీ ఎలా నాందీ పలుకుతున్నాయో.

ప్రకృతిలోని నదీ పర్వత వనపక్షి మృగాది రమణీయ దృశ్యాలూ వర్ణించాడు కవి. నడుమ నడుమ **'నర నారాయణ'** ఇత్యాది ఉదాత్త భావాలూ వర్ణించాడు. ఒకటి వరూధిని సకామ దృష్టికీ మరొకటి ప్రవరుడి అకామ దృష్టికీ ద్యోత కాలుగా కనిపిస్తాయి. తరువాత ప్రవరుడి చేతనే అనిపిస్తాడు. **నీవన్నయర్థ మెల్ల నిజము కాముకుడైన వానికి అకాముడిది గణించునె. అని** దానికి తగినట్టు ద్విముఖంగానే సాగిందీ ప్రకృతి వర్ణన కూడా ఇదీ. అల్లికే.

సరే ఇక ఇతని స్వభావానికి తగినట్టితని మాటలైతే ఆవిడ స్వభావానికి తగ్గట్టు ఆవిడ మాటలు. **ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెద వన్నా ఎల్లిద మైతిమి మాట లేటికి** అన్నా **సేదదీతి ఆతిథ్యం గైకొనుమన్నా - కుందనము నంటి మేను ఒప్పులొలుకు వదనమెంత వాడిపోయిందని** సానుభూతి చూపినా - ఆవిడ మనసులో ఉన్న భావాని కనురూపమైన మాటలు. ఇక ఈ మహానుభావు **దండజయాన నీవొసగునట్టి సపర్యలు మాకు వచ్చె - నిందుండగరాదు పోవలయు నూరికి భక్తియ చాలు - నేనిక నిల్లు సేరుటకు నెద్ది యు పాయముమీ మహత్త్యము ల్మానిని దివ్యముల్**

అని ఆడే మాటలన్నీ ఈయన శీలానికి తగినవి. చివరకా అప్సరస పైన బడితే ఈయన శ్రీహరీ అని ఆక్రందన చేస్తాడు. ఆవిడ నిష్క్రమించితే ఏమీ మాటాడడు. అగ్నిదేవుడి సహాయంతో ఇల్లు చేరుతాడు. ఇలా రెండాశ్వాసాలు నడపాడీ వర్ణనలతో కథా భాగాలను కలుపుకొంటూ పెద్దన.

పోతే ఇక తృతీయాశ్వాసంలో వరూధిని విరహ వర్ణన. మన దృష్టిని బట్టే ఉంటుంది ఏ దృశ్యమైనా. మనసు బాగా లేకపోతే ప్రకృతిలోని ప్రతి సంఘటనా నిస్తేజంగా నిర్వేద దాయకంగా భాసిస్తుంది. దేనిమీదా అభిలాష చూపలేము. నిస్పృహ నిరాశ ఆవరిస్తుంది మనస్సును. ఇదే ప్రస్తుతం వరూధిని పరిస్థితి. ఈ నాయిక ప్రకృతికి తగినట్టే బాహ్య ప్రకృతిని వర్ణిస్తాడు కవి. నభోమణి అస్తమిస్తున్నాడు. ఆ సంధ్యారాగ మన్నిచోట్లా అలముకొన్నది. అది సంధ్యారాగమని తెలియక శార్దూలాలు ఘురవారి శోణితమని - మృగపంక్తి దావపావకమని - మునికోటి కొమ్మలకు కట్టిన కాషాయాలని- ఆఖరు కమరులు ఆ కొండ హేమాద్రియని భ్రమపడుతూ వచ్చారు.

**శ్రేణుల్గట్టి నభోంతరాళమునఁ బాతెంబక్షు - లుష్ణాంశు పా**
**షాణ వ్రాతము కోష్ణమయ్యె - దిశాస్తోమంబు శోభాదరి**
**ద్రాణంబయ్యె - సరోజ షండములు నిద్రాణంబు లయ్యెంగడున్**

ప్రకృతి అంతా విచ్చలు విరిగి ఎక్కడి దక్కడ చతికిలబడి పోయిందని వర్ణిస్తాడు కవి. అంతే కాదు.

**ఏ విహంగము గన్న నెలుగించుచును సారె**
**కునుసైకతంబులఁ గూడదాఱు**

**తాటి కన్గొని యది తన జోడు గాకున్న**

**మెడ యెత్తి కలయంగ మింట నరయు**

**నరసి కన్నీటితో మరలి తామరయెక్కి**

**వదన మెండగ సరోవారి నద్దు**

**నద్ది త్రావగ నోప కట్టిట్టు గనుగొని**

**ప్రతిబింబ మీక్షించి భ్రమసియుఱుకు**

ఈ భ్రమ సంజ ప్రియుఁబాసిన చక్రవాకిదా లేక ఆ చక్రవాకిలాగా ఏకాకినియై విలపిస్తున్న వరూధినిదా. శోభాదరిద్రాణమైనదీ నిద్రాణమైనదీ దిశాస్తోమమూ సరోజషండమూనా – లేక ఆవిడ జీవితమా. అంతేకాదు. అంధ తమస రాసులు రోదసీ కుహరమంతా ఆవరించాయట. కాటుక పట్టినట్టయిందట బ్రహ్మాండం. అది కాదు చీకట్లు కమ్మింది. ఆవిడ మనో లోకం. ఆ వెంటనే వెన్నెలలు పొడచూపాయి లోకంలో. చంద్రికా ధవళితాజాండంబులో ఆరూఢ స్థితిలో ఒప్పారుతున్నారు చంద్రుడు. కాని వరూధిని మన శ్చంద్రుడలా ఒప్పారటం లేదు. వెన్నెలలెంత అద్భుతంగా కాసినా లోకంలో చీకట్లన్నీ పోగొట్టలేవు. ఎందుకంటే.

**కలయ జగమునఁగలయట్టి నలుపు లెల్ల**

**తెలుపులుగఁజేసి నీడలు తెలుపుసేయఁ**

**గా వశముగామి పొడము దుఃఖము న ఁబోలె**

**సాంద్రచంద్రిక తుహిన బాష్పములు గురిసె**

Vallamraju Srinivasa Rao Brahmasri www.advaitavedanta.in

అంటాడు కవి. వెన్నెల ప్రపంచంలో రాత్రి కాలమన్ని పదార్థాల మీద పడి వాటిన్నిటినీ తెల్లగా మార్చి చూపుతుంది. కాని చెట్లనీడలను మాత్రం తెల్లగా మార్చడం దానికి సాధ్యం కాదు. అలా మార్చలేకపోయానే అని బాధ పడుతున్నదట అది. మంచుబొట్ల రూపంగా కన్నీటి బొట్లు కూడా రాలుస్తున్న దంటాడు మహాకవి. ఇది వెన్నెల కాదు బాధ పడుతున్నది. కన్నీరు కారుస్తున్నది. వరూధిని. ఎంతమంది గంధర్వ యువకులనో ఆకర్షించిన వెన్నెలలాంటి స్వచ్ఛమైన ఆమె సౌందర్యం గాఢాంధకారంలాగా కర్మ వాసనలతో నిండిన ప్రవరుడి మనస్సును మాత్రం తనవైపు త్రిప్పుకోలేక బాధపడి వియోగ దుఃఖ బాష్పాలు రాలుస్తున్నది.

ఇక ఆ అప్సరః కాంతపడ్డ విరహవేదన ఇంతా అంతా కాదు. తోడి చెలికత్తెలెంత నచ్చజెప్పినా సమాధానపడక వసంతుణ్ణే గాదు. చంద్రుణ్ణే గాదు. మలయ మారుతాన్నేగాదు. ప్రకృతినంతా ఉపాలంభిస్తూ పోతుంది. ఎందుకిలా తాలిమి లేక బేలవయి బాధపడతావు. నందనోద్యానంలో కొంతసేపు విహరించి వద్దాము రమ్మని సఖులు బలవంతం చేస్తే ఎలాగో ఒకలాగు నికట **నాకధునీ కల్హారాంభోరుహ మధురస ధారా చంద్రకితమైన సలిలంతో** ముఖం కడుగుకొని దగ్గరగా ఉన్న ఆ వనానికి బయలుదేరు తుంది. ఆ బయలుదేరే వాలకం వర్ణిస్తాడు. అద్భుతం.

**ఘనసారపంకమొక్క లతాంగి దెచ్చిన**
**ముట్టి వ్రేలనె చుక్కబొట్టు పెట్టి**
**ఇంతియొక్కతె పూవు టెత్తు లెత్తినఁజూచి**
**విసువుతో నొక కొన్ని విరులు దుఱిమి**

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

ఇలా సాగుతుంది పద్యం. అంతా అయిన తరువాత –

**సగము గొటికిన యాకును సఖులు పిలువ**

**సగమొసగు నుత్తరము – తెల్వి సగము మఱపు**

**సగమునయి చింతచే సగమగుచు నరిగె**

**నవ్వరూధిని'** అని వర్ణిస్తాడు కవి. చెలికత్తెల బలవంతంతో చేస్తున్నదే గాని తెలివితో బుద్ధిపూర్వకంగా ఉత్సాహంగా చేయటం లేదే పనీ. అలాటి ఉత్సాహం వియోగావస్థలో ఎలా ఉంటుంది. అందుకే పొడి పొడి – విడి విడి మాటలతో ఎక్కడికక్కడ విరిసిపోయి పద్య రచన ఆర్ద్రత కోలుపోయిన ఆవిడ శుష్కమైన అవస్థకు అద్దం పడుతున్నది. అంతా సగం సగమే ప్రవర్తన. చివరకు మనిషి కూడా చింతతో సగమయి పోయింది. పద్యపాదాలు కూడా సగమే అయినాయి. ఉద్యానవనానికి పోయినా అది తెలివితోగాదు. సగం తెలవితో సగం మరపుతో. అలాగే వారితో బడి పోయింది. అక్కడ చెలికత్తె లందరూ తమలో తాము సరససల్లాపాలు చేస్తూ ఉంటారు. పుష్పాపచయం కావిస్తుంటారు. అప్పుడెన్నో చతురోక్తులు ఛలోక్తులు. కొలనులో జలకేళి చేస్తుంటారు. తన్నూ వచ్చి జలకమాడమని పిలుస్తుంటారు. అయినా మనసొప్పదు పాల్గొనటానికి. **వాడిన మోముదమ్మి తెలివాలిక కన్నులు విన్న బోవ తో నాడక నెన్నొసల్ కరము నందిడి తీర నిషణ్ణయై.** రవివర్మ గీచిన చిత్ర పటంలాగా కూచొని ఉంటుంది. ఇదంతా వర్ణించాడంటే కవి ఒక పక్క పక్కవారి ఆనందోత్సాహమూ – మరొక పక్క తన సర్వమూ పోయినట్టు దిగులు పడి కూచున్న వరూధిని నిస్పృహా నిర్వేదమూ ఎలాంటిదో చూపటానికి. ఇది రెండు విరుద్ధ భావాల కలయిక ఒక అల్లిక ఇది.

ఆ తరువాత ఉన్నట్టుండి ఆవిడ దృష్టి దూరంగా కనిపించే ఒక దృశ్యం మీద పడింది. ఎలా ఉన్నాడా వ్యక్తి. అంతకు ముందే వారక్కడికి వస్తారని ఊహించి సాక్షాత్తూ ప్రవరుడి వేషం వేసుకొని తయారయ్యాడు ఎలాగని

**అర్ధచంద్రుని తేట నవఘళించు లలాట**
**పట్టి దీర్చిన గంగ మట్టి తోడ**
**చెక్కటద్దము లందు జిగి వెల్లువలు చిందు**
**రమణీయ మణి కుండలముల తోడ**

అంతా ప్రవరుడే దిగి వచ్చాడనిపించాడా గంధర్వుడు. వేషమే గాదు. వరూధిని చూచేలాగా

**పసిడి తోరము తోడి బాహు వల్లన యెత్తి**
**సారెకు పొదలపై చాచి చాచి**
**బింబాధరంబు కంపింప నొయ్యన విపం**
**చీస్వనంబున జట చెప్పి చెప్పి.** నానాతంటాలు పడి ప్రవరుడి చేష్టలే అభినయిస్తుంటాడు. అది ఆ ఎండ వెలుగులో ఎగురుతూ ఉన్న పుప్పొళ్లలో దూరం నుంచే కనిపెట్టింది వరూధిని. వెంటనే **కాంచి కలక్వణత్కనక కాంచికయై యెదురేగి కలంగాంచిన వస్తువుం దెలిసి కాంచినయట్లను రక్తిగాంచుచున్ గుండె** జల్లుమనేలాగా కాళ్ల తొట్రుపాటుతో క్రమంగా దగ్గరకు వెళ్లి పలకరిద్దామని తేరిచూచేసరికే కన్నీరు పొడమిందని వర్ణిస్తాడు కవి.

చూచారా నిరాశా మన చేతిలో లేదు. అదే ఆశగా ఎప్పుడు మారుతుందో అదీ మన చేతిలో లేదు. ఈ ఆశా నిరాశాల కుండమార్పిడి ఎట్టిదో పట్టి చాపటానికి ఈ వర్ణన. అంతకు ముందు చీకటిని వర్ణిస్తూ ఒక మాట అన్నాడు కవి

**అంతటఁ బ్రాచి నిశాపతి**

**యంతిక గతుడౌట విని ముఖాలంబి తమః**

**కుంతలములు దీర్పగ గొను**

**దంతపు దువ్వెన యనంగ ధవళిమదోచెన్**

అని. అంత గాఢాంధకారం లోనూ చంద్రోదయమై చంద్రుడనే పతి తన దగ్గరకు వస్తున్నాడని నిశాముఖంలో చీకట్లు విరిసి ధవళిమ కనిపించిందని వర్ణించాడు కవి. ఆ చీకటి ఏదో గాదు. వరూధిని నిరాశ. ఆ ధవళిమ ఏదోగాదు. ఈ మాయా ప్రవరుణ్ణి చూడగానే కలిగిన ముఖ వికాసం. ఆ నిశాపతి ఈ గంధర్వపతే. కాని అసలు ప్రవరుడు కాడు వీడు. నకిలీ. ఆ భాస. కలలో కన్న వస్తువది. ఇలలో కన్నది కాదు. ఇలలోదే వాస్తవం. కలలోది కాదు. కలలాగా ప్రవరుడి వ్యవహారం ఆ భాస అయిపోయింది. ఈ మాయా ప్రవరుడిది మరలా ఆవిడకు వాస్తవంగా భాసిస్తున్నది. అందుకే తెలిసి కాంచిన యట్లను రక్తిగాంచుతున్నది. ఒకవిధంగా చూస్తే ప్రవరుడి తేజస్సే శాంబరీ మహిమచే సంగ్రహించాడు కాబట్టి వీడూ వాస్తవమేనేమో.

కవి వర్ణన కూడా చూడండి. అక్కడ మొదట ప్రవరుణ్ణి చూచినప్పుడెలా వర్ణించాడో ఇక్కడా ఈ ప్రవరుడి విషయంలోనూ అలాగే వర్ణిస్తాడు. **చూచి**

**ఝుళం ఝుళ త్కటక సూచిత వేగ పదార వింద**య్యై అని అక్కడ అయితే **కాంచికలక్వణత్కనక కాంచికయై** - అని ఇక్కడ. అక్కడ **అని మేషస్థితి మాన్పె బిత్తరపు చూపని ఉంటే** - ఇక్కడ ఆ **ఆకమలాక్షి యింపున** అని పద్యం. అక్కడ **త్రోపువడి నిలిచి ఘనలజ్జా పరవశయగుచు గుబ్బచను మిట్టల నశ్రులు చిందు వందగన్** ఏడ్చింది. ఇక్కడో. **పాటిత కరి దంతద్యుతి పాటచ్చర గండ ఫలక భాగంబులపైఁ గాటుక కన్నీరొలుకగ** మరలా ఏడుస్తుంది. అక్కడ ఎంత ప్రయత్నించినా నిరాశే మిగిలింది. ఇక్కడ మళ్లీ దర్శనమిచ్చాడు గదా ఆశపడితే ఫలిస్తుందేమో చూతామని ప్రయత్నం. రెండూ ఎలా పట్టుకు వస్తూన్నాడో చూడండి వర్ణనలో.

అలాగే ప్రవరుడి సాంసారిక జీవితమక్కడ ముందెలా వర్ణించాడో ఈ మాయా ప్రవరుడి జీవితం మరో భంగిమలో అలాగే వర్ణిస్తాడు. టూకీగా అయినా ఎంతో బలవంతంమీద ఆవిడ దీనాలాపాలు కాదన లేక ఒప్పుకొన్నట్టు నటిస్తాడు.

**'ఐనం గానిమ్ము భవద్దీనతకై వ్రతము విడిచితిం**
**బరులకుమే లైనంజాలు - శరీరం బైన నుపేక్షింపవలయు**

అని తన అళీక త్యాగబుద్ధిని ప్రకటించటమీ సన్నివేశానికంతా ప్రాణం లాంటిది. లేకుంటే వద్దు పొమ్మని త్రోసిపారేసి అదృశ్యమైపోయిన వాడు మరలా తనకుతానే వచ్చి సరేనని ఒక్కసారిగా అంగీకరిస్తే ఆవిడ కనుమానం రాదా. అందుకూ ఇంత దూరం సాగదీయటం కవి. అంతేకాక సంభోగ సమయంలో స్వస్వరూపమెక్కడ బయటపడి అనుమానిస్తుందోనని కన్నులు మూయాలి సుమా. ఇది మాదేశ వ్యవహారమని కూడా ముందుగా

జాగ్రత్తపడతాడా గంధర్వుడు. ఇదంతా కవి పకడ్బందుగా చేసిన అల్లిక. పని తీరిన తరువాత ఆవిడను వదలి హఠాత్తుగా వెళ్లినా ఒప్పుకోదు- శాపమిచ్చినా ఇవ్వవచ్చునని తన గృహస్థ జీవితాన్ని మరలా భంగ్యంతరంగా వర్ణిస్తాడు. అప్పటి ప్రవర జీవితం ఇప్పటి జీవిత వ్యవహారంతో ఎలా ముడిపెట్టి అల్లుకు పోయాడో చూడండి కవి.

ఇక్కడికి తృతీయా శ్వాసం ముగిసిపోతే ఇక స్వరోచి జన్మ అతని పెరుగుదల యౌవనం రాగానే **గ్రుద్దున్ గోత్రాచలంబు ల్గలగుల లయిపో గోతముల్ గ్రుద్దులీలన్ ఖడ్గింజెండాడు ప్రూకుల్కపుగిటి కొలదుల్ కత్తినొక్కొక్క ఘాతం బ్రోద్దామ ప్రౌఢివాతాద్భుత గతిఁబఱచున్ భూమి జవ్వాడగానిట్ల ద్దేవీ నందనుండత్యనుపమ బలుడై యౌవనారంభ వేళన్.**

**వేదండము తొండము సరి**
**కోదండము దివియు నెడమకుడి నిబిడ జ్యా**
**నాదము రోదసి నిండగ**
**భేదించున్ గండ శిలల పృథు బాణములన్**

అని రెండే రెండు పద్యాలలో అతని బలపరాక్రమాలు వర్ణిస్తాడు. ఎందుకీ వర్ణన. ఆ తరువాత ఎఱుకు ఱేడు వచ్చి మొఱపెడితే వేటకు వెళ్లుతాడు. ఆ పాటికే ధనుఃఖడ్గ విద్యాపారీణుడు తాను. పోతే తనవెంట ఆటవిక సైన్యమెంతో ఉంది కూడా. వేటకు కావలసిన సరకూ సరంజామూ ఉన్నట్లు చూపాలి ఆరాజుకు. అందుకూ ఈ వర్ణన. ఇక వేటను వర్ణిస్తాడు. అది అత్యద్భుతం.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

అది కూడా నిష్కారణంగా చేయలేదా వర్ణన. అందులోనూ ఒక ఆంతర్యముంది. వేటాడుతూ ఆడుతూ ఉండగా అపశకునాలెన్నో కనిపిస్తాయి. **నిండె కావిరి దిక్తటంబుల నింగి కుండలి చండరుఙ్మండ లింగను గొంచు మ్రోసెను మాలకాకుల మూకలు పద్మ గర్భాండ భాండము ధూళి ధూసరమయ్యెను** – ఇలాంటిఅశుభాలన్నీ చూచి శాకునికుడొకడు చాలా పెద్ద ఉపద్రవం రాబోతున్నదని హెచ్చరిస్తాడు. అప్పుడు వేట చాలించాడు స్వరోచి. వెంటనే **జయలాభ సూచకనిమిత్తంబు ల్మొయిందో చాయట.** దానివల్ల రెండు జరగబోయే విషయాలూహించి తెలుసు కొంటాడు. **ప్రాణ సంశయంబగు మహారణక్షోభం బొకటి – మీద నెట్టకేలకు మితివెట్ట రాని జయ మంగళం బొకటి. తమ సోమాజ్యోతిర్గమయ** అన్నట్లు ఒక కీడు తొలగితే గాని మేలు కలగదు. అందుకే తరువాత మనోరమా గమనం. ఇందీవరాక్షుడనే రాక్షసుడితో యుద్ధం – అందులో స్వరోచి జయ లాభం. రాక్షసత్వం తొలగిపోయి ఆ గంధర్వుడికీ జయలాభం – అదే గాక స్వరోచికి మనోరమ జయ లాభ మంగళమూ – సంప్రాప్తించాయి. దానికి దారి తీసేందుకే ఆవేట వర్ణనా – శాకునికుడి మాట వర్ణనా.

మరి ఇందీవరాక్షుడి పూర్వ వృత్తాంతం వినిపించటం కూడా మనోరమ తండ్రిని గుర్తించటానికీ స్వరోచితో ఆవిడ పరిణయానికీ నాందీ పలకటానికే. ఆ పిమ్మట వివాహ వర్ణన మామూలే అయినా – మనోరమ సఖులు విభావసీకళా వతులిద్దరూ శాపగ్రస్తులయి అరణ్యం పాలయ్యారని స్వరోచి తెలుసుకొంటాడు. ఒక సంతోష సమయంలో మరొక విషాదఘట్టం జోడించటం – గొప్ప అల్లిక. అంతకన్నా గొప్పది తన మామ ఇందీవరాక్షుడు ప్రసాదించిన ఆయుర్వేద విద్య ద్వారా ఆ యిద్దరి వ్యాధులూ మాన్పి వారి

వృత్తాంతం విని వారిని కూడా పరిణయమాడే జయమంగళ మను భవించాడని వారి కథలు కూడా జోడించటం. ఈ అల్లికలో మరొక రహస్యమేమంటే మనోరమ మొదట అస్త్ర హృదయమనే విద్య అభ్యసిస్తే ఆ రాక్షసుడి మీద ప్రయోగించి అతణ్ణి జయించటానికీ - అతని శాప విమోచనానికీ తోడ్పడింది. ఆ తరువాత తన మామ ఇచ్చిన ఆయుర్వేద విద్య ఆవిడ చెలికత్తెల నిద్దరినీ శాపవిముక్తలను చేయటానికి తోడ్పడింది. పోతే వారిద్దరూ తన కొసగిన విద్యలు రెండూ భోగభాగ్యాలను భవించటానికీ పక్షి మృగభాషలు కూడా గ్రహించాడు కాబట్టి పక్షుల గోష్ఠి వల్ల వైరాగ్య భావం - మృగీ రూపంలో ఉన్న వనదేవత సంభాషణవల్ల ఆవిడతో సంగమించి తద్వారా స్వారోచిషమను సంభవానికీ దారితీసింది. అందుకే వారి వారి వృత్తాంతాలూ - వారు వారు ప్రసాదించిన ఆయా విద్యలూ - వీటన్నిటినీ కథలో అక్కడక్కడా యధావకాశంగా వర్ణిస్తూ పోవటం మహాకవి. ఇలా ఆరాశ్వాసాల కావ్యంలో ఎక్కడ ఏ అంశం వర్ణించినా అదంతా ప్రతి ఒక్కటీ ఒక కొక్కెం లాగా తగిలిస్తూ కథా వస్తువనే ఒక పెద్ద గొలుసు నెక్కడా బెసకకుండా సడలకుండా గట్టిగా బిగిస్తూ చివరదాకా పట్టుకొని రావటమే అల్లసాని వారి అల్లికలో ఉన్న బిగి.

పోతే ఈ బిగే గాక బిగితో పాటు జిగి కూడా ఉందని గదా పేర్కొన్నాము. ఒక దానితో ఒకటి పొందిక కలిగి చిక్కగా ఉండటం బిగి అయితే దాన్ని చక్కగా ఆవిష్కరించటం జిగి. ఆంగ్లంలో చెబితే Tight-ness and Brightness అనవచ్చు. బిగి శబ్ద విన్యాసంలో జిగి అర్థ ప్రకాశంలో. శబ్దార్థాల సాంగత్యమే గదా సాహిత్యమంటే. అవి ఎంత చక్కగా చిక్కగా సాధించగలిగితే అంత గొప్ప సాహిత్యవేత్తవాడు. ఇందులో

కథా సన్నివేశాలూ వర్ణనలూ వాటి పరస్పర సంబంధ మెంత గొలుసుకట్టుగా అల్లుతూ వచ్చాడో అల్లసాని – ఇంతవరకూ నిరూపిస్తూ వచ్చాము. అందులో ఉండే బిగి ఏదో చూచాము. పోతే ఆ బిగి సడలకుండా దానితోపాటు దాని నావిష్కరించే భాషలో ఎంత జిగి చూపుతూ పోయాడో – దాన్ని గురించి ఇప్పుడు సాంగోపాంగంగా నిరూపించ వలసి ఉంది. అల్లసానివారి అల్లిక జిగిబిగి అంటే భావంలో భాషలో కూడా. భావాన్ని బయటపెట్టేది భాషే గదా. అంతర్గతమైతే భావం. అది బహిర్గతమైతే భాష. అది Impression ఇది Expression అన్నారు.

కాగా ఈ భాష అనేది ఒకటిగాదు. భావంలాగే ఇదీ అనేక శాఖలు. అది పద్యమే కావచ్చు. అందులో వాక్యమే కావచ్చు. పద్యంలో ఒక పదమే కావచ్చు. పదంలో ఒక అక్షరమే కావచ్చు. అంతా భాష క్రిందికే వస్తుంది. ఇందులో అక్షరం దగ్గరి నుంచీ పద్యరచన వరకూ కవి అయిన ప్రతి ఒక్కడూ ఎంతో చక్కగా ఆవిష్కరించటానికే ప్రయత్నిస్తుంటాడు. నన్నయభట్టు దగ్గరి నుంచి చిన్నయ వరకూ అలాగే చేస్తూండటం చూస్తూనే ఉన్నాము. వారి వారి మనస్సులలో ఉదయించే భావాలకు తగినట్టే వారి భాషా రచన కూడా సాగుతూ పోయినట్టు గమనించవచ్చు. ఇంతెందుకు. ఇంతవరకూ మనం నలుగురు మహాకవుల రచనలు గదా విమర్శిస్తూ వచ్చాము. ఒకసారి పునశ్చరణ చేద్దాము వారి రచన ఈ దృష్టితో.

**బహువన పాద పాబ్ధి కుల పర్వత పూర్ణ పురస్సరస్వతీ**
**సహిత మహామహీ భరమజస్ర సహస్ర ఫణాళి దాల్చి దు**
**స్సహతర మూర్తికిన్ జలధి శాయికిఁ బాయక శయ్యయైన య**
**య్యహిపతి దుష్కృతాంతకు డనంతుడు మాకుఁబ్రసన్నుడయ్యెడున్**

Vallamkonda Brahmasri Srinivasa Rao www.andhravedanta.in

ఇది నన్నయగారి రచన. ఆదిశేషుడి మహత్త్వాన్ని వర్ణిస్తున్నాడు. ఆది శేషుడంటే సామాన్యుడు కాదు. ఈ భూమండల భారమంతా వేయి పడగల మీద పెట్టుకొని మోస్తున్నాడు. స్వామివారు శయనించటానికి పెద్ద పానుపయి ఆయనను సేవిస్తున్నాడు. ఈ భావాలనెలా ఆవిష్కరిస్తాడో చూడండి కవి. ఇందులో బహువన దగ్గరి నుంచి భరమనే మాట వరకూ సాగిన సమాసం భూమి ఎంత పెద్దదో చూపుతున్నది. మహా మహీ అనే రెండు మాటలూ దాని ఆయామమూ విస్తారమూ రెంటినీ బయటపెడు తున్నాయి. మరి పాముపడగలో. అజస్ర సహస్ర దుస్సహ అనే సకార రేఫ సంయోగంతో నడచిన అక్షరాలు మూడూ బుసకొడుతున్న ధ్వనులను సూచిస్తున్నాయి. అందులో అజస్ర సహస్ర అనేవి జగణాలు. ఇటూ అటూ వాలుగా మధ్యలో ఎత్తుగా ఉన్న పడగకు సంకేతాలు. మరి శాయికి పాయక అనటంలో స్వామి వారు కాళ్లు జాపుకొని పవళించిన పోజును తెలుపుతాయి. ఇక శయ్యయైన యయ్యహిపతి అనే వర్ణ విద్యాసంలో యకారద్విత్వమా సర్ప శరీరమార్దవ మెలాంటిదో ధ్వనింపజేస్తున్నది. ఇలాటిదీ నన్నయగారి అక్షర రమ్యత.

ఇంకా చూస్తారా - వాక్య రచనలో రమ్యత. **వీరెవ్వరయ్య ద్రుపద మహారాజులె - యిట్లు కృపణులయి పట్టువడన్ వీరికి వలసెనె - యహహ మహారాజ్యమదాంధకార మది వాసెనొకో.** ఇక్కడ వీరు అనే మాట ప్రయోగించటంలో ఎంత వెటకారం. మహా మహా అని రెండుసార్లు పేర్కొనటమెంత వేళాకోళం. పోతే '**అహహ మహారాజ్య** అనే చోట పట్టుపడి వచ్చిన ద్రుపదుని చూచి చేసే అట్టహాసమెలా ధ్వనిస్తున్నదో చూడండి రచనలో. ఇది వాక్యరచన అక్షర రచన రెండింటినీ కలుపుకొన్న రమ్యత నన్నయగారిలో.

Yallamraju Srinivasa Rao
www.advaitaveda.in

పోతే తిక్కన ఏమీ తక్కువ వాడు గాదు. **మౌళి ప్రక్సంగ రంగన్మృధు కరపటలీ – దుర్వారోద్యమ – గాండీవ జ్యారవంబు** – ఎన్నని చెప్పమంటా రెన్నని చూపమంటా రాయన రచనలో అందచందాలు. ఇక సోమనాధు డంటారా. **ఖర్జూ ఖూర్జ ఖర్జూర – లీలా డోలా – లేఖలోక – ఒరసిరి నిన్ను తర్కని కషో పలధారల – ఈ కసిమిరింకెట్లోర్తు నోర్తున్ రిపుగ్రీవా ఖండన మండన స్ఫుర దసి క్రేంకారముల్గల్గినన్.** ఇలాటివెన్నో కనిపిస్తాయి కనుల పండువుగా. ఇక పోతన అంటారా. అది ఒక ప్రపంచం. ఏది పట్టినా బంగారమే. **హరి చూచిన సిరి చూడడు – సిరి చూచిన హరియుఁ జూడ సిగ్గున బొరయున్ – కరిదిగుచుమకరి సరసికి కరిదరికిని మకరి దిగుచు కరకరి బెరయన్ అడిగెదనని కడుపడిజను – రాడా చూడ – ఇచ్చుటన్ లేదా. ఇంతెందుకు. పాంచాలీ కబరీ వికర్షణ** అంటుంటే ద్రౌపదిని దుశ్శాసనుడు జుట్టు పట్టి లాగినట్టే ఉంది పద్యపాదం లాగటం. **చంపించెన్ – కల్పించెన్. చేయించెన్** అనే క్రియాపదాలు అక్కడక్కడ మైలురాళ్లలాగా ప్రయోగిస్తుంటే మీదేముంది. అంతా ఆ మహానుభావుడి ప్రభావమే గదా అని పాండవులనూ మనలనూ కూడా హెచ్చరిస్తున్నట్టే ఉంది. ఇది పోతన విషయమైతే ఇక శ్రీనాథాదుల మాట చెప్పటం దేనికి. దర్జా దర్పం ఎక్కడబడితే అక్కడ తొంగి చూస్తుంటాయి. **కుక్షిప్రోద్భవ నిష్ఠురక్షుధిత దుష్ప్రేక్షోద్ధాంధకార** మంటుంటే ఆ క్షుద్బాధ ఎలాంటిదో. ఆ ఉక్కు రోషమెలాంటిదో వేరే చెప్పాలా. మాటలే మనకు చెప్పటం లేదా.

ఇదంతా ఇప్పుడెందుకంటే ఏకరువు పెట్టటం – అల్లసానివారు తనకంటే ముందుండిపోయిన మహాకవుల రచనలూ వాటిలో దొరలిన భావాలూ – ఆయా భావాల నావిష్కరించటంలో – వారా భావాల కతికినట్టు

సాగించిన రకరకాల పోకడలూ - ఎంత లోతుగా దిగి వాటి అంద చందాలన్నీ పోగు చేసుకొన్నాడో మీకు తెలపటానికి. ఒక గొప్ప Editor Coordinater లాంటి వాడనుకోండి పెద్దన అంటే. ఎక్కడ ఏకవిలో ఏ గొప్ప గుణమున్నా పోనీయడు. అన్నీ పోగు చేసుకొని తన ఖజానాలో జమ చేసుకోవలసిందే. అలాగే అనుకరిస్తూ వచ్చాడు నన్నయ దగ్గరి నుంచి శ్రీనాథుని వరకూ పూర్వ మహాకవుల నందరినీ. శ్రీనాథునైతే చాలావరకు దోచేశాడనే చెప్పాలి. పద్యాలకు పద్యాలే అనుకరించాడు.

**శ్రీరామా కుచమండలీ** అని శ్రీనాథుడంటే అలాటి భావాన్నే పుచ్చుకొని **శ్రీ వక్షోజ కురంగనాభ**మని ఆదిలోనే వ్రాశాడు. **నలిన సంభవు వాహనము** లని అతడొక సీసం వ్రాస్తే అలాగే వ్రాస్తాడొకటి **చిన్ని వెన్నెల** కందని ఒక సీసం. **వాని ప్రశంస సేయదగువాడు కృతార్థత ముండని** అతడంటే అలాగే అంటాడు **వానిది భాగ్యవైభవము వానిది పుణ్య విశేషమని.** నిద్దమైన **మడుంగు నీర్కావి దోవతి** అతని మాట అయితే **బెడగారు నీర్కావి పింజతోడ** అని ఇతని మాట. **ఘనమైన రారాపు జనుదోయి** శ్రీనాథుడి కిష్టమైతే అదే ఇష్టమితనికీ. **వేదండ వదన శుండా దండ మతని** దైతే **వేదండ భయద శుండా దండమితనిది.** కడకతడు **హుంకారం బొనరిస్తే** ఇతడూ అలాటి **హుంకారం ఒనరిస్తాడు. అతడు నెట్టియంబుగ బిగ్గఁజుట్టిన పెనుబాముసు** పట్టుకొంటే - ఇతడూ **నెట్టెంబుగా ప్రేవు చుట్టి చూపుతాడు. పద్యాలేమిటి** వాక్యాలేమిటి పదాలేమిటి - అన్నిటికీ శ్రీనాథుడే ఆశ్రయం. అతడు ముందు నడుస్తుండే అతని నీడలాగా ప్రక్కనే నడుస్తూపోతాడు పెద్దన.

అలాంటప్పుడిక పెద్దన విశిష్టత ఏముందని అడగవచ్చు. చెప్పాముగా అతడొక గొప్ప ఎడిటరని. ఎడిటర న్నప్పుడది ఒరిజినాలిటీ ఎలా అవుతుంది

అని అంటారా. అక్కడే ఉంది గొప్పతనం. ఊరక గుడ్డిగా పూర్వకవులనను కరించినవాడు కాదు పెద్దన. ఒక మధుకరంలాగా ఎన్ని పుష్పాలు తిరిగినా ఏ పుష్పంలో తనకేది కావాలో అదే తీసుకొంటాడు. అక్కరలేనిది త్రోసిపుచ్చుతాడు. ఆ తీసుకొన్నది కూడా అలాగే దగ్గర ఉంచుకోడు. పుష్పరసమే మధువు కాదు గదా. దాన్ని మధువుగా మార్చే నైపుణ్యం మధుకరాని కెలా ఉందో - అలాటి గొప్ప చాతుర్యముంది పెద్దనలో. తాను సంగ్రహించింది ముడి సరుకు మాత్రమే. తాను దాన్ని మార్చి సరికొత్తగా చూపటం తన పనితనం. చతుర వచోనిధివని రాయలవారతనికి కితాబిచ్చాడంటే ఇలాటి చాతుర్యాన్ని బాగా గమనించే ఇచ్చాడు.

నన్నయాదుల లాంటివాడు కాదు పెద్దన. చాళుక్య రాజు నన్నయ కాశ్రయమిస్తే ఒక మనుమసిద్ధి తిక్కన కిస్తే ఒక రెడ్డి రాజులు శ్రీనాథునికైతే- కేవలం విజయనగర సామ్రాజ్యాధిపతి కృష్ణదేవరాయలే పెద్దన కాశ్రయ మిచ్చిన ప్రభువు. స్వర్ణయుగం రాయలయుగం. చతుర్దశ విద్యలూ - చతుష్షష్టి కళలలో ఆరితేరిన వారున్నారాయన కొలువులో. కళల నెలవగు వాడు రాయలంటే. ఆ కడలి రాయల లోతుగన్న గబ్బి పెద్దన అంటే. ఇద్దరూ ఇద్దరే. ఒకడా శ్రయుడూ ఒకడాశ్రితుడూ కూడా కాదు. ఒకరికొకరు ప్రాణమిత్రులు. ఇంకా మాటాడితే పెద్దన్నగారినే తనకు పెద్దన్నగా చూచిన కవితా కళా కింకరుడు రాయలు. కనుకనే మనుచరిత్రం బందుకొను వేళ ఎలాంటి ఆత్మాభిమానమూ లేకుండా పల్లకి తన చేతఁబట్టి ఎత్తాడు - గండ పెండేరమునకీవె తగుదని స్వయంగా పాదానికి తొడిగాడు - ఇలాటి మహారాజు అలాటి మహాకవికి చేసిన ఇలాటి సత్కారం మరి నన్నయాదుల కేగాదు. కవిసార్వభౌముడైన శ్రీనాథునికి కూడా ఏ రెడ్డిరాజులూ చేయలేదు.

మరి పెద్దనగారిలో ఏ వైశిష్ట్యమే చాతుర్యముందని చేశాడా ప్రభు వలాటి సత్కరమంటారు. అది స్వర్ణయుగం రాయల యుగమంటే. గుప్తుల తరువాత ఒక్క విజయనగర రాజులదే స్వర్ణయుగం భారతదేశ చరిత్రలో. అది ఉత్తరాన అయితే ఇది దక్షిణాన. గుప్తచక్రవర్తుల పాలనలో కాళిదాస మహాకవి నవరత్నాలలో ఒక గొప్ప రత్నమై ప్రకాశించాడు. వజ్రంలాగా. పోతే ఈ రాయల స్వర్ణయుగంలో మన అల్లసాని పెద్దన కూడా అష్టదిగ్గజాలలో ఒక గొప్ప దిగ్గజమై రాణించాడు ఐరావతంలాగా. అక్కడ కాళిదాసు వ్యాస వాల్మీకి భాస మహాకవులనెంత మధించి నవనీతం లాంటి రచన చేయగలిగాడో – అలాగే పెద్దన కూడా నన్నయ తిక్కన శ్రీనాధులను గాలించి సరిక్రొత్త రచన గావించాడు. అసలు వాల్మీకి తరువాత కవేమిటి లేనే లేడని అభిప్రాయం వెలిబుచ్చుతూనే – ఆయన పంథాలో నడుస్తూనే – తనదంటూ ఒక విలక్షణమైన పోకడ పోతూ వచ్చాడు కాళిదాసు. శబ్ద శిల్పం అక్షర శిల్పం వాల్మీకి దగ్గర నేర్చుకొన్నాడసలు కాళిదాసు. **'రజ్జ్వేవ పురుషం బధ్వా కృతాంతః పరికర్షతి** అంటాడు వాల్మీకి. **జ్జ్వే ధ్వా** అనే అక్షరాలుచ్చరిస్తుంటే కృతాంతుడు ప్రాణులను త్రాళ్ళతో మెలియబెట్టి లాగుతున్నట్టే ఉంటుంది. **సహచర రహితేవ చక్రవాకీ** అంటుంటే విరహాన్ని బయట పెడుతుంది హకారం. **విశాలే విమలే నేత్రే రక్తాంతే కృష్ణతారకే** అని సీతను రావణుడు వర్ణిస్తుంటే ఆవిడ నేత్రాల విస్తారం చూస్తున్నట్టే ఉంటుంది. **శక్యమంజ లిభిః పాతుంవాతాః కేతకి గంధినః** అని వర్ణిస్తుంటే **భిః పాతుమ్ తాః కేతకి** – అనే విసర్గ పూర్వక పకార కకారాలు మలయమారుతాన్ని దోసిళ్లతో త్రాగుతున్నట్టే ధ్వనింపజేస్తాడు మహర్షి.

ఈ శబ్ద సౌందర్యమంతా ఎంతగానో పరిశీలించి దానితో తృప్తిపడక దానికి దీటుగా వందల కొద్దీ వర్ణచిత్రాలూ శబ్ద చిత్రాలూ ఒక చిత్రకారుడిలాగా గీచి చూపగలడు మరలా కాళిదాసు. **మృణాళ మృదుభిః ఫణై** అని పాము పడగల మార్దవాన్ని చూపగలడా చిత్రలేఖనంలో **ఆరసాతల ములాత్త్వమవా లంబిష్యథా** అని పాతాళ లోకం లోతులనూ చూపగలడు. మరి **యాస్యత్యద్య శకుంతలేతి** అని కణ్వుని కంఠ గాద్గద్యమూ చూపగలడు. **తమాతిథేయీ బహుమాన పూర్వయా సపర్యయా ప్రత్యుదియాయ పార్వతీ** అని అతిధిగా వచ్చిన కపట బ్రహ్మచారి కభిముఖంగా తీగలాగా సాగిపోయే పార్వతి గమన భంగిమా ప్రదర్శించగలడు. **రశ్మిష్వి వాదాయ నగేంద్రసక్తా** మని దిలీపుని దృష్టిని త్రాళ్లతో వెనక్కు మళ్ళించే చమత్కారమూ తెలుసు నాయనకు. ఇలా ఎన్నో వందల మార్గాలు వాల్మీకి త్రొక్కుతూ పోతే అన్ని వందల దారులూ తానూ త్రొక్కుతూ పోగలడు. అందులో కూడా గుడ్డిగా అసహాయంగా ఆయన వెంటబడి పోవటంగాదు. ఆయన నడక ఆయనది ఈయన నడక ఈయనది. ఉక్తికి ప్రత్యుక్తే గాని పునరుక్తి గాదు. అలాగైతే అంత పెద్ద వాల్మీకి రామాయణాన్నే రఘువంశంలో ఒక ఐదు సర్గలలో బంధించి తన ప్రతిభ చూపడు కాళిదాసు. నీవా నేనా అనేట్టుందా రచన. ఆ భావాలే వేరు. ఆ వర్ణనలే వేరు. ఆ శబ్ద చిత్రాలే వేరు. వర్ణ చిత్రాలే వేరు. రెండింటినీ పోల్చి చూచిన విమర్శకులకే తెలుస్తుందా విలక్షణత ఏదో. రామాయణానికి మరొక రామయణమది.

అలాగే ఇప్పుడు మన అల్లసానివారు కూడా సామాన్యులు కారు నన్నయాదులనూ ముఖ్యంగా శ్రీనాధునీ ఎంతగానో అనుసరించినట్టే కనిపిస్తాడు. కాని వారి మాటలలాగే తీసుకోడు. వాటికెంతగానో నగిషీ

చేస్తాడు. దానికి కూడా మళ్లబడితే వాటిలాంటి నాణాలు మరికొన్ని క్రొత్తగా సృష్టిస్తాడు. మొత్తానికి తన మొహరు పడకుండా వాటిని ఖజానాలో చేరనివ్వడు. విజయనగర శిల్పమెలాటిదో కవితా శిల్పమూ అలాటిదే. శిలలలో శిల్పాలు చెక్కారు శిల్పులా కాలంలో. ఇంత కాలం గడచినా ఇప్పటికీ వాటి అందచందాలు మనకు నేత్రోత్సవం చేస్తూనే ఉన్నాయి. అలాగే పెద్దనలాంటి కవిశిల్పకారులు కూడా తమ పద్య శిలా ఫలకాలమీద అక్షరశిల్ప మత్యద్భుతంగా ప్రదర్శించారు. ఆ దేవాలయ కుడ్యస్తంభ చిత్రాలలాగానే ఈ మహాకవుల వర్ణ పద వాక్య చిత్రాలు కూడా అజరామరంగా నిలిచిపోయి సహృదయులైన వారి కమందానంద పారవశ్యాన్ని ప్రసాదిస్తున్నాయంటే ఆశ్చర్యమేముంది. స్వర్ణయుగ మన్నందుకు ఒక సంగీత మేమిటి సాహిత్యమేమిటి - చిత్రలేఖన మేమిటి - శిల్పమేమిటి - అన్ని కళలూ ఎంత శోభాయమానంగా కళ కళలాడుతూ వెలిగిపోవాలో అంత వెలిగిపోతాయి మరి. ఆ ప్రభావమే అల్లసాని వంటి మహాకవి కూడా తన మను చరిత్రలాంటి ప్రబంధంలో పదికాలాల పాటు మనుచరిత్రలాగా చూపగలిగాడు. అది శిలాశిల్పమైతే ఇది భాషా శిల్పమంతే తేడా. అంతేకాదు. నాట్యచిత్ర శిల్పాదులైన మిగతా అన్ని కళలనూ కూడా యథోచితంగా తన కవితా కళలోనే ప్రదర్శించాడది మరీ అద్భుతం.

అసలు కవిత్వమంటే అది ఎలా ఉండాలో ఆయన గారిచ్చిన అమూల్యమైన అభిప్రాయమేమిటో ఆయన రాయలవారి సన్నిధిలో చెప్పిన చాటువులలోనే మనకు తార్కాణ మవుతుంది. కొన్ని మనవి చేస్తాను.

**పూఁత మెఱుంగులున్ పసరుపూప బెడంగులు చూపునట్టివా**

**కైతలు - జగ్గ నిగ్గునెనగా వలె - గమ్మన గమ్మన స్వలెన్**

కవిత్వం చెప్పటమంటే మాటలు గాదు. పైపై తళుకు బెళుకులు గాదు. దానిలో జగ్గుండాలి. నిగ్గుండాలి. గప్పుమనిపించాలి వినగానే. అంతే కాదు.

**రాతిరి యుం బవ ల్మఱ పురాని హౌయల్చెలి యారజింపుని**
**ద్ధాతరితీపులుంబలెను తారసిల న్వలెలో దలంచినన్**

రాత్రీ పగలూ ఆలోచించే కొద్దీ మరపురాని ముద్ర వేయాలి మనసు మీద.

**బ్రాతిగ బైకొనన్వలెను పైదలి కుత్తుకలోని పల్లటీ**
**కూతలన న్వలెన్ సొగసు కోర్కులు రావలె నాలకించినన్**

సంభోగ కాలంలో ఒక యువతి గొంతులో నుంచి ఆనంద పారవశ్యంతో పైకి వచ్చే మణిత ధ్వని లాగా వినిపించాలట ఆలకిస్తే.

**డాతొడనున్న మిన్నుల మిటారపు ముద్దులగుమ్మ కమ్మనౌ**
**వాతెఱ దొండపండువలె వాచవి గావలె పంట నూదినన్**

తొడమీద కూచోబెట్టుకొన్న ఒక చిన్నదాని దొండపండు వంటి పెదవి కొఱికితే ఎంత రుచిగా ఉంటుందో అంత రుచులూరు తుండాలి ఉచ్చరిస్తుంటే.

**చేతికొలంది కౌఁగిటను జేర్చిన కన్నియ చిన్ని పొన్నిమే**
**ల్మూతల చన్నుదోయివలె ముచ్చట గావలె పట్టి చూచినన్**

గట్టిగా చేతులతో పట్టుకొని కౌగిలించుకొన్న కన్నెపిల్ల చనుకట్టు పట్టి చూచిన అనుభూతి నివ్వాలట పట్టుకొంటే. ఇంతకూ ఏమిటిది. నిజమైన

కన్యా – కవితా కన్యా. కవుల పాలిటి కంతా కవితా విలాసినీ విలాసమే. ఇందులో కవితా శిల్పమెలా ఉండాలో దాని అనుభూతి రసజ్ఞులకెలా కలగాలో నిరూపిస్తున్నాడు పెద్దన. రంగు రుచి వాసనా స్పర్శా ఇలాంటి అనుభవం మనకు లోకంలో కలిగినప్పుడెలా తృప్తినిస్తుందో అలాంటి తృప్తినే ఇవ్వాలి ఏకవిత్వమైనా, లేకపోతే అది కవిత్వమే గాదు – వాడు కవే గాడని పెద్దనగారి అభిప్రాయం. ఇలాంటి దృష్టితోనే చేశాడాయన కావ్య సృష్టి. ప్రతి పద్యమూ ప్రత్యక్షరమూ అంత శ్రద్ధతో అంత దీక్షతో రచించాడు కావ్యంలో. ఒక శిల్పిలాగా ప్రతి మాటనూ ఊరక వదిలేయలేదు. శిల్పి ఎలా నగిషీ పెడతాడో అలా నగిషీ పెడతాడు. ఇంత చెక్కడమూ ఇంత నగిషీ మన తెనుగు కవులలో ఎవ్వరూ చేయలేదు. అక్కడక్కడా చేస్తూ వచ్చినా ఇంత పట్టుదలతో చివరదాకా పెట్ట లేదెవ్వరూ చికిలీ. అందుకే అల్లసానివాని అల్లిక జిగిబిగి అనే పేరు ఈ మహాకవి కొక్కడికే వచ్చింది సాహిత్య రంగంలో. పద్యాలేమిటి. గద్యాలేమిటి. ప్రతి ఒక్కటీ ఆయన ఈ బిరుదును సార్థకం చేసేవే. ప్రతి ఒక్కటీ అన్నప్పుడన్నీ ఉదాహరించలేము గదా. అంచేత అక్కడక్కడా కొన్ని పట్టి చూపుతాను. చూడండి. ఆ రుచులేమిటో ఆవాసన లేమిటో – ఆరంగు లేమిటో – ఆ హంగులేమిటో – మీరే ఆస్వాదించగలరు. అనుభవించి తృప్తి చెందగలరు.

**అలపోత్రి ప్రభు దంష్ట్ర – భోగివర భోగా గ్రాళి రా లుద్భటా**

**చల కూటోపల కోటి –** ఉపోద్ఘాతంలో పద్యపాదమిది. రాయల వసుమతీ భార నిర్వహణను వర్ణిస్తున్నాడు కవి. ఆది వరాహం కోఱ – ఆదిశేషుని పడగల రాళ్లూ – కులపర్వతాల శిఖరాల పాషాణాలు ఒరసుకొని నొక్కులు పడ్డదట భూదేవి శరీరం. **పోత్రి** ప్రభుదంష్ట్ర అనే సమాసం

కోటి. తీక్ష్ణతనూ – **భోగివర భోగాగ్రాళిజాలు** అనే అక్షర విన్యాసమా మణుల గరగరనూ – **టాచల కూటోపల కోటి** అనే టాటోటీ అనే మాటలా శిఖరాల మిట్టపల్లాలూ ఎలా సూచిస్తున్నాయో ఉచ్ఛరించి చూస్తే తెలుస్తాయి మీకు. ఇది మన కర్ణేంద్రియానికి గోచరించే ధ్వని. **అకట కట వికట కూట కోటీ విటంక** – ఒక పర్వతం ఎగుడు దిగుడులు ఎత్తుపల్లాలూ – చూపే ధ్వని ఇది. **ఇందు బింబగళదమృత దుర్ది నార్ద్రీకృత సల్లకీ పల్లవ** – చంద్రమండలామృత ద్రవంతో తడిసిపోయిన ఆ దృశ్యమెలా చూపుతున్నాడో చూడండి. ఈ గళదమృత అనే మాటలో క్రిందికి జాలువారే అమృతరసం. దుర్దినార్ద్రీకృత అనటంలో తడిసిపోయిన ఆ దృశ్యం ఉచ్ఛరిస్తుంటేనే అనుభూతికి రావటం లేదూ. ఇది మేఘసందేశంలో కాళిదాసు **తంత్రీ మార్ద్రాం నయన సలిలైః** అనే దృశ్యాన్ని తలపిస్తుంది. త్ర – ద్ర అనేవి తడిని సూచించే అక్షరాలు. అక్షర హృదయం తెలిసిన కవులకే తెలుసునది. **ఆహూయ మాన మానస మదాల స మరాళంబని** మూడు శబ్దాలూ వరుసగా చదువుతుంటే హంసలను దగ్గరికి పిలుస్తున్నట్టు అవి ఒయ్యారంగా దగ్గరకు వస్తున్నట్టు కనిపిస్తున్నదా లేదా. ఇంతెందుకు. ప్రవరుడి కాలికి లేపనం పట్టించి వెళ్ళాడా సిద్ధుడు. వెంటనే ఇతడూ వెళ్లాడు. ఎక్కడికి. ఎక్కడికో అక్షర విన్యాసంలోనే చెబుతున్నాడు. వినండి అల్లసాని.

**ఆమందిడి యత దరిగిన**
**భూమీసురుడరిగె– తుహిన భూధర శృంగ**
**శ్యామల కోమల కానన**
**హేమాఢ్యదరీ ఝరీ నిరీక్షా పేక్షన్**

ఎత్తుగా పైకి లేచిన పర్వత శృంగాలు వాటిమీద పరిచినట్లున్న వనాలూ అక్కడి నుంచి క్రిందికి చూస్తే దరులూ ఝరులూ – ఈ ఎత్తులూ పరపులూ లోతులూ ఎలా కనిపిస్తున్నాయో చూడండి పద్యంలో. వెంటనే మరొక పద్యం దానినింకా ఎంత చక్కగా స్పష్టంగా చూపుతున్నదో మనకు.

**అటజని కాంచె భూమి సురుడంబర చుంబి శిరస్సర ఝ్ఝరీ**
**పటల ముహుర్ముహు ర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన**
**స్ఫుటనటనా నురూప పరిఫుల్ల కలాప కలాపి జాలమున్**
**కటకచర త్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్**

దగ్గరగా వెళ్లి చూచాడు ప్రవరుడా పర్వతాన్ని. పర్వతమేదో గాదు హిమాలయం. శీతశైల మనటంలో దాని చల్లదనాన్ని సూచిస్తున్నాడు. అంబరం నుంచి ఆకాశాన్ని అంటే దానికి సూచకం బిందు పూర్వక బకారం. శిరస్సర ఝ్ఝరీ – ఇవి మూడూ క్రమంగా క్రిందికి జారే సెలయేళ్ళ దృశ్యం. ముహుర్ముహుర్లుఠత్ – త్రొక్కిసలాడుతున్న తరంగపంక్తి. అభంగ తరంగ మృదంగ – మృదం గం మీది ధ్వన్యావర్త ధ్వనులు స్ఫుటనట – టకార ద్వయం మయూర నాట్యభంగిమ. ఫుల్ల కలాపకలాపి విరిసి విస్తారంగా కనిపించే వాటి పింఛం – ఇవన్నీ ఎలా కనిపిస్తున్నాయో చూడండి మన మనోనేత్రాలకు.

**ఉల్లల దలకా జలకణ**

**పల్లవిత కదంబ ముకుళ పరిమళలహరీ** – జలకణాలు పైకి లేవటం – కడిమి మొగ్గల పరిమళాలు నలుదెసలా వ్యాపించటం **హల్లోహల మద బంభర** – దానికోసం ఇటూ అటూ పడుతూ లేస్తున్న తుమ్మెదలూ ఎసగవిసరె

ఇలాటి వ్యవహారంలో గాలి విసరుతున్నదట. **ఎసగవి సరె** అనే మాటలో ఆ విసరటం చూపుతున్నాడు. **భోగా గ్రాళిరాలూ - కూటోపలకోటి - వికట కూటకోటి విటంక** - ఇవన్నీ స్పర్శ - అందులోనూ కర్కశమైన స్పర్శ - **పల్లవిత కదంబ ముకుళ - ఎసగ విసరె** - సుకుమారమైన స్పర్శ - ఇలాటి స్పర్శా నుభవమిస్తే ఇవి - **శిరస్సర ఝ్ఝరీ - అభంగ తరంగ మృదంగ** - ఇవి శబ్దానుభవమిస్తే - **చలిమల వల్ల నుల్ల సిలు చల్ల దనంబును బూన కుండినన్** అనే లకార ప్రాచుర్యం మనకు శైత్య సుఖాన్ని సంపూర్ణంగా ప్రసాదిస్తున్నది.

**నికట మహీధరాగ్రతట నిర్గత నిర్ఝర ధారఁబాసి - లో**

**యకుఁదల క్రిందుగా మలకలై దిగుకాలువ వెంట బూచుమ**

**ల్లిక లవలంబనంబుగ నలి ప్రకర ధ్వని చిమ్మిరేగ - లో**

**నికి మణిపట్ట భంగ సరణిన్ ధరణీసురుడేగి చెంగటన్**

ఇక్కడ చూడండి. **నికట మహీధరాగ్ర తట** అనటంలో మన ఎదుటనే ఎత్తుగా పైకి లేచిన పర్వత రూపం కనిపిస్తున్నదా లేదా. **నిర్గత నిర్ఝర ధార** పడటంలో క్రిందికి జాలువారుతున్న సెలయేరు కనిపిస్తున్నదా. **లోయకు లోనికి** అనటంలో ఆ రెండూ లోయలూ లోతులు చూపుతున్నవా లేదా - **అవలంబనంబు** అనటంలో తేనెటీగలతో పాటు మనకూ పట్టుచిక్కుతున్నదా లేదా. **సరణి ధరణి** అనటంలో ఆ దారినబడి పోయే ప్రవరాఖ్యుడు కనిపిస్తున్నాడా.

ఆ తరువాత - **మృగ మద సౌరభవిభవ**

**ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీ గంధస్థగి తేతర పరిమళమై** -

ఏమి పద్యమిది. తాంబూలవాసనలు గాలివాటాన చాలా దూరానికి వస్తున్నాయి. ఎలా ఉందది. కస్తూరి పచ్చ కర్పూరం – ఎడా పెడా వెదజల్లు తున్నాయి. **సౌరభ విభవ** ఆ భకారమే సూచిస్తున్నది దాని ప్రసరణ. **ఘనసార సాంద్ర వీటీ గంధం దాని** ని బిడత్వం సూచిస్తే – **గంధ స్థగిత** అనటం మిగతా వాసన లేవీ నాసికకు రాకుండా కట్టి పారేస్తున్నాయి – **అతడా వాతప రంపరా పరిమళ వ్యాపారలీలన్** – ఆ గాలివాటాన బడి ఆ బ్రాహ్మడు ముందుకు సాగిపోవటమైతే – అక్కడ కనిపిస్తుంది వరూధిని. చూచింది ఈ బ్రాహ్మణ్ణి. ఎలాగని. పద్యమే చెబుతుంది. వినండి. **అబ్బుర పాటు తోడ** అని బకార ద్విత్వం ప్రాసాక్షరం ఆ వృత్తి అవుతూ ఆశ్చర్యాన్నే చూపుతుంది. ఇది ఒక అందమైతే **వికసితోత్పల** అనేది నల్ల కలువలు పైనుంచి కుమ్మరిస్తున్నట్లు **చన్గవ గగుర్పొడువన్** – ఉన్నట్లుండి ఆవిడ ఒడలు జలదరించటం చూపటం లేదూ. అలా చూచిందో లేదో –

'**చూచి ఝుళం ఝుళత్కటక సూచి తవేగ** – గజ్జెలు గల్లుమంటూ ఆవిడ కదలి రావట మెలా ఉందో వినండి ఆ ధ్వని. వెంటనే **సురగరుడోర గనర ఖేచర కిన్నర సిద్ధ సాధ్య** – అనే సమాసం మిగతా దేవజాతి యువకుల సౌందర్యమేమి సౌందర్యమని ఆవిడ పెదవి విరవటం మీకు తలపింప జేయుటం లేదూ. **మరి కసటువో బీటెండఁ గరగి కట్టులనంటి** అంటున్నప్పుడు కటకు టెండా కట్టులూ వాటి నంటిన జవ్వాజి ఎంత మొరటుగా కనపడుతాయో అలాగే **తరువుల తనుదాన తొరిగిన కప్పురపు సిరము** అంత సున్నితంగా కనపడుతాయి. దేనికి తగిన అక్షర విన్యాసం దానికి. **ఇంతెందుకు వెతలం బెట్టకు మింక నన్నునుచు – నీవీ బంధ మూడన్ – రయోద్ధతి నూర్పుల్ నిగుడన్ వడి న్వీరులు చిందం గొప్పు వీడం దనూ**

**లత తోడ్తో పులకింపగా - ననునయాలాపాతి దీనాస్యయై** అనే పద్యానికి పద్యమే ఎంత హొయలూ ఒయ్యారమే గాక వరూధిని సంరంభానికి తగినట్టే ఎలా నడిపాడో చూడండి కవి.

నీవీ **బంధ మూడన్ - ఊర్పుల్నిగుడన్ - విరులు చిందన్ - కొప్పువీడన్** ఈ సాత్త్విక భావాలు చూడండి. వీటినొకదాని తరువాత ఒకటి ఎలా ఎంత వేగంగా జరిగినట్టు మాటలలోనే బయట పెడుతున్నాడో గమనించండి. ఏమి అల్లిక - ఏమి జిగిబిగి. అపరాంబు రాశిలో పంకజ బంధుడు క్రుంకట మెలా ఉందంటారు. **'తదీయ బడబాముఖ వీక్షాంకురిత కుతుక రథ్యనిరంకుశ వేగాపహృత శతాంగుడు వోలెన్ -** క్రుంకాడు. ఎవరో లాగు కొనిపోయే వేగాన్ని చూపే సమాస వేగం చూడండి ఎలా ఉందో. సంధ్యారాగమో. **రవిబింబ పతన దీర్ణపయోధి గర్భనిర్గత** అంటున్నప్పుడు సూర్యమండల పతనాన్ని సూచిస్తే - **దివసావ సాన సందీప్తాస్తగిరిశిఖా** అనేది దాని దూరాన్ని సూచిస్తే - **తపన ధూర్గండ నిర్దళిత దిక్తట దృశ్య** అనేది సూర్యకాంతి దిక్కుహరాలను భేదించట మెలా చూపుతున్నాయో చూడండి. **'బహులజలప్లవమాన ద్రుహిణాండమని లకార బాహళ్యం జలం** మీద తేలుతున్న భూమండలం - **అంధతమస రాసులు బెరసెన్** అని సకార ప్రాచుర్యం చీకట్ల మసకతనాన్ని ఎలా సూచిస్తున్నాయో చూడండి. మరి **వెన్నెల చిచ్చులంటి తే మిళ ద్భావ్యాచ్ఛదశ్యామికా చ్ఛలనం గంది** అంతకంతకు సడలిపోయి ఎలా ముడుచుకుంటున్నాయో తామరలు - **అగ్గలపుం గ్రొంబొగలో** అన్నప్పుడెలా పొగలు పైకి లేస్తున్నాయో చూడండి.

అళీక ప్రవరుణ్ణి అదాటుగా చూచినప్పుడెలా కనిపిస్తాడా ప్రవరుడు. పసిడి తోరంతో బాహువల్లన ఎత్తి బింబాధరం కంపించేలాగా జట చెబుతూ

– **దిశల మార్గాన్వేషి దీర్ఘలోచన దీప్తిగణం** విరజిమ్ముతూ **కమనీయ తను కాంతి కనక ద్రవంతో** ఆరాను రంగమంతా అలుకుతూ కనిపించాడు. బాహువు లెత్తి పిలుస్తున్నాడా – జట చెప్పి రమ్మంటున్నాడా – వస్తున్న దారావటం లేదా అని దృష్టి సారించి చూస్తున్నాడా – పచ్చని శరీరచ్ఛాయా దీర్ఘనీలకేశచ్ఛాయా దూరానికే కనిపిస్తుందే అది చూచైనా రాలేదేమా అని ఎదురుచూస్తున్నాడా. అదీ ఇదీ ఏదైనా కావచ్చునన్నట్టుందీ వర్ణన. అక్షర విన్యాసం చూడండి. భావానుగుణంగా ఎలా సాగుతున్నదో. మరి **ఆ కమలాక్షి యింపున దృగంచల మించుక మూసి** అంటుంటే ఆ వర్ణాలే చెబుతున్నాయా ఇంపూ ఆ కనుమోడ్పు. అంతేగాదు. **బాష్పకుల కోణ శోణ రుచుల గ్రమునం జనంజూచు చూపు** అనటంలో సూటిగా పొడవుగా ప్రసరించే ఆ వరూధిని దృష్టీ – **అంటుకొన న్వెడవింటి** వాడన్నప్పుడు తమ్మరస మంటుకొన్నట్టే తగులుతుంది రసజ్ఞుడి మనస్సుకు.

తరువాత అతని దగ్గరికావిడ మెల్ల మెల్లగా వచ్చే తీరు చూడండి. **'తొలుదొల్తవాని గన్నుల గాంచినపుడు పల్లవాధర గుండె జల్లుమనియె' పంకజాక్షికి తొట్రుపాటు గదిరె – దైన్యంబుదోచె – చంచలత బెరసె – గద్గదిక వొడమె – లేజెనుట గ్రమ్మె కన్నీరు పొడమె.** ఒకదాని వెంట ఒకటీ వరుసగా ఏమి సాత్త్విక భావాలివి. అంతకంతకు దగ్గరయ్యే కొద్దీ పద్యపంక్తుల పొడవు కూడా చూడండి ఎలా కుంచించుకు పోతుందో, మొదటి పాదం కన్నుల గాంచినప్పుడ అని పూర్తిగా సాగితే – అరుగునప్పుడ కాళ్ల అని రెండవ పాదం కాళ్ల అనే మాటకు ముందే తెగిపోతే – డాయంగ జనునప్పుడ అనే మూడవది మరీ వెనక్కి జరిగితే – కదిసి నిల్చిన యప్డ అనే నాలుగవది అప్పుడ అనే ఓపిక కూడా లేక అప్డతో సరిపుచ్చుకొంటే

– ఎంత రచనా చమత్కారం ప్రదర్శిస్తున్నాడో చూడండి కవి. మరి **ఏలరయీా చలం బుడిగి యేలర – రావైరాగ్యము బూని నీవు** అనే పద్యాలు చదువుతుంటే అవి సంగీతంలో జావళీలలాగా జారిపోతూ నిలదొక్కుకొంటూ – ఎంత ఒయ్యారం ఎంత దైన్యం ఒలకబోస్తున్నాయో సహృదయైక సంవేద్యం.

ఇక ఆ దంపతుల సంభోగమా. అది అతిలోకం అతి సహజం. **పతిపాణి పల్లవచ్యుత నీవి బంధన వ్యగ్రబాలా హస్త వనరుహంబని** నలదమయంతుల మైధునం శ్రీనాధుడూ వర్ణించాడు. కాని దానికన్నా మెఱుగిది. ముఖ్యంగా **ఆక్రమ క్షీణ నుతివర్ణ – మాని మీలితాక్ష – మాస్విన్నగండ – మాయత్త చేష్ట – మాస్తిమిత భూషణారవమని –** అంతకంతకు రతిపారవశ్యంలో వరూధిని చేష్టలు దక్కి నిశ్శబ్దంగా కనపడే దృశ్యం ఎప్పటికీ మరపురాదు. ఆ అనే మాట సంస్కృత శబ్దమంతవరకూ. పిమ్మట ఆవధూటి అనే చోట అది తెలుగుమాటగా వచ్చి కూర్చోట మెంతైనా మందస్మిత మందిస్తుంది భావుకుడికి.

ఇలా వర్ణిస్తూపోతే ఎంతైనా ఉంది. పెద్దన వర్ణన పోయి అది మన వర్ణన అవుతుంది. అన్నీ కాకపోయినా స్థాలీపులాక న్యాయంగా కొన్నైనా ఉదాహరించక తప్పదు మరి. అసలు అక్షరాల కూర్పే మాటలు. మాటల కూర్పే పంక్తులు. వాటి కూర్పే పద్యం గద్యం. అంచేత అక్షర విన్యాసాన్ని బట్టే ఉంటుంది ఏ రచనలోనైనా అక్షరమైన చమత్కారం. అది కాళిదాసాది మహాకవుల తరువాత ఎంతగానో సాధించిన వాడు పెద్దన. ఆ అల్లికే వేరు. చెప్పాను గదా '**ఫుల్లలవలీన వైలా వల్లిమతల్లికల తోడ వాసంతిక లుద్యల్లీల నల్లి బిల్లిగ నల్లికొనినది** ఆయన వర్ణించిన లతాగృహమూ –

లేక భంగ్యంతరంగా ఆయన ధ్వనింప జేస్తున్న కావ్య లతా గృహమా చెప్పలేము. ఏదైనా కావచ్చు. **అనునయాలాపాతి దీనాస్యమై** అనే అక్షరాలుచ్చరిస్తుంటే అంతకంతకు దగ్గరకు పోయి గడ్డం పట్టుకొని బ్రతిమాలుతున్న వరూధిని కనపడటం లేదా. **గ్రుద్దన్ గోత్రాచలంబుల్గులగుల లయిపో** అని ఒక్క గ్రుద్దుతో పద్య మారంభిస్తే అది **వాతాద్భుత గతి బలచి** ఆ స్వరోచి అనుపమాన బలాన్నే ప్రదర్శిస్తుంది. కొండమీద పడే వర్షం వర్ణిస్తున్నాడు చూడండి కవి. కరకా **చిటపట రవ భీకరమట.** పెళ పెళ నినాద **ఘనమట. ఝంఝూ మరుదుజ్ఝిత** బిలమట. మాటలే చాలు మనకు బండల మీద పడగండ్లు పడే ధ్వని చెట్లు విఱిగి పడే ధ్వని గుహలలో నుంచి వెలువడే పెద్ద గాడ్పుల ధ్వని బయటపెట్టటానికి.

**'చకితైణాహుతి దావ మావళిత పుచ్ఛ స్వల్ప గచ్ఛత్తర**
**క్షుక మద్రి గ్రహయాళు భల్లుకము – వక్షోభాగ నిక్షిప్త డిం**
**భక వల్గత్ప్లవ గీకదంబము – హ్రదాంభః ప్రోత్థిత క్రోడ నా**
**యక మా భీలముఖద్విపి స్థపుటితం బయ్యెన్ వనంబత్తఱిన్**

స్వరోచి వేట సంరంభ మెలా వర్ణిస్తున్నదో చూడండి ఈ పద్యం. ఎక్కడికక్కడ విఱుపులు. ఎందుకు. ఒక్కొక్క జంతువులో కలిగే మార్పు ఎలాటిదో చూపాలి గదా. **చకితైణా** అనటంలో జింక లెగురుతున్నట్టు మంటలకు దూరంగా పోతున్నట్టు **దావ మావళిత** – తోకలు ముడుచుకొని **పుచ్ఛస్వల్ప గచ్ఛత్తరక్షుక** మనటంలో నెమ్మదిగా నడుస్తూపోతున్న చిరుతలు కనిపిస్తున్నాయి. **అద్రి గ్రహయాళు** అనటంలో కొండ కొమ్మలను గట్టిగా పట్టుకొని ప్రాకుతున్న ఎలుగుబంట్లు – **వక్షో నిక్షిప్త వల్గత్ప్లవగీ.** అనటంలో

పిల్లలను భద్రంగా పొట్ట కదుముకొని ఒక్క ఎగురుతో కొమ్మ మీది నుంచి మరో కొమ్మకు దాటి సాగిపోయే కోతులు కనపడటం లేదా. **ప్రాడాంభః ప్రోత్థిత పల్వలాల** లోనుంచి పైకిలేచే అడవి పందులు – **అభీల ముఖ ద్విపిస్థపుటిత** – వికృతమైన ముఖాలతో లేస్తూ ఉన్న పెద్ద పులులతో మిట్ట పల్లాలుగా కనిపించేనేలా మనకు వెంటనే మనసుకు రావటం లేదా. ఏమి పద్య రచన ఇది. అడవిలో జరిగే కోలాహలమంతా ఎక్కడి కక్కడ కండ్లకు గట్టినట్లు చూపుతున్న ఒక గొప్ప వర్ణచిత్రమిది. ఇలాంటి పద్య రచన సాహిత్యంలో గాలిస్తే ఏ పదో ఇరవయ్యో అంత కన్నా ఎక్కువ దొరకవు.

**హరిణంబొక్కటి – గవిలో బెబ్బులి** – ఈ పద్యాలు చదువుతుంటే ఆకాశాని కెగిరే హరిణం – గుహలో నుంచి పైకి దూకే వ్యాఘ్రం ఎంత వద్దను కొన్నా మన మనోనేత్రానికి దర్శనమిచ్చి తీరుతాయి. **నిండెకా విరి దిక్తటంబుల** – ఉన్నట్లుండి ఒక మత్తకోకిల. **గర్భాండ భాండము ధూళి ధూసర** అనే అక్షర విన్యాసం – అసలు మనకేదీ కనపడకుండానే చేస్తున్నది. వెంటనే మనోరమ ఆక్రందన చేస్తూ రావటం. శైలి మారింది. రాజును సంబోధించి మొఱపెడుతున్నది. **ఓ రాజన్య మహేంద్ర** అని. ఎంత గట్టిగా నొక్కి చదివినా చదవవచ్చు నీ పద్యం. ఎంత నొక్కినా నొక్కు పడదెక్కడా. అంత గట్టి శరీరమా రాజుది. అలాటి వాడే తనకు రక్షకుడని అంత దట్టంగా నమ్మి నట్టున్న దావిడ. అందుకే అంత పకడ్బందుగా సాగింది పద్యం.

పోతే **మిన్నంది పెన్నంది కోరాడు తన గుబ్బ కొమ్ములొడ్డి.** కొమ్ములతో బయలు కోరాడే నందిని చూచినట్లే ఉంది. మరి **ఎందుండు గురివెంద పందిళ్ళ పూదేనె జడియిందు శిలలందు జాలువారుతూ** పోతే ఆ పూఁదేనె మాధుర్యమే వేరు. మధురమైన ఆ రుచి కూడా మాటల

ద్వారానే అందకోవచ్చు మనం. **'ఊసరవెల్లి చందమున నొక్కట బీఱ నరాలు దేఱుగా** – ఱ ర ఱ ఆ ముదుసలి మునీశ్వరుడి అస్థిపంజరంలాంటి చర్మం నుంచి బయటికి కనిపించే నరాలు చూడండి. ఎంత కఱకుగా పైకి తేరుతున్నాయో. స్పృశించి చూడవచ్చు మనం. రేఫత్రయమే మనకిస్తున్నదా స్పర్శ. **జరాధూసరమైన రోమ తతితో పెన గంబడి** – ఏమిటీ డొంక తిరుగుడు మాటలు. **తతితో పెనగంబడి** ఒక దానితో ఒకటి చుట్టుకుపోయి చిక్కుపడిన నరసిన వెంట్రుకలు ఎలా ఉంటాయో దృశ్యం చూపవద్దా రచన మనకు.

ఇక ఇందీరాక్షుడనే రాక్షసుడు వస్తున్నాడు చూడండి. వాడి అడుగుల చప్పుడు వినండి. **ఉదగ్ర పదాగ్ర ఘట్టన గ్లాని** – దాని కచటీ కాన ఏమయింది. **ఘరట్ట విఘట్ట తాకృతింబూని** చెడింది. **ఉదగ్ర పదాగ్ర – ఘరట్ట విఘట్టిత** – ఎక్కడి కక్కడ వర్ణాలే ధ్వనింప జేస్తున్నాయి భావాలను. మరి ఆ దానవుడు చేసే అట్టహాసమెలా ఉంది. **'గళగర్త క్రోడ నిర్యత్కహకహ నినదోద్గాఢహాసంబు** ఎంతో లోతైన గొంతులో నుంచి వస్తున్న కఠినమైన సవ్వడి అని అక్షరాలు చెప్పటం లేదా మనకు.

వర్ణ విన్యాసమేగాదు. పద్య విన్యాసం కూడా ఒక్కొక్క భావమెలా మారుతూ పోతుందో అద్భుతంగా చూపగలదు. రాక్షసుడంతకంతకు చేసే హడావుడిని పంచచామరం – మహాస్రగ్ధర – ఈ ఛందస్సులొక దాని తరువాత ఒకటి తరుముకొని రావటం చూస్తే అది ఆ రాక్షసుడి తరుముకు రావటమేనా ఏమి అని మనసుకు తోస్తూంటుంది. **పలాశిదాసి రాజు – అని బాహాస్ఫోట రావాహత పతగ – గదాహతికి నాత్మ గొంకక** – ఇవి పద్యాలా రాక్షసుడి వాగ్భాణ పరంపరా. మరి వాడి ఆర్భాటాని కోహటించి

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

పరుగెత్తిపోయే వేటకాండ్ర హడావుడిని బయటపెట్టే ధ్వనులు చూడండి. **పక్కు పక్కున - గళ గళధ్వనులు - గుప్పుగుప్పున - కంగుకం గన.** నాలుగూ ఒకే ధ్వని కాదు. దేనిపాటి కది - చివరకా రాక్షసుడిందీవ రాక్షుడుగా మారిన ఘట్టాన్ని వర్ణించే పద్యం చూడండి.

**ధగధగని దేహరుచి నిగనిగని కుందన పుండగడు దెగడన్** - లయ విభాతి అనే ఈ పద్యంలో ధగ ధగ - నిగనిగ - బుగ బుగ - ఈ గ కా రా ను ప్రాస అందచందాలు చూడండి. దానికింకా అందచందాలు దిద్దే **నవనవ - కువలయ రవరవ - దివి దివిషత్** - ఈ శబ్ద పునరుక్తి చూడండి. అల్లసాని జిగి ఎలాటిదో తెలుపుతుంది. ఇంతెందుకు. **శశికాంత వాంత నిర్ఝరము జలము - సౌగంధికంబు రజంబు కళుకు దుమ్ము మల్లెలనుండి పడియు మరందంబు గుడరసంబు - కరడుల మీది మీగడల మెఱుగు** - పట్టి చూడండీ మాటలు - ఎలాటి స్పర్శనిస్తాయో నోట్లో వేసుకొని చూడండి. ఎలాటి రుచినిస్తాయో. పైపైన తేలికగా ఉచ్చరించి చూడండి. ఎలాటి మెఱుగులు కురిపిస్తాయో. **దంత శుండాగ్ర హతిఁజించి** - ఏనుగులు చించుతున్నట్టే. **అహిమాంశుహయ హేషలా** గుఱ్ఱాలు సకలిస్తున్నట్టే కంటబడటం లేదా. చెవిన బడటం లేదా చెప్పండి. **వైకుంఠాం** అనగానే కమ్మెచ్చులో నుంచి బంగారు తీగలాగా లాగే శబ్దం వినపడటం లేదూ. **ఆతతవలద్వా తాశనా కృష్ట రేఖాకారంబుల** అంటుంటే ఆ కొండ చుట్టూ ఆ తీగను సాగదీసి చుట్టటం లేదూ ఆ మహాకవి. **అంద మొంద నిందడవి మెకాలతో - రేబవల్ బయల్వెడలి ఘులీకులీర శకులీ మకరీ** అంటుంటే వాటి అందమూ వాటి గమనమూ కొట్టవచ్చినట్టు చూడటం లేదా మీరు.

Brahmasri Vallamraju Srinivasa Rao www.advaitaveda.in

**చందనపంక పంకిల తలం** – గంధోదకంతో తడిసిన నేలనూ – **కేతురుద్ధాత పాథ్వం** ఎండ వేడిమిని అడ్డుకొంటున్న దృశ్యాన్నీ – **మంచరకోపరి కుటీ వాటీ నటన్నర్తకీ** – మంచెల మీద నాట్య మాడే మగువలనూ – ఎలా చూపుతున్నాయో చూడండి. **ఆశుద్విజహూత హరిత శమీ శాఖా శకలనినద మేదుర విశదా భీశు జ్వాలా జాలహు తాశ క్రోడమట** వివాహ వేదిక ముందున్న అగ్నిహోత్రం. సమాసమే చూపుతున్నదా అగ్నిజ్వాలలూ అందులో వధూవరులు హోమం చేసే దృశ్యమూ. **అవనతాం గుష్ఠా గ్ర హర్య నిర్య ద్రత్నాలు** – బొటనవ్రేలితో గుచ్చితేనే బయటికి వస్తుంటాయి. **మదము దావహ దివ్యమైరేయ ధౌరేయాలు** – తాగితేనే తెలుస్తుంది పారవశ్యం. **ప్రఖరాఖు నఖర ధారా విదీర్ణో ద్గీర్ణ సౌవర్ణ మృత్కీర్ణాలా** – ఎక్కడ బడితే అక్కడ త్రవ్వి పడయవచ్చు. మాటలతోనే సప్లై చేయగలడు మనకు పెద్దానామాత్యుడు. ఇక **చలిగాలి బొండు మల్లెల పరాగము రేచి** అనే పద్యంలోని హృద్యత మీరు చదివి తీరాలి ఆస్వాదించి తీరాలి. మేము చెప్పేదిగాదు. సకలేంద్రియాలకూ సంతర్పణ మా శబ్ద విన్యాసం. మరి **అలకని జీబులో** ప్రత్యక్షమైన అప్సరస – **తలకొని దాని తమ్ములపు** దావి నాఘ్రాణించి పరవశమైన ఆమౌని నడిగి చూడండి. మౌనంగానే జవాబిస్తాడు తన అనుభవ మిలాంటిదని.

మరి ఇక **గంగా తరంగిణీ రంగత్తరంగ శీకర శీత సైకతోత్కరము లందా – మందార మకరంద తుందిలేందిందిరానంద కృన్నందన ములందా – కాంత నిశాకాంత కాంత వితర్ధికా క్రాంత భూభృద్బృంద కందరములలోనా – మసృణ బిసా హార మాంసల హంసికా సంసదా సారకాసార తటులలోనా** – ఎక్కడ విహరిద్దామని మీకుందో చెప్పండి.

పెద్దనగారు మనల నక్కడంతా తీసుకెళ్లి తిప్పగలడు. స్వరోచి ఒక హరిణి నాలింగనం చేశాడో లేదో వెంటనే అది ఎలా కనిపించిందో తెలుసా. **'పల్లీమతల్లి లావణ్య సర్వస్వంబు విమలాంగ రేఖనా విర్భవింప మంజుల మంజరీ మహిత సౌభాగ్యంబు పరివృత్తకుచ వృత్తి పరిణమింప** అని వర్ణిస్తాడు కవి. ఇది మహిళా రూపంలో వనదేవతా. లేక వనదేవతా రూపంలో ఉన్న మహిళా. రెండూ. రెండూ రెండుగా కాదు మరలా. ఒకటిగా. అద్భుతమైన భావం. అంతకన్నా అద్భుతమైన ఆవిర్భావం.

ఇక **నీలమేఘముదాలు డీలు సేయగంజాలు** స్వామివారి సాక్షాత్కారం. **జయజయ దానవ దారణ కారణ** అంటూ స్వారోచిషుడా మూర్తిని పొగడే దృశ్యం వర్ణిస్తుంటే – పారవశ్యం చెందని సహృదయు డుండడని నా నమ్మకం. చాలు చాలు. ఈ వర్ణ చిత్ర వర్ణనే మనకు వర్ణనాతీతమైన భగవత్సాక్షాత్కారం ప్రసాదించింది. మనువుతో పాటు మనుజులమైన మనం కూడా ఆ ప్రసాదాన్ని తనివి తీర ఆస్వాదించి ఆనందించవచ్చు. ఇక్కడికి అల్లసాని వారి అల్లిక బిగిజిగి మనుచరిత్ర ఆరాశ్వాసాలలో అక్కడక్కడా స్థాలీపులాక న్యాయంగా పరిశీలించి చూచాము. స్థాలీపులాక మంటున్నాము గమనించండి. ఇదీ చాలా తక్కువేనా దృష్టికి. ఇంకా వివరంగా చూస్తూ పోతే ఎంతో ఉన్నది చూప మలసిందీ చెప్పవలసిందీ. ఆ మాటకు వస్తే ప్రతిపద్యమూ అందులో ప్రత్యక్షరమూ ఒక గొప్ప అల్లకం. బాగా బిగుతుగా అల్లిన అల్లకమే. ఎక్కడి కక్కడ జిగులొలికే అల్లకం.

పోతే ఒక రెండు ముఖ్యమైన విషయాలున్నాయి చెప్పవలసినవి. పెద్దన కాలం స్వర్ణయుగ మని పించుకొన్న విజయనగర సామ్రాజ్యకాలం.

Vallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

సంగీత సాహిత్య నాట్య శిల్పాదులైన సకల కళల నిలయమది. **కళల నెలవగువాడని** చంద్రుణ్ణి వర్ణిస్తూ మహాకవి భంగ్యంతరంగా దానినే సూచించాడు కూడా. అలాంటప్పుడా కళా దృష్టి ఆ మహాకవిలో లేకపోతుందా. తప్పకుండా ఉండి తీరాలి. గుప్తుల కాలం వాడైన కాళిదాసెలాగో రాయలనాటి పెద్దన కూడా అన్ని కళలలో ఆరితేరిన వాడే. **ప్రియ శిష్యాలలితే కలా విధౌ** అని కాళిదాసు వాచ్యంగానే అన్నాడా మాట. **కళలనెలవగు** వాడని పెద్దన అన్నట్టే. దానికాయన కావ్యాలూ నాటకాలూ అన్ని రచనలూ ఎలా సాక్ష్యమిస్తాయో - అలాగే పెద్దనగారి మనుచరిత్ర కావ్యమంతా సాక్ష్యమిస్తుంది. సందేహం లేదు. అసలాయన ఆశువుగా చెప్పిన ఉత్పలమాలికలోనే సంగీత నాట్యకళలను వాచ్యంగా వర్ణించిన మాట లెన్నో ఉన్నాయి. చూడండి. **'సంగాతపు సన్నతంతి బయకారపు కన్నడ గౌళ పంతుకా సాతత తాన తానల పసందివుటాడెడు గోటమీటు బల్ మ్రోత** లట. ఇది వీణాగానమా. ఆయన హృదయవీణా గానమా. అదే భావంలో నుంచి భాషలో ప్రవేశించింది. మరి నాట్యం వర్ణించాడు చూడండి. **సుధా ప్రపూర బహుభంగ ఘుమంఘు మఘుంఘు మార్భటీ జాతక తాళ యుగ్మలయసంగతి చుంచు విపంచికా మృదంగా తత తేహి తత్తహిత హాధి తధింధిమి ధాణధింధి వ్రాతనయాను** కూలంగా ఉండాలట నాట్యం.

కళా దృష్టి ఉన్న వాడు గనుకనే సమయం వచ్చినప్పుడల్లా తన అభిలాష అక్కడక్కడా తన కావ్యంలో సూచిస్తూనే వస్తాడు. లేకుంటే నాలుగు వర్ణాల వారినీ వర్ణించి అక్కడి కూరకుండక వెలయాంధ్రను కూడా వర్ణిస్తాడా

అరుణాస్పదంలో. వారిలో కూడా కళా ప్రావీణ్యమే బయటపెడతాడు. మరేదీ గాదు. **అచటి వెలయాండ్రు రంభాదులైన నొరయ కాసె కొంగున వారించి కడపగలరు – నాట్యరేఖా కళాధురంధర నిరూఢి** – నాట్యమంటే ఎంత మోజో చూడండి కవికి. హిమాలయాన్ని వర్ణిస్తూ కూడా ఆ అంశం మరచిపోడు. **అభంగతరంగ మృదంగ నిస్వన స్ఫుటనట నానురూప పరిఫుల్ల కలాప**మట. మృదంగ ధ్వనులు వాటి కనుగుణమైన మయూర నాట్యమెంత కళ్లకు కట్టినట్టుందో. అసలు నాటకశాల లుండేవి విజయనగర కాలంలో. అక్కడ నాట్యకళ అభ్యసించే వారెందరో పడతులు. **'చిలుకల కొల్కికల్కియొక చేడియ నాటకసాల మేడపై నిలువున నాడుతున్నదట** ఒకతి. అది స్వరోచి దంపతులను చూడటానికి పిట్టగోడ అంచుమీద నిలబడ్డదట. ఇంతెందుకు స్వరోచి పెండ్లి మండపానికి తరలి వస్తుంటే **'మంచకోపరి కుటీ వాటీ నటన్నర్తకీజన** మాయనకు తమ నాట్యభంగిమలతో స్వాగతం పలుకుతున్నదట. అసలు **చూచిఝుళం ఝుళిత్కటక సూచిత. కాంచికల క్వణ త్కన కకాంచిక – మంజీరం బించుక గల్లు**మంటే చాలు. దానిధ్వనులు శ్రవణ మనోహరంగా ఎక్కడబడితే అక్కడే వినిపిస్తాయి కావ్యంలో.

ఇక సంగీత కళ అంటారా సరస్వతీ స్తుతి లోనే ఆవిడ వీణావాదన నైపుణ్యం వర్ణించాడు. అదే మరలా వరూధిని వీణావాదనంలో **ఝుణ ఝుణ ధ్వనులు తాన మానాలు** కొలుపుతూ వినిపిస్తాయి. ఏ రాగ మెప్పుడు పాడాలో కాల నియమం కూడా తెలుసు పెద్దనగారికి. నాటరాగానికి మేళవించిన వీణా తంత్రులు – ప్రభాతకాలంలో పలకట మిష్టం లేదు

Vallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

ఆయనకు. అందుకే దానికి అనుగుణమైన దేశాక్షిరాగానికి మార్చమని చెలికత్తె చేత సలహా ఇప్పిస్తాడు వరూధినికి. అసలు అన్ని **కళలందు రమించుటఁ జేసి భువి మనోరమ** అని పేరు వచ్చిందట మనోరమకు. **హిందోళంబునఁ బాడిరి బృందారక సతులు** – వసంత కాలానికి అనుకూలమైనది హిందోళ రాగం. మరచిపోడు కవి. **కీర మనోజ్ఞవాణి యొక కిన్నరి కిన్నెర మీటి మీటి యొయ్యారపు లీల** వచ్చిచూచిందట స్వరోచిని. సహజంగా గాత్ర సంపత్తి ఉండి జంత్ర వాద్య నైపుణ్యం కూడా ఉంటే బంగారానికి పరిమళ మబ్బినట్టేనని తెలుసు మహాకవికి. ఆ మాటకు వస్తే నా ఆయుర్వేద విద్య నీకిస్తాను ఈ కన్యనూ నీకిస్తాను పెండ్లాడమని అల్లుడికి చెప్పే సందర్భంలో కూడా మంధరాద్రిని వర్ణిస్తూ అక్కడ గంధర్వ గానం మాత్రం మరచిపోలేదా గంధర్వరాజు. **రమానారాయణ పరిణయ గేయ విగాయన గాంధర్వ**మట ఆ పర్వతం. లక్ష్మీనారాయణ వివాహానికి సంబంధించి పాటలెన్నో మారుమోగుతుంటాయట అక్కడ. దానిని ధ్వనింపజేసే అక్షర విన్యాసం చూడండి ఎంత గానమాధుర్యాన్ని ఒలక బోస్తున్నదో.

ఇక శిల్పమూ చిత్రమూ – ఈ కళలకు కావ్యమంతా ఉదాహరణమన్నా తప్పులేదు. అందులో రంగులు పూసిన బొమ్మలు కొన్ని. రంగులు లేకుండా ఒకానొక భంగిమలో మన మనసుల నాకర్షించే బొమ్మలు కొన్ని. ఆయన మాటలోనే చెబితే **'రేఖవల్మ రపు రాని హొయల్బెలి యార జంపునిద్దా తరితీపులుంబలెను దార సిలన్ పలె లో దలంచినన్.** మొట్టమొదట ఒక ఔషధ సిద్ధుడి బొమ్మ చూడండి ఎలా గీచి చూపాడో.

ముడిచిన యొంటి కెంజడ మూయ మువ్వన్నె

మెగముతోలు కిరీటముగ ధరించి

కకపాల కేదార కటక ముద్రిత పాణి

కుఅచలాతాముతో కూర్చిపట్టి

ఐణేయమైన యొద్దాణంబు లవణి చే

నక్కళించిన పొట్ట ముక్కళించి

చెవుల రుద్రాక్ష పోగులు చవుకళింప -

కావి కుబుసుంబు జల కుండికయును బూని-

ఎలా ప్రత్యక్ష మవుతున్నాడో చూడండి మన కళ్ల ముందు.

మరి అంతగా రంగులు పులమని చిత్రాలూ ఉన్నాయి కవిగారి ఖజానాలో. తొండము ల్సాచి యందుగుఁ జిగుళ్లకు నిక్కు కరుల దంతచ్ఛాయ కడలు కొనగ - సెలవుల వనదంశములు మూగి నెఱె వెట్ట క్రోల్పులు ల్పొదరిండ్ల గుఱకలిడగ - ప్రబల భల్లుక నఖభల్ల భయదమ ధన శిథిల మధు కోశాలన్నీ అలాంటివే. దీనికి తోడు సాత్త్వికాదులైన అనుభవాలతో నిలిపిన వరూధిని చిత్రమింకా ఎంతో గొప్పది. 'ఘనసార పంకమొక్క లతాంగి దెచ్చిన ముట్టి వ్రేలనె చుక్క బొట్టు పెట్టి. పడతి యొక్కతె రత్న పాదుకలిడ నిల్చి తొడుగ కవ్వలికి బోనడుగు వెట్టి సగము గొఱికిన యాకును సఖులు పిలువ సగ మొసగునుత్తరము తెల్పి సగము మరపు సగమునయి - చింతతో సగమగుచు ఉద్యానాని కరిగే ఆవిడ

మూర్తి ఏ చిత్రకారుడు గీయగలడో చెప్పండి. **ఇక అర్ధచంద్రుని తేట నవఘుళించులలాట'** అనే పద్యంలో ప్రవరుని వేషమున్న దున్నట్టు దించి చూపాడు పెద్దన. ఒక సదాచారపరుడూ సద్బ్రాహ్మణుడూ ఇలాగే ఉంటా డనిపించే సజీవమైన వర్ణన ఇది. మరి విరహం తట్టుకోలేక **చనుగప్పు దొలగ వాసన గాలికెదురేగు - పసిడి గాజులు పైకి వెస ద్రోచినును దీగ తెమలిస్తూ మొలనూలు బిగించి వెలది వెన్నెలఁజొచ్చే** వరూధినీ విగ్రహమెలా కండ్లకు కట్టినట్టు కనిపిస్తుందో మనకెంత సానుభూతి కలిగిస్తుందో చెప్పలేను.

ఇంతెందుకు. స్వరోచి ఎక్కిపోవటాని కొక మంచి గుఱ్ఱాన్ని తెచ్చి ఎదుట నిలుపుతాడొక సాహిణి. ఎలాంటిదా గుఱ్ఱం. విజయనగర రాజు లెక్కిపోయే గుఱ్ఱమే మరొకటి కాదనిపిస్తుంది. **పచ్చని హురుముంజి పని వాగె పక్కెర - పారసి పల్లంబు పట్టమయము రాణ నొప్పారు పైతాణంబు సింగిణి - తళుకు ల కోరుల తరకసంబు మిహి పసిండి పరుంజు మొహదా కెలంకుల తావుగుజ్జరి సేత కేవడంబు డాకెలంకుల సిరాజీ కరాచుర కుత్తికుఱ గట క్రొవ్వాడి గొరకల పొది. పీలి కుంచె తలాటంబు బేర జంపుమణుల మొగముట్టు పన్ని సాహిణీ యొకండు కర్తయెదుటికిఁ గొని తెచ్చె గంధవాహ బాంధవంబగు నొకమహా సైంధవంబు** - ఈ పద్యం చదువుతుంటే స్వరోచి గుఱ్ఱమా ఇది లేక రాయలవారు స్వారి చేసే గుఱ్ఱమా అని అనుమానం రాదు మీకూ. పైగా ఆ మాటలు చూడండి. అవన్నీ కొన్ని తెలుగు మాటలు కొన్ని ఉర్దూ మాటలు. రెండూ కలిసి ఒక మణిప్రవాళ శైలిలో సాగింది పద్యం. రెండు భాషలలో గుఱ్ఱం బొమ్మ సజీవంగా గీచి

స్వరోచి ఎదుట ఏమో గాని మన ఎదుటనిలిపాడు పెద్దనగారు. అలాగే **మండిగాలిడి దంత శుండాగ్రహతిఁజించి జలధరాంభముకరం ల్బుల్లులాడటం ధ్వజ వాత హతినాఱ వైద్యుతాగ్నులఁ జూడి పగటి దివ్వెల వారు పంజు లెత్తటం** - స్వరోచి ఇందీవరాక్షుడి వెంట ఆకాశయానం చేస్తూ వెళ్లినప్పుడు దొరలిన ఈ పద్య భావాలు నిజంగా వారితోపాటు మనలను కూడా ఆకాశయానం చేయిస్తున్నట్టే కనిపిస్తాయి.

ఇక స్వరోచిని చూడటానికి వచ్చి నిలబడ్డ పురకాంతల విగ్రహాలు విజయనగరం నాటి శిల్పకలా సౌందర్యాన్నంతా పుడికి పుచ్చుకొని మనకళ్లకు ఒక అతిలోకమైన సౌందర్యాన్ని మనస్సులకొక అతి మానుషమైన పారవశ్యాన్ని కలిగించకపోవు. చూడండి మచ్చు కొకటి రెండు దాహరిస్తాను.

**ఒక నేత్రాంబుజ మొక్కగల్ల మొక చ న్నొయ్యా రపున్నీల వీధికిఁ దోఁపం దలుపోరఁగా నొక పురంధ్రీ రత్న మీక్షించె రాజ కిశోరంబు - తదీయలై వెలయు భాషాల క్ష్మలంజూచి త్ర్యం బక భాగంబు మొఱంగి మైత్రికి శివా భాగంబె యేతెంచెనాన్.** ఒక ఇల్లాలు - కుర్రదే. రాజుగారిని చూడాలని కుతూహలం. అయినా నలుగురూ ఏమను కొంటారోనని జంకు. అంచేత వీధి తలుపు సగం మూసి సగం తెరచి ఆ సందులో నిలుచొని చూస్తుందెవరికీ అంత కనపడకుండా. అప్పటి కొక కన్ను ఒక చన్ను ఒక చెక్కిలి. ఇంతెందుకు. శరీరంలో ఒక భాగమే కనిపిస్తున్నదట. ఇది ఇలా రవివర్మ లాటి ఒక చిత్ర కారుడు గీచి చూపితే ఎంత మనోహరంగా ఉంటుందో మనసులో ఊహించి చూడండి. మీకే తెలుస్తుంది. ఇది ఇల్లాలి విషయమైతే

మరొక పద్యంలో ఒక వెలయాలి విషయం వర్ణిస్తూన్నాడు చూడండి. దీనికి భిన్నంగా. ఏమాత్రం జంకు కొంకు లేకుండా నిలబడి అది ఎలా చూస్తున్నదో.

**అలరుల బంతి జృంభికకు నడ్డము సేయుచు - కర్ణ పాళిపై కలకలఁ ద్రోయుచుంద రగలౌప్రమదా శ్రులు గోటమీటుచున్ చెలి భుజపీఠి నొత్తగిలి చిల్కను దువ్వుచు వాలుగన్ను గ్రేవల కుదధార చేర నొకవార విలాసిని చూచె రాసుతున్.** ఆవులింత వస్తుంటే దానికడ్డంగా పూలబంతి పెట్టుకొన్నది. మాటి మాటికి ముంగురులు మొగం మీద పడుతుంటే చెవుల వెనక్కి సర్దుకుంటున్నది. ఆనందబాష్పాలు వస్తుంటే గోట మీటు తున్నది. చెలికత్తె పక్కనుంటే దాని భుజం మీద వాలి చేత్తో చిలకను దువ్వుతున్న దట. ఏమి ఒయ్యారం. ఏమి విలాసం. ఏమి హావ భావాలు. ఆనాటి వేశ్యల వ్యవహారమెంత చక్కగా ఒక గొప్ప శిల్పిలాగా అక్షరాల నే శిలలలో చెక్కి చూపుతున్నాడో చూడండి కవిపితామహుడు. జక్కనలాంటి శిల్పకళా కోవిదులకు ఏభంగిమలో ఒక బొమ్మ చెక్కి చూపాలో మౌనంగా బోధిస్తున్నాడా అని తోస్తుంది నాకిలాటి వర్ణనలు చూస్తుంటే.

మనోరమా స్వరోచులకు కళ్యాణోత్సవం జరుగుతున్నది. **అప్పుడు తూర్యముల్మొరయ నమ్మిథునమ్ము విలో కనస్పృహం దెప్పలఁదేల - వంప బడు తెల్లని చీర తెరం గ్రమంబునన్ కొప్పు మొగంబు నఱ్ఱు చనుగొండలు దోఁపల లతాంగి దోచె** అని వర్ణిస్తున్నాడు కవి. ఏమిటీ వర్ణన. ఏమిటర్థం.

పూర్వం మనదేశంలో నాటకాలు ఎలా వేసేవారో ఇప్పుడు చాలామంది యువకులకు తెలియదు. ఆ టెక్నిక్కే వేరు. ఒక భామా కలాపం లాంటిది చూస్తే తెలుస్తుంది. ఒక తెర అడ్డంగా కడతారు. తెర వెనుక ఎంతో కలాపం జరిగిన తరువాత నెమ్మదిగా ఆ తెర దించుతూ పోతారు. నాటకాల్లోనూ అంతే. తెర దించే కొద్దీ పాత్రలూ వారి వేషభాషలూ వారి వ్యవహారమూ ప్రేక్షకులకు క్రమంగా దృష్టిగోచర మవుతూ వస్తుంది. అదే వర్ణిస్తున్నదీ పద్యం. వధూవరుల మధ్య శుభ్రమైన ఒక వలిపం లాంటి తెల్లని చీర పట్టుకొని ఉన్నా రిరువైపులా ఇద్దరు. అది క్రమంగా దించుతూ పోతున్నారు. పోయే కొద్దీ ఆ అమ్మాయి కొప్పు మొగమూ వక్షోజాలూ నడుమూ – ఇలా శరీరావయవాలు బయట పడి వరుడికి గిలిగింతలు పెడుతున్నట్టుంది. అది ఎలా ఉందంటే క్షీరసాగరంలో నుంచి శ్రీమహాలక్ష్మి ఆవిర్భవిస్తూ ఉన్నదట. తెల్లని పాలకడలి కెరటం నుంచి పైకి వస్తున్న ఆ దేవత విగ్రహం చూస్తూ అక్కడ ఉన్న దేవతలూ విష్ణు దేవుడూ ఎలా పరమానంద భరితులై నిలబడి ఉన్నారో అలాగే పెండ్లికి వచ్చిన వారందరూ వారితోపాటు ముఖ్యంగా పెండ్లి కొడుకు స్వరోచి ఆనందిస్తున్నారట. నా విష్ణుః పృధివీపతిః అన్నట్టు అతడూ విష్ణ్వంశ సంభూతుడే కదా. ఆవిడకు వరణీయుడు గాక ఏమవుతాడు. మరి పెండ్లి కుమార్తె సాక్షాత్తూ లక్ష్మీస్వరూపిణి అనే గదా లోకంలో మాట. అదీ సరిపోయిందిక్కడ ఇంతకూ చెప్ప వచ్చేదేమంటే ఇది ఒక శిల్పమన్నా అనుకోవచ్చు. ఒక నాటక మన్నా అనుకోవచ్చు. మహాకవి గారడీ ఏదైనా సృష్టించగలదు మరి. వనదేవత ప్రత్యక్షమైన ఘట్ట మొకటి. శ్రీ మహావిష్ణువు సాక్షాత్కరించిన దొకటి రెండూ రెండే.

Brahmasri Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

రెండు వర్ణ చిత్రాలు. రెండు చక్కగా చెక్కిన రమ్యమైన శిల్ప ఖండాలు. వల్లీమ తల్లి లావణ్యమంతా ఆ వనానిదా - వనదేవతదా. ఏదైనా మనోహరమే. పోతే **నీలమేఘ ముడాలు డీలు సేయగ జాలు మెఱుగు జామన చాయ** మేనితోస్వామివారు కనిపిస్తుంటే ఇక మనకు కావలసిన దేముంది. మొదటి దచేతన ప్రకృతిలో చైతన్యాన్ని నింపి చూపితే కవి - రెండవదానిలో పరిపూర్ణ చేతనుడైన పరమాత్మే అచేతనమైన నామరూపాద్యుపాధులతో కలిసి బయటికి వచ్చి మనలను పలకరించే మరపురాని గొప్ప శిల్పాలివి రెండూ.

చాలు చాలు. ఇంతకన్నా ఎక్కువ వివరిస్తూ పోనక్కర లేదు సహృదయులకు. ఇంకా ఎంత ఉన్నదో అనల్పమైన శిల్ప సంపద కావ్యంలో. తమ పాటికి తామే పోల్చుకొని చూడగలరు. **చాపలాయ ప్రచోదితః** అన్నట్టు కేవలం నా చాపల్యం కొద్దీ ఉండబట్ట లేక కొన్ని ఏకరువు పెట్టానంత మాత్రమే. ఇంతే ననుకోకండి మహాకవి భాండాగారంలో ఉన్న సరకూ సరంజామూ. అక్షయ బాణతూ ణీరమది. లాగే కొద్దీవస్తూనే ఉంటాయి భావాలు. ఇలా సంగీత శిల్పచిత్ర నాట్యాది భంగిమల నక్కడక్కడా కథా సన్నివేశాలలో పొదిగి మనకు ప్రదర్శించటం అల్లసానివారి ఒక అల్లిక అయితే ఇంకొక అల్లకం కూడా గమనించవలసి ఉంది మనకాయన కావ్యంలో. అది ఏదోగాదు. తాను జీవించిన కాలానికి చెందిన ఆచారాలూ సంస్కారాలూ వ్యవహారాలూ వేషభాషలూ వగైరా. కావ్యమంటే ధ్వని ప్రధానంగదా. పెద్దన రాయలవారి జీవితాన్నే భంగ్యంతరంగా చూపుతూ వచ్చాడా ఈ మనుచరిత్రలో ననిపిస్తుంది నాకు. కథానాయకుడైన స్వరోచి

ఆ మాటకు వస్తే కృష్ణదేవరాయలే. స్వరోచి జన్మ దగ్గరి నుంచి వనదేవతా సాక్షాత్కారం వరకూ జరిగిన సన్నివేశాలన్నీ రాయల జీవిత సన్నివేశాలే ఒక విధంగా.

నరసింహ రాయలకు నాగమాంబిక అనే దేవదాసికి జన్మించినవాడు కృష్ణరాయలు. గంధర్వుడు నరసింహరాయలైతే ఆ నాగాంబ ఎవరోగాదు వరూధిని. రాయలు పుట్టి పెద్దవాడయ్యాడో లేదో వారిద్దరూ కనపడరు. అలాగే వరూధినీ గంధర్వులు మాయమయ్యారు. మణి స్వరుచి స్ఫురణతో స్వరోచి రాణించి నట్టే – స్వతంత్రంగా పెరిగాడు రాయలు. **సంయమి సమాజవినిర్మిత జాతకర్మ్ముడూ – నెఱిఁబరి వర్ధి తుడూ ఉపనీతుడూ వివిధాస్త్ర మిద్యలం గఱకరి అయ్యాడు స్వరోచి లాగే. యౌవన దశ వచ్చిందో లేదో – గ్రుద్దున్ గోత్రాచలంబుల్గ లగుల లయిపో – ఖడ్గిం జెండాడు ప్రాకుల్కవుగిటి కొలదుల్ – వాతాద్భు తగతి బఱచున్ భూమి జవ్వాడగా** – ఇది స్వరోచి కసరత్తుగాదు. ఆ వేషంలో రాయల వారి వ్యాయామమే. మరి ఆటవిక సైన్యాన్ని సమకూర్చుకొన్న వాడూ రాయలే. కతి పయాప్త వేష్టితుడూ ఆయనే. అందులోనూ కూరిమి మంత్రితో ఏకతమాడే వాడూ రాయలే. ఆ కూరిమి మంత్రి కావ్యంలో నలకూబరుని మంత్రి. రాయల జీవిత కావ్యంలో అప్పాజీ అని పిలవబడే తిమ్మరుసు.

కావ్యంలో వేటకాంక్షతో బయలుదేరి పోయి మృగాలను వేటాడిన వాడెవడో గాదు. రాయలవారే. ఆయన కోసం తెచ్చిపెట్టిన గుఱ్ఱం అచ్చమైన పారసీ అరబ్బీ దేశా లనుంచి రవాణా అయిన రాయలవారి గుఱ్ఱం. పారసీ

పల్లమని పైఠాణంబు సింగిణి సిరాజీ కరాచురకత్తి అని కంఠోక్తిగానే చెబుతున్నాడు కవి. అక్కడవాడి నవి సగం తెలుగు పదాలైతే సగం ఉర్దూ శబ్దాలు. రాయలనాటి భాష స్వరోచికాలంలో ఎక్కడ ఉంది మీరే చెప్పండి. అంతే కాదు. ఆ మాటకు వస్తే ఉర్దూ మాటలు కుప్పతెప్పలుగా ప్రయోగిస్తాడు పెద్దన. అదీ తనకాలానికి కథాకాలానికి ముడిపెట్టి. ఇది ఒక చిత్రమైన అల్లిక. వరూధిని మాయా ప్రవరుణ్ణి ఎంత అనురాగంతో చూచిందంటే **అగ్రమునం జనంజూచు చూపు తీరై గనుపెట్టె** నంటాడు కవి. చూపు తీరుగా కనపడిందని పైకి అర్థం చెప్పుకోవచ్చు. కాని కవి మరొక అర్థం కూడా మనసులో పెట్టుకొన్నాడు తెలుసా. తీర్ అంటే పారసీలో బాణమని అర్థం. అదీ సరిపోతుందిక్కడ. చూపులను బాణాలతో గదా పోలుస్తారు కవులు. గుఱ్ఱాన్ని వర్ణిస్తూ తరకసమంటాడు. అది తర్కష్ అనేదానికి తెనుగుసేత. అమ్ములపొది అని అర్థం. మంథర పర్వతాన్ని వర్ణిస్తూ అంటాడొకచోట. **కులములో తరితీపు కలిగి మించినమేటి** అని. తరి అంటే తరవటం సముద్రమథనం. తీపంటే అమృతమని పయి మాట. లోగుట్టు ఏమిటో తెలుసా. తర్ తీబ్ అనేది అరబీ శబ్దం. దాని కర్థం గొప్ప పదవి అని. అది తరితపుగా తెలుగులోకి మార్చి ఆ అర్థం కూడా స్ఫురింప జేస్తాడు పెద్దన. **నారాజులల్లార్చు నారసము.** నారాజంటే కోపం. **అలకని జేబులో** – అలక అంటే తేలిక. ఎలా వచ్చిందిది. హల్కా అనే ఉర్దూ మాట నుంచి. పలచని అని అర్థం చెలామణీ అయింది. ఆరజ మంటాడు. ఆరజూ అనే పార్సీ మాటకు తెలుగుసేత. అభిలాష అని అర్థం. ఇలాగే కన్నడ పదాలెన్నో దొర్లాయక్కడక్కడా. **మూరురాయరగండ** కన్నడమే. **హెంబట్టు**

కన్నడమే. మహా విష్ణువు సాక్షాత్కరిస్తే దశావతారాలను వర్ణిస్తూ పోతాడు స్వారోచిష మనువు. అందులో బలరామావతారం వర్ణిస్తూ పగిలి రాకాసి **దేహంబు మొగపు ముత్య - మయ్యె ముంగై మురారి రంగై మురారి** అని ఒక చక్కని ప్రయోగం చేస్తాడు. **ముంగై మురారి** అంటే ముంజేతి కంకణం. **రంగై మురారి** అంటే అలాటి కంకణం లాంటిదై ఓ మురారి ఓ మహావిష్ణూ నీకు ఒక అలంకారంగా భాసించిందని అర్థం. ఇలాగే **నకీబులనిదుము దారులని** ఎన్నో మాటలున్నాయి - ఆయా భాషాంతరీయాలు.

ఇదంతా ఎందుకంటే ఆ నాటి వేషభాష లెలాంటివో చూపటానికి. రాయలూ పెద్దనా వీరందరూ దాక్షిణాత్యులు. కన్నడ తెలుగు తమిళమనే తేడా లేదా రోజుల్లో. అంతేగాక హిందూ రాజ్యం చుట్టూ మహమ్మదీయుల రాజ్యాలున్నాయి. వారితో వీరికి లావాదేవీ. రాయలకైతే పారశీకం అరేబియాల నుంచి వచ్చి రాయబారులు గుఱ్ఱాలు విక్రయించిపోయేవారు. అవి ఎలాంటివో కొంటే మేలో కీడో నిర్ణయించే అభిజ్ఞులు కూడా ఉంటారు కొలువులో. **అనువగు సుళ్ల నొప్పు మలయానిల వాహము** నెక్కి అనే పద్యం చదువుతుంటే ఈ అంశం మనకు బాగా తేలుపడుతుంది. రాయలు బహుభాషాభిజ్ఞుడు. ఆయనకు సన్నిహితుడైన పెద్దనామాత్యుడూ అంతే. ఇంతకూ అసలు విషయానికి వస్తే రాయలు వేటాడేటప్పుడు పెద్దనను కూడా వెంట తీసుకుపోయి ఉంటాడు. ఆటవికులు - వేటకుక్కలు, డేగలు - బోయలు - వారి వేష భాషలు - వారు రాయలవారికి తెచ్చియిచ్చే నక్కకొమ్ములూ ఇఱ్ఱి గోఱజాలు - జున్నులూ పప్పులూ ఇవన్నీ స్వరోచి మీద నెపం పెట్టి రాయల వ్యవహారమే వర్ణించాడు పెద్దన. ఒక పెద్దపులిని

రాయలవారెలా వేటాడుతాడో **గవిలో బెబ్బులి** అనే పెద్దనగారి పద్యం బయట పెడుతుంది. మరి వాయువేగంతో పరుగెత్తే జింక నెలా వేటాడుతాడో **హరిణం బొక్కటి** అనే పద్యం చెబుతుంది. వేటకుక్కలకు వాళ్లెన్ని ముద్దు పేర్లు పెడతారో. **పులియడు బూచిగాడనే** పద్యం చాటుతుంది. ఇలా ఎంతైనా ఉంది వ్యవహారం.

ఇంతెందుకు. మనోరమా స్వరోచుల వివాహ వర్ణన అంతా రాయల వివాహవర్ణనే. అతని స్నానం- రాయల స్నానమే. **మజ్జన మాడెరాజు** అనే పద్యం చదివితే తెలుస్తుంది. **గోవ జవాజులనిగ్గులు** చూపుతున్నాయట- స్నానం చేసే గంధోదకాలు. ఎక్కడో స్వర్గంలో స్నానం చేసే స్వరోచికి గోవాజవాజి ఎక్కడిది - పెద్దనే భూలోకం నుంచి పైలోకాలకు ఎగుమతి చేసి ఉంటాడు. ప్రభాత సంధ్యారాగమెలా ఉందో తెలుసా. వర్ణిస్తున్నాడు వినండి. '**ప్రథమాద్రి సభయందు బఱచిన కెంబట్టు జము కాణం**లాగా ఉందట. ఇది రాయల సభలో బఱచిన Red carpet జముకాణమే సందేహం లేదు. ఇలాటివి చూస్తూ పోతే ఎన్నో ఉన్నాయి కావ్యమంతటా. - అసలు వరూధిని విరహంలో కూడా ఎక్కడ గుర్తు వచ్చిందో కవిగారికి. **గోవధము సేయుతుర కలదైవంబవు నీవు** అనే మాట. Anachronism అంటారు వీటినింగ్లీషులో. ఒక దేశకాలాలకు చెందిన వాటి నంతకు ముందున్న కాలానికి ముడి పెట్టటం. ఇదంతా అల్లసాని వారి అల్లికే.

అసలు రాయలవారికి తిరుమలదేవి - చిన్నమ దేవి అని ఇద్దరు భార్యలేగాదు. వారు పట్టమహిషులైతే ఇంకా ఉన్నారు అవరోధజనం. ఈ బహు భార్యాత్వాన్ని కూడా దెప్పి పొడిచాడు పెద్దన. ఎలాగ. చక్రవాకి

హంసి – ఈ రెండింటికీ జరిగిన సంవాదాన్ని నెపంగా చేసుకొని. అది రాయల వారా మాత్ర మర్థం చేసుకో లేనివాడు కాదు. అయినా గుణదోషజ్ఞు డాయన. హితమైన మాట ఎవరు చెప్పినా వినే సహృదయుడు. పైగా పెద్దన ఆయనకు పరమాప్తుడు. అది హితుడవు చతురవచో నిధివనే సంబోధనలో ధ్వనిస్తూనే ఉంది మనకు. ఆ చనువుతోనే హెచ్చరించి ఉంటాడు పెద్దన. అంతేకాదు. నరసింహరాయలను చూచి ఉంటాడు పెద్దన. ఆయన పాలన అయిన తరువాత రాయలపాలన. ఆయన అనంతరం కూడా కొంతకాలం జీవించాడు తాను. ఇద్దరి జీవితాల మధ్య ఉండి రెంటిలో ఒకదాన్ని ప్రత్యక్షంగా చూపుతూ మరొక దాన్ని పరోక్షంగా ధ్వనింప జేస్తున్నట్టుంది ఒక వర్ణన ఆయన కావ్యంలో. అది ఇనాస్తమయ వర్ణన. ఇనుడంటే ప్రభువనీ సూర్యుడనీ రెండున్నాయర్థాలు. రెండూ ఇక్కడ చెప్పుకొనేలా ఉంది పద్యధోరణి.

**ఇనుడస్త ప్రాప్తుడయ్యెన్ తుదన్** అని ముగుస్తుంది పద్యం. ఏ ఉదయమైనా అస్తమించవలసిందే తుదకు. ఆ ఉదయ మెలాంటిది. **'వికసిల్లం బ్రజచక్ర పాలనము గావించెన్** – సూర్యపరంగా చక్రమంటే జక్కన పక్షులు. రాజపరంగా రాష్ట్రం. **'కరవ్యాపృతిం గకుబంతంబుల నాక్రమించె** కరమంటే కిరణమూ – కప్పమూ రెండూ. **పొసగంగా నేర్చె వర్ణాళి** – వర్ణమంటే చాతుర్వర్ణ్యమనీ – ఏడురంగులనీ అర్థమే. **కాంతికి బాపెంబెల రాజకోటి** – రాజ శబ్దానికి చంద్రుడు – పాలకుడూనని అర్థాలు. **తుద శాంతిబొందె** శాంతి అంటే అస్తమయ మిద్దరికీ సరిపోతుంది. **దైవంబు సేతకుఁదాంబిక**

**నేలనంగ నిను దస్త్రప్రాప్తు**డయ్యెనని వర్ణిస్తాడు. దైవాన్ని ఎవడూ దాటిపోలేడు. అంచేత తాపం దేనికిక. తాపమంటే ఉష్ణమనీ ప్రతాపమనీ రెండర్థాలు. సూర్య భగవానుడిలాగా గొప్ప అభ్యుదయం పొంది చివర కస్తమించాడా మహారాజని గొప్ప వస్తు ధ్వని ఇది కావ్యంలో. ఇలా దేశకాల వస్తు సంపదనంతా భూత భవిష్యద్వర్తమానాలనే తేడా లేకుండా అన్నింటినీ కలిపి ముడివేసి దాన్ని కావ్య కథా వస్తువులో ఓతప్రోతంగా అల్లి తన అల్లిక జిగిబిగి ఎలాటిదో అనన్యా దృశంగా నిరూపించుకొన్నాడు పెద్దనామాత్యుడు. అదే ఈ కవిలో ఉండే గొప్ప విశిష్టత.

అంతా అయిన తరువాత ఒక రహస్యమిప్పుడు బయటపెట్టవలసి ఉంది. ఆముక్తమాల్యద రాయలవారా పెద్దనగారా – ఎవరు రచించారని విమర్శక లోకం తర్జన భర్జనలు పడుతున్నది. నన్నడిగితే అందులో ముప్పాతిక పెద్దనగారి హస్తమే ఉంది. ఒక పాతిక రాయలదైతే కావచ్చు. రాయలేమి తక్కువవాడు కాదు. బహు భాషా కోవిదుడు. కళా హృదయం బ్రహ్మాండంగా ఉన్నవాడు. కాని అంత ప్రౌఢమైన కావ్యం రచించేటంత పాటవ ముందంటే బరవసా పడలేము. నిజంగా అంత కవితా పాటవమున్న వాడే అయితే పెద్దనకవి త్వానికంత మూర్ఛపోనక్కర లేదు. గండ పెండేరం తొడిగి అంత బ్రహ్మరథం పట్టనక్కర లేదు. సర్వసాధారణంగా చూచేవాడు. అలాకాక పల్లకి కూడా తనకేలంబట్టి ఎత్తాడంటే ఏమనుకోవాలి. మరి కవితా ప్రావీణ్య ఫణీశుడని ముక్కుతిమ్మన ఎలా కీర్తించాడంటారా. కవితా

Brahmasri Srinivasa Rao
Yallamraju
www.advaitavedanta.in

ప్రావీణ్య ఫణీశుడేగాని వాణీశుడు కాడు. గొప్ప కవిత్వాన్ని విమర్శించగలడు. అభినందించగలడు. సృష్టించలేడని అందులో ధ్వనిస్తూనే ఉంది. అందుకే పెద్దన కూడా ఆయనను **విద్యాఖేలన భోజ** అని **భోజక్ష్మాపతి విద్యా పరిపాక** అని ఆయన వైదుష్యాన్ని మాత్రమే ప్రశంసించింది. కవిత్వ ప్రావీణ్యాన్ని కాదు. ఇంతకూ రాయలంటే తక్కువ అంచనా వేసి మాటాడుతున్నాననుకోకండి దయ ఉంచి. దాని **తల్లిగ నల్లసాని పెద్దన చెప్పె ముది మదిఁదప్పి యాముక్తమాల్య** మన్నట్టు కొంత వయసు మళ్లిన తరువాత వ్రాశాడు పెద్దనగారా కావ్యం. వయసే గాక వైష్ణవం కూడా ముదిరిందా పాటికి. రాయలకు కూడా ఉంది వైష్ణవాభిమానం. నేనూ కొన్ని పద్యాలు వ్రాస్తనయ్యా అని ఉంటాడు పెద్దనతో. అలాగే కానివ్వండి ప్రభూ అని ఉంటాడీయన. అందుకే కొంత అల్లిక బిగితో అద్భుతంగా కొంత అది సడలి అక్కడక్కడా శిధిలంగా నడుస్తుంది కావ్యం. సహజంగా వినయశీలుడు కాబట్టి రాయలు - ఆశ్వాసాంతంలో దొరలిన కొన్ని మాటల్లో నాదేమీ కాదు అంతా మా పెద్దన గారిదేననే సూచన కూడా చేస్తాడు. **కృష్ణరాయనృప సంజ్ఞాస్మ దాముక్త మాల్యద** అనే మాటలో ఉందా గూఢార్థం. రాయలని పేరేగాని ఆ పేరుతో సాగింది చాలావరకు నా రచనే సుమా అని ధ్వనించటం లేదూ మనకు.

అసలు **ఖనటత్వయోబ్ధి లలితో ద్యాన పరంపరా - కోరకిత నాళికేర- సవల యధ్వని తలఁబక్ష ఛ్ఛట - సాయంకాలములన్ - పొలయున్**

**గాడ్పులు - అందుండున్ ద్వయసద్మ - అనిష్ఠా నిధి - తారు ణ్యాతిగ - పరిపక్వ సురభి - స్వామీ నన్ను - గృహ సమ్మార్జనమో - శరదిందు చకచక - అద్ధావాగ్వి ఋధమ్ - అద్దమ రేయద్దా సరి -ఎలనీటి బొండలంబులు గండా భోగములన్ - నఖము ఖోజ్ఝిత** - ఇలా ఎన్నని చెప్పమంటారు. అన్నీ మణులూ మాణిక్యాలే. ఇలాంటి విలువైన రత్నాలు ఒక్క పెద్దనగారి గనిలో తప్పమరే కవి గనిలోనూ మనకు దొరకవు. అందులోనూ సంస్కృతాంధ్ర పద సమ్మేళనా రూపమైన ఆ మణి ప్రవాళశైలి ఆయన ఒక్కడి సొమ్మే. రాయలకేమిటి. ఎవరికీ అవి అందే ద్రాక్షగుత్తులు గాదు. ఇంతెందుకు. తరుచుగా వాడే కొన్ని శబ్దాలు చూచినా తెలుస్తుంది మనకిది పెద్దన రచనేనని. **ఖనటత్తనే** మాట - **చకచక** అనేమాట - **జరఠ** అనేమాట - **ఆభోగ** అనేమాట **రహి** అనే మాట రెండు కావ్యాల్లో ఎన్నిచోట్లనైనా తరుచుగా కనపడతాయి మనకు. పెద్దన కిష్టమైన మాటలవి. బింబ ప్రతిబింబ న్యాయంగా మక్కికి మక్కిగా నడచినవెన్ని ఉన్నాయో లెక్కలేదు. మచ్చుకొకటి చూపుతా. **ఖనట త్పయోబ్ధి వీక్ష్యరసాత లాన్యోన్య పిండీ కృతాంగ భీతాండ జములు** - ఇది ఆముక్తమాల్యద. **రవిబింబ పతన దీర్ణ పయోధి గర్భనిర్గత శేష ఫణి ఫణారత్న రుచియొ** - ఇది మను చరిత్ర. ఇలాంటివెన్నో. గ్రంథవిస్తర భయంతో ఏకరువు పెట్టటం లేదు నేను. అసలు కావ్యారంభంలో పద్యాలు చాలా వరకవే. కొద్ది మార్పుతో పెద్దన్నవే. చూడండి మీకు తెలుస్తుంది. **పణ్యారంపు పుణ్యంపు కంపులలాంటి** మాటల పొందిక కేవలం పెద్దనగారిదే. **పరి పరి విధంపు జన్నంపు**

**పరికరంపు** అని ఈ పూర్ణ బిందుపూర్వక పువర్ణ ప్రాచుర్య మాయన ముద్ర. ఇలా లోతుకు దిగి చూడాలేగాని ఆముక్త కావ్యరచన కూడా పెద్దనామాత్యునిదే. రాయలవారి చేయి పుచ్చుకొని అక్కడక్కడా ఆ మహారాజు ముచ్చట తీర్చటానికి కొన్ని పద్యాలు వ్రాయించి ఉంటాడు సందేహం లేదు. నాయీ మాటలు చాలామంది విద్వాంసులూ విమర్శకులూ భరించ లేకపోవచ్చు. దానికి కారణం చాలాకాలం నుంచీ వస్తు న్న జనశ్రుతి కొంతా – మరికొంత కావ్యాలు రెండూ బాగా పోల్చి తలస్పర్శిగా చూచే ఓపిక లేకపోవటం కొంత. ఇది కొద్దిమంది సహృదయులూ సదసద్వివేక సంపన్నులూ కూచొని చర్చించుకోవలసిన విషయం. మొత్తానికి కవి చౌడప్ప చెప్పినట్లు పెద్దన పెద్దనే. ముఖ్యంగా పద్య గద్య నిర్మాణ మార్మికతలో అందరికన్నా పెద్దనే. ఇంతకన్నా నేను పెద్దగా అనవలసిందేమీ లేదు. వినవలసింది లేదు.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# ముక్కు తిమ్మనార్యు ముద్దు పలుకు

అల్లసాని వారి అల్లిక జిగిబిగి అయింది. పోతే ఇక ముక్కు తిమ్మన గారి ముద్దు పలుకెలాంటిదో ఆలకించవలసి ఉంది మనం. ఇవి రెండూ ఏదో లోక సామెతగా మొదటి నుంచీ వింటున్న మాటలే అయినా– నూటికి నూరు పాళ్లూ సార్ధకమైన మాటలు. నిప్పు లేనిదే పొగ రాజదన్నట్టు ఏదో విశిష్టత లేనిదే ఇలాంటి మాటలు వాడుకలోకి రావు. అందులో మన మల్లసాని వారి అల్లిక ఎంత బిగువైనదో ఎంత మెఱుగైనదో అది ఎంత సార్థకమైనదో యధాశక్తిగా పరామర్శించి చూచాము. అలాంటి సార్థకత్వమే ఇప్పుడీ తిమ్మన గారిలో కూడా ఎంతవరకుందనే విషయం సవిమర్శంగా చూడవలసి ఉంది.

అసలు ముక్కు తిమ్మన అని పేరేమిటి. ఆయన పేరు ముక్కు తిమ్మన గాదు. నంది తిమ్మన. నంది సింగయ ఘంట మల్లయ అని ఇద్దరు జంట కవులుండే వారంతకు ముందు. వరాహ పురాణ మాంధ్రీకరించారు

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

వారిద్దరూ కలిసి. అది చాలా గొప్ప ప్రబంధమే. అందులో నంది సింగయ కుమారుడే సాక్షాత్తూ ఈ మహాకవి. తానే స్వయంగా చెప్పుకొన్నాడా శ్వాసాంత గద్యలో **'నంది సింగయామాత్య పుత్ర కౌశిక గోత్ర పవిత్ర'** అని ముక్కు తిమ్మనని ఎక్కడా చెప్పుకోలేదు. నంది తిమ్మయననే పేర్కొన్నాడు. మరి ముక్కు తిమ్మన అని పేరెందుకు వచ్చింది. ముక్కు మీద ఒక చక్కని పద్యం వ్రాశాడని అది భట్టుమూర్తి అంతవాడాయన వద్ద కొని తన వసుచరిత్రలో కెక్కించాడని లేనిపోని కబుర్లు చెబుతారు కొందఱు. అది చాలా పేలవమైన ప్రసంగం. నన్నడిగితే అదీ ఒక ముద్దు పలుకే. ఆయన ముక్కు కోటేరు వేసినట్టు చాలా చక్కగా నాజూకుగా కనపడుతూ వచ్చింది నలుగురికీ. అంచేత ముద్దుగా ఆయనను ముక్కు తిమ్మన అని పిలుస్తూ వచ్చారు.

ముక్కేగాదు. ఆమాటకు వస్తే ఆయన వాక్కు కూడా అసలెంతో ముచ్చట గొలిపే వాక్కు. ముద్దూ ముచ్చటా అని లోకులందరూ అనే మాట. ఏ దృష్టితో చూచినా ఎందులోనూ లోపం లేకుండా అంతా చక్కగా కుదిరిన సందర్భమేదైనా చూస్తే ప్రతి ఒక్కరూ ఏమంటారో చెప్పండి. అబ్బా ఎంత ముద్దుగా ఉందిది ఎంత ముచ్చటగా ఉంది అంటారా లేదా. అలాగే మహాకవి కావ్యం కూడా అంత ముద్దూ ముచ్చటగానే ఉంటుంది సందేహం లేదు. ఏమిటీ మహాకవి కావ్యం. రసజ్ఞ లోకానికి తెలియనిది గాదది. పారిజాతాపహరణం. ఇది తప్ప మరి ఒక కావ్యమేదీ వ్రాసినట్టు దాఖలాలేదీ మహాకవి. కాని ఏమి తక్కువ. ఒక్కటైనా ఇది వజ్రంలాంటిదీ కావ్యం. సర్వాంగ సుందరం. సర్వలక్షణ లక్షితం.

అష్ట దిగ్గజాలెవరో మనకంతగా తెలియకపోయినా రెండు దిగ్గజాలు మాత్రం రాయలవారికి చాలా సన్నిహితమైనవే. స్నేహపాత్రమైనవే. ఒకరు పెద్దన మరొకరు తిమ్మన. వీరిద్దరూ రాయల ఆస్థాన కవులే. రాయలకు కుడిభుజం ఎడమ భుజంలాంటి వారే ననటానికి వేరే సాక్ష్యమక్కర లేదు. ఇద్దరూ తమ కావ్యాలు రాయలకే అంకితమిచ్చారు. అందులో కృతిపతి వంశాన్నీ ఆయన గుణగణాలనూ చిలువలు పలువలు పెట్టి కీర్తిస్తూ వచ్చారు. అందులోనూ రాయల వారికి పెద్దన గారొక విధంగా అయితే తిమ్మన గారింకొక విధంగా అభిమాన పాత్రుడు. అమ్మగారు అంటే రాణీగారి ద్వారా ఇంకా ఎక్కువ అభిమానాన్ని చూరగొన్నవాడు. రాణీ చిన్నమదేవి అరణపు కవి తిమ్మరాజంటే.

అంచేత రాయల అంతఃపురంలో చనువెక్కువ. తద్వారా రాయలతోనూ చనువే. రాయలకూ తిమ్మన అంటే ఎక్కువ మక్కువే, అది మనకీ కావ్య మడుగడుగునా ప్రత్యక్షమవుతూనే ఉంటుంది. పెద్దనలాగే తిమ్మన కూడా రాయల వంశాన్నీ రాయల దిగ్విజయాలనూ అద్భుతంగా వర్ణించాడు. అంత మాత్రమే గాదు. పెద్దన కన్నా ఒక అడుగు ముందుకు వెళ్ళి కృష్ణరాయలకూ తన కావ్యానికి నాయకుడైన కృష్ణస్వామికీ అభేదాన్ని భావించి కావ్యారంభం నుంచి కావ్యాంతం దాకా ఎవరి చరిత్ర అయిందీ పోల్చుకోలేని విధంగా ఓతప్రోతం చేసి రచిస్తూ పోయాడు కావ్యాన్ని. కావ్యమంతా ఈ భావం పరోక్షంగా ధ్వనింప చేస్తూ ఉపోద్ఘాతంలో దాన్ని ప్రత్యక్షంగానే బయటపెట్టట మింకా గడుసుదనం. చూడండి ఈ పద్యాలు మీకే తెలుస్తుంది.

Yalamanchili Srinivasa Rao
www.andhrajyothy.in

యాదవత్వమున సింహాసనస్థుడు గామి
సింహాసనస్థుడై చెన్నుమెఱయ
గొల్ల యిల్లాండ్రతో గోడిగించుటఁజేసి
పరకామినీ సహోదరతఁజూప
మఱి జరా సుతునకై మధుర డించుటఁజేసి
పరవర్గ దుర్గముల్బలిమి గొనగ
పారిజాతము నాసపడి పట్టి తెచ్చుట
నౌదార్యమున దాని నడుగు పఱుప
గోరి తొలుమేనఁదనకైన కొదవ లెల్ల
మాన్పుకొన వచ్చి భువనైక మాన్యలీల
నవతరించిన కృష్ణుఁడే యనగ మించె
నరస విభు కృష్ణరాయ భూనాయకుండు

విన్నారా తిమ్మనగారి వర్ణన. కృష్ణుడే అవతరించాడట మరలా కృష్ణదేవరాయలుగా. ఎందుకని. ఇంతకు ముందు యదువంశంలో పుట్టినందు కాయనకు రాజ్యాధికారం లేదు. అది ఒక కొఱత. అప్పుడు గొల్లభామలతో క్రీడించాడన్న అపప్రథ ఉండేది అది ఒక లోపం. జరాసంధుడి దండయాత్రలు భరించలేక అప్పుడు మధుర వదిలేసి పోవలసి వచ్చింది. అది ఒక కొదవ. పోతే పారిజాత వృక్షం స్వర్గం నుంచి దొంగిలించి తెచ్చాడని ఒక అపకీర్తి ఉండేదప్పుడు. అదీ ఒక నేరమే. ఇలాంటి ఈ నాలుగు కళంకాలూ కృష్ణావతారంలో ఏర్పడ్డవాటిని సరిదిద్దుకోటాని కిప్పుడు

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

కృష్ణరాయలుగా అవతరించాడట. ఎలాగా. ఇప్పుడు సింహాసనస్థుడయి రాజ్యాధికారం సంపాదించాడు. పరస్త్రీల యెడల సోదర భావంతో మెలుగుతున్నాడు. మథుర పోగొట్టుకొన్నా పరదుర్గాలనెన్నిటినో సాధించాడు. పారిజాత మపహరించినా తన వితరణ మహిమతో దాని దానగుణాన్ని అతిక్రమించగలిగాడట. ఎంత అద్భుతంగా ఉందో చూడండీ వర్ణన. అతిశయోక్తి అనిపించటం లేదు. పైగా పారిజాతమనే మాటతో తన కావ్యవస్తువును భంగ్యంతరంగా ఎలా సూచిస్తున్నాడో చూడండి కవి. **'నావిష్ణుః పృథివీపతిః'** అనే అభియుక్తోక్తి కనుగుణంగా కూడా ఉందీ వర్ణన. పోతే మరో పద్యం.

**చక్రవర్తి మహా ప్రశస్తి నాడును నేడు**
**చెలగి ధర్మక్రమ స్థితి ఘటించె**
**భూభృదుద్ధరణ విస్ఫూర్తి నాడును నేడు**
**గోరక్షణ ఖ్యాతిఁ గుదురు పతిచె**
**సాధుబృందావన సరణి నాడును నేడు**
**వంశాను రాగంబు వదలడయ్యె**
**సత్యభామా భోగసక్తి నాడును నేడు**
**నాకల్ప మవని నింపార నిల్పె**
**నాడు నేడును యాదవాన్వ యమునందు-**
**జనన మందెను వసుదేవ మనుజ విభుని**
**కృష్ణుడను పేర నరసేంద్రు కృష్ణ దేవ**
**రాయడను పేర నాది నారాయణుండు**

ఇది ఇంకా అపూర్వమైన వర్ణన. కృష్ణావతారంలో దొర్లిన లోపాలు సవరించుకొనే ప్రసక్తి కూడా లేదిక్కడ. అసలు లోపమే లేదు కృష్ణమూర్తికి. కాకపోయినా పరిపూర్ణావతారం గదా అది. లోపమెలా ఉంటుంది. పరిపూర్ణం గనుకనే రాయల లాంటి రాజన్యులకు కూడా అది ఆదర్శం. కృష్ణదేవుని గుణాలే పుడికి పుచ్చుకొని వచ్చాడు కృష్ణరాయలు. ఎలాగ. ఆయన చక్రవర్తి అయి ధర్మస్థితి కాపాడితే ఈయనా అలాగే చేశాడు. చక్రమంటే అక్కడ సుదర్శన మిక్కడ రాష్ట్రం. ధర్మస్థితి అక్కడ ధర్మారాజాదుల స్థితి. ఇక్కడ ధర్మపాలన. భూభృదుద్ధరణ. తద్ద్వారా ఆయన గోరక్షణ చేస్తే – భూభృత్తులంటే రాజులు. వారిని జయించి గో అంటే భూమి. దాన్ని కాపాడాడీ రాయలు. మరి సాధు బృందావనంలో తిరుగుతూ వంశంతో ఆయన గానం చేస్తే ఈయనా సాధు బృందాన్ని కాపాడుతూ రాజవంశం మీద అభిమానం చూపుతూనే ఉన్నాడు. మరి సత్యభామ మీది అనురాగంతో ఆయన గారా కల్పకాన్నే భూమిమీదికి తెచ్చి నిలిపితే ఈయనా నిలిపాడు సత్యమనే కాంతిలక్ష్మి మీది ఆసక్తిని బ్రహ్మకల్పందాకా ఈ భూమండలం మీద. చూడండి. ఇద్దరికీ ఉన్న గుణసామ్యమీ పద్యం ద్వారా ఎలా చూపుతున్నాడో కవి. అందులోనూ ఆయా శబ్దాలలో అప్రయత్నంగా దొరలిన శ్లేష చూడండి ఎంత మనోహరంగా ఉందో. అంతేగాక ఇంతకు ముందు పారిజాతమనీ ఇక్కడ సత్యభామాసక్తి అనీ– ఈ రెండు మాటల నెపంతో కావ్యకథా వస్తువును చూడండి ద్విగుణీకృతంగా బయటపెడుతున్నాడా లేదా. అదీ రెండు వర్ణనల ద్వారా ఎంత ముద్దుగా ఎంత ముచ్చటగా సాధించాడో చూడండి మహాకవి. ముక్కు తిమ్మన ముద్దు పలుకంటే ఇది. పెద్దన కవి కూడా వర్ణించాడు గాని కృష్ణరాయల నింత

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ముద్దుగా వర్ణించలేదాయన కూడా. **'తొలగెను ధూమకేతు క్షోభజనుల'** కని వ్రాసిన పద్యంలో ఆయనా కృష్ణునితో కృష్ణరాయల కభేదాన్ని శబ్ద శ్లేష ద్వారా సూచించాడు గాని. తిమ్మన కవి ముద్దు పలుకు దగ్గర అది కూడా బలాదూరే. ఆ మాటకు వస్తే ఇక్కడే గాదు. ఎక్కడైనా శ్లేష వాడాడంటే తిమ్మన– అది అప్రయత్నంగా దొరలినట్టుంటుందే గాని– తెచ్చిపెట్టుకొన్న ట్టుండదు. అందులోనూ ముద్దు లొలుకు తుంటుంది. అది ఇంకొక విశేషం. చూడండి ఈ శ్లేషలు. శ్లేష అంటే శ్లేష కాదంటే కాదు.

**కుంతలేశ్వరుడు సిక్కుపడంగ–** కుంతలాలు చిక్కుపడక ఏమవు తాయి– **పారశీకునకు దుర్భ మానవత్వంబు తొలగించె** మానవుడికి మానవత్వం తొలగిందట. మానవత్వమంటే అభిమాన గుణమని మరో అర్థం. **ఉదయాద్రి వేగ యత్యుద్ధతి సాధించె– వినుకొండ మాట మాత్రనహరించె–** వినే లక్షణమున్నది మాటనెందుకు హరించదు– బెల్లము **కొండ యచ్చెల్లఁ జెటిచె–** అది బెల్లమే గదా. బెల్ల పచ్చులు తుంచితే ఏమవుతాయి చెడక. **కంబంబు మెట్టు గ్రక్కన గదల్చె.** ఎంత కంబమైనా గట్టిగా కదిపితే కదలదా మరి. చూచారా. కావాలని రెండర్థాలు చూపుతున్నట్లుండదు తిమ్మనగారు ప్రయోగించే శబ్దాలు గమనిస్తే. అవలీలగా అవి మనకు స్ఫురించటమే గాక అందులో లోకులందరూ వాడే పలుకు బళ్లు సామెతలూ కూడా ఎలా చోటు చేసుకుంటాయో గమనించారంటే ఇంకా ముద్దుగా ఉన్నట్టు తోస్తుందాయనగారి ధోరణి. ఇంతెందుకు ఈశ్వర రాయల నాయన ఒక పద్యంలో వర్ణించాడు చూడండి ఆ పద్యభావమెలా నడుస్తుందో.

Yalamanchili Brahmasri Jijnasa www.advaitavedanta.in Rao

**తామస వృత్తి లేదు సతతంబును నుగ్రుడు గాదు- పౌరుషం**
**దేమియు వెల్తిగాదు- తనకెందును బైమతి రాజు లేదు- సం**
**గ్రామము నందు నొక్క నరుగాసికి వాసిదొలంగ - డీశ్వర**
**క్ష్మామహిళా మనోహరుని సాటియె యీశ్వరు డెన్ని భంగులన్**

అక్కడ కృష్ణా భేదంతో రాయలను వర్ణిస్తే ఇక్కడ ఈశ్వరా భేదంతో ఈశ్వర రాయలను వర్ణిద్దామనుకొని కూడా మరి ఈశ్వరుడిలో ఈ లోపాలున్నాయే నన్నెలా వర్ణించమంటారని అడుగుతున్నాడు మహాకవి. ఏమిటది అంటే ఏకరువు పెడుతున్నాడు. తామస ముంది ఈశ్వరుడిలో. తమోగుణ ప్రధానుడు గదా శివుడు. అది ఈ రాజుగారిలో లేదు. తామసమంటే నిద్రాణత్వం. అలసత్వం. అలాంటి అవలక్షణం లేదట. సతతంబును నుగ్రుడు కాదు. ఉగ్రత్వమంటే కోపోద్రేకం. అది శివుడికి మారుపేరు. అలాటి ఉగ్రత్వమీ రాజుకు లేదు. మరి పౌరుషం కొఅత పడ్డది శివుడికి. అర్ధనారీశ్వరుడు గదా. పూర్ణ పురుషత్వమెక్కడది. మరి ఈ రాజుగారికో పౌరుషం పరిపూర్ణంగా ఉంది. పోతే ఆయనగారి నెత్తి మీద ఒక రాజున్నాడు- రాజంటే చంద్రుడు. చంద్రశేఖరుడు గదా శివుడు. ఈ రాజుకు పైన మరొక రాజు లేదు. అంతేగాక యుద్ధంలో ఒక నరుడి ధాటీ కోహటించాడా శివుడు. నరుడంటే అర్జునుడు. ఒక్క నరుడి కాయన కిందు మీదయితే ఈ రాజు కలాటి గొడవ లేదు. ఎంతమంది నరులకైనా జవాబు చెప్పగలడు. అలాంటప్పుడా ఈశ్వరుడీ ఈశ్వరుడికి సాటి ఎలా కాగలడు. చూడండి. శ్లేష అయినా ఎంత ముద్దుగా ఉందో తిమ్మనగారిది. మరి పెద్దనగారికి కూడా లేదింత చాకచక్యం శ్లేష కవిత్వం చెప్పటంలో. కొంత ప్రయత్నం కనపడుతుందక్కడ.

ఇంతకూ చెప్పవచ్చేదేమంటే ఆయా దేవతాంశలతో- ముఖ్యంగా విష్ణ్వంశతో జన్మించినవాడు కృష్ణదేవరాయలంటే తిమ్మకవి దృష్టికి. విష్ణ్వవతారాలలో కూడా కృష్ణావతార మన్నిటి కన్నా పరిపూర్ణం పరమాద్భుతం. అన్ని కళలకు ఆలవాలమది. నిత్యమూ మందస్మిత సుందరవదనమది. తిమ్మనవంటి ఒక కళాకారుని హృదయాన్ని ఆ మూర్తి ఆకర్షించటంలో ఆశ్చర్యం లేదు. వీరశృంగారాలను రెండింటినీ అభినయించే ఆరూపం తన ప్రభువైన కృష్ణరాయలలో దర్శించాడా కవి. దర్శించినా దాని నలాగే ఆవిష్కరిస్తే మరలా సుఖం లేదు. అది ఒక చారిత్రక కావ్యమవుతుందే గాని ధ్వని ప్రధానమైన మహాకావ్య మనిపించుకోదు. అలా అనిపించు కోవాలంటే రాయలతోపాటు తోడి రసజ్ఞలోకాని కాయన రసధ్వని ప్రధానంగానే తీర్చి దిద్దాలి తన ప్రబంధాన్ని. అంచేత కృష్ణదేవరాయల నాయన కృష్ణదేవునిలోనే దర్శించి కృష్ణరాయల జీవిత వృత్తాంతాన్నే కృష్ణావతార కధావస్తువుగా రాయలనే కృష్ణుడనే కధా నాయకుడిగా రాయల ముద్దుల రాణి చిన్నమదేవినే కృష్ణుని ప్రియభామిని సత్యభామగా - పట్టమహిషి తిరుమలదేవినే అష్టమహిషులలో పెద్దదైన రుక్మిణీ దేవిగా మిగతా అంతఃపుర కాంతలనే మిత్ర విందాది షోడశ రాజకన్యలుగా ఇరువురి జీవితాలకూ ఒక గొప్ప లంకెపెట్టి గొప్పగా రచించాడీ పారిజాతాపహరణమనే ప్రబంధాన్ని తిమ్మకవి. అంతా చెప్పారు బాగానే ఉంది. మరి నారద మహర్షి ఎవరని మనమడిగితే మనకు వినీ వినపడకుండా ఏదో గొణుగుతున్నట్టు తోస్తుంది నాకు. ఆ నారదుడెవరో గాదు తానేనని. **'చక్రఘోషమున నించుక యించుక గాని యంత యేర్పడ వినఁగాని నీవయని పల్కిన యట్టులు తోఁచు భామినీ'** అని శ్రీనాధుని హంసి అన్నట్టు సవసవగా అంటాడా మాట తిమ్మకవి.

ఇలా తన నాటి చరిత్రనూ ఆలనాటి పురాణ చరిత్రనూ అనూహ్యంగా ఒకదానితో ఒకటి ముడిపెట్టి ఆ కుటుంబ గాధను భావితరాల వారికి దాంపత్య జీవితమనేది ఇలా ఉండాలని నిర్దేశిస్తూ ఎంత ముచ్చటగా సాధించాడో చూడండి కాలైక్యాన్ని Unity of time మహాకవి. దేశైక్యమంటారా Unity of place. ద్వారకలో ప్రారంభమై కథ మధ్యలో ఊర్ధ్వలోకాలన్నీ తిరిగి ద్వారకా నగరంలోనే సమాప్తమవుతుంది. ఇక వస్త్వైక్యమంటారా Unity of plot పాత్రల వ్యవహారాన్ని బట్టి ఉంటుందది. ఈ కథలో ముగ్గురే ముఖ్యమైన పాత్రలు. కృష్ణుడు సత్యభామ నారదుడు. ఈ ముగ్గురే కనిపిస్తుంటారు మనకు కావ్యమంత మయ్యేదాకా. స్వర్గ యానమూ అక్కడ దేవేంద్రాదులూ మధ్యలో వచ్చి మధ్యలో నిష్క్రమిస్తారు. అదైనా పారిజాత వృక్షం స్వర్గంలో ఉంది కాబట్టి దాన్ని భూలోకానికి తెచ్చే సందర్భంలో వచ్చిందా వృత్తాంతం. పోతే రుక్మిణి మొదలైన మిగతా అంతః పుర కాంతలు – ధర్మరాజాదులైన బంధువర్గమూ పుణ్యకవ్రత సందర్భాన్ని బట్టి ప్రస్తావనకు వచ్చింది. అందులోనూ రుక్మిణి సత్యాదేవి ఆగ్రహానికి నిమిత్తంగా తేవలసి వచ్చిన పాత్ర. ఇక నారదుడు సరే సరి కావ్య మాసాంతమూ కృష్ణనారదులాడిన నాటకమేగా ఇది. ఇలా కథానాయకుడు కృష్ణుడైతే నాయిక సత్యభామ అయితే– ప్రతి నాయకుడు తాత్కాలికంగా దేవేంద్రుడైతే– ప్రతి నాయిక రుక్మిణి అయితే నాయికా నాయకుల మధ్య ఒక నర్మ సచివుడుగా పాత్ర పోషించాడ నారద మహర్షి ఒక విదూషకుడి లాంటి వాడైతే ఇక వస్త్వైక్యానికి లోపమే ముంది కావ్యంలో. ఇలాటి వస్త్వైక్యం సోముని హరివంశం దగ్గరి నుంచి శ్రీనాధుడేమిటి పెద్దన ఏమిటి. ఎవరి కావ్యంలోనూ మనకు కానరాదు. ఒకే నాయకుడు ఒకే నాయిక – ఒకే

సచివుడు – వీరి చుట్టే తిరిగే కధావస్తువే లేదు ఎక్కడా గూడా. బహుశా నాకొకటి తోస్తుంది కొంచెమాలోచిస్తే. పెద్దన కాళిదాసు రఘువంశాన్ని ఆదర్శంగా భావించి అనుకరిస్తే – ఆయన కుమార సంభవాన్ని మనసులో పెట్టుకొని ఉంటాడు తిమ్మన. రఘువంశంలో రాజులనేకమంది. వారి వంశం మాత్రమొకటే. అయినా ఎవరి వృత్తాంతం వారిదే. కుమార సంభవ కథ అలా కాదు. అంతా పార్వతీ పరమేశ్వరుల చరిత్రే. అలాగే పారిజాతాప హరణంలో చివరిదాకా సత్యాకృష్ణుల చరిత్రే. అక్కడ వారి దాంపత్య సుఖానికి సంధాతలు సప్త మహర్షులయినట్టే ఇక్కడ నారద మహర్షి అనుకోవచ్చు.

అసలు నారద కృష్ణులంటేనే చాలు. ఎంతో వినోదదాయకంగా ఆహ్లాదకరంగా ఉంటుంది వారి అన్యోన్య వ్యవహారం. ఇక సత్యాకృష్ణులంటారా అది శృంగారానికి పరాకాష్ఠ. అందులో విప్రలంభమైనా మనోహరమే మరొకటైనా రమణీయమే. ఇంత ముచ్చట గొలిపే పాత్రలూ వారి మధ్య నడచిన వ్యవహారమూ ఒక కధా వస్తువుగా స్వీకరించి దాన్ని ఎంతో ముద్దులొలికే భావాలతో భాషతో ఎంత ముగ్ధమనోహరంగా తీర్చిదిద్దాడో తిమ్మకవి చెప్పనలవి కాదు. ఇంతా చేస్తే ఇది ఒక చిన్న కుటుంబ గాథ. భార్యాభర్తల మధ్య జరిగిన పొరబాటు. దాన్ని సరిదిద్దుకోటమూ. మరలా ఇద్దరూ చెట్టపట్టలు వేసుకొని విలాసంగా కాలం గడపటమూ ఇంతే కథ. ఇది అయిదాశ్వాసాలలో దాదాపు అయిదువందల పద్యాలలో చిలువలు పలువలు పెట్టి సాగదీసి విసుగు పుట్టకుండా ఇంత రసవంతంగా కవి తన కావ్యాన్ని నడిపాడంటే ఎంత గొప్ప. అందులోనూ ముందుగానే చూపించాడు తన రచనా ప్రణాళికనంతా ఒక పద్యంలో తిమ్మరాజు. రాయల వారిని కీర్తించే పద్యాలలో ఒక పద్యంలో గుప్తంగా దాచాడా భావాన్ని ఆలకించండి.

Yallamanchili Brahmaji / www.advaitavedanta.in

'ప్రతివర్ష వసంతోత్సవ – కుతుకాగత సుకవి నికర గుంభిత కావ్య
స్మృతి రోమాంచ విశంకిత – చతురాంతః పుర వధూ ప్రసాదనరసికా

ఈ పద్యమేదో ఆపాతతః వ్రాసినట్టు కనిపిస్తున్నా అది పైకే. లోనికి దిగి చూస్తే ఆసుకవి ఎవరో గాదు తానే. ఆయనచేత గుంభితమైన కావ్యం తన పారిజాతహరణ కావ్యమే. అది స్మరించి పులకితుడైన కృష్ణరాయడెవరో గాదు శ్రీ కృష్ణుడే. ఆ పులకిత శరీరం చూచి శంకించిన అంతఃపుర కాంత ఎవరో గాదు. సత్యభామే. ఆవిడను ప్రసాదన మంటే బ్రతిమాలటం. అందులో రసికత్వమున్న వాడెవరు కృష్ణుడు కాదు. ఆ వేషంలో ఉన్న కృష్ణరాయలే. చూడండి. పారిజాత కథా వృత్తాంత మంతటికీ కేంద్ర బిందువేదో అది ఒక నాందీ పద్యంలో నాటక వృత్తాంతమంతా సూచించినట్టు ఎలా సూచిస్తున్నాడో మహాకవి. అదీ ఎంత గుంభనగా ఎంత ముచ్చటగా ఉందో అనుకొనే కొద్దీ ఆనందం. ఈ పద్యం తిమ్మన సభలో చదువుతుంటే రాయలు లోలోపల ఎంత మురిసిపోయి ఉంటాడో. రసజ్ఞులైన కవులెంత సంతోషించి ఉంటారో. మరి అంతఃపురంలో రాణీ గారికి చదివి వినిపిస్తుంటే ఆవిడ ఎంత అభినందించి ఉంటుందో నంది తిమ్మనగారిని. సారస్వతాభి నంది గదా నంది తిమ్మన అంటే.

పోతే ఇక జాగు చేయకుండా ఈ నేపథ్యంలో తిమ్మనగారి ముద్దు పలుకెలాంటిదో ఆయన కావ్యమంతా గాలించి చూడవలసిన బాధ్యత ఉంది మనకు. చూద్దాం. కావ్యమనేది ప్రఖ్యాత మనీ ఉత్పాద్యమనీ మిశ్రమనీ మూడు విధాలు. ఇది కేవలం ప్రఖ్యాతం కాదు. కేవలం ఉత్పాద్యం గాదు. మిశ్రం. మనుచరిత్ర ఎలాగైతే మార్కండేయ పురాణంలోని కథ తీసుకొని

రచించాడో పెద్దన - అలాగే తిమ్మన కూడా హరివంశ పురాణ కథను తీసుకొని ఈ కావ్యం రచించాడు. కాని ఇద్దరూ మక్కీకి మక్కీగా గాక ఎన్నో కల్పనలూ వర్ణనలూ జోడించి తమ కావ్యాలను సర్వాంగ సుందరంగా దిద్దారు. అది పెద్దన రచన చూచాము. ప్రస్తుతం తిమ్మన రచన కూడా అలాగే సాగింది. అంతేకాదు. ఇంకా ముద్దుగా ముచ్చటగా సరదాగా సాగింది. కృష్ణ నాయకంగదా ఇది. కృష్ణుడంటేనే విలాస పురుషుడు. జగన్నాటక సూత్రధారి. ఆ సూత్రధారికి మారిషుడి లాంటివాడు నారదుడు. ఇంకేమి. మూడు పూలు ఆరుకాయలు. అయిదాశ్వాసాల ప్రబంధమని పేరేగాని కవి దీన్ని చిత్రించిన తీరు చూస్తే అయిదంకాల నాటకమిది. ఎక్కడికక్కడ తెర పడుతుంటుంది. లేస్తుంటుంది. పాత్రలు లేకుండా కథ లేదు. పాత్రల హావభావాలూ మాటలూ చేష్టలే కథ అంటే. ఇందులో పాత్రలందరూ కాలాంతకులే చెలికత్తెలతో సహా. రాబోయే దేదో ముందుగా తెలుసు ప్రతి ఒక్కరికీ. తెలిసి కూడా తెలియనట్టు నటిస్తారు. ఎందుకు. తరువాత ఏమి జరుగుతుందో చూదామని. ఇది ఒక Suspense. ఈ Suspense చాలా ముచ్చట గొలుపుతుంది.

చూడండి. కథానాయకుడు శ్రీకృష్ణుడు పదహారువేల మంది కన్యలను పెండ్లాడాడు. బలవంతంగానా. కాదు. **తన్వరునిగఁగోరు** వారినే. తానేమి విరక్తుడా. **సౌఖ్యరసైకలోలుడు.** అలాంటప్పుడొకరి అనుమతి దేనికాయనకు. అయినా **నారదుని పంపున** వారిని చేసుకొన్నాడట. ఈ ఘోటక బ్రహ్మచారా ఆ రసిక శిఖామణికి అనుమతి ఇవ్వవలసింది. అదొక చమత్కారం - అయినా అంతమందితో ఎలా క్రీడించగలిగాడు. **పెక్కు రూపముల మాయా కల్పనా చాతురిన్** అని కవిగారి సమాధానం. అందరూ

కావలసిన వారే అయినా అందులో రుక్మిణీ సత్యలు మాత్ర మాయనకు చాలా ఇష్టం. మిగుల చనవులిస్తాడు వారికి. కాని వారికే పడదొకరిని చూస్తే ఒకరికి - ఏమి కారణం **'కులమును రూపమున్మగని కూరిమియు'** నిద్దరికే సమానమే. మరి **'రవరవల్పొడమక'** ఏమవుతుంది. చూచారా రాబోయే అంతఃపుర కలహానికెలా నాందీ పలికాడో కవి ఈ మాటల ద్వారా.

మరి ఆ **రవరవలు వారి** మదిలోనే ఉండిపోతే ఎలాగా. బయట పడాలిద్దరూ. ఆ నిప్పు రాజేయటానికే నారద మహర్షి ఆగమనం. ఆకస్మికంగా వచ్చాడా **అరివేరంపుదపసి** ఊరక వచ్చాడా. కావాలని ఒక పారిజాత పుష్పం చేత బట్టుకొని వచ్చాడు. ఎందుకు. అది కృష్ణుడి కిస్తే ఆయన అక్కడే ఉన్న రుక్మిణికి తప్పక ఇస్తాడు. దాని మహిమ తాను వర్ణిస్తే - అక్కడ పొంచి ఉన్న చెలికత్తెలు వినిపోయి వారి దేవేరులకు వినిపిస్తారు. అందులో మిగతా వారు సరిపెట్టుకొన్నా సత్యభామ ఆగ్రహోదగ్రు లవుతుంది. దానితో కథ రక్తి కడుతుందని తెలుసా దేవర్షికి. మరి రుక్మిణేమి తక్కువదా. రాగానే ఆయనకు రత్న సింహాసనము పెట్టండని తన కనుసన్నలతో చెలికత్తెలను హెచ్చరించి కాకా పదుతుంది. ఆవిడే పడితే కృష్ణుడేమి తక్కువా. ఇంకా నక్క వినయం నటిస్తాడు. ఆ మాట ఈ మాట చెబుతూ ఆ కలహ భోజనుడు పారిజాత కుసుమం బయటపెట్టి మధుసూదనుని చేతిలో పెడతాడు. వెంటనే రుక్మిణి ఎదుట కనిపిస్తుంది. సత్యభామ తలపున నిలుస్తుండా మహానుభావుడికి. దానికా దీనికా ఇవ్వటమని క్షణమాలోచించినట్టు నటించి ఇక్కడ నేనున్నప్పుడు దీనికివ్వటమే

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

సబబని తీర్మానించి మరలా **కనుగవపిన్న నవ్వు దొలకన్** మునినాథుని కన్ను సన్న రుక్మిణికే ఇస్తాడట. ఏమిటా ఇద్దరి నటన. రాబోయే ఘటన ఎలాగో చూదామని కాకపోతే.

తిడితే గుద్దినట్టు ఆ రుక్మిణి ఆ పుష్పం వెంటనే కొప్పులో చెరివిందట- ఏమంత తొందర. ఎక్కడ మళ్లీ ఎవరడుగు తారోననా. సత్యభామకు దక్కని అదృష్టం తనకు లభించిందనా. కావచ్చు. పైకి చెప్పదు కవి. ఇక నారదుడు లంకించుకొన్నాడు ఆ పుష్ప విశిష్టత ఎట్టిదో వర్ణించటానికి. అంతేనా. సందులో సందన్నట్టు ఆ వర్ణించే నెపంతోనే సత్యాదేవిని కించపరుస్తూ ఆడవలసిన మాటలన్నీ కావాలనే ఆడుతూ వచ్చాడు. ఎందుకోసం. ఎందుకోస మేమిటి. ఆయా రాణుల గూఢచారిణులా మాటలన్నీ విని తమ రాణుల చెవిలో వేయుటానికి. వేశారు కూడా. కాని మిగతా 6గురు దేవేరులు సాత్త్విక స్వభావం కాబట్టి **అందఱలోన పెద్ద మహిమాన్విత రుక్మిణి గాన పూవు గోవిందుడు దానికిచ్చె తగవే** అని తమలో తాము సమాధానం చెప్పుకొని ఓర్చారట కాళిందీ భద్రా సుదంతాదులు. కాని వారిలో మానవతి అయిన సత్యమాత్రమిలా ఓర్చుకోలేదు. **దక్షిణాంస చూచుకాది ప్రకంప గుణాల** శుభాన్ని సూచిస్తున్నాయే- **ప్రాణనాయకుండొక చపలాక్షింగూడి నను నొల్లని చెయ్దము లేమి సేసెనో** అని వెంటనే రుక్మిణి మీదికి పోతుందావిడ మనస్సు. దానికి తగినట్టే ఆవిడ ఇష్టసఖి పరుగెత్తుతూ వచ్చి అక్కడ జరిగిన సంగతంతా చిలువలు పలువలు పెట్టి వినకారు చేస్తుంది. **ఎంతకు లేదు నారద మునీంద్రుదుడట. 'ఆ రణ భోజను మతకములా**

Yalamanchili Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

**రుక్మిణి నటన లాము రాంతకుచెయ్యివ్ల్** చూస్తే ఎవరికి కోపం రాదంటుంది. ఆ ముగ్గురి ప్రణాళికా దాని మాటల ద్వారా ఎలా బయటపెడు తున్నాడో చూడండి ముక్కు తిమ్మన.

ఇక ఉక్కురోషం పుట్టుకు వచ్చింది సత్యభామకు. **ఏవేమీ కలహాశనుడిలా** అన్నాడా. ఆ **గోపికా వల్లభుడదేదో** బంగారమయి నట్టు విన్నాడా. ఆవిడేమన్నదా రుక్మిణి – ఎందుకింకా దాస్తావు జరిగిందంతా వివరంగా చెప్పమంటూ వారిద్దరినీ అని ఏమి ప్రయోజనం. ప్రాణంగా నమ్మిన నా భర్తే ధూర్త గోపాలు డనిపించుకొన్నా డేమి చేయాలి అని ఎంతో పలవించి ఎన్నో జరిగిపోయిన అనురాగ శృంగార చేష్టలన్నీ గుర్తు చేసుకొని బాధపడుతుంది. తట్టుకోలేక మాసిన చీర కట్టుకొని కోపగృహం చేరుతుంది. చూడండి ఈ పరిణామం ఎంత సరసంగా నాజూకుగా పట్టుకు వస్తాడో కవి. అదీ ఎంత హృదయంగమంగా ఉందో సహృదయులకు.

పోతే ఇది ఇలా జరుగుతుందని జరగాలని ముందుగానే మనసులో ఉంది గోవిందుడికి. అందుకే **ముని నాకిచ్చిన పూవుచందమును నే మున్నాడి యీ భోజనందన కర్పించిన జాడయుం దెలియఁ జెంతం బొంచి వీక్షించి పోయిన సాత్రాజితిబోటి నావలసఁదా నేమేమి కల్పించునో అని చింతాయత్త చిత్తుడవుతాడట.** అప్పటి కందరికీ అంతకు ముందే తెలుసు. ఆ కలహకారికీ ఈ సూత్రధారికీ ముఖ్యంగా. మరి ఆ చింతా యత్త చిత్తమంటే ఎలా ఉంటుందో వర్ణించాడండీ తిమ్మన మహాకవి. అంత ముచ్చట గొలిపే వర్ణన మరెక్కడా చూడబోము మనం. ఆ వర్ణించిన పద్యమే పద్యం. **అరదము**

**నెక్కి కేతన పటాంచల చంచలమైన తాల్మితో తురగ జవంబు మున్గడవఁ ద్రోఁచి కడంగెడు తత్తఱంబుతో తిరిగెడు బండి కండ్ల పగిదిన్ భ్రమియించు మనంబు తోడ నా హరి సనుదెంచె సత్య సముదంచిత కాంచన సౌధ వీథికిన్** తాలిమి లేదు. తత్తర మెక్కువయింది. మనసు పరిపరి విధాల పోతున్నది. ఈ మూడు భావాలూ ఎంత మనోహరంగా వర్ణించాడో చూడండి. రథమారోహించి పోతుంటే ఆ రథానికి కట్టిన జెండా గుడ్డ గాలికి ఎలా రెపరెపలాడుతున్నదో అలాగే నిలవకుండా పోతున్నది సహనం. మరి రథానికి ముందు కట్టిన గుఱ్ఱాల వేగం కన్నా వేగంగా ముందు పరుగెడుతున్నది మనసులో తహ తహ. ఇక ఆ రథచక్రాలెలా తిరుగుతున్నాయో అలాగే గిర గిరా తిరుగుతున్నది నిలకడ లేకుండా మనస్సు. రథమెంతో రథికుడూ అంతే. అక్కడికక్కడే ఔపమ్యం కల్పించి చెప్పడం చూడండి ఎంత ముచ్చటగా ఉన్నదో. మొత్తం మీద ఇలాటి వాలకంలో వచ్చాడా హరి సత్యభామా సౌధానికి. ఆయన హరి. అన్నిటినీ హరించేవాడు. అలాటి వాడికీ సాంసారిక భావాలు మనస్సును హరిస్తాయా. అదీ ఒక నటనే ఆ నాటక సూత్రధారికి.

ఇంతకూ వచ్చాడు. అరదం దిగాడు. కక్ష్యాంతరాలు గడిచాడు. **అలబలం లేనినగరెల్ల అరసి** చూచాడు. **కనక పంజర శారికలకు** చక్కె పెట్టే వారేమయ్యారో **కరతాళగతులతో మయూరాల** నాడించే వారెవరో – **క్రొవ్వాడి గోళ్ల తంత్రులు మీటి వీణలను పలికించే వారెవరో** – కలికి **రాయంచ బోదలను** నడపించే వారెవరో కానరాక **చెన్నుదఱిగిచిన్న బోయి** ఉందామేడ. రాయలనాటి రసికతా కళా వైభవమంతా ఎంత ముచ్చటగా

వర్ణించాడో చూడండి కవి. ఇంతకు ముందు సత్యభామ పడిన ఆవేదనలో కూడా ఆనాటి రసిక జీవనమెలాంటిదో ఎంతో రమణీయంగా ధ్వనింప చేశాడు కవి.

**కలలోన నైన నవ్వులకైన నామాట**
**జవదాట వెఱచునో చంద్రవదన**
**యేపదార్థంబునా యెదుటఁబెట్టకమున్న**
**యెవ్వారి కొసగడో యిగురుబోఁడి**
**చెలులు నాతో నేమి చెప్పుదురోయని**
**లంచంబు లిచ్చునో చంచలాక్షి**
**తోఁడి చేడియలు నాతోఁడి వంతుల కు రా**
**సయిరింపజాలడో సన్నతాంగి**

**అరమరలు లేని కూరిమి ననగి పెనగి కొదలు తీరని కోర్కుల కూడి మాడి కపట మెఱుగని మమతల గలిసి మెలసి యున్న విభుడిట్లు సేయునే**

అని వాపోతుంది సత్యభామ. రసిక దంపతుల అన్యోన్యత చూడండి. ఎంత దూరం పోయిందో. చెలికత్తెల నోరు మూయించటానికి లంచాలిచ్చే వరకూ పోయింది. భార్య మాట జవదాటనంత భార్యా విధేయులా నాటి రసికావతంసులు. అందులో రసికాగ్ర గణ్యుడు కృష్ణ పరమాత్మ మాట చెప్పాలా. అయినా జవదాటాడు. పారిజాతమనే పదార్థమావిడ ఎదుట బెట్టకుండానే మరొకరి కప్పజెప్పాడు. అయితేనేం. మరలా ఈవిడ మాట

జవదాటకుండా వెంటబెట్టుకొని స్వర్గానికే వెళ్ళాడు. ఒక పుష్పమేమిటి. వృక్షాన్నే పెళ్లగించి తెచ్చి పెరటి చెట్టుగా నాటాడు. ఇది కృష్ణదేవుని వ్యవహారమా. కృష్ణరాయల ప్రేమ వ్యవహారమా. రెండూ కలిసి వచ్చేలాగా ఎంత సరసంగా ఎంత సవిలాసంగా ప్రదర్శిస్తాడో చూడండి తిమ్మన ఇంత కన్నా అద్భుతంగా ఆ దంపతుల శృంగార చేష్టలు వర్ణిస్తాడు కూడా. అది సత్యభామ నోటనే పలికిస్తాడు. విందాము. **కృతకాద్రికందరా** అనే పద్యం చదవండి తెలుస్తుంది. ఇదంతా రాయలవారి రసిక దాంపత్య జీవితమే ఇందులో తొంగిచూస్తున్నది.

అయితే ఒక మాట సత్యభామ అమాయికురాలు – అమాయిక మైనదామె ప్రేమ కూడా. **'తలలోపలి నాలుక పూసలలో దారంబు మాడ్కి'** ఉండాలని కోరుతుంది తన ప్రియుణ్ణి. ప్రాణమైన మగడు మరొకలా ప్రవర్తిస్తే ఒప్పుకోదు. ఎంతో బాధపడుతుంది. తిమ్మన ఆవిడ ప్రణయ వృత్తాంతం వర్ణించేటప్పు డలాగే వర్ణిస్తాడు. పోతే ఇప్పుడు కృష్ణ పరమాత్మ విషయంలో అలాగాదు. ఈయన నట సార్వభౌముడు. నిజంగా చూపుతున్నాడో ప్రేమ లేనిదున్నట్టు ప్రదర్శిస్తున్నాడో అంచనా వేయలేము. అనిర్వచనీయం. **గారవంబు మెఱమెచ్చులకై పచరింతు** నని సత్యతో తరువాత అనబోతాడు. అది ఇతర కాంతలను గురించి అన్నా సత్యభామకు కూడా ఆ మాట వర్తించదని ఏమి గారంటీ. ఆ తేడా చూడండి అడుగడుగుకూ ఏమరకుండా ఎలా స్ఫురింపజేస్తాడో కవి తన వర్ణనలో.

**కొందఱ మంతనంబులను కొందఱ జంకెన వాడిచూపులం గొందఱఁ జేతి సన్నల 'దగుల్పడఁజేయుచు – చేరబోయాడట'** సత్యామానిని దగ్గరకు.

చూడండా నటన. ఎంత ముద్దుగా వర్ణిస్తున్నాడో. చెలికత్తెలప్పుడే తన రాక ఆవిడకెక్కడ ఎఱుగ చేస్తారోనని భయం. మరగనీ మురగ గొడదామన్నట్టు నెమ్మదిగా బయట పడితేనే స్వారస్యం. అది తెలుసునా శృంగార పురుషుడికి. ఆయనగారి హృదయం తెలుసు ఈ కవీశ్వరుడికి.

పోతే ఆ బయట పడటం కూడా చూడండి. ఎంత సుకుమారంగా దానిపాటికదే జరిగిపోయిందో. **'అంతట పారిజాతకుసుమాగత నూతన దివ్యవాసన - ల్వింతలు సేయ - తావియిది విస్మయ మంచు ముసుంగు ద్రోచియ - క్కాంత గృహంబు నల్గడలు నారసి'** ఈయన గారావిడ మునుగు దీయకుండానే ఆవిడ ముఖం చూడకుండానే ఆవిడే తనపాటికి తాను ముసుగుదీసి అటూ ఇటూ చూచి చివరకు తన ముందరనే నిలబడ్డ తన నాథుణ్ణే చూచిందట - ఎలా జరిగిందంటే చెబుతున్నాడు కవి. పారిజాత పుష్పవాసనలు నలుగడలా కమ్ముకొంటే ఏమిటా ఈ పరిమళం ఎక్కడిదో తెలుసుకోవాలని ముసుగు తీసి చూచిందట. అసలు పారిజాతమేమిటి. దాని పరిమళమేమిటి. ఎక్కడ ఉందక్కడ. ఆ పారిజాతం. అది రుక్మిణి కొప్పులో గదా ఉంది. ఇక్కడికెలా వచ్చింది. అదే దాని మహిమ. లేదా కృష్ణస్వామి గారడీ. చెప్పకుండానే ఎంత ముద్దుగా చెప్పాడో చూడండి కవి. ఇంతకూ ఏదైతేనేమి. ముసుగు తొలగించింది. చూచింది. దేనిని పారిజాతాన్నే కాదు **'సంభృత తాళవృంతునింగాంతుని'** ఒక తాళవృంతం పట్టుకొని వీస్తున్నాడావిడనంత వరకూ ఆ రసికావతంసుడు. ఏమో ఉపచారాలు చేసినట్లు నటన. కోపోపశమన మలా ఉంచి అది ఆవిడ కోపాన్ని దరికొల్పుతున్నదంటారు మన తిమ్మనగారు.

మరి చూచిందిగదా. అలాగే చూస్తూ కూచోవచ్చు గదా. అబ్బే. అలా చేస్తే స్వారస్యం లేదు. **తలవంచి మరల** ముసుగిడితేనే అందం. అలాగే ముసుగు పెట్టి లోలోపల కుమిలిపోతున్నది. **కొలుకుల దిగిజాఱి జాలుకొని దుఃఖాశ్రువులు** చెక్కిళ్ల మీద పడుతున్నాయి. వేడి నిట్టూర్పుగాడ్పులకు కప్పుకొన్న దుప్పటి పైకి లేస్తున్నది. ఆనాటి రసికత ఎలాంటిదో చూడండి. అయ్యో నా ముఖం చూచి కూడా పలకరించ లేదే ఎలాగా లేపటమని ఇక చూడండి ఎంత అనురాగం ఒలకబోస్తున్నాడో ఆ జగన్నాటక సూత్రధారి. లేని అనురాగమంతా కుమ్మరిస్తూ మాటాడే మాటలు ఎంత ముచ్చట గొలిపే శైలిలో వర్ణిస్తాడో చూడండి కవి. అది ఒక్క ముక్కు తిమ్మనకే సాధ్యమని పిస్తుంది.

**ఇందునిభాస్యమై తొడవు లేల ధరింపవు - వన్నెగావు లీ**

**వెందును మానలేవు - తెలుపేటికి గట్టితి**

ప్రేయసీ - నీవేమిటి సొమ్ములు పెట్టుకోలేదు. రంగుచీరలు మానేసి ఈ తెలుపెందుకు కట్టావు. **'వీటికా రుచుల్కెందలిరాకు మోవి తులకింపగ జేయ విదేల నీచందము వింతయయ్యెడు'** వీడెమెందుకు వేసుకోలేదు నీ చందం చూస్తే చాలా వింతగా ఉందంటాడు. వింతగా ఎందుకో తనకు తెలీదా. **'మన మరయందలంచి యొకమార్గము వన్నితొ నవ్వుటాలకో నను వెఱపించెదో యకట నాయెడ నిక్కమ తప్పుగల్గెనో - పగవాడనె నన్నిటు లేలచూడవు ఒక్క నిమిషమైన నీవు దయ గన్గొసకుండిన నిల్వ నేర్తునే'** ఏమి నయగారమో చూడండి. మార్గము పన్నిందావిడా తానా.

తన బూటకాలన్నీ ఆవిడకంట గట్టి మాటాడట మొక మోసం. అంతేనా. **'మనమున మాటలం(గియల మన్నన లీనొక నాడు నెట్టికా వినులకు గారవంబు మెఱ మెచ్చులకై పచరింతు గాని - వాయనియనురక్తి నీ యెడనెయగ్గల'** మట. ఎంత నాటకం. ఎంత ఇచ్చకం. ఏదైనా జగన్నాటక సూత్రధారికే చెల్లు.

**పడతీనీ మధురాధరామృ తము నీ బాహాపరీరంభముం**
**బడయన్ ధన్యుడగాక యుండిన ననుంబాటించి యొక్కింతనీ**
**నిదు వాలుంగడ కంటఁ జూడుమనుచు న్నిల్పోపమిం బైచెఱం గొడియన్.**

ఏమి మాటలివి. ఏమి ప్రేమాభినయం. కృష్ణుని మాయా విలాసం వర్ణించటంలో పురాణేతిహాస వాఙ్మయమంతా దీని ముందు బలాదూరు. ముక్కు తిమ్మనకు ముక్కు తిమ్మనే సాటి. కృష్ణలీల అంటే ఏమిటో అది ఎలా ఆవిష్కరించాలో - ఆ విద్యలో అనితర సాధారణం తిమ్మన మేధాపాటవం - దాని పరాకాష్ఠ చూడండి. ఆవిడపై చెరంగొడిసి పట్టుకోబోయాడట. పోతే ఆవిడ కోపంతో చేతిలో ఉండే విరిదమ్మి విసిరిందట. సత్యభామ పాత్రాభినయంలో దిట్ట అనిపించుకొన్న స్థానం నరసింహరావుగారికీ ఘట్టమే చాలావరకూ స్ఫూర్తి నిచ్చి ఉంటుంది బహుశా.

అసలేమి పద్యాలివి. ఏమి హావభావాలు. అయిదూ అయిదే. అయిదు రత్నాలు - వరహాలు. ముక్కు తిమ్మన రసభావ పోషణ కివి మణి దర్పణాలు. రాయలనాటి రసిక జన జీవనానికివి ప్రత్యక్ష సాక్షులు. రసిక దంపతుల

కివి ఎప్పటికీ జీవితంలో చిరస్మరణీయాలు. నిత్యానుసరణీయాలు. చూడండి. ఇన్ని హావభావాలూ ఆవిడ ప్రణయ కోపానికి జవాబు చెప్పలేకపోయాయి. చివరకు కాళ్ల బేరానికి రావలసి వచ్చిందా రసిక శిఖావతంసుడు. అది కూడా చూడండి. **తత్పదద్వయీ పాటల కాంతి తన మౌళిమణి పంక్తికి పన్నియ పెట్టేలాగా** మ్రొక్కాడట అంతవాడూ. అంత వాడేమరి. ఎవరంత వాడంటే. జగన్నాటక సూత్రధారి అని ఒక్క మాటలో ముద్దుగా బయటపెట్టాడు ముక్కు తిమ్మన. ఆ కాళ్లు పట్టుకోటం కూడా అప్పటికొక నటనే నన్న మాట. దాసుడి తప్పులు దండంతో సరి అనుకొన్నాడు పాపం. కాని అది తనకు దండమే అయింది చివరకు. పెనిమిటి మ్రొక్కినా తీరలేదావిడ కోపం. **'శిరమచ్చో వామ పాదంబునం దొలగం ద్రోచెనట'** కుడి కూడా కాదు. ఎడమ కాలితోనే ప్రక్కకు త్రోచిందాయన శిరస్సు. త్రోచిందో తాచిందో చెప్పలేము గాని **'కోపన పదహతి కుహనా గోపాలుడు గాంచి'** అంటాడు కవి. కుహనా గోపాలుడు గనుక ఎలా చెప్పినా చెప్పుకోవచ్చు. హతి అంటే తాపే గదా. తోపెలా అవుతుంది. ఆవిడ త్రోపే ఆయన తాపుగా చాటుతున్నాడు కావాలని. ఇది కాళిదాసును చూచి ఇలా వ్రాశాడా అనిపిస్తుంది **'కయాసికామిన్ సురతాపరాధా - త్పదానతః కోపనయావధూతః'** అని మన్మథుడు దేవేంద్రుడితో చేసిన ప్రసంగం - అక్కడ అపరాధం ఇంద్రుడిదైతే ఇక్కడ ఉపేంద్రుడిది. పదానతుడతడే గాదు ఇతడూ. పోతే అక్కడ ఎవతో కోపన అయితే ఇక్కడ సత్యేకోపన. కోపన పదహతి అని తరువాత అననే అంటాడు కవి. మరి అవధూత అని

కాళిదాసంటే ఈయన హతి అంటాడు. రెండింటికీ త్రోయటమైనా తన్నటమైనా ఏదైనా కావచ్చు అర్థం. అది తిన్నవారికే ఎఱుక అంటారు కవులిద్దరూ.

కాగా ఇది సత్యాకృష్ణుల ప్రణయానికి పరాకాష్ఠ అనుకోండి. సత్యదృష్టిలో ఇది అలాటిదే అయినా లీలా మానుషుడి విషయంలో అది కూడా చాలదు. **'మెయి గ గుర్పొడువగ నుద్దీపిత మన్మథ రాజ్య ప్రాపితుడ'** య్యాడట. కోపం తాపం కాదు. రెండూ మరచిపోయి పాపమని పించిందట ఆవిడ చేష్ట గోపాలకృష్ణుడికి. దానితో ఇంకా ప్రణయంతో శరీరం పులకించి **'కూర్మిబయలు పడంగన్ ననుభవదీయ దాసుని మనంబున నెయ్యపు గిన్క బూని తాచిన యది నాకు మన్ననయ'** తంతే తన్నావు. దాసుణ్ణి గదా. దాసుణ్ణి తన్నినా అది తప్పుగాదు. అసలైన కినుక లేదు గదా నామీద నీకు. అంచేతనా కది మన్ననే. కాని **మత్తనుపులకాగ్ర కంటక వితానము సోకిన నీపద పల్లవము** నొచ్చిందే మోనని నాభయ మంటాడు. ఎంత దొంగ నాటకమో చూడండి. **ఇకనైన అల్క మానవుగదా** అంటాడు పైగా. ఇకనైన అంటే. తన్నునే తన్నావుగదా. ఇంకా నీ అలక తీరలేదా అని. ఇంతకూ తన నేరం నేరమే గాదు. ఆవిడదే నేరమని తేల్చాడు. కృష్ణుడిదయి పోయింది. ఇక సత్యభామదే బాధ్యత.

స్వామివారిది నాటకమైతే ఆవిడది నాటకంగాదు. వాస్తవం. వెంటనే పానుపు మీద నుంచి సగం పైకి లేచింది. కొప్పు సవరించింది. పైట సవరించింది. కోపంతో చూరచుర చూస్తూ ఇక ఇస్తున్నది చూడండి

సమాధానం. ఎంత ముద్దుగా ముచ్చటగా వర్ణించాడో తిమ్మనగారు చెప్పలేను. '**ఈ నయగార పుంబ్రియము లీపస లీమొగమిచ్చ మాట లేలా నిను నమ్మియుండిన ఫలంబిదె తోడనె కల్గె నాకు. నీయాన సుమీ నను జెనకి యాఱడి పెట్టిన నవ్వు వారలం గాన వెఱుంగునే పసుల కాపరి భావజ మర్మకర్మముల్.**

**'ఇంకిటు నిన్ననమ్మ – నను నేమిటికిం గెరలించె దెంతయుం**
**బొంకముగాని యీవలని బొంకులు మాచవి గావు – రుక్మిణీ**
**పంకజ పత్త్ర లోచనకు బ్రాణ పదంబులు గాని – వల్లవీ**
**కింకర – చాలుఁ జాలు నుడికింపకు నింపకు లేని కూరుముల్**
**మునిపతి వచ్చి పూవొసగి మోదము తోడ భవత్ప్రియాంగన**
**న్వినుతి యొనర్పగా వినిన వీనుల మాచవిగాని మాటల**
**న్వినవలసెంగదా – యిపుడు నీవిట వచ్చుట పారిజాతవా**
**సనఁ బ్రకటించి నాకు నెక సక్కెము సేయన గాదె చెప్పుమా–**
**'మానంబె తొడవు సతులకు – మానమె ప్రాణాధికంబు మానమఖిల**
**సమ్మానములకు మూలంబగు – మానరహిత మైన బ్రతుకు మానిని కేలా'**

చూడండి. ఇవి అయిదూ మరలా అయిదు రత్నాలు. ఇంతకు ముందువి కృష్ణ రత్నాలైతే ఇవి సత్యారత్నాలు – అది సత్యకు తెలుసు. ముక్కుకు పోటీగా పోయేదావిడ. ఆవిడది ముక్కుసూటి వ్యవహారమని ముక్కు తిమ్మనకూ తెలుసు. అందుకే కృష్ణుడి మాటలలోని నాటకాలు

బూటకాలు బయట పెడుతున్నది. ఈ ఈ అని చేతులు తిప్పుతూ మాటాడు తున్నట్టే ఉంది. మాట మాటకూ మందలిస్తున్నట్టే ఉంది. ఒక ఆడదాని కలక వస్తే ఎలా వ్యవహరిస్తుందో ఎలా మాటాడుతుందో ముఖ్యంగా తెలుగు కుటుంబాల్లో మనం తిమ్మనగారి కవితా శిల్పం ద్వారా గ్రహించవచ్చు. నయగారాలూ ఇచ్చకాలూ కాదు కావలసింది. అచ్చమైన అనురాగం. అది నీకెక్కడుంది. పసుల కాపరివి. నీకేమి తెలుసు రసికత. ఇక నిన్ను చస్తే నమ్మను. నీ వెర్రి వేషాలు ఆవిడకు ఇష్టమేమో నాకు గాదు. లేని ప్రేమ ఒలకబోయకు. ఈమో సాలూ - వేషాలూ కల్లలూ కపటాలూ నీవు పుట్టగానే పుట్టాయి. వెన్నతో బెట్టినవి నీకు. ఇవి ముందుగా పసిగట్టి కూడా నేనే మోసపోయాను. నా దగ్గరి కిప్పుడు నీవు రావటం కూడా ఆ పుష్ప సౌరభం చూపి నన్ను హేళన చేయటానికే నాకు తెలుసు. నీకు మా మాటలు దేనికి. చవిగాని మాటలు. నీ ప్రేయసి రుక్మిణి మాటలు వింటూ కూచో ఆనందంగా ఉంటుంది.

ఇంతవరకూ ఆవిడ నిష్ఠు రోక్తులు. పోతే ఇక ఆవిడ నిర్వేదం వర్ణిస్తున్నాడు చూడండి కవి. **'మానంబె తొడవు సతులకు - మానమె ప్రాణాధికంబు - మాన మఖిల సమ్మానములకు మూలంబగు - మానరహితమైన బ్రతుకు మానిని కేలా'** నేను మానవతిని. పరువు ప్రతిష్ఠలతో బ్రతుకుతున్నాను. అదే కుల స్త్రీకి అలంకారం. గౌరవం. అది లేకుంటే ఉన్నా పోయినా ఒకటే. అది ఉన్నదాన్ని గనుకనే **'తనదు కోడండ్రలోన పెద్దయు గ నన్ను దేవకీ దేవి మన్నిస్తున్నది.** ఎందుకో తెలుసా. నీవు నాకు చనవిస్తున్నావని తెలుసు ఆవిడకు. అది ఎవరికీ లేని అదృష్టం. అలాటి

Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

'సాధ్వి సేవ సేయఁ బోవంగ నాకింక సిగ్గు గాదె' అంటుంది. ఎంత ఆత్మవిశ్వాసమో చూడండావిడకు. రుక్మిణి మొదలైన వారెవరికీ లేదా విశ్వాసం. అందుకే వారెవరికీ ఇవ్వని మర్యాద ఈవిడ కిస్తున్న దత్తగారు. అప్పటికి సత్యాదేవి లోకులందరూ అనుకొన్నంత మూర్ఖురాలు గాదు. గయ్యాళి గాదు. గుట్టుగా గంభీరంగా బ్రతుకుతున్న మానవతి. అయితే అది కాపాడవలసిన బాధ్యత తన మగనిదేనని ఆవిడ అభియోగం. అది విస్మరించాడు పెనిమిటి. అది ఎంత బాధాకరం. అందుకే వాపోతున్నది

ఉవిద యెవ్వతె నోఁచి యున్నదో యీ శ్యమం
తక రత్నమింక నౌదల ధరింప
నీ రైవతక శైల చారు కూట విటంక
కేళికిం కెవ్వతె పాలుపడునొ
యెవ్వతె కబ్బునో యీ వ సంతారామ
కర్పూర కదళికా గార వసతి
లీల నీ మణి సౌధ జాలకంబుల నిన్నుఁ
గూడి యెవ్వతె వార్ధిఁ జూడఁగలదొ
యకట నేఁబెంపఁ బెరిగిన శుక మయూర
శారికా బృంద మెవ్వతె జేరునొక్కొ
నన్ను నాతోడి సవతులు నగక మున్న
పంత మలరంగ నిన్ను మెప్పింతు గాక

గత స్మృతులన్నీ ఒక్కసారి మెదిలాయావిడ మనోవీధిలో. తన పెనిమిటీ తానూ గలిసి మెలిసి ఆడిన ఆటలూ పాడిన పాటలూ ఒకటా. ఎన్నో విలాసాలు వినోదాలు. ఇంతకు ముందు చెలికత్తెతోనే వలపోసుకొని విలపించింది చాలా. ఇప్పుడు సాక్షాత్తూ పతి ఎదుటనే పలవరిస్తున్నది. ఈశ్యమంత రత్నమిక ఎవతె ధరిస్తుందో- ఈ రైవతక పర్వతం మీద ఎవతె నీతో విహరిస్తుందో - ఈ ప్రమదావనంలో ఎవతె నీతో కలిసి క్రీడిస్తుందో- అలాగే నీతో కూడి ఈ గవాక్షంలో నుంచి ఎవతె ఆ సాగరాన్ని విలోకిస్తుందో- నేను పెంచితే పెరిగిన ఈ చిలుకలు గోరువంకలు నెమళ్లూ మరే వనిత పాలబడతాయో గదా. అది చూచి నేను సహించగలనా. అది జరిగేలోపుగా నా నవతులు చూచి నవ్వకముందే నేను నిన్ను మెప్పిస్తానంటుంది. అంటే ఏమని అర్థం. నీదారి కడ్డురాను - ఏమయి పోతానో అడగకు. నీకు కావలసిన ఎలనాగతో నీవు యధేచ్ఛగా క్రీడించవచ్చునని తన అక్కసు వెళ్లబోసుకొంటుంది. అనన్య ప్రేమకిది ఆఖరి మెట్టు. రాయలనాటి రసిక జీవనమిందులో ఎంతగానో తొంగి చూస్తున్నది కూడా.

పోతే తన పట్టరాని అక్కసూ ఆవేదనా అంతా వెళ్లబోసుకొని ఇక అనటానికి మాటలు కూడా మిగలక ఏమి చేసిందో వర్ణించాడు తిమ్మన. అది ఎంత గొప్పగా ఉందో చెప్పలేను. **'నను నెవ్వతె గాఁజూచితి' వని యంతర్బాష్పయగుచు నవనత ముఖియై - ఘనతర గద్గదికా నిస్వసమున మతి మాటలాడ శక్యముగామిన్'** అని ఒక్క పద్యంలో ఆవిష్కరించాడా

నాయిక సాత్త్విక సంచారి భావాలన్నీ మూటగట్టి. అయితే శక్యము గాక మరేమి చేసింది. మాట నోట రాకపోతే మరి ఏమి చేస్తుందాడది. ఏడుస్తూ కూచుంటుంది. అలాగే. చేసింది సత్యభామ. కలియుగ వ్యవహారం ద్వాపర యుగానికి తరలించాడు కవి. అంతే మరి. స్త్రీ పురుషుల భావాలూ చేష్టలూ ఎప్పుడూ ఒకటే యత్నించి ధ్యైదంతో. అలాటి సార్వకాలిక సార్వజనిక భావాలను బయటపెట్ట గలిగిన వాడే మహాకవి. అసలైన సాధారణీకరణ మాలంకారికులు చెప్పేది ఇదే.

**ఈసునఁ బుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచే**

**గాసిలి యేడ్చె బ్రాణ విభు కట్టెదుటన్ –**

అంతేకాదు. **మోము పయిచేల చెఱంగిడి యేడ్చిందట.** అదీ గండుకోయిల కాదు. ఆడుకోయిల కంఠధ్వనితో. అంత ముద్దుగా ఏడ్చిందంటే అది తిమ్మనగారి ముద్దు పలుకు. మరి అంత ముద్దుగా ఆవిడ ఏడిస్తే ఆ ముగ్ధ మోహనుడేమి తక్కువ వాడా. అది తీర్చవలసిన బాధ్యత ఉందా లేదా తనకు. ఉంది గనుకనే. **'నీరజనాభుడు నిండు కౌగిటం జేరిచి బుజ్జగించి నునుజెక్కుల జాలు కొనంగ జాఱు కన్నీరు కరంబునం దుడిచి నెయ్యము తియ్యము దోప** – చూడండి ఎన్ని ఉపచారాలు చేస్తూ వచ్చాడో ఆ కుహనా గోపాలుడు.

అంతేనా. అలా చేసినా అది నయగారమని మొగమిచ్చక మని దెప్పినా దెప్పవచ్చు ఆవిడ. అదీ భయమే. అంచేత ఏదో ఒక హామీ ఇవ్వాలావిడకు. లేకుంటే ఒప్పుకోదు. అందుకే ఇస్తున్నాడు హామీ. ఏమని.

Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

**ఓ లలితేంద్ర నీల శకలోపమకై శిక యింత వంత నీ**
**కేల లతాంత మాత్రమున కేఁగలుగన్ - విను నీకు దేవతా**
**కేళి వనంబు సొచ్చి - యనికిన్ బలసూదనుఁడెత్తి వచ్చినన్**
**దీలు పడంగఁదోలి యిట దెచ్చెద నిచ్చెద పారిజాతమున్'**

చూచారా. ఒక పుష్పం రుక్మిణి కిచ్చాననిగదా నీ బాధ పుష్పమేమిటి నీకు పారిజాత వృక్షమే తెచ్చి ఇస్తా. మరి దేవేంద్రుడడ్డు పడడా అంటే పడ్డా అతణ్ణి యుద్ధంలో ఓడించి తేగలను సుమా - ఇంతెందుకు - **వామలోచన నీకేళి వనములోన చలువ వెదఁజల్లు చెంగల్వ కొలని కెలన - సరసకర్పూర కదళికా తరులనడుమఁ బెరటి చెట్టుగ నాటింతుఁ బెంపు గనుము'** ఆ వృక్షాన్ని సమూలంగా పెకిలించి తెచ్చి నీ ప్రమద వనంలో అన్ని వృక్షాల నడుమ దాన్ని కూడా నాటిస్తా- ఇక నీకు తృప్తేనా అంటాడు. అనేసరికి అతడు మేఘశ్యాముడు. అతని మాటలు మధుర గర్జితాలు. ఇక చూడండి ఆవిడ ఒక నీపలతిక లాగా ముఖవికాసంతో ముందుకు వస్తే సఖులనే మయూరాలు ఉత్సాహంతో గంతులు వేశారని వర్ణిస్తాడు ముక్కు తిమ్మనగారు. ఎంత ముద్దుగా ఉందో చూడండి ఈ సతీపతుల అన్యోన్య వ్యవహారం. అది ఎలా నడిపాడో చూడండి మహాకవి. ఇక్కడ మరొక విశేష మేమంటే రాబోయే కథాంశాన్ని ముందుగా సూచించటం. అది నాయకుడి నోట సందర్భానుసారంగా పలికించటమే తిమ్మనగారి నైపుణ్యం.

ఇదంతా కనుసన్నలతో నడపటమే కవిగారికి ముచ్చట. నారదుని- కనుసన్న తోనే కృష్ణుడు రుక్మిణికి పారిజాత మిచ్చాడు. రుక్మిణి కనుసన్నలో

Valluri Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

చెలులాయనకు ఆసనాది సత్కారాలు చేశారు. మరి కనుసన్నలు చేతి సన్నలతోనే కృష్ణమూర్తి సత్య చెలికత్తెలను దూరం పంపుతాడు. ఇప్పుడు కోపోపశమనమై రాత్రి తన పెనిమిటితో ఆనందంగా క్రీడించి తెల్లవారగానే తన స్వామి మజ్జనభోజనాది కృత్యాలు నిర్వర్తించటానికి కూడా సత్యభామ కనుసన్న చేస్తుంది చెలికత్తెలకు. ఇది ఎంత దూరం పోతుందంటే ఈ కనుసన్న - చివరకు నారదుడికి తన పతిని దానం చేస్తూ ఆయనను పుష్ప దామంతో కట్టి వేసినప్పుడా వేడుక బూచి **'సత్య బోంట్ల సన్నల నెసకొల్పుచు** నవ్వారట ధర్మజ భీమ ఫల్గునులు కృష్ణస్వామి బావమరదులు, సన్నలు చేయటం కేరింతలు కొట్టటం ఎంత సరదాగా వర్ణిస్తాడో చూడండి కవి. సందర్భం వచ్చినప్పుడల్లా మరచిపోడా మాట. ఇదే తిమ్మనగారి పలుకు - అతని ముద్దూ ముచ్చటా.

ఇక స్నానం చేయిస్తారా స్వామిని చెలికత్తెలు. ఆయనకు నలుగు పెట్టటం దగ్గరి నుంచీ నీరాజన మివ్వటం వరకూ ఆ జవ్వనులు ఎవరికి వారు మార్చి మార్చి చేసే ఉపచారాలు ఇవీ అవీ గావు. వారు చేయటమేమిటి. చేస్తే ఆయనగారు చేయించుకోట మేమిటి. శృంగార పురుషుడు గదా కృష్ణ పరమాత్మ అంటే. మరి వారో శృంగారవతులుగదా లెక్కేమిటి. ఇది మనుచరిత్రలో కాదుగదా ఎక్కడా కనపడదీ విలాస చర్య.

**'చెలువల్గొందఱు హేమ కుంభములతోఁ చేసే నొసంగన్ విని**

**ర్మల దోర్మూలరుచుల్వెలిం బొలయఁ దోరంబైన చందోయి సం**

**దొలయ న్వేనలి జాఱ నిక్కి యరమే నొయ్యారమై** వ్రాలిందట స్వామి వారిమీద ఒక వామలోచన.

**చెంద్రిక పూవన్నె జిలుగు దువ్వలువను**
**తడియొత్తె నొక్క కాంతా ల లామ**
**కొనగోళ్ల నెఱుల చిక్కులు వాపి మెలపున**
**శిరసార్చె నొక్క లేంచిగురు బోడి**
**యలదె చందన మొక యర వింద గంధి**
**సుదతి యొక్కతె కపురంపు సురటివిసరె**

**ఒడలంతా తడవి తడవి వలువ లొత్తటమూ తల ఆర్చటమూ చందన మలదటమూ** - అది **ఆరటానికి సురటి విసరటమూ** - ఇది ఆడువారి కాడువారే చేయరు. అలాంటిది మగవాని కాడువారా. ఆయన ధీరలలితుడు - వారు లలితాంగులూ - చేస్తేనేమట. ఏమట అని మనబోటి పాఠకులమే గాదు. అది గమనించే సత్య కూడా చిరునవ్వులతో చూస్తూ కూచున్నది. ఏమి సరసమైన సన్నివేశాలివి. అవి వన్నె చిన్నెలు పెట్టి వర్ణించటంలో ఎంత ముచ్చట కవిగారికి.

మరి ఈ మహానుభావుడి కింత ఉపచారాలు జరిగితే అవి ఏవీ లేకుండా తన పాటికి తానే '**జలకం బాడి మదుంగు గట్టి మణి భూషా దీప్య మానాంగియై - కలపం బెంతయు వింతగా నలది చెంగల్వ ల్నెఱిన్ముంచు వే నలిఁ గీల్కొల్పి పసిండి యందె రవళిన్ రాయంచ లందందరా జెలులుం దాను సత్యభామ సమదెంచిం** దట. ఇంత ముస్తాబు చేసుకొని వస్తే అది చూచి అంతకు ముందే ముస్తాబయిన ఆయనగారు - ఉప్పొంగాడంటాడు తిమ్మన. ఏమిటో ఆ రసికత - సతీ పతులకు వారిద్దరికీ తెలుసు. తెలుసునని వారిని సేవించే తిమ్మనకు తెలుసు.

వారు సత్యాపతులైతే గదా. ఆ ముసుగులో ఉన్న చిన్నాదేవీ కృష్ణరాయలే గదా తిమ్మన దృష్టికి.

సత్యభామ ఇప్పుడు వికసితస్వాంత – పరమ శాంత. అది ఎక్కడి నుంచి పసిగట్టాడో నారదుడు. మరలా తయారయ్యా డక్కడికి. తానూ మజ్జనాది మాధ్యందిన కృత్యాలు మున్నీటి జలంలోనే ఆచరించి వచ్చాడట. మున్నీరా అది మిన్నేరా – అడిగితే మిన్నేరు మున్నేరేగా అని ముద్దుగా నవ్వుతాడు తిమ్మన. ఇంతకూ చిత్రమేమంటే కృష్ణుడి హృదయ మాయనకు చిరపరిచితమే. ఆయనతో గొడవ లేదు. ఇద్దరూ తోడు దొంగలేగా ఒక రకంగా. వచ్చిందల్లా సత్యతోనే. ఆవిడ కోప ప్రసాదాల అదను కనిపెట్టి వ్యవహరించాలిద్దరూ. అది తెలిసే వచ్చాడా మహర్షి. అంతకు ముందు రుక్మిణి ముందర ఆమెను తీసివేసిన వాడిప్పుడు చూడండి కాకా పడుతున్నాడు. సత్యాపతులిద్దరూ తనకు స్వాగతం చెప్పి భోజనాని కాహ్వానిస్తే చక్కగా భోజనం చేస్తాడు. అదీ ఎలాగని. కృష్ణస్వామీ తానూ ఒక పంక్తి. సాంబాదులైన కుఱ్ఱకారంతా ఒక పంక్తి. ఎదురు మళ్లా కూచుంటారు. ఎంత ఔచిత్యమో చూడండి. ఇక భోజనాల వద్దన అంటారా. **'శాకపాకంబుల చవులు వక్కాణించు గతి కంకణంబులు గల్లుమనగ'** ఆడువారి వడ్డన ఎంత సరసంగా అందంగా వర్ణించాడో కవి చెప్పలేను. మరి భక్ష్య భోజ్యాదుల రుచులు సారె సారెకు కానియాతూ భుజించారట కృష్ణ నారదులు. వారు కొనియాడారంటే ఇక ఆ పదార్థాల సౌష్ఠవం మనమిక కొత్తగా కొనియాడన క్కరలేదు. అంత ముద్దుగా వర్ణించిన కవినే కొనియాడాలి మనం కొనియాడితే.

Brahmasri Vallamraju Srinivasa Rao www.andhravedanta.in

ఇక వామ నేత్రలు కర్కరికలు వంచుతుంటే స్వామివారు తన వారితోపాటు చేతులు కడగటం – కర్పూర తాంబూలాదులు సేవించటం జరిగిపోయింది. మహర్షి బ్రహ్మచారి గదా ఆయన విషయ మేమిటో చెప్పడు. చూడండి మహాకవి. ఇదొక ఔచిత్యం. మొత్తమీద భార్యాభర్త లిద్దరు వచ్చి ఆ మహర్షి కాళ్లకు మొక్కుతారు. ఒకరిది నటన మరొకరిది ఘటన. ఏదైతేనేమి. చూడండి ఇక అంతకు ముందు రుక్మిణి దగ్గర ప్లేటు మార్చేస్తాడు నారదుడు. **'పతినీవై విహరింపగా జనము సంభావింపగా బంధు సంతతి నిన్నుం గొనియాడగా నితరకాంత ల్వాచిలజ్జింపగా నతుల ప్రాభవవై భవోన్నతుల ప్రోవై యిట్లు వర్తించు నీకితర స్త్రీ జన బుద్ధి దీవనలు నేనేమిచ్చెదన్ మానినీ'** ఏమని ఆశీర్వదించా లంటాడు. ఎందుకని. మిగతా స్త్రీలనైతే ఆశీర్వదించవచ్చు. నీకేమిటి ఆశీర్వాదం. అన్నీ సమకూడిన దానవు. పతి నీకు వశవర్తి. సవతులు నీ వైభవం చూచి సిగ్గు పడాలి సుమా. అలాంటి దానికా దీవనలు – అంతేకాదు – **'అని కైనంబతి నిన్ను బాసి చనునో'** – అంటాడు. ఎవరితోనైనా యుద్ధానికి వెళ్ళేటప్పుడు కూడా నిన్ను ఇంట్లో వదిలేసి పోడుగదా. అంటే ఇది ఇంతకు ముందు జరిగిన నరకాసుర వృత్తాంతంలోనే గాక ఇక జరగబోయే సురలోక యుద్ధాన్ని కూడా ఎలా సూచిస్తున్నాడో చూడండి. తప్పకుండా సత్యాస మేతుడై దేవలోకానికి వెళ్లాలని హెచ్చరిక కూడా ఇది కృష్ణస్వామికి. అలాగైతేనే **'నీకు మగడు కోరిన కోర్కెల్ ఘటియించు గాక తానెంతటి కార్యం బైనడించి నాదీవనలన్'** అని తన దీవనలతో అది తప్పకుండా ఫలిస్తుందని కూడా జోస్యం చెబుతున్నట్టుంది ఈమాట.

మరి మహర్షే ఇలా నాటకమాడితే స్వామివారేమి తక్కువవాడా. ఆయనగారు నాటక సూత్రధారి గదా. **'అదితి మొఅంగి కుండలము లానరకుండు హరించె నేను వానిని కదనములోన ద్రుంచి అవికై కొని దాచితి నాటనుండియుం - బదిలము గాగ - నన్నదుగ౯బంపని కారణమేమి - లాతినే - ఇదెచనుదెంచియిత్తు ననుమీ శతమన్యుని తోడ సంయమీ'** అంటాడా మహర్షితో. అదితి దేవి తనకూ తల్లే. ఆవిడ కుండలాలు నరకుడు హరిస్తే వాణ్ణి సంహరించి అవి తన దగ్గర పెట్టుకొన్నాడింత కాలమూ. అవి దేవేంద్రుడడగనే లేదు. మరీ ఆలస్యం దేనికి నేనే తెచ్చి ఆవిడ కిస్తానని అతనితో చెప్పమంటాడు. నిజమైనా కావచ్చు. అయినా అది ఒక నెపం. ఆ నెపంతో పారిజాతాపహరణం చేయాలి తాను. ఆవిడ తన భార్యకూ అత్తగారే కాబట్టి కోడలిని వెంట బెట్టుకొని పోవాలి. రాబోయే దానికెంత ప్లాను వేశాడో చూడండి. ఎవరు కృష్ణుడు కాదు. తిమ్మకవి.

ఇలాటి పన్నుగడ మొదటి నుంచీ పట్టుకు వస్తున్నాడు కవి మనం బాగా గమనిస్తే. ప్రథమంలో రుక్మిణీ కృష్ణుల ద్యూత క్రీడ. పానకంలో పుడకలాగా నారదా గమనం. ఎప్పుడూ తేనివాడు పారిజాత పుష్ప మానాడు తెచ్చి ఇవ్వటం - కృష్ణుడు దాన్ని రుక్మిణి కివ్వటం - ఆవిడ ధరించటం ఇక దాన్ని చిలువలు పలువలు పెట్టి వర్ణించటం. సందట్లో సందుగా సవతులనూ సత్యాదేవినీ రెచ్చగొట్టే మాటలు మాటాడటం. సేదతీర్చు కొని వెళ్ళటం - తరువాత చెలికత్తె వచ్చి చెప్పటం - సత్యభామ నిర్వేదం అలక పాన్పు - కృష్ణుడి రాక - బ్రతిమాలటం - తన్నులు తినటం - హామీ ఇవ్వటం - అలక మానటం - అయింది ప్రథమాశ్వాసం. ఇది రాబోయే

కథకు నాంది. ఇక ద్వితీయంలో మరలా నారదుని రాక - స్నాన భోజనాదులు - సత్యను దీవించటం - అందులో భావి యుద్ధ సూచన. కృష్ణుడు దానికి మరొక అతుకు పెట్టటం. సరే నారద పాత్ర మరలా నిష్క్రమణ. సతీపతుల ద్యూతకేళీ వినోదం ఇంతలో ప్రొద్దు గ్రుంకటం. దీనితో కథ రేపటికి వాయిదా. తీరిక దొరికింది తిమ్మనగారికి.

ఇక చూడండి. కథ సద్దుమణిగేసరికి వర్ణనకు లంకించుకొన్నాడు. ఒక సాయంకాల వర్ణనే గాదు. అంధకార వర్ణనే కాదు. అభిసారికా వర్ణనే గాదు. నక్షత్ర చంద్ర చంద్రికా వర్ణనలే గాదు. అందులో జారిణుల వ్యవహారమే గాదు. వారిమీద దండెత్తే వలరాజు ఆర్భాటమే గాదు. చివరకు వేగుచుక్క ఉదయించి వైతాళికులు కృష్ణదేవుని నిద్ర లేపే నెపంతో ప్రభాత వర్ణనే గాదు. అంతా వర్ణనామయం. అదంతా కవి ప్రతిభా పాటవ మయం. అంతా రుచికరమే. అయినా అందులో ఒకటి రెండు మనవి చేస్తా వినండి. తిమ్మకవి భావన ఆ భావనలోని చమత్కార సంభావన ఎలాంటిదో. **'దినవారి రాశి మాపను మౌని గ్రోలంగ నదుగునంగను పట్టు న సలనంగ - తన మణి పడిపోవ ధరణీతలంబున నెమకంగ వచ్చిన నింగి యనంగ** - కమ్ముకొన్నా యట చీకట్లు **లోకంలో. మరి** కార్కొన్న **కటికి చీకటి మొగుల్మొత్తంబు గురిసిన వడగండ్ల గుంపులలాగా** వెన్నెల **వెండి తీగలు నిగిడించు చదలు కమ్మచ్చు బెజ్జములనంగ'** ఉన్నాయట నక్షత్రాలు. మరి శీతమయూఖుని మయుఖాలెలా ఉన్నాయో తెలుసా. **'కైరవములకు వెన్నెల నీరు వరవ బూని చేర్చిన పటికంపుదో నెలలా** ఉన్నాయట. పోతే చకోరాలు వెన్నెల బువ్వ మారగించటం చూడండి.

విరహుల మై సోకి వేఁడియౌ వెన్నెల

పచ్చి వెన్నెల నులివెచ్చ జేసి

కలువ పుప్పొళ్ళచే కసటైన వెన్నెల

వలిప వెన్నెలలోన వడిచి తేర్చి

చంద్రకాంతపు నీట జాలైన వెన్నెల

ముదురు వెన్నెల జుట్టు బదను చేసి

సతులమై పూతం బిసాళించు వెన్నెల

తనుపు వెన్నెల రసాయనము గూర్చి

చిగురు విలుకాని జాతర సేయఁబూని

కొలము సాములనందఱఁగూడ బెట్టి

వంతుగలయంగ బువ్వంపు బంతి విందు

పెట్టి రెలమి చకోరంపు పేరటాండ్రు

ఏమి అద్భుతమైన వర్ణన ఇది. ఎంత ముద్దుగా ముచ్చటగా వర్ణించాడో ముక్కు తిమ్మన. తిమ్మన ముద్దు పలుకంతా ఇక్కడ మూటగట్టినట్టయింది. ఏమిటంత ముద్దంటారా. అది బువ్వం బంతి. మనబోటి మానవులది గాదు. పక్షులది. అందులో చకోర పక్షులు. వెన్నెల పులుగులంటారు వాటిని, వెన్నెల మేసి బ్రతుకుతుంటాయి. వాటిలో ఆడవి వడ్డిస్తుంటే మగజాతి కడుపునిండా ఆరగిస్తున్నాయట - వెన్నెల అనే భోజనం. ఎలాంటి వెన్నెల. ఒకటి గాదు. రకరకాల వంటకాలవి. వండుతున్నాయి. ఒకటి వేడి వెన్నెల పచ్చి వెన్నెల కలిపి నులివెచ్చ చేసిన

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

వంటకం. వెన్నెల వేడి ఎలా అయింది. విరహుల శరీరాలు సోకి వేడెక్కిందట. రెండు కలువపూల పరాగంతో వగరైతే దాన్ని పలుచని వెన్నెలతో వస్త్రగాళితం చేసినదట. మూడవది చంద్రకాంత శిలల నుంచి ధారగా ప్రవహిస్తుంటే అందులో కొంచెం ముదురు వెన్నెల కలిపి జుఱ్ఱుకోటానికి వీలుగా చేసిన వంటకం. పోతే నాలుగు స్త్రీల అంగరాగంతో పరిమళించే వెన్నెలలో అచ్చమైన వెన్నెల కలిపి చేసిన రసాయన వంటకం. ఇవన్నీ ఎందుకో తెలుసా. మన్మథుని జాతర చేయాలనుకొన్నాయట అవి. అందుకోసం కులపెద్దల నందరినీ కూడ గట్టాయట. వరుసగా కూచోపెట్టి వారందరికీ వెన్నెల భోజనాలు వడ్డిస్తున్నాయట. ఎవరా వడ్డన గత్తెలు. చకోరపు పేరంటాండ్రు. వెన్నెల వర్ణన చదివాము చూచాము. ఇంత ముద్దులొలికే ముచ్చట గొలిపే వర్ణన ఎక్కడైనా చూడగలమేమో చెప్పండి.

అసలింతకు ముందు అభిసారికలను వర్ణించేటపుడు కూడా ఇలాంటి సుకుమారమైన వర్ణన ఒకటి చేశాడు మహాకవి. అదేమిటో కొంత వెనక్కు వెళ్ళి పట్టుకొందాం.

**చిలుక తేరును నల్ల చెఱకు విల్లును గల్వ**
**విరితూపు నిత్తుము మరుడ నీకు**
**వనమాలికయు మాత్న వంశనాళమునుపిం**
**ఛము సమర్పింతుము శౌరి నీకు**
**కప్పు గప్పడమును గస్తూరియును గాటు**
**కయు నివేదింతు ము కాళి నీకు**
**నేరేడు పండ్లు వినీల చామరలు దూ**

ర్వులు నొసంగు దు మిభవక్త్ర నీకు
నిట్టి లోకోప కారికి నిరుల దొరకు
చంద్ర సూర్యాది దుర్దోషశాంతి వఱలి
నిత్యత వహింప జేయంగ నేర్తురేని
యనుచుఁ బ్రార్థించి రభిసారి కాబ్జముఖులు.

చీకట్లో ఎవరూ చూడకుండా తమ ప్రియులను కలుసుకోటానికి పోయే కాంతల కభిసారికలని పేరు. వారెప్పుడూ అసూర్యంపశ్యలు. అచంద్రంపశ్యలు కూడా. వారి వెలుగు వారికి గిట్టదు. అంచేత సూర్యచంద్రాది దోషాలు ఇరులనే దొరలకెప్పుడూ సోకకుండా చీకటి రాజ్యమే ఎప్పుడూ నిలిచి ఉంటే ఎంత బాగుండునని వారి గొంతెమ్మ కోరిక. అందుకోసం కాకా పడుతూ వేడుకొంటున్నారు. ఎవరిని. కొంతమంది దేవతలను. ఊరక వేడుకొంటే మాట వింటారో లేదో. అంచేత వారికి లంచాలిచ్చి పని జరుపుకోవాలను కొంటున్నారు. వారి అమాయికత్వాన్ని ఎలా బయటపెడుతున్నాడో చూడండి తిమ్మన.

నలుగురిలో మొదటివాడు మన్మధుడు. రెండవవాడు అతని తండ్రి శ్రీకృష్ణుడు. మూడవది కాళికాదేవి. నాలుగవ వాడు వినాయకస్వామి. ఈ నలుగురు దేవతలకూ లంచమిస్తారట. ఏమిటవి. మన్మధుడికి చిలుక రధము. చెఱకు విల్లు కలువ పుష్పమనే బాణం – కృష్ణమూర్తికి వనమాలిక వేణునాళం నెమలి పింఛం – కాళికకు నల్లని దుప్పటి కస్తూరి కాటుక. మరి విఘ్నేశ్వరుడికి నేరేడు పండ్లు నల్లని వింజామరాలు గరికపోచలు. చిత్రమేమంటే ఇవన్నీ వారి దగ్గర ఉన్నవే. అవి కొఱత పడితే మళ్లా సప్లై

చేస్తామంటారు. అంతేకాదు. ఆ దేవతలు చాలావరకు నల్లని వారు కాబట్టి వారికి నల్లని దినుసులే సమర్పిస్తామంటారు. ఎందుకీ నల్లని పదార్థా లర్పించట మంటారా. నల్లని చీకటి వెలుగు వచ్చి తెల్లగా మారకుండా ఎప్పటికీ నిలిచి ఉండాలంటే ఆ చీకటి పార్టీ నల్లని పదార్థా మర్పించట మంటారా నల్లని చీకటి వెలుగు వచ్చి తెల్లగా మారకుండా ఆ చీకటి పార్టీ నల్లని వర్ణం కలిగిన దేవతలను బట్టుకొని వారికి ఇష్టమైన నల్లని పదార్థాలిస్తే తమ పార్టీ మెంబరే గదా చీకటి– దాని నెప్పటికీ నిలబెడతారేమోనని ఆశ. ఏమి చమత్కారంగా ఉందో చూడండి కవి మాటకారితనం.

ఇలా చీకట్లనూ వెన్నెలనూ వర్ణించటమే గాక మరొక సుకుమారమైన మాట ఏమన్నాడో తెలుసా తిమ్మన.

**‘ఆ నలినాయతాక్షు గడియారమునం దభిసారికా జిఘాం**
**సానిరత ప్రసూన శర చాపగుణ ధ్వనులో యనంగ ఘం**
**టానిన దంబుల య్యెడ వినం బడియెన్’**

అంటాడు. ఆరోజుల్లో ఉన్నాయో లేదో గాని గడియారాన్ని కూడా వర్ణించాడు. అదీ కృష్ణుని గడియారం. చేతి గడియారమా. గోడ గడియారమే. ఎందుకంటే గంటలు కూడా కొడుతున్న గడియారం. ఎలా ఉన్నాయా గడియారపు మ్రోతలు. అభిసారికల మీద ఎక్కుపెట్టిన మన్మధుని ధనుర్జ్యాటం కారాలా ఏమనే భ్రాంతి కొలుపుతున్నాయట. ఎంత దర్జా చూపే వర్ణన. మనుచరిత్రలో పెద్దన కూడా వర్ణించలేదీ గడియారం విషయం. ఒక్క శ్రీనాధుడే వర్ణించాడింతకు ముందు. **‘ఉడువీధిన్ శిఖరావలంబియగు నాంధ్రో ర్వీశు మోసాలపై గడియారంబది మ్రోసె**

**రెండిని మిదు'** లని క్రీడాభిరామంలో. ఆ తరువాత ఎవరూ దాని ప్రస్తావన చేయలేదు ఒక పిల్లల మఱ్ఱి తప్ప. ప్రస్తుతం తిమ్మనగారిలోనే కనిపిస్తుంది మరలా దాని ప్రస్తావన.

ఇక కృష్ణస్వామికి ప్రభాత గీతికలు పాడుతూ వైతాళికులు మేలు కొలుపులు మొదలు ఆ స్వామి మేలుకాంచి కల్యకృత్యములు నిర్వర్తించి ప్రయాణానికి రెడీ కావటం వరకూ చేసిన వర్ణనలు వర్ణనలు గావు. వైతాళికుల లాగే **'రాచిల్కలు కనుమెగిచి యున్న చెలువల' దమకుం బలుకులు నేర్పగ ముద్దులు గులికెడు పల్కులను మేలు కొలుపుతూ** వచ్చాయంటాడు కవి. ఈ ముద్దు పలుకులురా చిలుకలవా లేక ఆ ముసుగులో దాగిన తిమ్మనగారివా. కావచ్చు. ఏవైనా కావచ్చు. అసలు ముద్దు పలుకులకు హాస్యం కూడా తోడైతే ఇంకా ముద్దుగా ఉంటుంది. అది కూడా ఖుద్దుగా తెలుసు తిమ్మనకు. తెల్లవారితే వెలవెలబోయే చంద్రబింబమెలా ఉన్నదో మనకు చూపుతున్నాడు చూడండి.

**చరమాద్రి దావాగ్ని సంప్లుష్ట సుర సౌర**
**భేయీ కరీషైక పిండ మనఁగ**
**బహు చకోరక దంశ పరిపీత చంద్రికా**
**క్షౌద్ర నీరస మధు చ్ఛత్ర మనగ**
**ప్రత్యఙ్ముఖోచ్చల ద్రాత్రి వర్షీయసీ**
**పలిత పాండురకేశ బంధమనగ**
**గగన సౌధా లేపకర కాల శిల్పిని**
**ర్ముక్త సుధా వస్త్ర ముష్టియవగ**

పడమటి కొండమీద మండే దావానలం సోకి బాగా కాలి పిడకలాగా మారిన కామధేనువు పేడకడి మాదిరి – చకోరాలనే తేనెటీగలు రాత్రంతా పీల్చి పిప్పి చేసిన తేనె పెర మాదిరి – రాత్రి అనే ఒక ముసలిది తూర్పు నుంచి పడమరకు పయనిస్తుంటే ఆవిడ నరసి తెల్లబడిన వెంట్రుకల ముడి మాదిరి – ఆకాశమనే సౌధానికి బాగా వెన్నెల అనే వెల్ల వేసి కాలమనే పనివాడు ఆ తరువాత పక్కన బారేసిన సున్నపు గుడ్డ కుప్ప మాదిరి – ఉందని వర్ణిస్తాడు. ఇది మన నిత్య జీవితంలో చూచే మామూలు దృశ్యాలను ఆకాశందాకా తీసుకుపోయి అక్కడ అస్తమించి కాంతిని కోలుపోయిన చంద్రబింబానికి ముడిపెట్టి వర్ణిస్తున్నాడంటే కవి – ఎంత గడుసరి ఎంత హాస్యప్రియుడు. అందులో ఎంత చమత్కారం.

గరుత్మంతుడు స్మరణ మాత్రంతోనే ప్రత్యక్షమవుతాడు స్వామివారి ఎదట. ఎలాటి వాడా గరుత్మంతుడు. **పవ్రింబునకు నీక వైచిన బలశాలి – గజకచ్ఛ పాశన ఘాతుకుండు అమృత పశ్యతోహరుడు – అహిమృగ యావ్యసనా కులుండు** ఒక ఈక వేసిన వాడెంత బలశాలి. గజకచ్ఛపాలను తిన్నాడంటే ఎంత అశనఘాతుకం Glutton. అమృతాన్ని చూస్తుండగానే కొట్టేశాడంటే ఎంత కొంటెవాడు. పాములను వేటాడతాడంటే ఎంత వ్యసన పరుడు – తెలుగువారి ప్రసంగాలలో దొర్లే ఈ పలుకు బళ్లు చూడండి. ఒకవైపు అతని బలపరాక్రమాలు మెచ్చుకొంటూనే ఎంత ముచ్చట గొలిపే హాస్యరస మొలికిస్తున్నాయో.

ఇక బయలుదేరారండీ దంపతులిద్దరూ ఆ గద్దల రాయడి నెక్కి కూచొని. గగన వీధిలో పయనిస్తుంటే ఆ దివ్య దంపతులకు ప్రకృతి ఎన్ని

ఉపచారాలు చేస్తున్నదో కవి ఎంతో సహజంగా సుందరంగా వర్ణిస్తాడు. అన్నిటికేమిగాని అక్కడ ఒక సన్నివేశం వర్ణించాడు తిమ్మన. అది ఎంత అద్భుతమో ఎంత ఉదాత్తమో ఎంత సముచితమో ఎంత నీతిబోధకమో అన్ని భావాలూ కలగలిపి రంగరించి ఒక రసాయనంలాగా ఆస్వాదించాలి మనం నిజంగా సహృదయులమే అయితే. ఏమిటది

**నతి సేసె వైన తేయుడు**
**గతి భేదములోన నన్నగనుగొని యతడున్**
**గతిలోనన నతి సేసిన**
**చతురతకున్ మెచ్చిరపుడు సత్యయు హరియున్.**

ఆకాశంలో గదండీ వెళ్లుతున్నాడా గరుత్మంతుడు. అందులోనూ నిలువుగా నిటారుగా వెళ్లుతున్నాడొక రాకెట్టులాగా. అలా వెళ్లుతుంటే అడ్డంగా రథాన్ని నడుపుతూ మరొక మహానుభావుడు వేగంగా పయనిస్తున్నాడు. ఎవరో గాదాయన సూర్యరథ సారథి అనూరుడు. ఊరువులు లేవాయనకు. అందుకే రథమెక్కి కూచున్నాడు కదలకుండా. రథానికి కట్టిన వేడు గుఱ్ఱాలు. వాటిని ముందుకు వంగి తోలుతున్నాడు. అతడీ గరుత్మంతుడి కన్నవారే సాక్షాత్తూ. వినతకు పుట్టిన మొదటి సంతానం. మరి అన్నగారు తన మార్గాని కడ్డంగా ఎదురుపడేసరికి వేగం తగ్గించుకొని ఆయన రథానికి క్రిందుగా వెళ్లి మళ్లీ పైకి లేచిపోయాడు. అది అన్నగారికి నమస్కారం చేసిపోతున్నట్టుందట. అలాగే తమ్ముడు నమస్కరిస్తే తాను కూడా ప్రతి నమస్కారం చేయటం గదా మర్యాద. అది ఎలా చేశాడాయన. గుఱ్ఱాలను తోలే మిషతో ముందుకు వంగాడని గదా చెప్పాము. అదే

తమ్ముడికి చేసిన ప్రతి నమస్కారం. నతి అంటే నమస్సు. అంటే తల వంచి పెట్టే దండం. సరియైన అర్థంలో ప్రయోగించాడు కవి. అది కూడా వారిరువురూ ఆగకుండా వేగంగా వెళ్లుతూ చేసిన క్రియ అది. దానినెంత సహజంగా ముద్దుగా ముచ్చటగా వర్ణించాడో చూడండి కవి. అన్నదమ్ముల సంస్కారం అన్యోన్యత ఎంతగా తొంగిచూస్తున్నదో ఈ పద్యంలో చెప్పలేము. అంతే కాదు. వారి అన్యోన్యత చూచి సత్యాకృష్ణులే ఎంతో సంతోషించారంటాడు కవి. వారే సంతోషించినపుడిక మీ బోటి సహృదయులు సంతోషించక పోవటమేమిటని మనకు హెచ్చరిక. ఏమి అద్భుతమీ సన్నివేశం.

ఇక అక్కడ మేఘమండలాన్ని వర్ణించాడే మహాకవి - చంద్ర మండలాన్ని వర్ణించాడే - ఖేచరులైన కిన్నర కింపురుష గరుడ గంధర్వులను యక్షులను వర్ణించాడే - శరవేగంతో వ్యాపించి క్రిందికి దూకే ఆకాశ గంగను వర్ణించాడే - ఎంతో మనోహరంగా సాగిందా వర్ణన. అలా వర్ణిస్తూ వర్ణిస్తూ చివరకు స్వర్గాన్నీ దానివై భవాన్నీ కండ్లకు కట్టినట్టు చూపాడు. దానితో ద్వితీయాశ్వాసం సమాప్తమయింది. ఈ వర్ణనలొకా దాని తరువాత ఒకటి నడుస్తున్నాయంటే అసలు గరుత్మంతుడి మీద కూర్చున్న ఆ ది మదంపతులాయా దృశ్యాలు చూస్తూ ఎలా ముందుకు సాగిపోతున్నారో అలా సాగి చివరకు తమ ప్రయాణానికి గమ్యమైన స్వర్గ సీమనెలా చేరుకున్నారో పోల్చుకో లేరూ రసజ్ఞులైన సహృదయులు. వర్ణనలోనే ప్రయాణం కూడా కలిసి రావటం ఎంత ముచ్చట.

మళ్ళీ కథనందు కొన్నాడు కవి తృతీయాశ్వాసంలో. గమ్యం చేరేవరకూ వర్ణనలు. చేరాక కథా భాగం. ఏమి చక్కని విభాగమిది. అంతకు

ముందే స్వర్గాధిపతికి వార్తవెళ్లింది. ఎవరు అందించినవారు. ఇంకెవరు. ఉన్నారుగా నారద మహాముని. చూడండి ఒక్క నారదుణ్ణి సంధానకర్తగా చేసి తిమ్మనగారు ఎంత నాటక మాడుతున్నాడో. మొదటి నుంచీ నారదుడే. చివరదాకా నారదుడే. ఆ మాటకు వస్తే కృష్ణునికి పారిజాతమిచ్చి సత్య కాగ్రహం తెప్పించి ఆవిడ దగ్గరి కాయనను జేర్చినవాడు నారదుడు. సత్యకోపం తీరిన తరువాత ఏమీ ఎఱగనట్లు మరలా వచ్చి సత్యచేత మర్యాదలందుకొని ఆవిడను తన పెనిమిటితో పాటు స్వర్గానికి ప్రయాణం కట్టించినవాడు నారదుడే. వారు వస్తున్నారు వారిని ఎలా రిసీవు చేసుకొంటావో చూచుకోమని దేవేంద్రుని హెచ్చరించిన వాడు నారదుడే. **'అంతకుమున్న నారద మహామునిచే మఘవుండు కంసదైత్యాం తకు రాక తానెఱి గాడట** చూడండి. ఎఱగటం వరకేనా. సపరివారంగా వచ్చి ఆయనకు సాష్టాంగ పడతాడు. అది చూచి దిక్పాలకులంతా ప్రణమిల్లుతారు. కుశల ప్రశ్నలయిన తరువాత ఎవరి వాహనాలు వారెక్కి  బయలుదేరుతారు. ఇక దారి పొడవునా శ్రీకృష్ణదేవుని చూచే వేడుకలో పురసుందరులెన్ని పోకడలు పోయారో అది చెప్పనలవి కాదు. ఒకతి గవాక్షంలో నుంచి చూస్తుంటే మరొకతి దానికేదో పని ఉందని చెప్పి అది లేచివస్తే దాని చోటు తాను ఆక్రమించుకొని చూచిందట. మరొకతి స్నానం చేసి కేశపాశం తడి ఆర్చుకొంటూ చేతితో పట్టుకొని అలాగే వస్తుంటే స్వామివారికి నెమలి పింఛమొకటి కానుక ఇవ్వటానికి వచ్చినట్టుందని వర్ణిస్తాడు కవి. ఎంత ముద్దు గొలిపే వర్ణనలివి. ఇంతెందుకు. **'అనిమిష పురజాలకములు వనితా**

**జనతామయము లైతే - వనితల హృదయం బనురాగ రసమయమైతే - ఆ యనురాగము శౌరిమయ** మయిందట. ఈ ముగింపు వర్ణన ఎంత చక్కగా ఉందో చూడండి. సంగీతంలో ముక్తాయింపిది.

ఇంతకూ దేవేంద్రుడు తనకు కైదండ ఇస్తే గరుడుని దిగి కృష్ణస్వామి అన్నగారితో పాటు తాను దర్శించింది మొట్టమొదట ఎవరో తెలుసా. అదితి దేవి. తనకూ అతనికీ తల్లి ఆవిడ. ఇటూ అటూ దేవతా స్త్రీలు వింజామరలు వీస్తుంటే శచీదేవి తన ఒళ్లో అత్తగారి పాదాలు పెట్టుకొని ఒత్తుతుంటే ఎంతో దర్జాగా కూచుని ఉందావిడ. పత్నీ సమేతంగా నమస్కరిస్తాడు కృష్ణస్వామి. నరకుడపహరించిన కుండలాలు మరలా ఆవిడ కంద జేస్తాడు. ఇదీ ఒక నెపమే. నాటకమే. ఆవిడ సాదరంగా దగ్గర కూచో పెట్టుకొని కొడుకులో పరమాత్మను దర్శిస్తూ ఇక ఎక్కడలేని భక్త్యావేశంతో పొగడుతూ మరలా తేరుకొని నాయనా రాకరాక వచ్చావు. ఇవాళ రేపు ఇక్కడ ఉండి మావాడి ఆతిథ్యం తీసుకొనిపోదువు గాని తొందర పడకు అని బ్రతిమాలుతుంది. అమ్మా నీవు బ్రతిమాల నక్కర లేదు. నాకు ఈ రెండు రోజులే పని ఉంది. అది ముగించుకొని నిదానంగానే వెళ్లు తానని ఆయన తనలో తాను అనుకొనే ఉంటాడు బహుశా. తిమ్మన వ్యంగ్యంగా సూచిస్తున్నాడు.

తరువాత దేవేంద్రుడు స్వామీ అమ్మ చెప్పిన మాట విన్నావుగదా. నాకూ అదే కోరిక. వైజయంత సౌధం నీకు విడిది ఏర్పాటయింది. సతీపతులు హాయిగా అక్కడ ఉండండీ రెండురోజులు అంటాడు. ఇక చూడండి. అన్నదే తడవుగా ఆ లాడ్జిలో ఉంటూ తన ప్రేయసితో పాటు

రంభాద్యప్సరసలు సేవిస్తుంటే అలా వాహ్యాళికి వెళ్లి నందనవన మంతా విహరిస్తారు. ఆ పాటికి వసంతం కూడా వచ్చి– ఒక వసంతమేమిటి. **అఖిలర్తు నందనమట'** ఆనందనం. అన్ని ఋతువుల శోభా తిలకిస్తూ పోతారా దంపతులు. అక్కడి వర్ణనలిక అతిలోకం. అతి మనోజ్ఞం, దీనితో తృతీయాశ్వాసం చెల్లు. కథలేదుగా – కృష్ణుడు లాడ్జి చేరితే అదీ సెలవు తీసుకొన్నది తాత్కాలికంగా.

క్రమంగా వచ్చారా దంపతులిద్దరూ ఆ వృక్షమీ వృక్షం చూస్తూ చివరకు పారిజాతవృక్షం దగ్గరికి. దాని వైభవ మంతకు ముందు నారదుడు రుక్మిణికి వర్ణించిన దానికంటె హెచ్చుగా వర్ణించి చెబుతాడు సత్యకు. ఇక దేని కాలస్యమని ఆవిడ తొందర చేస్తే చిరునవ్వుతో ఆవిడ కొక పుష్పం కోసి చెవిలో ఉంచి తొందర లేదు. కొంచెంసేపీ అప్సరసలతో విహరించి వారిని వీడొలిపి నీ కోరిక తీరుస్తాగా ఓపిక పట్టమని వారితో కలిసి వనవిహారం జలకేళి అంతా సలుపుతాడు. ఆయన సలిపాడని సందు చూచుకొని తిమ్మనగారు వనవిహారాదులూ పుష్పావచయాలూ – జలక్రీడాదులూ – చివరకు సంధ్యా కాల చంద్రోదయాదులూ – తరువాత సూర్యోదయమూ – ప్రబంధానికి కావలసిన వర్ణన సామగ్రి అంతా ఖాళీ చేస్తాడు. మంచి అవకాశమిది తిమ్మనకు.

ఎవ్వరూ వెంట లేరిప్పుడు ఎక్కడి వారక్కడే గప్‌చుప్ – నడుస్తూపోతే ఆలస్యం – అంచేత గరుడుని మీదనే కూచుని వెళ్లి పారిజాత వృక్షాన్నే పెళ్ళగిస్తాడు. వనపాలకు లడ్డగించబోతారు. వారితో కృష్ణుడేమీ మాటాడడు. ఆయన బదులు సత్యభామ చేత పలికిస్తాడు తిమ్మన. ఏమని–

**వినుడు సురేశ్వర వనపాలకులు వార్థిఁ**
**బొడమిన యీ దివ్య భూరుహమున**
**కింద్రాణి యెవ్వతె యింద్రుండు నెవ్వఁడు**

తోడి యిందిరను కౌస్తుభము నెవ్వఁ
డధిపుడై ధరియించె నతఁడె చేకొను గాక
తెకతేర యిది యేమి యొకరి సొమ్మొ
యిదె నాదు విభునిచే నీవదాన్యనగంబు
నొడియించు కొని యేగుచున్న దానఁ
బలుకు లేటికిఁ దా వీరపత్నియేని
మీ శచీదేవి తనదు ప్రాణేశుడైన
మఘవు నిటఁబంపి సత్యభామా విధేయు
వలన మరలంగఁ గొనుటె పో వాసితనము

ఎంత అద్భుతమైన సమాధానమో చూడండి ఇది. కృష్ణుడి నోట గాక సత్యభామ చేత పలికించటం నంది తిమ్మన గడుసుతనం. అసలు ఆ వృక్షాన్ని పెఱికి తీసుకుపోతున్న వాడు కృష్ణుడు – దానికి అభ్యంతరం చెప్పారు వన పాలకులు. ఆయనగదా వారికి జవా బివ్వవలసింది. మరి సత్యభామ కలగ జేసుకోట మేమిటి. అదే చమత్కారం. కృష్ణుడి కక్కర లేదు పారిజాతం. దాని కోసంగా ఇంద్రునితో గొడవ పడవలసినంత సీను లేదాయనకు. ఏదో భార్య పోరు పడలేక ఆవిడ ముచ్చట తీర్చాలని వచ్చాడంత మాత్రమే. అంచేత తోటమాలుల లాంటి వారితో తాను చేసిన పనికి సంజాయిషీ ఇచ్చుకోవలసిన పరిస్థితికి రాకూడదా పాత్ర. ఆడవారి మధ్య వ్యవహారం కాబట్టి ఆడువారు నోరు చేసుకొని దబాయించటమే సబబుగా సొగసుగా ఉంటుందది తెలుసు తిమ్మనకు. అందుకే సత్యభామ

కొప్పజెప్పాడా ద్యూటీ. ఆవిడ ఒక గొప్ప న్యాయవాదిలాగా ఎలా వాదిస్తున్నదో చూడండి. అసలు క్షీరసాగరంలో పుట్టింది పారిజాతం. దానితో పాటు పుట్టిన లక్ష్మిని కౌస్తుభాన్ని సొంతం చేసుకొన్నవాడు శ్రీమహావిష్ణువు. అసలాయన అనుగ్రహం వల్లనే సాగరమథనం జరిగింది. అలాంటప్పుడా లక్ష్మీకౌస్తుభాలతో పాటు పారిజాతం కూడా ఎవరికి దక్కాలి. ఆ మహాత్మునికే గదా. అది గుర్తించకుండా మీ శచీదేవి తనకు చెందవలసిన సొమ్ముని ఎలా చెబుతుంది. దానికి శచిగాదు శచీవల్లభుడైన ఇంద్రుడు గాదు హక్కుదారు. అయినా మాది అని వాదించిందంటే ఆవిడ వీరపత్నే అయితే తన భర్తను పంపించి నానాథునివల్ల విడిపించుకోమని చెప్పండి చేతనైతే. నానాథుడు నామాట కాదనడు. అన్ని విషయాలలో నాకు విధేయుడు.

చూచారా. ఈ రెచ్చగొట్టే మాటలు. వెంటనే వారింద్రుడికి తెలియజేస్తారు. దానికా ఇంద్రుడేమో గాని అతని కంటే ముందు శచీదేవి వెల వెలబోయింది. అది చూచి భరించలేక ఇంద్రుడు **'నీకింత మాత్రాన విన్నంబడనేల పోదునిదె సత్యా గర్వభారంబు దివ్యనగంబు న్విడిపించి వత్తు'**నని యుద్ధానికి సన్నద్ధ డవుతాడు చూచారా. అక్కడ సత్య ఇక్కడ శచి. ఒక విధంగా తోడికోడండ్లే ఇద్దరూ. పుష్పాలంటే ఇద్దరికీ ఇష్టమే. అందులో దివ్యమైనవి. ఎప్పటికీ వాడిపోనివి. తమ భర్తలను వశం చేసుకొని తమ కనుసన్నలలో నడుచుకొనేలా చేసేవి – అందుకే పడిచావట మిద్దరూ. మొదటి నుంచీ అనుభవిస్తున్నదా సౌభాగ్య మింద్రాణి – కొత్తగా దాన్ని సొంతం చేసుకోవాలని చూస్తున్నదీ ఉపేంద్రాణి. ఎంత ముచ్చటగా ఉందో చూడండి వారి స్పర్థ. అందుకే కృష్ణుడే మీ పట్టించు కోలేదిక్కడ. పని

జరిపి కూచున్నాడు. మరి అక్కడ దేవేంద్రుడా. భార్య ప్రోద్బలంతో కాలుగాలిన పిల్లిలా చిందులు తొక్కుతున్నాడు. దిక్పాలకు లందరూ వారి వారి సైన్యాలతో కదనానికి బయలుదేరారు. దీనితో చతుర్థాశ్వాసం విశ్రాంతి తీసుకొన్నది.

పోతే ఇక పంచమం. మరలా కథకంచికి. కథ అంతా యుద్ధ కధే. దిక్పాలకులు పరారయినారు కృష్ణుని ధాటి కోర్వ లేక. దేవేంద్రుడు పండ్ల బిగువుతో సాగించినా అది ఫలించలేదు. అది సాగుతున్న కొద్దీ మిగతా వారి మాట ఎలా ఉన్నా ఒక మహానుభావుడి కది విందు భోజనం. ఆయనే కలహభోజనుడు. ఏమి చేస్తున్నాడు. **'నింగి పైఁగుతుక రసాతిరేకమున గుంచియ వీచి నటించె** నంటాడు తిమ్మకవి. వింజామర ఇటూ అటూ వీస్తూ ఆనంద తాండవం చేస్తున్నాడట. ఎంత ముచ్చట గొలిపే సన్నివేశం. తట్టుకోలేక ఇంద్రుడు వజ్రాయుధమే ప్రయోగించాడు. పంక జోదరుడు దాన్ని చేత్తో ఒడిసి పట్టాడట. అది తన ముందలనే పట్టినట్టు పరాభవం చెందాడట దేవేంద్రుడు. దానితో కొండ దిగినట్టు ఐరావతం దిగి వచ్చాడు కాళ్ల బేరానికి. నేన పరాధినని సాగిలపడ్డాడా మురవిరోధికి.

ఇక చూడండి ఆ అన్నదమ్ముల ఇద్దరి నాటకం. నేనపరాధం చేశాను మన్నింపమని ఇంద్రుడంటే – **'నీవలన లేదొక తప్పును** – మఱి నీ వలననా అని నీవడుగవచ్చు. నావలన కూడా లేదు. **'నీమఱందలీ కొమ్మ వదాన్య భూరుహము గోరినఁ దెచ్చితి నంత మాత్రమే.** నాకోసం గాదు నీ మఱదలు ముచ్చటపడితే పట్టుకెళ్లుతున్నాను. ఇదుగో నీ సొమ్ము వజ్రాయుధం నీవే తీసుకో. కావాలంటే పారిజాతం కూడా తీసుకోమని **'ఆ తరువీదలంచాడట'**

చూడండి వజ్రాయుధమంటే తీసుకొంటాడు. పారిజాతం మరలా తీసుకొంటాడా దేవేంద్రుడు. తీసుకోడని తెలుసు కృష్ణుడికి. అయినా అది ఒక చమక్కు. లీలా మానుషుడు గదా. అదీ ఒక వినోదమే. దానికి చకితుడై ఆ సురరాజే మంటాడో చూచారా. **'సొమ్మన నెద్ది యేననగ సొమ్మున కెన్వడ - కర్తవీవు - నీ సొమ్మ ఖిల ప్రపంచము'** నీవు భూతలం మీద ఉన్నంత వరకూ ఈ వృక్షం కూడా నీ దగ్గరే ఉంటుందని హామీ ఇస్తాడు. ఇందులో వ్యావహారికమేగాక పారమార్థికమైన ప్రసంగం కూడా ఎలా పట్టుకు వచ్చాడో చూడండి మహాకవి. సత్యభామ వన పాలకులతో ఆడిన మాటలు కూడా దేవేంద్రుని మాటలలో ఎలా కలిసి వచ్చాయో చూడండి. అంత మాత్రమేగాక కృష్ణ పరమాత్మ స్థాయి ఏమిటో ఇంకా గొప్పగా గుర్తించి కీర్తించాడు దేవేంద్రుడు. అసలదీ కవి వివక్షితం. ఇక మరలా ద్వారకకు బయలుదేరి వస్తారు సతీపతులిద్దరూ. వారితో పాటు వచ్చిన పారిజాత వాసన సోకిందో లేదో బధిరులు విననేర్చారు. అంధులు కన నేర్చారు. ముదుసళ్ళు కొదమ వయసువారయ్యారు. దరిద్రులు ధనికులయ్యారు. వ్యాధిగ్రస్తులు స్వస్థత చెందారు. ఒకటి గాదులెండి. మూడు పూలారు కాయలుగా ద్వారకా నగరమంతా అమరావతీ నగరంగా మారిపోయిందని వర్ణిస్తాడు కవి. ఇక కృష్ణుడు దేవకీ వసుదేవులకు మ్రొక్కి బల భద్రుడికి ప్రణమిల్లి గురుపురో హితాదులను వినయంతో గారవించి మిత్రులను కౌగిలించి సోదరాదుల నమస్కృతులు స్వీకరించి వినతాతనూ భవుని ప్రేమపూర్వకంగా వీడ్కొలి పాడని తిమ్మనగారు వర్ణిస్తుంటే ఎంత నిండుగా కనుల పండువుగా ఆ దృశ్యాన్ని చూస్తున్నట్టుందో చెప్పనలవి కాదు.

Vallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

ఇది ఇలా ఉండగా మరలా తయారయ్యాడు నారద మహర్షి అక్కడికి. చుక్క తెగిపడ్డట్టు ఎక్కడి నుంచి వస్తాడో పోతాడో ఎవరికీ తెలియదు. తెలియనిది మనకు. ఆయనకు గాదు. ఎప్పుడు రావాలో ఏ పనికి రావాలో ఆయనకు తెలుసు. ఆ పాత్రలను నిర్మించిన మహాకవికి తెలుసు. ఏమిటది. ఎప్పుడు వచ్చినా ఎందుకు వచ్చినా ఒకటే పని ఆయనగారికి. **'పలు దెఱగు ముళ్ల మాటల కలహమె కళ్యాణమని జగంబుల వెంటన్ మెలగట** మని ముందుగానే సూచించాడు కదా. అయితే కలహం కల్పించటమే గాదు. దాన్ని మరలా తానే పరిష్కరించి అందరినీ ఆనందింప జేయటం కూడా ఆయన పనే. ఒకముడి పెట్టనూగలడు. దాన్ని మరలా విప్పనూ గలడు. అఘటన ఘటనా కోవిదుడు. అది ఆయన ఎక్కడో గాదు. కృష్ణ పరమాత్మ దగ్గర అభ్యసించిన వాడే. ఇద్దరూ ఇద్దరే. కాలాంతకులు. వీరాడే నాటకమే ఈ జగన్నాటకం. ఈ పారిజాత కథా నాటకం కూడా వారి నాటకమే.

మళ్లీ ఆడటానికి వచ్చాడొక నాటక మా మహర్షి. ఇదే ఆఖరి నాటక మాయనగా రాడదలచింది. పంచమాంకం గదా ఇది. నాటకానికి కూడా అసలు అయిదంకాలే ఉంటాయి. అయిదో అంకం నిర్వహణ సంధితో ముగుస్తుందంటారు నాటక శాస్త్రజ్ఞులు. ఇక్కడ శ్రవ్యకావ్యంలో కూడా కథ నాటక ఫక్కీలో నడుపుతున్నాడు కాబట్టి తిమ్మనగారు నాటకంలాగానే ఈ పంచమాశ్వాస నిర్వహణలోనే భరత వాక్యం పలకదలచాడా అనిపిస్తుంది. **'అభీష్ట ఫలసిద్ధి సంతోషిత స్వాంతు'** లైన సత్యా కృష్ణులను జూడాలనే వేడుకతో వచ్చాడట. వారిద్దరికీ ఫలసిద్ధి కలిగినా తనకింకా ఫలసిద్ధి కలగ లేదా మహర్షికి. మామూలు మహర్షి కాదు గదా. కలహభోజనుడాయె. అది ఇంద్రోపేంద్రుల యుద్ధంతో కొంత ఆకలి తీరినా పూర్తిగా తీరలే దాయనకు. అది పూర్తి చేసుకొందామనో ఏమో పని గట్టుకొని వచ్చాడు

మరలా ద్వారకకు. చూడండి. మొదట వచ్చిందీ ద్వారకకే. చివరకు వచ్చిందీ అక్కడికే. వచ్చినవాడు కృష్ణుడిని గదా పలకరించవలసింది. అలా కాక సత్యాదేవితోనే మాటాడుతున్నాడు. ఆవిడతోనే పని యిప్పుడు. ఏమిటా పని. బయటపెడుతున్నాడు. వినండి.

**హేమనిభగా త్రి నీభాగ్యమేమి చెప్ప – జిష్ణుభూజంబు నీపెట్టు చెట్టు జేసి సవతులన కాదు త్రిభువనేశ్వరి యనంగఁబొలుచు పౌలోమి గెలిచి తివ లఘు మహిమ** ఏమి మాటో చూడండి. అప్పుడు రుక్మిణిని చూచి సవతులం దరినీ సత్యభామతో సహా మించి పోయావన్న వాడు. ఆ తరువాత **'సవతికాంత ల్వాచి లజ్జింపగా** అని మరలా సత్యనే అందరికన్నా మిన్నగా స్తోత్రం చేసినవాడు. అక్కడికి తీరలేదాకలి. సత్యా రుక్మిణులకు చిచ్చు పెట్టి అది సమసిపోగానే మరలా ఇప్పుడొక క్రొత్త వారిని పట్టుకు వచ్చాడు రుక్మిణీదేవి స్థానంలో. ఎవరో గాదావిడ. సాక్షాత్తూ దేవేంద్రుడి అర్థాంగి పౌలోమి. అంటే శచీ దేవి. నీ సవతులు రుక్మిణీ ప్రభృతులెక్కడ పోవాలో. ఆ శచీదేవినే గెలిచావు పొమ్మంటాడు. ఎలాగట. ఆవిడ నిత్యమూ అనుభవించే పారిజాత పుష్పసౌరభాన్ని ఆవిడకు దూరం చేసి సరాసరి భూలోకానికి పట్టించి తెచ్చి పెరటి చెట్టుగా నాటించుకొన్నావు. నీభాగ్యమేమి చెప్పాలి లెమ్మని పొగడ్త.

ఇది కేవలమొక నాందీ ప్రస్తావన లాంటిదీ మాట. పోతే నాటకా రంభమేమిటో తెలుసా. **'అతులిత తావకీన మహిమాతి శయోచితమైన పుణ్యక వ్రత మొనరింపగావ లయు వారిజలోచన నీవు'** నీ గొప్పతనానికి తగినట్టు ఒక గొప్ప వ్రతమే చేయాలంటాడు. ఏదైనా ఒక విలువైన వస్తువు మనం కోరింది లభించినప్పుడు పదిమంది దృష్టిపడకుండా దానికి పరిహారంగా ఒక పుణ్యకార్యం జరపటం పరిపాటి. అదేమిటని అడిగితే

తడుముకోకుండా పుణ్యక వ్రతం పొమ్మంటాడు. ఇది తానే కల్పించిన వ్రతం. తానే దానికి పెట్టిన పేరా అనిపిస్తుంది. దానికి తోడు ఇది ఎవరైనా ఇంతకుముందు చేశారా లేదా అని ఆవిడ అనుమానించకుండా ఒక మాట విసురుతాడు. ఏమని–

**'అయ్యరుంధతియును గౌరియున్ శచియు తత్పరబుద్ధి నొనర్చు వేళఁజూచితి మును' తద్విధం బెఱుగఁ జెప్పెద నేనిపు దాను పూర్వగన్'** అని ఏదో తాను చూచినట్టు చేసినట్టు కథలు కూడా కల్పిస్తాడు. అరుంధతి – పార్వతి అంతేగాక శచీదేవి కూడా ఈ వ్రతం చేసింది – వారు చేస్తుండగా నేను ప్రత్యక్షంగా చూచాను. దాని విధానమంతా చెబుతానంటాడు – అంటే అలాగే నీవు చేయవమ్మా బాగుంటుందనే గాక దాని విధానం తెలిసినవాడు తానే గనుక తన్నే పురోహితుడుగా పెట్టుకొని ఆ దానమేదో తనకే ఇమ్మనే భావం కూడా ఇందులో వ్యంగ్యంగా స్ఫురింప చేస్తున్నాడు. ఎవరు నారదుడా. నారదుడి బురఖాలో తిమ్మన.

ఇక చూడండి చిలువలు పలువలు పెట్టి వర్ణిస్తాడా వ్రత విధానం. ప్రొద్దున్నే లేచి స్నానపానాలు ముగించుకొని రత్నాంబర భూషణాలు ధరించి అత్తమామలకు భక్తితో నమస్కరించి ఆ తరువాత మాత్సర్య కోపాగ్రహాదులు విడిచిపెట్టి సవతులందరి ఇండ్లకూ వెళ్లి వ్రతోత్సవానికి వారందరినీ ఆహ్వానించి సగౌరవంగా తీసుకొని వచ్చి ప్రతిదినమూ పదివేలమంది పేరంటాండ్ర కర్చన లొనరించి వారందరికీ వస్త్ర మాల్యాభరణాదులు యథోచితంగా సమర్పించి – ఇలా చైత్ర శుద్ధ నవమి మొదలుకొని ఒక నెలరోజులు వ్రత మాచరించా లంటాడు. ఇది ఒక విధంగా సత్యా

Valluri Brahmasri, Rao, www.andhrabharati... (watermark)

గర్వభంగం చేయాలనే ఉద్దేశంతో కూడా అని ఉండవచ్చు నారదుడు. అది నారాయణుడికి కూడా అభిమతమేగా. ఇరువురూ కూడబలుకు కొనే ఈ వ్రత ప్రస్తావన జరిగి ఉంటుంది. అది తిమ్మనగారికి బాగా తెలుసు. అప్పుడే ముద్దు ముచ్చట.

ఈ ముచ్చట ఇంతటితో ఆగలేదు. ఆగితే సారస్యం లేదు. మరేమిటి.

**'పరమాచార ధురీణు - నధ్యయన సంపన్నున్ శుభాకారు - శాస్త్రరహస్యజ్ఞు - విశిష్ట వంశజుఁ బ్రశాంతస్వాంతు నుద్యద్దయా పరతంత్రు న్విదితాత్మ భూసుర వరుంబ్రార్థించి యాచార్యుగా తరలాక్షీ! నియమింప గాదగు వ్రతో ద్వాస క్రియా వేళకున్.**

ఈ ఈ లక్షణాలు గల ఒక బ్రాహ్మణోత్తముణ్ణి దానమిచ్చే వేళకు ఎన్నుకోవాలంటాడు. మరి ఈ లక్షణాలన్నీ చూస్తే తనకే ఉన్నాయని చెప్పక చెప్పినట్టవుతున్నది. ఎలాగూ తనకే వస్తుంది ఛాన్సని తెలుసు మహర్షికి. అంతేకాదు. **'మాద్యద్దంతివాహా వళుల్ నారీరత్న చయం బన ర్ఘనవ రత్నశ్రేణి గోభూపరి వారాలూ** ఇవన్నీ రాసులు రాసులు దానం చేయాలట బ్రాహ్మడికి. తనకేనా. ఘోటక బ్రహ్మచారి కాయన కెందుకు - అది ఒక నటన. ఎలాగూ వెనక్కిచ్చేవే అవన్నీ. పోతే అసలు విషయానికి వస్తూన్నా డిప్పుడు.

**'ఏతద్వస్తు సదక్షిణా కముగ నాత్మేశున్ సురానోకహా**
**న్వీతుంగా దగధారవోసి - ద్విజు దేయే యర్థము ల్వేడినన్**
**చేతః ప్రీతిగనిచ్చి క్రమ్మఱఁ బతింజేకొంట యుక్తం'** బంటాడు. పారిజాత వృక్షంతో సహా నీ పెనిమిటిని కూడా దానమిచ్చి ఇంకా ఆయన

ఏమి కోరితే అవన్నీ ఇచ్చి తరువాత వ్రతమంతా పూర్తి అయితే పెనిమిటినీ వృక్షాన్ని కూడా వెనక్కు తీసుకోవచ్చునంటాడు. అసలిదీ నారదుడి ప్లాను. ఇస్తే అలాగే తీసుకుపోతాడేమో ననే అనుమానం కలగకుండా తాత్కాలికంగా ఏడిపించటానికి చెప్పిన మాట ఇది. అంతేకాదు.

**'ధనకనక వస్తు సమితియు తనయ సమృద్ధియును గలిగి తానుం బతియున్ మనమునన లెఱుగక యనితరసుల భైక సుఖము** లందుదురని కూడా హామీ ఇస్తాడు. మనసులో దంపతులిద్దరికీ ఇకమీదట పొరపొచ్చా లుండవనట మామెకు గొప్ప ఆశ గొలిపే మాట. అంతే కాదు. అంత మాత్రమే అయితే నారదుడు కాడాయన. కలహభోజను డంతకన్నా కాడు. సవతుల ఇండ్లకు పోయి అదే పనిగా **'తోడి తేఁదగున్'** అంటాడు. అంటే సగౌరవంగా పిలుచుకు రావాలట. దీనితో కొంత గర్వభంగ మవుతుందావిడకు. అది ఇంకా పూర్తిగా కావాలని కూడా ఉందో ఏమో పుణ్యక వ్రతానుష్ఠాన మంతా అయిన తరువాత వాయనాలు అన్నీ బ్రాహ్మడికి ఇస్తూ ఇస్తూ తన పెనిమిటిని కూడా దానం చేయాలంటాడు. అది వ్రతంలో ఒక భాగమంటాడు పైగా. పెనిమిటి నెవరైనా దానం చేస్తారా. అందులోనూ నలుగురి సమక్షంలో. అది ఆవిడకు తలవంపు బాగా కలిగించే వ్యవహారం. అయితే మరీ భయపడి పోతుందేమోనని అలా ధారపోసి ఆ బ్రాహ్మణుడేవి అడిగితే అవన్నీ ఇచ్చి మరలా నీ పతిని నీవు పుచ్చుకోవచ్చునని హామీ ఇస్తాడు. గర్వభంగ మయ్యేవరకే ఇది. తెగినదాకా లాగ గూడదని తెలుసు నారదుడికి. పైగా **'ఏమే యర్థము ల్వేడినం జేతః ప్రీతిగనిచ్చి'** అని ఒకమాట విసురుతాడు. ఈవేడటం సత్యనా. తన అధీనంలో ఉన్న ఆవిడ పతినా.

పతినే. ఆయన చేతనే అన్ని పనులు చేయించుకొంటాడు నలుగురి ఎదటా. అది చూస్తే నీకే గాదాయన ఎవరికైనా కావలసినవాడే. అందరికీ వశమైనట్టే ఉంటూ ఎవరికీ వశమయ్యే తత్త్వం కాదది. తెలుసా నీకు. నీవమాయికు రాలివి నీకేమి తెలుసు. తత్త్వజ్ఞులమైన మా బోటివారికే అది ఎఱుకగాని. కావలసివస్తే ఇకనైనా అలాటి భగవత్తత్త్వ మేమిటో తఱచి చూచి సమదర్శనాన్ని అలవరుచుకో – అదే ముక్తికి మార్గమని భంగ్యంతరంగా ఆ ఇల్లాలికి హితబోధ చేయటానికా ఏమి ఈ సన్నివేశం కల్పించాడని తోస్తుంది సహృదయ విమర్శకులకు.

సరే. ఇక వచ్చారండీ వ్రత మహోత్సవాని కాహూతులై బంధుమిత్ర పరివారమంతా. ఎవరెవరు. ముఖ్యంగా యదువృష్ణి కుకురు భోజాంధకాది బంధువులు. భీష్మకాదిరా జన్యులు – పాండవ కౌరవ పాంచాలాది సంబంధి బాంధవులూ – నంద యశోదాదులూ – అందరూ తయారయ్యారు. మరి దేశం నలుమూలల నుంచి వచ్చి పడ్డాయి సంభారాలన్నీ. ఎక్కడను కొన్నారు వ్రతోత్సవం. రైవతక పర్వతం దగ్గర విశ్వకర్మ అపూర్వంగా నిర్మించిన మణిమయోజ్జ్వల మండపంలో. భూలోకం నుంచేగాక స్వర్గ లోకం నుంచి దేవతలందరూ వారి వారి విమానాల్లో వచ్చారు. ఆకాశంలో అంగుళం ఖాళీ లేదు. అన్నీ విమానాలే. రాజుల కిరీట రత్నకాంతులతో దిక్కులన్నీ వెలిగిపోతున్నాయి. ఇక గడ్డాల వారున్నారే మహర్షులు – వారితో క్రిక్కిరిసి పోయింది ఆ ప్రదేశమంతా. వేలాది ప్రేక్షక జనం ఒత్తిడికి వేయి పడగలూ క్రుంగి పోతున్నాయి ఆదిశేషుడికి. మేళతాళ ధ్వనులతో మృదంగ ధ్వనులతో బ్రహ్మాండం బద్దలయి పోతున్నది. ఏమి చెప్పమంటా రంటాడు తిమ్మనగారు ముద్దుగా.

సరే వచ్చారు దంపతులిద్దరూ. బాగా ముద్దుగా ముస్తాబయి కూచున్నారు పీటలమీద. వ్రతమయింది. నారదుణ్ణి దానం స్వీకరించమని సవినయంగా నమస్కరించి బలవంతంగా ఆయనగారిని సమ్మతింప జేశాడట కృష్ణస్వామి. ఎంత నాటకమో చూడండి. ఆయన వద్దు వద్దంటుంటే ఈయన మీరు కాకుంటే ఎవరున్నారిక తీసుకోండి తీసుకోండి అన్నట్టుంది. పైగా ఆయన కెన్ని ఉపచారాలో తెలుసా ఆ జడదారికి.

**మద వతీ కరముక్త మణి కుంభ సంభృత**
**సౌర భోదకముల జలక మార్చి**
**హిమధామ కిరణ విభ్రమ విడంబక శుభ్ర**
**కౌశేయ యుగళంబు గట్ట నిచ్చి**
**ఘనసార మృగమద గంధ బంధురమైన**
**గంధసారము మేనఁగలయ నలంది**
**విసృమర పరిమళ ప్రసవ మాల్యంబులు**
**ఘనజటా జూటంబు మునుగఁజుట్టి**
**లలిత మణిమయ భూషణావళులు దొడిగి**
**ఇష్టరాజోపచార సంతుష్టుఁజేసి'** అంటాడు. సమస్త రాజోపచార భక్త్యుపచార శక్త్యుపచార అని గదా చెబుతుంటాము. అవన్నీ లోపం లేకుండా జరిపాడా మహర్షికి. ఆయన కెలా జరుగుతూ వచ్చాయో ఈయనకూ అవేనా. సన్యాసికి దేనికివన్నీ. ఈయన చేయటమేమిటి. ఆయన తగుదునమ్మా అని చేయించుకోవట మేమిటి. చేసినా ఒకటే చేయించుకొన్నా

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఒకటే. ఇద్దరూ ఆడే నాటకమిది. ఇద్దరూ నిర్లిప్తులే. ఇద్దరిదీ అభినయమే. ద్వంద్వాల ననుభవిస్తూనే ద్వంద్వాల నంటి ముట్టకుంటా బ్రతకండని లోకులకు చేసే ఉపదేశమే. **'అసక్త స్సుఖమన్వభూత్త'**ని గదా మహాకవి మాట. ఆ మాటలాంటిదే ఈ బాట.

ఈ వేడుక అంతా నయనానందకరంగా చూడటానికే వచ్చారు ధర్మరాజాదులు. సుభద్రా ద్రౌపదీ ప్రముఖ రాణివాసం స్యందనాలెక్కి అందలాలెక్కి వచ్చారు. దంపతులిద్దరూ అందరినీ సంభావించి పారిజాతానికి ప్రదక్షిణ చేసి దేవర్షికి యథోచితంగా పూజాపురస్కారాలు నిర్వర్తించారు. ఇంతలో రుక్మిణీదేవి వచ్చింది. ఎలాగా. **'సతులు పదాఱు వేపురును సందడి రా'** ఎంతో రాజసంతో. **'వదనాంబు జంబునన్ కృతక వికాసమచ్చుపడ'** పైగా **'రాఁదగవేనని** వచ్చిందట – ఏమి మాటలివి. తిమ్మనగారి ముద్దు మాటలు. రుక్మిణికీ సత్యకూ మొదటి నుంచీ పడదు. **'పతి కెంతయు గూర్చు దానన**ని ఇరువురూ పోటీ పడ్డ బాపతు. ఒక పుష్పమావిడ కిచ్చాడని అమాంతమూ వృక్షాన్నే పెకలించి తెప్పించుకొన్న దానవతి. మరి మండి పోదూ మనసులో. అందుకే ఈ వాలకం. అప్పటికీ దర్జా తగ్గకుండా మిగతా సవతులను వెంటబెట్టుకొని రాజసంగా వచ్చింది. ఏమి ఈ సవతులను వర్ణించటంలో తిమ్మకవి చూపిన చమత్కారమూ హాస్యమూ.

అంతా అయింది. రావలసిన వారంతా వచ్చారు. ఇంకేమి. వ్రతమంతా అయింది. కానివ్వండి ఇకనీ నాధుణ్ణి నాకు దానమివ్వటానికి ఒప్పించమంటాడు నారదుడు. అనగానే ఏమండీ మౌనంగా ఉన్నారు.

Vallamraju Brahmasri Srinivasa Rao www.andhravedaarta.in

మహర్షి మాట విన్నారా స్వామీ అంటుంది సత్య. **నీకు నేలయనుమాన మిది ఆగమోక్తంగదా** అలాగే ధారపోయమంటాడా జగన్నాటక సూత్రధారి. ఏమి నటన ఇది. సవతులందరూ సిగ్గుతో శిరస్సులు వంచారట. పుష్పమాలలతో కృష్ణుణ్ణి చుట్టి వేసిందట ఆదేవి. బలిచక్రవర్తి నెప్పుడో కట్టి వేశావని విన్నామేగాని ఇప్పుడు నిన్నే కట్టి వేసింది మాచెలి దీనికేమి చెబుతావు జవాబని ఒకటే నవ్వులక్కడ ఉన్న చెలికత్తెలు. వారిని కనుసన్నలతో రెచ్చగొడుతున్నారట ధర్మజ భీమార్జునులు మందహాస మొలికిస్తూ. ఏమి ముచ్చటగా వర్ణిస్తున్నాడో చూడండి తిమ్మన ఈ సందర్భాన్ని.

సరే అసలు ఘట్టం వచ్చింది. **'నిజప్రాణేశుంగూడన్ తుభ్యమహం సంప్రదదే'** అని దానమిచ్చింది సత్యాదేవి నారదుడికి. ఇంకా ఎన్నో ధనకనక వస్తువాహనాదులు రాసులు రాసులిచ్చింది. ఇస్తే పుచ్చుకొన్నాడు మహర్షి. చెట్టుకు గట్టిన స్వామివారి చెంగు ముడి విప్పాడు నవ్వుతూ. నిజంగానే నిన్ను నాకు దానం చేసిందయ్యా స్వామీ. ఇక నా పనులు చేసి పెట్టాలి సుమా నీవు - అంటూ ఒక్కొక్క పనీ పురమాయిస్తున్నాడు. ఎలాగో తెలుసా. వర్ణిస్తున్నాడు వినండి తిమ్మన. ఇలాంటి పద్యం ఇలాటి భావం సాహిత్య ప్రపంచంలోనే అరుదు. అందులోనూ ఒక మహర్షి ఒక అవతార పురుషుడి మధ్య జరిగిన ఆ వ్యవహారం అందులోని చమత్కారం అది కవి వర్ణించిన తీరు ఎక్కడా కనపడదు. అతిలోకం. అనుభవైక వేద్యం.

**మేళవించినవి సుమీ్మ దీని మెట్లని**

**మాంసలాంసంబున మహతిఁ జేర్చి**

**మిన్నేటి జలము సుమీ్మ తొలంకెదునని**

డాచేత మణికమండలు వొసంగి

యిది జపోచితము సుమ్మీ జతనంబని

పలకేలఁబద్మాక్ష వలయ మిచ్చి

యీశానుఁడొసఁగెఁ జుమ్మీ మాకు నిదియని

**శార్దూల చర్మంబు చంకఁజొనిపి** – తన సరకులన్నీ ఆయనకు తగిలించసాగాడు. ఎప్పుడూ తాను మోసే వీణ ఆయన భుజంమీద పెట్టాడు. ఒక బరువు తగ్గింది తనకు. పైగా ఇది తీగలు బాగా సవరించిన వీణ జాగ్రత్త అంటాడు. అలాగే ఆకాశ గంగాజల ముంది ఇందులో – జాగ్రత్తగా తీసుకురమ్మని ఎడమచేతికి కమండలువు తగిలించాడు. జపానికి పనికి వచ్చేది జాగ్రత్త అంటూ తులసి మాల కుడిచేతిలో ఉంచాడు. సాక్షాత్తూ పరమేశ్వరుడిచ్చాడు మాకిది – ఇంకా జాగ్రత్త సుమా అని పులిచర్మం చంకలో జొనిపాడు. అప్పటికి తన బరువంతా పోయి స్వామి బరువెక్కాడు. ఎలాగ. రెండు చేతుల్లో రెండు. భుజంమీద ఒకటి. చంకలో ఇంకొకటి. ఎక్కడా ఖాళీగా లేదు ఏ అవయవమూ – కదిలితే కింద బడతాయి. పడగూడదని మహర్షి ఆజ్ఞ. ఇక ఎలా చేస్తాడా భక్త కింకరుడు. పోనీ కదలకుండా కూచుందామా అంటే కూచోనివ్వడు.

'పొమ్ము పొమ్మని యొక కొంత పోవఁబోవ

**రమ్మరమ్మని మఱల జేరంగఁ బిలిచి.** కదిలి ముందుకు నడచి పొమ్మని ఉత్తరువు. పోయాడనుకో. వెంటనే మరలా వెనక్కి రమ్మని మరొక ఉత్తరువు. ఇన్ని బరువులు మీద బెట్టుకొని ఎలా వెళ్లతాడా మహానుభావు డెలా రాగలడు. మరి తమాషా ఏమిటో తెలుసా. తిమ్మనగారే చెబుతాడు వినండి.

**'కపట నటనా పరుండైన కంసవైరిఁ బరమముని నవ్వులాటకు పనులు గొనియె'** ఆ స్వామిదీ నటనే. ఈ గోస్వామిదీ నటనే. ఇద్దరిదీ నవ్వులాట పంచాంగమే. **'నిశ్శంకం బనుల్గొంచు మౌని గరిష్ఠుండు కృతార్థుడయ్యాడట'** భక్త గణాధీనుడు గనుక ఆవిభుడలాగే నటించాడట. ఇదీ అసలు రహస్యం ఏదీ నిజం గాదు. అంతా లోకానికి ప్రదర్శనే.

అంతా అయిన తరువాత నారదుడు మరలా సత్యాదేవితో అమ్మా మా పని అయింది. ఇక నీ పెనిమిటిని నీ కర్పిస్తున్నాను. వెనక్కు తీసుకోమంటాడు. ఆవిడ ఎంతో సంతోషంతో ఆయనకు ఎన్నో విలువైన వన్నీ సమర్పిస్తుంది. ఇచ్చి పుచ్చుకోటం తిలకించి పులకించి దేవతలా ఇరువురి మీదా పూలవానలు కురిశారట. సత్యభామ తన మాత్సర్యమంతా పక్కనబెట్టి రుక్మిణీ ప్రభృతులైన సవతులందరికీ పారిజాత పుష్పాలే వాయనాలుగా ఇచ్చిందట. పదహారువేల మందికీ. అసలిక్కడ ఒక మాట చెప్పుకోవలసి ఉంది మనం. శ్రీకృష్ణ తులాభారమని ఒక నాటకముంది తెలుగులో. ముత్తరాజు సుబ్బారావుగారు 19వ శతాబ్దంలో రచించింది. చాలా బాగుంటుంది. పద్యాలూ పాటలూ కూడా అద్భుతం. **మీఁఅఁ జాలగలడా** అని నాటక రంగం మీదికి సత్యవేషంలో వస్తుంటే స్థానం వారిని చూచితీరాలి. ఇలాటి నాటక కధావస్తువు ఎక్కడిదో గాదు. అది తిమ్మనగారి పారిజాతాపహరణ కావ్యాన్ని చూచి తయారు చేసుకొన్నదే సుబ్బారావుగారు. కృష్ణుణ్ణి దానం చేయటం కావ్యంలోనిదే నాటకానికెక్కింది మరి తులాభారమో. కృష్ణుణ్ణి తులలోపెట్టి తూచటం మాత్రం కావ్యంలో లేదు. పైకి కనపడక పోయినా కావ్యాంతంలో సూచించాడొక చోట తిమ్మన కవి. కృష్ణరాయలను వర్ణిస్తూ **'ఏకచ్ఛత్రిత సర్వభూతల నృసింహేంద్ర క్షమా**

**భృత్తపః పాక ద్యోతిత రూప! మౌక్తిక తులాభార ప్రదానోద్యతా'** తులా పురుష దానం కూడా చేశాడట రాయలు. ఒక పురుషుడు త్రాసులో ఒక పళ్లెంలో కూచుంటే మరో పళ్లెంలో బంగారు వస్తువులు పెట్టి తూస్తే ఎంత సొమ్ము తూకానికి వస్తుందో అంతా దానం చేసేవాడట. బహుశా ఈ భావం పట్టుకొని ఇది సత్యాకృష్ణుల కథకు జోడించి ఇంక కొంచెం చమత్కారంగా వర్ణించి ఉంటాడు సుబ్బారావు. ఇంతగా భావి కవులకు కూడా స్ఫూర్తినిచ్చింది తిమ్మన పారిజాత కావ్యం.

కాగా ఇక నారదుడు చివరకు స్వామివారి దగ్గర సెలవు తీసుకొని వెళ్లిపోయేటపుడు ఆయనగారిని కీర్తించిన పద్యాలు అమోఘం. తిమ్మనగారి ప్రతిభా పాటవాని కంతటికీ గీటు రాళ్లు. చతుర్విధ కవితా మతల్లికా అని అల్లసానివారు చెప్పుకొన్నారేగాని దానికి నిదర్శనం అంతగా కనపడదు మనుచరిత్రలో. ఒక శ్లేష – ఒక ఆశువు మాత్రమే అల్లసానివారి కవిత్వంలో ఉదాహరణలు దొరకవచ్చు. కాని అలాటి బిరుదు తనకున్నట్టు ఏ మాత్రమూ తిమ్మనగారు చెప్పుకోకపోయినా అన్నిటికీ ఉదాహరణలు లభిస్తాయి మనకాయన కావ్యంలో. శ్లేష ఉంది ఆశువుంది. చిత్ర ఉంది. బంధ ఉంది నాలుగూ ఉన్నాయి. అందులో ఆశువు వారి చాటువుల్లోనే తప్ప మరెక్కడా ఎవరికీ దొరకవు. మిగతావన్నీ పుష్కలంగా ఉన్నాయి తిమ్మనలో. ఇప్పుడీ కావ్యాంతంలో ఆయనగారి బంధ కవిత్వ మెలాంటిదో కొట్టవచ్చినట్టు కనబడుతుంది. గోమూత్రికా – నాగచక్ర చ్ఛురి కాది పద్య గర్భిత పద్యాలే గాక అనులోమ విలోమ కందాలూ పాదభ్రమరకాలూ – ఏకాక్షర పద్యాలూ – ద్వికంద క్రౌంచాలూ భుజంగ గర్భ స్రగ్విణులూ – కట్టలు తెంచుకొని

ప్రవహించాయి మహాకవి కలంనుంచి. అది కూడా కావాలని తన పాండిత్యాన్ని చూపుకోటంగాక నారదుని కృష్ణ సంకీర్తనలో మిళితం చేసి వర్ణించట మెంతైనా ఔచిత్యం. నాదేమీ లేదయ్యా **అని చిత్రగతుల నవ్విభుం గొనియాడిన** వాణ్ణి నేను గాదు నారద మహర్షి సుమా అని చెప్పటమెంతైనా చమత్కారం.

మాఘుం కిరాతార్జునీయంలాంటి సంస్కృత కావ్యాల్లో ఇలాంటి ఏకాక్షర ద్వ్యక్షర లాంటి చిత్రగతు లున్నాయి గాని అవి కావ్యాంతంలో గాక కావ్యమధ్యంలో కథ ఇంకా నడుస్తున్నప్పుడు కక్కుర్తిగా కవులు తమ గారడీ నేర్పు అదే పనిగా చూపినట్టు కనిపిస్తుంది. ఇక్కడ అలా కాదు. కావ్యంలో కథ అంతా ముగిసిన తరువాత – అదీ నారద మహర్షి ఇక స్వామి వారి దగ్గర సెలవు తీసుకొని పోయే సందర్భంలో – తీరికగా చేసిన స్తోత్రం. అందులో ఎంత చిత్రబంధాదులైన గారడీలు చూపినా ఉద్వేజకంగా కనిపించదు. ఉద్వేజకం కాకపోగా హృదయాహ్లాదకంగా భాసిస్తుంది. పైగా వాచంయముడైన మహర్షి వాచామ గోచరుడైన భగవత్తత్త్వాన్ని కీర్తిస్తున్నాడని చెబుతున్నాడు తిమ్మకవి. వాచామ గోచరుణ్ణి వాక్కు స్థాయికి దించి చేసిన వర్ణన ఎంత అద్భుతంగా చిత్రాతి చిత్రంగా ఉంటుందో చూపాలి గదా. పైగా సకల విద్యా విశారదుడు నారదుడంటే. అలాటి పాత్రకు తగిన పంథాలోనే నడచిందా చిత్ర కవిత్వం. ఇక అందులో కృత్రిమత్వాని కాస్కారమేముంది. అలా భాసింప జేయటమే మహాకవి కవితా భాసురత్వం.

పోతే కావ్యారంభం కృష్ణలీలా వర్ణనతో మొదలైంది. కావ్యాంతం కృష్ణలీలలతోనే ముగుస్తుంది. ఎలాగా. **'ఏయే వేళల నేసరోజ ముఖి** అని

Vallamma Srinivasa Rao
www.advaitavedanta.in

గదా వర్ణించాడు కావ్యం మొదట్లో. అలాగే '**భోజకన్యా సరిద్రాజ హంసము – సత్యభామా శుకీకేళి పంజరం** అని వర్ణిస్తాడు కావ్యం చివరలో. '**అనుజ్ఝి తార్థ సంబంధః ప్రబంధో దురుదాహరః** అని వాక్రుచ్చాడుమాఘ కవి. ప్రబంధమంటే గట్టిముడి. దేనికి దేనికి. మొదట చెప్పిన దానికి చివర చెప్పిన దానికీ. అలాగే వేశాడు మరి ఇక్కడ కవి. అందులో కూడా అక్కడ సూత్రప్రాయంగా చేసిన లీలా వర్ణన మిక్కడ వ్యాఖ్యానించి చూపటమింకా ముద్దుగా ముచ్చటగా ఉంది. అంతేకాదు. దానికీ దీనికీ నడుమ నడచిన కథ అనండి వర్ణన లనండి. ఈ వ్యవహారమంతా ముడిలో ముడి పడుతూనే నడచింది చివరిదాకా. ఇంతకు ముందే చెప్పాము గదా నారదకృష్ణ సత్యభామలు ముగ్గురే ప్రధాన పాత్రలు. ఇవి పౌరాణిక పాత్రలైనా తిమ్మనగారి కవితా నేపథ్యంలో సరికొత్త రూపాలతో ఎంతో ముద్దుగా ముచ్చటగా కనిపిస్తాయి. అలా కనిపించేలా చేశాడు కవి తన చిత్ర కళా కౌశలంతో. పాత్రలే సగం బలమిచ్చాయి ఆ కళాకారుడికి. దానిమీద ఎన్నిరంగులు ఎన్ని హంగులు పట్టించి వాటిని జీవకళ ఉట్టిపడేటట్టు రసజ్ఞుల కనులకు కట్టినట్టు చూపాలో అంత ముచ్చటగా చూపాడు మహాకవి.

అసలు మొదట కలహభోజనుడు రావటమేమిటి. పారిజాత కుసుమం కుసుమాయుధుని కన్నతండ్రి కివ్వటమేమిటి. ఆయన తన కనుసన్నలతో రుక్మిణి కివ్వట మేమిటి – ఆవిడ కనుసన్నతో చెలికత్తెలా మహర్షికి పరిచర్యలు చేయట మేమిటి. రుక్మిణి సౌభాగ్యం ఆ మహర్షి పొగుడుతూ పొగుడుతూ సత్యాదేవికి చుఱ్ఱుమనే మాటలు దొర్లించట మేమిటి. అవి ఆ దేవిదాకా దొర్లిస్తూ చెలికత్తె ఆవిడ చెవిలో వేయట మేమిటి. ఆవిడ ముగ్గురినీ

దుయ్యబట్టి కృష్ణునిపైన అదేపనిగా అలక బూనటమేమిటి. స్వామి వారెంతో హడలిపోయినట్టు నటించి ఆవిడ మేడచేరి ఆవిడ కామాటలీ మాటలు చెప్పి బ్రతిమాలట మేమిటి. తన్నులు తిన్నా శృంగార మొలక బోయట మేమిటి. ఆవిడ ఆడదాని అఘాయిత్య మంతా ఒలకబోసి చివరకాయన హామీ ఇచ్చి అనునయిస్తే హర్షించట మేమిటి.

సందు చూచి మరలా ఆ కలహాశనుడే వచ్చి ఆవిడ ఆతిధ్య మందుకొని మరలా దేవేంద్రుడి తోడి కలహానికి నాందీ పలికి వెళ్ళటమేమిటి. స్వామి గరుడాళ్వారు మీద తానూ తన దేవేరీ బయలుదేరి స్వర్గానికి వెళ్లటమేమిటి. దేవేంద్రుడు అదితి చేసిన మర్యాదలన్నీ అనుభవిస్తూనే తెల్లవారి పారిజాతాన్ని పెళ్ళగించి తేవటమేమిటి. కావలి వారడ్డుకొంటే ఆయన బదులు సత్యభామ ప్రగల్భాలు పలకటమేమిటి. అది విన్న శచీదేవి బిక్కమొహం వేసుకొంటే ఇంద్రుడామెను సముదాయించి యుద్ధం చేయటమేమిటి. కృష్ణుడి చేతిలో ఓడిపోయి పారిజాతం స్వయంగా ఆయనకు సమర్పించట మేమిటి. అది భూతలానికి తెచ్చి ఇరువురూ తమ పెరట్లో నాటించటమేమిటి. మరలా కలహభోజనుడు తయారయి పుణ్యక వ్రతమనే వ్యాజంతో సాత్రాజితికి లేనిపోని దొకటి కల్పించి స్వామివారిని దక్షిణగా ప్రతి గ్రహించడమేమిటి. ఆయన చేత నలుగురి సమక్షంలో చాకిరి చేయించుకొన్నట్టు నటించట మేమిటి. ఆయనా దాని కనుగుణంగా నటించటమేమిటి. మరలా సత్యాదేవి కాయన నర్పించి తన కవితా కౌశలమంతా ఉట్టిపడేలాగా స్వామివారిని సంకీర్తన చేసి అంతర్థానం కావట మేమిటి. ఇది కావ్యమా – నాటకమా. ఏదైనా అనుకోవచ్చు. శ్రవ్యంగా దృశ్యంగా ముద్దుగానూ ముచ్చటగానూ

లేదూ ఈ వ్యవహారమంతా. అంతేనా. ఆయా సన్నివేశాల్లో వర్ణించిన పద్యాలో – రసవత్తర ఖాద్యాలు. సహృదయ హృదయైక వేద్యాలు. **మగమీలనగఁ జాలు తెగ గీలుకొనువాలు కనుగవలో – అలరుంబోడుల లోపల అలరుంబోడుములలో – అలికుల రావముల్కిసల యాకుల కోకిల కాకు కాకలీకలకల నాదములలలో – కలలోన నైన నవ్వులకైన – కృతకాద్రికం దరాకేళీని గూహన వేళా పరస్పరాన్వేషణలలో కనక పంజర శారి కలకు చక్కెరపెట్టి చదివించటంలో – ఇందు నిభాస్య మొదలుకొని పాటల గంధి వరకు సాగిన ప్రేమరస ప్రవాహంలో – ఈ నయగారవుం బ్రియముల నుంచి నను నెవ్వతెగా చూచితివనే** వరకూ – సాగిన నిష్ఠురోక్తులలో – రాచమర్యాదలతో స్నానాలు చేయించటంలో – శాకపాకాదులు వడ్డించటంలో – తాంబూలచర్వణలో – వృద్ధ విలాసినులకు చీకట్లను నరసిన జట్టుకు Hairdye లాగా అభిసారికల కద్రుశ్యాంజనంలాగా ఉందని వర్ణించటంలో – మరి వెన్నెల భోజనాలు చేసే చకోర పక్షుల వర్ణనలో – మరలా స్వర్గయాత్రలో గరుత్మదనూరుల పరస్పర నమస్కారాలలో – అదితి కృష్ణుల తల్లి కొడుకుల అనురాగ వాత్సల్యాదులలో – సత్యాకృష్ణుల వన విహారాలలో – ఏమి పద్యాలు ఏమి అందచందాలు – చెప్పనలవి గాదు – ఆఖరుకు

**తలిరుల తుదఁజినుకుల జల**

**జలవడియగ దడిసి మెలగు చలికరువలి ను**

**న్నొలపమున విరియు పరువపు**

**దొలు మొగడల వలపు దెలుపు తోటల** నాయన వర్ణిస్తుంటే– ఆ తోటలలో తిరగటానికీ

**దరదళదంబుజ ముకుళో**

**దరదళమిళ దళికుల చ్ఛద ప్రహతి సర**

**త్సరసరజో ధూసర పరి**

**సర సరసీతీర కుంజ సదనస్థలులన్**

ఆ అద్భుత స్థలాల్లో సంచరించటానికీ కరావలంబ మిచ్చి తీసుకెళ్లు తున్నాయి తిమ్మనగారి కమ్మని పద్యాలు మనలను.

ఇంతెందుకు. తిమ్మకవి కావ్యం కొనా మొదలు ముద్దులొలికే పలుకులే. ముచ్చట గొలిపే కొలకులే. పారిజాతాన్ని వర్ణిస్తూ ఏమన్నాడు కవి. **పరిమళము సెడదు వాడదు - పరువము దప్పదు** - అని గదా వర్ణించాడు. అది ఆ పారిజాత పుష్పమే గాదు - పారిజాతాపహరణ కావ్యం కూడా పరిమళించెడదు. పరువము తప్పదు - ఎప్పటికీ సాహిత్య ప్రపంచంలో. నిజానికి పారిజాతాపహరణం తాపహరణమే సహృదయ రసజ్ఞులకు. అలాటి పరాగ భర భరితమైన - కాదు కాదు - రాగ రసభరితమైన మహాకావ్యాన్ని రసజ్ఞ లోకానికందించిన సారస్వతాభి నంది నంది తిమ్మన కల కాలమూ మన కభినందనీయుడే. సందేహం లేదు.

Yallamraju Srinivasa Rao
www.advaitaveda.in

# భట్టుమూర్తి - చిత్రకవిత్వము

ముక్కు తిమ్మనగారి ముద్దు పలుకులు విన్నాము. పోతే భట్టు మూర్తిగారి చిత్రకవిత్వ మెలాంటిదో రుచి చూడాలి మనం. చిత్రమంటే ఏమనుకొంటున్నారో. ఉత్తమ మధ్యమాధమాలని మూడు విధాలుగా కావ్యాలను విభజించిన ఆలంకారికుల అధమ జాతి కావ్యమను కొంటున్నారా. పొరబాటు, అపచారం కూడా. చిత్రమంటే ఎన్నో ఉన్నాయర్థాలు. ఆశ్చర్యమని ఒక అర్థం. ఇదేమి చిత్రమండీ అని అంటారు లోకంలో వినలేదా. చిత్రమంటే బొమ్మ అని కూడా అర్థమే. చిత్రలేఖనమంటే ఏమిటి. బొమ్మలు గీయటం. చిత్రమంటే పరస్పర విలక్షణమైన అనేక భావాలని కూడా ఒక అర్థముంది. శబలం చిత్రమంటే అనేక వర్ణాల కలయిక అని Miscellany of colours భావం. ఇన్ని ఉన్నాయి అర్థాలు చిత్రమనే శబ్దానికి. ఇవన్నీ మంచి అర్థాలే. ఇందులో చెడ్డ అర్థమేదీ గాదు.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

మరి చిత్ర కావ్యమంటే అధమశ్రేణికి చెందిన కావ్యమని ఎందు కన్నారు ఆలంకారికులు. ఎందుకంటే కేవలం శబ్దాలంకారాలూ అర్థాలంకా రాలతోనే - అందులోనూ అర్థాలంకారాల కంటే శబ్దా లంకారాలతోనే కావ్యమంతా పులిమి పెట్టే కవుల రచనలను చూచి ఆ మాట అన్నారు. అలంకారమంటే పనికిరానిదేమీ కాదు. **అలం కరో తీతి అలంకారః** - ఏదైతే మామూలుగా ఉన్న భావాన్ని మెఱుగులు దిద్ది చూపుతుందో అది అలంకారం. **సౌందర్యమలంకారః** అని వామనుడి సూత్రం. అలంకారమంటే అందమని సౌందర్యమని నిర్వచించాడాయన. అది అర్థంలో చూపవచ్చు. శబ్దంలోను చూపవచ్చు. శబ్దార్థాలేగా కావ్య మంటే. మామూలు శబ్దమర్థమైతే అది లౌకికం. అదే సుందరమైన శబ్దార్థాలైతే అలౌకికం. అలౌకికమైన రచనే గదా కావ్యమంటే. అందుకే **'శబ్దార్థౌ సగుణౌ సాలంకారౌ** కావ్యమన్నారు దండి మొదలైన కావ్య మీమాంసకులు. అలాంటప్పుడు అలంకారయుతమైన కావ్యమధమ మెలా అయింది. అది తప్పమరే రసభావ సన్నివేశాదు లేవీ మచ్చునకైనా లేకపోతే బహుశా అలాంటి కృత్రిమ కావ్యాలను చూచి పేర్కొని ఉంటా రధమ కావ్యమని ఆలంకారికులు. ఏదైనా అంతే. లోకంలో కూడా అతి చేస్తే ఏదైనా సరే రోత అనిపిస్తుందెవరికైనా.

కాగా ప్రస్తుతం భట్టుమూర్తి కవిత్వం చిత్రకవిత్వమని పేర్కొన్నామంటే కృత్రిమమని అందు మూలంగా హేయమని గాదు మనం భావించ వలసింది. ముందు చెప్పినట్టు చిత్రమనే మాట కెన్ని అర్థాలున్నాయో అన్ని అర్థాలూ సరిపోయే ఒక విలక్షణమైన కావ్యమది. ఏమిటా కావ్యం.

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

వసుచరిత్ర. మను చరిత్ర పారిజాతాపహరణం తరువాత భట్టుమూర్తి వసుచరిత్రనే గొప్పగా చెబుతారు సాహిత్య రసజ్ఞులు. భట్టుమూర్తి – రాజ రాజభూషణుడు మూర్తి కవి అని ముచ్చటగా మూడు నామధేయా లున్నాయా మహాకవికి. ఈయన గారు రచించిన కావ్యం కూడా ఒక వసుచరిత్రే గాదు. ఆ మాటకు వస్తే మరి రెండు రచనలున్నాయి మనకు తెలిసి. ఒకటి హరిశ్చంద్ర నలోపాఖ్యానం. మరొకటి నరస భూపాలీయం తేడా కావ్యాలంకార సంగ్రహం. ఇందులో మొదటిది వసుచరిత్రలాగే ఒక ప్రబంధమైతే రెండవది ప్రబంధం కాదు. ప్రబంధ లక్షణాలను నిర్దేశించే అలంకార శాస్త్రం. ప్రబంధమని చెప్పిన హరిశ్చంద్ర నలోపాఖ్యానం కూడా వసుచరిత్రలాగా కేవల ప్రబంధం కాదు. ద్వ్యర్థి కావ్యం. అంటే ఒక అర్థం కాక రెండర్థాలిచ్చే కావ్యం. కావ్యానికి నామకరణం చేయటం లోనే స్ఫురింప చేశాడు కవి. హరిశ్చంద్రుడి కథా నలమహారాజు కథా – రెండు కథాంశాలూ ఒకే ఒక పద్యంలో స్ఫురించేలాగా చేసిన రచన అది. అందుకే అది ద్వ్యర్థి కావ్యమయింది.

అప్పటికీ కవిని గూర్చి మన కర్థమయిందేమిటి. ఇతడు కేవలం కవేగాదు. కావ్య విమర్శ చేసే లాక్షణికుడు కూడా. అంతే కాదు. కావ్యంలో మరొక కావ్యాన్ని కూడా ఇమిడ్చి చెప్పగల సమర్థుడు. ఇంకా దేవుడు మేలు చేస్తే సంగీత సాహిత్యాలు రెండింటినీ జోడు గుఱ్ఱాల స్వారీగా నడుపుతూ పోయే అద్భుతమైన ప్రతిభా పాటవంగలవాడు. ఇంత సంగీత జ్ఞానం మిగతా ప్రబంధకవు లెవరిలోనూ చూడబోము. అంతమాత్రమే గాదు. యోగమంత్ర వేదాంత శాస్త్రాలలో కూడా ఎంతో పాండిత్య

Yellamraju Srinivasa Rao
www.advaitaanandalahari.in

మార్జించిన వాడు. అన్నిటినీ మించి కావ్య విమర్శ చేసి కావ్యలక్షణంలో కూడా బాగా ఆరితేరినవాడు గనుక లక్షణాను సారిగా లక్ష్యభూతమైన కావ్య నిర్మాణం చేయగల ప్రజ్ఞావంతుడు.

ఈ గుణాలన్నిటికీ సంగమ స్థానమీ కవి రచించిన వసుచరిత్రమనే మహా కావ్యం. అది ఒక్కటే చాలు కవి సర్వతోముఖమైన ప్రజ్ఞాపాటవాన్ని మనకు పట్టిచూపుతుంది. అవధరించండి ఈ పద్యం.

**'నమ శ్రీరామ పదార వింద భజనానందున్ - జగత్ప్రాణనం**
**దనకారుణ్య కటాక్షలబ్ధకవితా ధారా సుధారాశి సం**
**జనితై కైక దిన ప్రబంధఘటనా సద్యశ్శత గ్రంధక**
**ల్పను - సంగీత కళారహస్య నిధిఁ బిల్వం బంచి పల్కెన్ కృపన్'**

తిరుమల రాయల ఆస్థాన కవి భట్టుమూర్తి. తిరుమల రాయలు రామ రాయల తరువాత వచ్చిన విజయనగర చక్రవర్తి. రామరాయలు కృష్ణరాయల అనంతరం వచ్చినవాడు కాబట్టి ఈ కవి అల్లసాని ముక్కు తిమ్మనలలాగా రాయల యుగంవాడు కాదు. తదనంతర కాలం వాడు. వారు కృష్ణరాయల కెంత సన్నిహితులో - ఇతడు తిరుమల రాయలకంత ఆంతరంగికుడు - ఎంతో మేధావంతుడైతే గాని రాజుగారి కాప్తుడు కాలేడు - ఎంత మేధావంతుడంటే తన్ను గూర్చి తానే చెప్పుకొంటున్నాడెంతో ఆత్మవిశ్వాసంతో.

రామభక్తుడట మొదట. ఆ తరువాత ఆంజనేయస్వామి భక్తుడట. ఆస్వామి కరుణా కటాక్షంతో కవితా శక్తి అలవడిందట. దానితో రోజుకొక

ప్రబంధమూ గంటకు నూరు పద్యాలూ ఆశువుగా చెప్పగల సామర్థ్య ముందట తనకు. అంతేకాదు. సాహిత్య బలమే గాక సంగీత బలం కూడా ఉంది. అదే అంటున్నాడు సంగీత కళలో ఉండే రహస్యాలన్నీ గ్రహించినవాడనని. అంతేగాక ఆరాజుగారు తనతో స్వయంగా అన్న మాటలు కూడా చెప్పుకొంటాడు. నానా కళా పారీణుడైన మా అన్నగారిని మెప్పించావు నీవు – బహు సంస్కృతాంధ్ర కృతులను రచించి అని. అప్పటికి సంగీత సాహిత్యాలే గాక ఆశువుగా పద్యాలప్పటి కప్పుడల్లి మెప్పించటమే గాక అందులో సంగీత చ్ఛాయలు కూడా జోడించి శ్రవణానందంగా పాడి వినిపించే శక్తి ఉందన్న మాట కవికి.

**లలనా జనాపాంగ వలనా వసదనంగ**

**తులనాభికాభంగదోః ప్రసంగ**

**ఏపారు పొదరిండ్ల నాపాటలాశోక**

**దీపార్చిఁగనక కలాప మరసె**

**మందయా నము నేర్పు నిందింది రాజీవ**

**రాజీవ రాజన్మ రాళ రాజి**

**సాలావళులు దాటి యేలాలతా వార**

**బాలాతతి పరాగ పటము లూడ్చె**

**ఇమ్ములై మరుహ జారమ్ములై పొదలుండ**

**పూఁజ వికెలె వేటె పూన వలదు**

**సారమై హిమ జలాసారమై – మొత్తమై మారుతాయత్తమై**

**ఒకచా యి నన పాయ పిక గేయ సముదాయ**

**మొక వంక నకలంక మకరాంక హయహేష** లని ఇలాంటి పద్య పాదాలు పరిశీలిస్తుంటే ఇవి చదువుకొనే పద్యాలా లేక ఎవరికి వారు పాడుకోవలసిన పాటలా అనిపించటం లేదూ మనకు. అందుకే అంటాడు కధానాయకుడు వసురాజు గిరిక అనే నాయిక దూరంగా వీణ వాయిస్తూ దానితో గాత్రం జత చేసి పాడే అద్భుతమైన ఒక గానం వినితన నర్మ సచివునితో.

**వీనుల విందై యమృతపు సోనల పొందై యమంద సుమచల దళినీ**
**గానము క్రందై - యాస్వన - మానంద బ్రహ్మమైన నధిపతి పల్కెన్'**

ఏమని పలికాడా వసురాజు -

**నాదం బొక్కటి పిక్కటిల్లె దిశలన్ నవ్యామృతావ్యాహతా**
**స్వాదం బై వినన య్యెడిం బ్రియవ యస్యా వింటివే షట్పదీ**
**నాదంబో - కలకంఠనాదమొ - మరున్నారీ మణీ పల్లకీ**
**నాదంబో - వివరింపరాదు పరమానందాను సంధానమై**

ఎంత గొప్ప సంగీత నాదం విన్నామోయి.

**నానా నాయన గాయనీ మణుల గానం బుర్వి నాలింపమో**
**నానాట న్నగ భేది వీటఁగల గంధర్వాప్సరో గీతవి**
**ద్యా నైపుణ్యము లెన్నియేనిఁ గనమో - యందైన నిందైన విం**
**దైనాదం బొనగూర్చునే మదికి నిట్లానంద సందోహమున్ -**

మనమింతకు ముందు ఎన్ని వినలేదు కన లేదు పాట కచ్చేరీలు, దివిలో భువిలో కూడ విన్నాము కన్నాము. కాని ఇలాంటి గాన మాధుర్య

మెప్పుడూ చవిచూడలేదు గదోయి. ఆహా ఎంత హృదయ పారవశ్యం కలిగించే మధురాతి మధుర స్వరమిది - అని మూర్ఛపోయాడా రాజంటే అది వసురాజు గాదు - రామరాజ భూషణుని సంగీత సాహిత్య సమ్మేళన నైపుణ్యం చూచి సహృదయులమైన మనమేనని భావించండి.

ఇంకా గొప్ప విషయమేమంటే అసలు కోలాహలుడనే పర్వతరాజు తన కూతురు గిరికాదేవి కొరక సంగీత ధ్వనులు ప్రతిధ్వనించే భవనమే నిర్మించి ఇచ్చాడని వర్ణిస్తాడు భట్టుమూర్తి. ఎలాంటిదా భవనం.

**వీణావాదన వేళలన్ ఘుమఘుమా విర్భూతి నింపన్ జగ**
**త్ప్రాణా చంచల తైలశూన్య నవ దీప శ్రేణి కాపాది యై**
**రాణింపన్ - ముఖ లక్ష్మికిన్ ముకురమై రంజిల్ల - లేబట్టికిన్**
**మాణిక్యాయతనం బొనర్చె గిరి యాత్మ శ్రీ ప్రభావంబునన్**

అమ్మాయి తోడి చెలియలతో వీణ వాయిస్తుంటే ఆ ఘుమ ఘుమ ధ్వనులు నలుమూలలా నిండిపోయి మణిదీపాలు చలించకుండా వెలుగుతుంటే తమ ముఖాలు తామే చుట్టూ ఉన్న రత్నకుడ్యకాంతులలో ప్రతిఫలిస్తే తిలకిస్తూ శ్రోతల శరీరాలు పులకించేలాగా సంగీత స్వరమంతటా వినిపించటాని కొరక మణిమందిరం నిర్మించాడట. ఎంత అభినివేశ ముండాలి ఆ గిరిరాజుకు. ఎంత అభిమాన ముండాలి ఆ గిరిక గానకళ మీద.

మరి భట్టుమూర్తి సంగీత కళారహస్య నిధి అన్నందు కొకటి రెండు పద్యాలుదాహరించి ముగిస్తాను - ఒకటి గీతానికి - మరొకటి వాద్యానికి- ముందు మనం గీతమెలాటిదో చూతాము.

**అరిగాఁ బంచమ మేవగించి నవలా లవ్వేళ హిందోళవై**
**ఖరిఁబూనన్ - పికజాత మాత్మ రవ భంగ వ్యాకులంబై - వనీ**
**ధర నాలంబిత పల్లవ వ్రత విధు ల్దాల్పన్ - తదీయ ధ్వనిన్**
**సరిగాఁ గైకొని యెన్ వసంతము మహాసంపూర్ణ భావోన్నతిన్.**

పంచమమంటే సంగీతంలో పవర్ణం. అది హిందోళా రాగంలో వర్జ్యం. పనికిరాదు. అలాగే రి అనే రెండవ వర్ణం కూడా నిషిద్ధమే. సప్త స్వరాలలో రెండు పోతే మిగతా 5 వర్ణాలే తీసుకోవాలి హిందోళంలో. అరిగా రి లేకుండా పంచమ మేవగించి అంటే ప అనేదాన్ని కూడా వదిలేసి అని అర్థం. అయితే పంచమ స్వరం కోకిల స్వరం కాబట్టి వాటికది వదిలేశారు. నవలాలని కోపమట. అందుకోసం పల్లవ వ్రతం సాగిస్తున్నాయట. అంటే వసంతం కాళ్లమీద పడి ప్రాధేయ పడుతున్నాయి. అందుకు వసంతం వాటి ననుగ్రహించి సరిగా తీసుకొన్నదట. అంటే రి ని వది లేయకుండా దానికి పంచమంతో కలిపి పట్టుకొన్నదంటాడు కవి. వసంతమంటే ఇక్కడ వసంత ఋతువనే కాదు. వసంత రాగమని ఒక రాగం కూడా ఉంది. అందులో 7 స్వరాలూ కావలసినవే. ఏదీ నిషిద్ధం కాదు. అన్ని స్వరాలూ ఉంటే దానికి సంపూర్ణ రాగమని పేరు. అలా సంపూర్ణ భావోన్నతితో వాటి నాదరించిందంటాడు. సంపూర్ణ భావమంటే సంపూర్ణ రాగమనీ అర్థమే. సంపూర్ణమైన భావమనీ అర్థమే. చూడండి. ఎంత గాన కళా రహస్యం తెలిసినవాడో భట్టుమూర్తి. సంగీత కళను సాహిత్యంతో ముడిపెట్టి వర్ణించటంలో అతని కతడే సాటి.

www.vallabhaneni Brahmasri Srinivasarao / www.advaitavedanta.in

గిరికా దేవిని వర్ణిస్తూ ఒకమాట అంటాడు. అదీ ఎంతో భావగర్భితంగా ఉంటుంది. **పదమెత్తం గలహంస లీల యధర స్పందంబు సేయ న్మృభాస్పదమౌ రాగకదంబ కంబు - శ్రుతి చూవన్ శ్రీవిలాసంబు- కే ల్గదలింప న్సుకుమార పల్లవ నవైలా లక్ష్మి - వీక్షింప షట్పదియుం బొల్చుఁ దరంబె కన్నెగొనియాడన్ గేయ వాక్ప్రౌఢిమన్'** అని గిరికను చెలికత్తె వర్ణించే పద్యమొకటి ఉంది. అదీ ఇలాంటి సంగీత సాహిత్యాలు రెండూ మేళవించిన పద్యమే. గేయ వాక్కనే రెండు మాటల్లో సూచిస్తున్నాడు కూడా కవి. గేయమంటే సంగీతం. వాక్కంటే సాహిత్యమని కవి హృదయం. నాయిక పదమెత్తితే చాలు కలహంస గమనమే. పదమనే మాట సంగీతానికి కూడా సరిపోతుంది. అలాగే రాగకదంబకంబు - శ్రుతి పల్లవి - షట్పది. ఇవన్నీ సంగీత పరిభాషకు చెందిన మాటలు. వాటినావిడ ఆయా అవయవాలకు ఉపమానాలుగా పెట్టి వర్ణించటంలో ఎంతైనా ఉంది ప్రౌఢి.

ఇదంతా భట్టుమూర్తి గానవిద్యా నైపుణ్యం చూపటానికైతే ఇక రెండవ దాయన వాద్య విద్యా విశారదత్వాని కొక మచ్చుతునక ఇవ్వవలసి ఉంది. ఈ క్రింది కందపద్యం చూడండి.

**ఉద్ధత రిపు విద్ధ తపన**
**పద్ధతి - కరి భవన దవని పట దంబుధి సం**
**పద్ధరణ సముద్ధరణ స**
**మిద్ధరణ రజో వ్రజోద్య దిభమద సృతికిన్.**

Yallamraju Srinivasa Rao www.advaitaveda.in

ఇక్కడ మృదంగ ధ్వన్యావర్తన మద్భుతంగా కనిపిస్తుంది. ద కింద ధ ఎన్నిమార్లు ఆ వృత్తి అవుతున్నదో గమనించండి. ఉద్ధ విద్ధ పద్ధ అని అక్కడక్కడా మృదంగం మీది దెబ్బలు వినబడటం లేదా. అలాగే సంపద్ధ - సముద్ధ - సమిద్ధ అని మార్చి మార్చి ద్ధ కారం వినిపించటంలో తాళమెలా పడుతున్నదో చూస్తే ఆశ్చర్యం గొలుపుతుంది - ఇదేగాదు - ఇది ఆయన లయవిన్యాసానికొక మచ్చుతునక అని చెప్పాను. ఇలాంటివి ఇంకా ఎన్నో చూడవచ్చు ఆయన ఆశ్వాసాంత పద్యాలు వివరంగా పరిశీలిస్తే.

ఒక్క సంగీత జ్ఞానమేమిటి. యోగ మంత్ర తంత్రాది ఇతర విద్యలలో కూడా ప్రవేశమున్న వాడని గదా పేర్కొన్నాము. ఈపద్యం కొంచెం చిత్తగించండి. తెలిసిపోతుంది. మంజువాణి వసురాజు రాజధాని అధిష్ఠాన పురానికి వస్తుంది. అప్పుడా పట్టణమెలా కనిపించిందో తెలుసా ఆవిడకు.

**సాలము యంత్ర పీఠము విశాలక వాటక ఘట్టనంబు దృ**
**జ్జీలన మైందవామృత సమేత పతాకిక జిహ్వా - చంద్రికా**
**జాలము భూతి పూత - నవచంద్ర శిలాంబువు లశ్రుధారగాఁ**
**బ్రోలు ప్రశాంత ఘోషమయి పూర్ణ సమాధిఁజెలంగె నయ్యెడన్-**

ఈ పద్యభావం బాగా తరచి చూస్తే మనకు వెంటనే తెలిసిపోతుంది ఇది ఒక కుండ లినీయోగ సిద్ధుని సమాధి దశా వర్ణనమని.

ఇక అన్ని విద్యలకూ మిన్న అనిపించుకున్న అద్వైత వేదాంత విద్యలో భట్టుమూర్తికున్న చొరవ ఎంతటిదో ఎలాంటిదో చెప్పనక్కర లేదు. కావ్యాంతంలో అప్రయత్నంగా దొరలిన ఒక పద్యరాజం చాలు దానికి నీరాజన మిస్తుంది. చూడండి.

**భూనాథాగ్రణికిన్ వధూమణికి సంభోగాంత సౌఖ్యంబు బ్ర**
**హ్మానందానుభవంబు దెల్పె నవవద్యంబై - యవేద్యాంతరం**
**బై- నిర్లేపకలాపమై - క్రమవిముక్తానేక బంధాను సం**
**ధానంబై - యపునర్భవ ప్రభవ ఖేదంబై విజృంభించుచున్**

గిరికా వసురాజుల మదన కేళీ విలాసాన్ని వర్ణించే మధురాతి మధురమైన పద్యమిది. నాయికా నాయకుల సంభోగానందాన్ని బ్రహ్మానందంతో పోల్చి చెప్పటమెంత గొప్పగా చెప్పాడో మాటలతో చెప్పలేను. వధూవరుల సంభోగ కాల సౌఖ్యం కన్నా **సంభోగాంత** సౌఖ్యమే అసలైన సౌఖ్యం. అది **అనవద్యం.** మాటలతో వర్ణించేది గాదు. **అవేద్యాంతరం.** మరొకటి తెలుసుకోవలసిందేదీ మనసుకు రాదు. **నిర్లేప కలాపం -** ఒంటికి పూసుకొన్న అంగరాగాలన్నీ ఎక్కడికక్కడ రాలిపోతాయి. **క్రమవిముక్తానేక బంధాను సంధానం.** క్రమ క్రమంగా త్రాచుపాములలాగా ఒకరితో ఒకరు పెనవేసుకొన్న రతిక్రీడా బంధాలన్నీ వాటి వాటికవే సడలిపోయాయి. **అపునర్భవ ప్రభవఖేదం** పునర్భవ అంటే మన్మధుడు. అంటే కామం. దానివల్ల కలిగే తాపం సంభోగాంతంలో ఒక్కక్షణంలో మటుమాయ మయిందంటాడు.

ఇక్కడ వాడిన విశేషణాలన్నీ వధూవరుల సంభోగానికే గాక ముముక్షువుల సాయుజ్యానికి కూడా అన్వయించేలా వర్ణించాడు మహాకవి. అది ఎలాగంటే సురతానందంలాగే బ్రహ్మానందం కూడా అనవద్యమే. అ వాచ్యమే. అతి స్వచ్ఛమే. **అవేద్యాంతరం** కూడా. అంటే ద్వితీయమైన

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

పదార్థమే లేదు బ్రహ్మానికి. వేద్యమైన విషయం లేదక్కడ. అంతా విషయిరూపమైన వేదన అంటే జ్ఞానస్వరూపమే. అంతేగాక **నిర్లేపకలాపం** నామరూప క్రియాత్మకమైన సంసారంతో సంపర్కమే లేదు. పోతే క్రమ **విముక్తానేక బంధాను సంధానమది.** సంసార బంధాలన్నింటి నుంచి క్రమంగా విడిబడిన దశ అది. అద్వైతంలో క్రమముక్తి అని ఒకటుంది. సగుణంగా బ్రహ్మతత్త్వాన్ని ఉపాసన చేసే సాధకులకు సద్యోముక్తి లభించదు. వారు పాసనాబలంతో సత్యలోకం దాకా ప్రయాణం చేసి అక్కడ నిర్గుణ తత్త్వ జ్ఞాన మలవరుచుకొని చతుర్ముఖ బ్రహ్మతోపాటు కల్పాంతంలో తామూ విదేహముక్తులయి పోతారట. ఇది అద్వైత శాస్త్ర సంప్రదాయం. ఇదుగో ఈ విదేహ ముక్తిని కూడా కంఠోక్తిగా వర్ణిస్తున్నాడు కవి. ఏమని. **అపునర్భవ ప్రభవ ఖేద** మని. పునర్భవ అంటే ఇక్కడ పునర్జన్మ. దీనివల్ల కలిగే ఖేదం లేదంటే ఏమిటర్థం. ఇక జన్మ అంటూ ఉండబోదు ముక్తుడికి. జన్మరాహిత్యమై పోతుందని గదా. అదే విదేహ ముక్తి అనే మాట కర్థం. చూడండి. ఒక ప్రక్క ఐహికమైన విషయానందం వర్ణిస్తూ మరొక ప్రక్క నిర్విషయమైన బ్రహ్మానందాన్ని కూడా దానితోపాటు ఎలా పట్టుకు వస్తున్నాడో భట్టుమూర్తి.

అసలు భట్టుమూర్తి పట్టే పట్టు. సంగీత మేమిటి. సాహిత్యమేమిటి. కావ్యమేమిటి శాస్త్రమేమిటి. ఐహికమేమిటి ఆముష్మికమేమిటి. గంగా యమునల లాగా రెంటినీ ఒక్క మాటలో వర్ణించి చెప్పగలడు. రెంటికీ రెండు ప్రయత్నాలు లేవా కవికి. అయితే అవీ ఇవీ వర్ణిస్తూ పోవటం కాదాయన వివక్షితం. ఏదో సరదాకు చేసినా అన్నీ కలిపి మరలా

సాహిత్యంతో ముడిపెట్టి సాహిత్య కళే తన రచన కంతటికీ ఏకైక లక్ష్యమని చాటటమే భట్టుమూర్తి కావ్యతాత్పర్యం. అది కూడా బయటపెడతాడొక పద్యంలో. ఆ పద్యమింతకు ముందు దాహరించిన పద్యానికి ముందు పద్యం. దానిలాగే ఇదీ కావ్యాంతంలోనే మనకు దర్శనమిస్తుంది.

**'సతి సాహిత్య రహస్యమీశు వలనన్ సాధించి తోడ్తోన త**
**త్పతికింబ్రత్యుపదేశ మిచ్చె నతుల ప్రౌఢిన్ ధ్వని వ్యక్తి త**
**చ్ఛ్రుతికింజొన్పుచు లోచనాంజన రస ప్రోన్మేషము ల్తన్ముఖో**
**ద్గతము ల్సేయుచుఁబ్రత్యలంకరణ మౌఖర్యంబు దీపింపగన్**

ఇది వధూవరుల సంభోగపరంగా సాహిత్యపరంగా రెండు విధాలా అర్థం చెప్పుకోవలసిన పద్యం. సంభోగపరంగా మొదట అర్థం చెప్పుకొందాం. సాహిత్యమంటే ఇక్కడ సంభోగమనే అర్థం. **సహిత యోర్భావ స్సాహిత్యం.** వధూవరుల కలయిక. ఎవరా వధూవరులు. గిరికా వసురాజులా. వారే కాని సతి – పతి అని రెండు మాటలు ప్రయోగించాడు కవి. ఈశువలనన్ అని మరోమాట కూడా ఉందక్కడ. సతి అంటే సతీదేవి. పార్వతి – ఈశ అంటే పరమేశ్వరుడనే ఇంకొక అర్థం కూడా స్ఫురిస్తున్నది. బహుశా కాళిదాసు కుమార సంభవంలోని అష్టమ సర్గ గుర్తుకు వచ్చి ఉంటుంది భట్టుమూర్తికి. అదీ సంభోగ శృంగార వర్ణనే. నాయిక తన నాయకుడి వల్ల సాహిత్య రహస్యమంటే సంభోగ కళారహస్యమంతా నేర్చుకొని తోడ్తోన వెంటనే పతికింబ్రత్యుపదేశ మిచ్చిందట. అంటే పురుషాయిత మని భావం. స్త్రీ తన అంగంలో పురుషాంగాన్ని జొనుపుకొని

క్రిందా పైనా పడుతూ లేస్తూ పురుషుడి మీద పడుకొని చేసే సంభోగానికి పురుషాయితమని పేరు కామశాస్త్రంలో. నీవు **నేర్పిన విద్యయే నీరజాక్ష** అన్నట్టు పతి డ్యూటీ ఇప్పుడు సతి పెట్టుకొన్నది. **అతులప్రౌఢిన్** అలా పెట్టుకోవాలంటే చాలా ప్రాగల్భ్యముండాలి.

అలాంటప్పుడు రెండు మూడు పనులు జరుగుతుంటాయి. **ధ్వని వ్యక్తి తచ్ఛ్రుతికింజొన్పుట** ఒకటి. రతిక్రీడలో హాయిని అనుభవిస్తూ హాహా అని చేసే శబ్దానికి మణితమని పేరు. అలాటి మణిత ధ్వని పతి కర్ణ ద్వయనాకి విందు గొలుపుతుండటం. రెండవది **లోచనాంజనరస ప్రోన్మేషముల్తన్ముఖోద్గతములు** చేయటం. అంటే తన కళ్లకు పెట్టుకొన్న కాటుక ఆయన ముఖానికంటుకోటమని అర్థం. పోతే మూడవది **ప్రత్యలంకరణ మౌఖర్యం.** అంటే ఆవిడ శరీరం చలిస్తూ ఉండటం మూలాన ఒంటికి పెట్టుకొన్న గాజులూ అందెలూ మొదలైన అలంకారాలన్నీ గలగలమంటూ శబ్దం చేస్తుండటం కూడా జరుగుతుంది. ఇవి మూడూ కొట్టవచ్చినట్టు కనపడతాయా సందర్భంలో. ఇది వారి సంభోగ వర్ణన.

పోతే ఈ పద్యంలో ఇక సాహిత్య వర్ణన ఏదో చూతాము. సాహిత్యమంటే ఇక్కడ శబ్దార్థాల కలయిక. కావ్యనాటకాది వాఙ్మయం. దానిపై పై తళుకుగాక దాని రహస్యం లోతుకు దిగి గమనించినవాడే కవీశ్వరుడు. ఏమిటది. ఆనంద వర్ధనాదులైన గొప్ప ఆలంకారికులందరూ మొదటి నుంచీ ఎంతో గొప్పగా సాహిత్యాన్ని మథించి అందులోని సారస్యాన్ని రసజ్ఞ లోకానికి చాటిచెప్పిన రసధ్వని. ధ్వన్యాలోకమనే ఒక అద్భుతమైన

అలంకార శాస్త్ర గ్రంధం వ్రాసిపోయాడు ఆనంద వర్ధనుడు. దానికి లోచనమని ఒక అతిలోకమైన వ్యాఖ్య వ్రాసి లోకానికి ప్రసాదించాడు అభినవ గుప్తుడనే మరొక ఆలంకారికుడు. సాహిత్య మర్మాలన్నీ విప్పి చెప్పిన గ్రంధాలవి. వాటిని మనసులో పెట్టుకొని మాటాడుతున్నాడు భట్టుమూర్తి. **ధ్వని వ్యక్తి తచ్ఛ్రు తికింజొన్పుచు** - కావ్యధ్వని అనేదేమిటో పాఠకులకు కర్ణరసాయనం చేయాలి కవి అయినవాడు తన రచన ద్వారా. **లోచనాంజనరస ప్రోన్మేషము ల్త న్ముఖోద్గతము ల్సేయుచు'** అంతేగాక అభినవగుప్తుని లోచన మనే అంజనం వేసుకొని చూచినప్పుడే అందులోని రసస్ఫూర్తి సహృదయులకు తద్వారా అందుతుందని భావం. అలాగే **ప్రత్యలం కరణ మౌఖర్యంబు దీపింపగన్** ఆ రసభావ ధ్వనికి తోడ్పడే అలంకారాల విశేషాలు కూడా అక్కడక్కడా పానకంలో మిరియంలాగా పాటిస్తూ పోవాలని భావం. అప్పుడే ఉత్తమ సాహిత్య తత్త్వజ్ఞుడవుతాడు కవి - అని భట్టుమూర్తి ఇంత గొప్ప భావాన్ని ఈ పద్యం ద్వారా ప్రకటిస్తున్నాడు మనబోటి పాఠకులకు.

అంతేకాదు - ధ్వని ప్రధానమైన ఇలాంటి ఉత్తమ కావ్యతత్త్వాన్ని మరచి పైపై తళుకుబెళుకులు చూపే కాకవులను హేళన చేస్తూ వారి వెఱ్ఱి మొఱ్ఱి వ్రాతల నెలా తప్పుపట్టాడో చూడండి.

**భావం బెక్కడ లేక వృత్తనియమా పాయంబు చింతింప కెం**
**దే వర్తించి పరార్థ వంచనలచే దీపించి - మూర్ఖాళి సం**
**భావింపం గుకవి ప్రణీత కృతి సామాన్యాకృతింబూని పై**
**పై వన్నెల్పచరింప దానిఁ దిలకింపం బోరు ధీరోత్తముల్**

చాలా అద్భుతమైన పద్యమిది. శ్లేషతో చెప్పినా చాలా సులభంగా అర్థమయ్యే శ్లేష. కుకవులు సామాన్యాకృతులట. సామాన్య అంటే మామూలనే గాదు. వేశ్యకు కూడా సామాన్య అనే పేరు. ఒక వేశ్యలాంటి వాడే కుకవి. ఎందుకని. **భావం బెక్కడ లేక** దాని కెవరిమీదా ఎలాంటి భావమూ లేదో అలాగే వీడి రచనలోనూ ఏ గొప్ప భావమూ ఉండదు. **'వృత్తనియమాపాయంబు చింతింపక'** అది ఎలాగా సద్వర్తనం కలిగి ఉండాలనే నియమం పాటించక దానికి నీళ్లు వదలుకొంటుందో వీడూ ఏ వృత్తమంటే పద్యమెలా నడవాలో తెలియనివాడు. **ఎందే వర్తించి** ఎక్కడెక్కడో తిరుగుతుంటుందది. వీడూ అలాగే ఎక్కడో మనసు పెట్టుకొని వ్రాస్తుంటాడు. **పరార్థవంచనలచే దీపించి** – అది ఇతరుల సొమ్ము మాయమాటలు చెప్పి ఎలా అపహరిస్తుందో వీడూ అంతే ఇతర మహాకవుల రచనలలోని వన్నీ చౌర్యం చేసి తనవేనని డచ్చాలు కొడతాడు. మూర్ఖాళి సంభావింపన్ – ఆళి అంటే చెలికత్తెలు. వారంతా మూర్ఖులై దీన్ని ఎలా అంటి పెట్టుకొని బ్రతుకుతుంటారో – వీరే మూర్ఖులైతే వీరికంటే మూర్ఖులైన జనులూ వీరిని మహాకవులని కీర్తిస్తుంటారు. పైపై వన్నెల్పచరింప. ఇంతకూ పైపై తళుకులే గాని పైన పటారం లోపల లొటారమన్నట్టు ఒక రస ముండదు. భావ ముండదు కుకవుల రచనలలో. అతి సామాన్యమైన రచన చేసి అదే గొప్ప రచన అని మూర్ఛపోతుంటారని ఇలా మొహం వాచేట్లు చీవాట్లు పెట్టాడు కుకవులను భట్టుమూర్తి.

దీన్నిబట్టి మనమేమవి భావించాలీ కవిని. ధ్వన్యాలోక లోచనాదులైన ఉత్తమ లాక్షణికుల లక్షణశాస్త్ర రహస్యాలను బాగా జీర్ణించుకొని ఆ

పంథాలోనే చాలావరకు పయనించిన పూర్వాంధ్ర మహాకవుల లక్ష్య భూతమైన కావ్యాలను కూడా చక్కగా అవగాహన చేసుకొన్నా వాడని గదా అనుకోవాలి మనం. నిజానికా శాస్త్రకారుల హృదయమెలా అర్థం చేసుకొన్నాడో వారి అనుయాయులైన మహాకవుల కావ్యాలను కూడా అలాగే ఆకళించుకొన్నాడు సందేహం లేదు. చూడండి ఈ పద్యం.

**'మహిమున్ వాగను శాసనుండు సృజియింపం గుండలీంద్రుండు త**
**స్మహనీయ స్థితి మూలమై నిలువ - శ్రీనాథుండు ప్రోవన్ మహా**
**మహులై సోముడు భాస్కరుండు వెలయింపన్ సొంపు వాటించు నీ**
**బహుళాంధ్రోక్తిమయ ప్రపంచ మునం దత్ప్రాగల్భ్య మూహించెదన్'**

ఇదీ చాలా అద్భుతమైన పద్యమే. శ్లేషలో చెప్పినా శ్లేష ఉందా లేదా అనే భ్రాంతి కొలిపే పద్యం. వాగనుశాసనుడంటే బ్రహ్మదేవుడు. ఆయనే గదా సృజించాడీ ప్రపంచాన్ని. అలాగే సృష్టించాడు మరొక వాగను శాసనుడు ఆంధ్ర వాఙ్మయ ప్రపంచాన్ని. వాగనుశాసనుడని నన్నయ భట్టారకునికొక బిరుదున్నది. ఇద్దరికీ సరిపోయే మాట. అలాగే ప్రపంచ స్థితిని కాపాడుతున్నాడొక కుండలీంద్రుడు. ఆదిశేషుడని అర్థం. శేషుడే గదా భూభారమంతా మోస్తున్నాడు - అలాగే కుండలీంద్రుడంటే తిక్కన సోమయాజి. ఆయనా ఈ వాఙ్మయ ప్రపంచాన్ని నిర్వహిస్తున్నాడని అర్థం. పోతే శ్రీనాథుండు ప్రోవన్ శ్రీనాథుడంటే మహావిష్ణువు. ఆయన రక్షిస్తున్నాడు భౌతిక ప్రపంచాన్ని. మరి వాఙ్మయ జగత్తునో. ఉన్నాడు గదా మనకొక శ్రీనాథుడనే మహాకవి. ఆయనగారే పోషకుడు. ఇక సోముడు

Brahmasri Jalamanchi Srinivasa Rao
www.advaitavedanta.in

భాస్కరుండంటే చంద్రసూర్యులు వెలిగిస్తున్నారీ ప్రపంచాన్ని అహోరాత్రాలు. అలాగే సోమనాధుడూ భాస్కరుడనే మహాకవులు వెలిగిస్తూన్నారీ వాఙ్మయ లోకాన్ని. ఎంత హాయిగా ఆనంద దాయిగా ఉందో చూడండి శ్లేష అయినా భేషనిపిస్తూ ఈ పద్యరాజం.

ఇంతకూ ఇంత గొప్ప కావ్య శాస్త్రజ్ఞుడూ అలాగే ఇంత గొప్ప కావ్య కళాభిజ్ఞుడూ అయిన భట్టుమూర్తి రచించిన కావ్యమెంత అనితర సాధారణంగా ఉండాలో ఎంత రక్తి కట్టించేదిగా ఉండాలో చెప్పండి. పైగా కథా కమామీసూ ఏదీ లేకుండా ఆకాశతాండవం చేశాడా అంటే అదీ లేదు. మంచి కథే తీసుకొన్నాడు. మహాభారతంలో వచ్చే కథే అది. ఉపరిచర వసు వృత్తాంతం. శౌనకాదులకు రౌమహర్షణి చెప్పిన కథ. వసురాజంటే సామాన్యుడు కాడు. దేవేంద్రునికి ఆంతరంగికుడు. అతని గుణగణాలకు ఇంద్రుడే మెచ్చి ఒక గొప్ప దివ్య రథాన్ని కూడా ప్రసాదించాడు. గిరికా వసువుల వివాహానికి దేవతా పరివారంతో హాజరై కానుకలు సమర్పిస్తాడు. పైగా పురాతన పుణ్య శ్లోక రాజర్షిని కథానాయకుణ్ణి చేసి ఆయన వృత్తాంతం కథా వస్తువుగా చేసి వర్ణించాలని కవి వాచా తన అభిప్రాయం చెప్పు కొన్నాడు కూడా.

**కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్యసత్కథల్**
**వావిరిఁ బుట్టు రత్నము లవారిత సత్కవి కల్పనా విభూ**
**షావహ పూర్వ వృత్తములు సానలఁదీటిన జాతి రత్నముల్**
**గావున నిట్టి మిశ్రకథగా రచియింపుము నేర్పు పెంపునన్'**

అని తిరుమల రాయలు తనతో అన్నట్టు చెప్పుకొన్నాడు. మరీ కల్పనా కథ అయినా బాగుండదు. కృత్రిమంగా ఉంటుంది. మరీ పౌరాణిక గాథ అయినా అంత రాణించదు. మరెలా ఉండాలి కథా వస్తువంటే చెబుతున్నాడు. కొంత ప్రసిద్ధమైన ఇతివృత్తం తీసుకొని దానినలాగే వర్ణించక మెఱుగులు దిద్ది సరిక్రొత్తగా ప్రదర్శించాలట. అప్పుడే అది సానబెట్టిన రత్నంలాగా ప్రకాశిస్తుందని కథా విషయంలో తన అభిప్రాయం వెలిబుచ్చినవాడు రామరాజ భూషణుడు.

అలాంటప్పుడిక కొదవ ఏముంది. శుక్తిమతీ కోలాహల వృత్తాంతంతో ప్రారంభించి గిరికా వసురాజుల కళ్యాణ మహోత్సవంతో ముగించవచ్చు కథ. అయితే చిన్నదే ననుకోండి కథావస్తువు. ఎంతో సాగదీస్తే గాని 6 అధ్యాయాల గ్రంథం తయారుగాదు. ఆ మాటకు వస్తే మనుచరిత్ర పారిజాత కావ్యాల విషయం కూడా అంతే. మనుచరిత్ర ఇంకా 4,5 కథల సంపుటి అయి అయిదాశ్వాసాల వరకైనా ఎదిగింది. పారిజాతమైతే మరీ అన్యాయం. సత్యాకృష్ణుల ప్రణయ వృత్తాంతమే చివరిదాకా కథా వస్తువు. ముక్కు తిమ్మన దానినెంతో సాగదీస్తే ముద్దు ముచ్చటగా తయారయింది. పోతే ఈ వసురాజు వృత్తాంత మంతకన్నా పొట్టిది. గొఱ్ఱెతోక. ఈ తోకనెంత వరకని లాగుతాడు కవి. అయినా లాగుతూనే పోయాడు. అసలు కథ చిన్నదయ్యే సరికి బెందడి ఎక్కువ పెట్టవలసి వచ్చింది. అందుకోస మెన్నో వర్ణనలు. అలంకార శాస్త్రంలో చెప్పిన అష్టాదశ వర్ణనలూ పట్టుకువచ్చి కథా భాగానికి జోడించి దానికి బలం చేకూరుస్తూ వచ్చాడు. పైగా తాసూ ఒక అలంకార శాస్త్రం రచించిన లాక్షణిక శిరోమణి గదా. నరస భూపాలీయమని దానిపేరు

కూడా. సంస్కృతంలో ప్రతాపరుద్రీయం లాంటి గ్రంథమది. కావ్య లక్షణమంతా ఎంతో చక్కగా సంగ్రహించి చెప్పిన లక్షణ గ్రంథం. ఇంకేమి కావలసినంత సామగ్రి తాను సృష్టించింది తానే వాడుకోవచ్చు. అడిగేవాడు లేడు.

అలాంటప్పుడిక కొఱతేముంది. మను పారిజాతాలను కూడా త్రోసిరాజనేటంత రమణీయంగా అద్భుతంగా సహృదయ హృదయ రంజకంగా ఉండాలి కదా తన కావ్యం. కనీసం వాటితో సమానమైన ప్రతిష్ఠ అయినా సంపాదించి ఉండాలి గదా. నిజమే. ఉండాలి సందేహం లేదు. ఎందుకంటే కావ్య వస్తువూ మంచిదే. కవీ సమర్థుడే. ఇక ఉత్తమ కావ్యమెలా ఉండాలో దాని లక్షణమంతా నూటికి నూరుపాళ్లా తెలిసిన ప్రజ్ఞావంతుడే. కాని దాన్నే ధ్యేయంగా పెట్టుకొని ముక్కుకు సూటిగా వెళ్లిపోయి ఉంటే ఎంతో చక్కగా రాణించేది. కాని అలా కాక ఒకటి రెండు బలహీనతలకు లోనయ్యాడు భట్టుమూర్తి. ఒకటి అతడొక అలంకార శాస్త్రం వ్రాయటం పొరబాటయింది. కావ్యాలంకార సంగ్రహమని నరస భూపాలీయమని దాని నామధేయం. చెప్పాను గదా అది తెలుగులో ప్రతాపరుద్రీయం లాంటిదని. కావ్య లక్షణమంతా పూసగ్రుచ్చినట్టు చక్కగా వివరిస్తూ పోయాడందులో. సందేహం లేదు. కాని ఆ లక్షణాని కుదాహరణ ప్రాయంగా ఒక లక్ష్యగ్రంథం వ్రాయాలను కొన్నాడే అదీ మొదటి పొరపాటు. అందుకోసం ప్రకృతి వర్ణనలు శబ్దార్థాలంకారాలూ కుప్పతెప్పలుగా పులిమి పుచ్చి చద్దిని మించిన ఊరగాయ చేశాడు తన కావ్యాన్ని. కథా వస్తువు 5

వంతులైతే 95 వంతులు చిత్ర కవిత్వంతో నిండిపోయింది వసు చరిత్ర. ఇది వసుచరిత్రో వసుచిత్రమో అర్థం కాదు భావుకుడికి. పోతే రెండవదేమంటే అల్లాసాని వారి మనుచరిత్రతో తిమ్మన పారిజాతంతో పోటీపడి వాటిని మించిపోవాలని కొత్త కొత్త పంథాలు తొక్కుతూ పోయాడు. ఇది మరొక చాపల్యం. మరీ మనుచరిత్ర అయితే ఎక్కడ ఏ సందర్భంలో పెద్దన ఒక పద్యం వ్రాసినా దానికి ప్రతిగా తాను మరొకటి వ్రాసి చూడండి దానికంటే ఇది ఎంత బాగుందో నన్ను మెచ్చుకొంటారా లేదా అని మనలను ప్రశ్నించినట్టుంటుంది ఆయన వాలకం చూస్తే.

ఇవి రెండూ రెండు పెద్ద చాపల్యాలు. నాకు జూడ ఈ చాపల్యాలతోనే ఎంతో ఉన్నతంగా ఎదగవలసిన ఈ మహాకవి క్రిందికి దిగజారి పోవలసి వచ్చింది. ఈ వ్యసనమూ ఈ చాపల్యమూ ఉన్నదని తానే భంగ్యంతరంగా తన మాటల్లో సూచించాడా అని తోస్తుంది నాకు. ముందుదాహరించిన **'సతిసాహిత్య'** అనే పద్యంలో **'ప్రత్యలంకరణ మౌఖర్యము'** ని ఒకమాట ప్రయోగించాడు అనుకోకుండా. మౌఖర్యమంటే ముఖరత్వం చాపల్యమని వదరుబోతు తనమని అర్థం. ఇది దాక్షిణాత్యులందరికీ వెన్నతో పెట్టిందని పండితరాయలే అన్నాడొక చోట. **'ప్రకృతి ముఖరో దాక్షిణాత్య స్వభావః'** దాక్షిణాత్యులు సహజంగానే చపల స్వభావులట. అతడు చెప్పిన చాపల్యమే భట్టుమూర్తిలో కనిపిస్తున్నదా అని తోస్తుంది మౌఖర్యమనే మాట వినగానే. అలంకారాలు వాడటంలో ఎంతో మోజుంది భట్టుమూర్తికి. అవి శబ్దాలంకారాలు కావచ్చు. అర్థాలంకారాలు కావచ్చు. శబ్దాలంకారాలు మరీ

ప్రమాదం. అతిగా వాడితే రసజ్ఞుల కుద్వేజకంగా కనిపిస్తుంది. పైగా ధ్వన్యాలోకం లాంటి ఉత్తమ కవితా లక్షణా లాకళించుకొన్న తాను కేవలాలంకార ప్రాచుర్యానికి లోబడి రచన చేయటమేమిటా అని పిస్తుంటుంది నాకు. ధ్వన్యాలోకంలో ఆనందవర్ధనాదు లేమని శాసించారు. **'శబ్దార్థ శాసన జ్ఞాన మాత్రేణైవ నవేద్యతే – వేద్యతే సతు కావ్యార్థ తత్త్వజ్ఞై రేవ కేవలం** – శబ్దార్థాల మీద మాత్రమే గాదు కవి కుండవలసింది దృష్టి. రసభావాది ధ్వనిమీద నంటారాలంకారికులు. అంతే కాదు. **'అలంకృతీనాం శక్తావ ప్యాను రూప్యేణ యోజన'** మని కూడా శాసించారు. అలంకార ప్రయోగంలో నీకెంత చాతుర్యమున్నా సందర్భోచితంగా ఏ కొంచెమో ప్రయోగించాలే గాని పిచ్చిగా అదే చివరిదాకా పాటిస్తూ పోరాదు సుమా. అది కావ్యానికి ప్రధానమైన రసభావాలకు భంగకరమని హెచ్చరించారు. అదీ తెలియనివాడు గాదు భట్టుమూర్తి. **సారసలోచన లున్నచోటికిన్ బోరన లాతివారు చనబోయినచో రసభంగమౌ'** నన్నవాడు తానే గదా. సరసమైన చూపుండవలసినచోట దానికి భిన్నమైన దేది మధ్యలో చోటు చేసుకొన్నా అది రసభంగాని కేనని భంగ్యంతరంగా సూచన చేయటమే గదా కవి.

అయినా ఇతర కవి జిగీషా బుద్ధి ఈ శ్లేషాద్యలంకార ప్రయోగ బాహుళ్య మనీషకు దారితీసి వసుచరిత్రను కవి ఆసించినంత రసవత్తరంగా గాక ఒక చిత్ర కావ్య విశేషంగా మార్చి మనముందు నిలబెట్టింది. అయితే ఒక్క మాట. అది భట్టుమూర్తి కెంత బలహీనతో అంత బలం కూడా అదే. అందులోనే తన ప్రజ్ఞా విశేషాన్ని పాఠకలోకానికి ప్రదర్శించ దలచాడు.

కాబట్టి మనమీ కవి కావ్యాన్ని విమర్శించేటప్పుడాయన కెందులో విశిష్టమైన అభినివేశముందో అది ఎంత చక్కగా నిర్వహించ గలిగాడో ఆ అంశాన్ని మాత్రమే పట్టుకొని పరామర్శిస్తూ పోవటం మంచిది. మన ముపోద్ఘాతంలో పెట్టుకొన్న నియమం కూడా అదేగదా అసలు. ఏయే శాఖలో ఏయే కవి కెలాంటి కౌశల ముందో ఎందులో నిష్ణాతుడో అది బయటపెట్టటమే మనధ్యేయం. అలాంటప్పుడీ కవిలో అది లేదిది లేదేమిటలా వ్రాశాడనే ప్రశ్న రాకూడదు. అయినా కావ్యాని కాత్మభూతమైన రసధ్వని అసలే లేనివాడు గాదు భట్టుమూర్తి. ఎంత శబ్ద చిత్ర చాపల్యమున్నా అంత అన్యాయం కాదు. అక్కడక్కడ కావ్యంలో ఆయా సందర్భాలలో రచించిన పద్యాలెంత రసభావ స్ఫోరకాలో రసజ్ఞులే గ్రహించగలరు. ఈ క్రింది పద్యాలు చూడండి. మీకే అర్థమవుతుంది.

**పంకజనేత్ర శంఖ పరిభావక కంధర తల్లియేలకో**
**సంకులు గట్టెనంచు కులశైలసుతా గ్రణిపాయఁద్రోచి ర**
**త్నాంకిత హారమున్న బరువానునొ బిడ్డ కివేల కర్కశా**
**లంకృతులంచు హల్లక కలాపములుంచు నదీలలామయున్**

తమ బిడ్డ గిరికను ముద్దు చేస్తున్న శుక్తిమతీ కోలాహలుల దుహితృ వాత్సల్యాన్ని వర్ణించే ఘట్టమిది. శంఖాన్ని కూడా లెక్కచేయని మన అమ్మాయి మెడలో ఏమిటా తల్లి సంకులు కట్టిందని వాటిని త్రోసి వేసి తండ్రి మంచి రత్నాల హారం వేశాడట అమ్మాయి మెడలో. అది చూచి ఏమిటీ రాళ్ళ హారం బిడ్డకు బరువుగాదా అని తల్లి వాటిని కూడా కాదని మంచి ఎఱ్ఱ

కలువల దండలు వేసిందట కూతురి మెడలో. ఏమి హాయిగా ఉందో చూడండి. ఎంత ముద్దుగా ఉందో ఈ వర్ణన. ఇందులో శబ్ద శక్తి ధ్వని కూడా ఎంతో గుప్తంగా పెట్టి రచించాడు కవి. సంకులు కట్టటమంటే అపహాస్యం చేయటం. సంకుతో పోలుస్తారు కన్యమెడను. దాన్ని కూడా గెలిచిన మెడలో మరలా సంకులు కట్టటమేమిటి. ఇది ఒక సొబగు. అలాగే రత్నాలంటే ఎంత విలువైనా అవీ రాళ్లే గట్టిగా సోకుతాయి. ఎంతో విలువైన హారమే కావచ్చు మెత్తగా లేదు గదా అని శుక్తిమతి కలువల దండ వేయటం మరొక సోయగం. ఇంకా గాంభీర్యమే మంటే శంఖాలు నదిలో పుష్కలంగా దొరుకుతాయి. అవి అందుబాటులో ఉన్నాయి గదా అని తల్లి - రత్నాలు కొండల గనులలో సమృద్ధిగా దొరుకుతాయి గదా అని తండ్రి - అలాటి సొమ్ములు కూతురికి పెట్టటంలో ఔచిత్యమెంతైనా ఉంది. చివరకు తల్లిదే పయి చేయన్నట్టు కలువల దండ వేయటంలో నదిలోనే అవి కూడా లభిస్తాయనే భావం కూడా బ్రహ్మాండంగా ఉంది. అన్నిటినీ మించి కూతురి నంత ముద్దుగా చూచుకొనే తల్లిదండ్రుల ప్రేమాతిశయ మెంతైనా ధ్వనిస్తున్నది.

ఇలాగే మరో పద్యముంది ఇలాటి వాత్సల్యాన్నే సూచించేది.

**వీణావాదన వేళలన్ ఘుమఘుమా విర్భూతినింపన్ జగ**
**త్ప్రాణా చంచల తైలశూన్యనవ దీప శ్రేణికాపాదియై**
**రాణింపన్ముఖలక్ష్మికి న్ముకురమై రంజిల్ల లేఁబట్టికిన్**
**మాణిక్యాయతనం బొనర్చె గిరి యాత్మ శ్రీ ప్రభావంబునన్'**

ఇది తండ్రి కూతురి ఎడల చూపే అభిమానం. కూతురు పెరిగి యుక్తవయస్కురాలు కాగావే ఆవిడకున్న సంగీతాది కళాభిమానం గుర్తించి కోలాహలుడు అద్భుతమైన మందిరమొకటి మణులూ మాణిక్యాలతో నిర్మించాడట. కొండల రాయడు గదా నవరత్నాల కేమి కొదవ అని భావం. అందులో ఆవిడ కద్దంతో పనే లేదు. ఎక్కడ ఏ గోడలో చూచినా తన సౌందర్యం ప్రతి ఫలించి కనిపిస్తుంది. దీపాలక్కర లేదు. అన్నీ కాంతులు విరజిమ్మే రత్నదీపాలు. గాలి కారిపోయే ప్రసక్తి కూడా లేదు. ఇక వీణా వాదనా భ్యాస మెంతైనా చేయవచ్చు కుమార్తె. భవనమంతా మారుమోగు తుంది జంత్రగాత్ర నాదంతో.

ఇలాంటి రసభావ ధ్వని స్ఫోరకాలైన పద్యాలు రచించే ప్రాగల్భ్య మెంతైనా ఉన్నవాడు భట్టుమూర్తి. సామాన్యుడు కాడు. కాని చెప్పాను గదా ఎంత సమర్థుడైనా మానవుడేదో ఒక చాపల్యానికి లోనవుతాడని. అలాటి చాపల్యమే ఆవరించింది కవిని. అదీ ఒకటి గాదు. రెండు. ఒకటి అన్యకవి జిగీష – ఇంకొకటి నిజపాండిత్య ప్రదర్శనా మనీష. ఏ కవికైనా ఇలాటి బలహీనత ఉండటం సహజమే కొంతవరకు. కాని వాటి నదుపులో పెట్టుకొని కావ్యశిల్పం మీదనే దృష్టి పెట్టుకొని ముందుకు సాగిపోయే వారు కొందరైతే – కావ్య తాత్పర్యమే మరచిపోయి కేవలం తమ పాండిత్య ప్రకర్షనే చాటుకొంటూ పాఠకుల నాకర్షించే ప్రయత్నం చేసేవారు మరి కొందరు రచయితలు. భట్టుమూర్తి ప్రస్తుత మీ రెండవ శ్రేణిలోకి వస్తాడు. అందులోనూ ఇతని కున్న ప్రతిభ శబ్ద చిత్రరంగంలో. ఒక అర్థంతో తృప్తి పడడీ కవి. ఏ శబ్దానికెన్ని అర్థాలున్నాయి. ఆయా అర్థాలు స్ఫురించేలాగా

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఆయా శబ్దాలు ఎలా పోహళిస్తూ పోవాలి – ఆ శబ్దాక్షర విన్యాసం కూడా ఎన్ని వింత వింత పోకడలు పోతే ఎంత అందంగా ఆనందంగా ఉంటుంది – అని అన్వేషణ ఈకవికి. అది కేవలం శ్లేషా కాదు. కాకపోదు శ్లేషా గాని శ్లేష. దీన్ని కూడా మించి శబ్ద శక్తి ధ్వని అని కూడా అంటే అనవచ్చు. రెండవ అర్థం చెప్పుకొన్నా చెప్పుకోవచ్చు– లేకున్నా లేకపోవచ్చు – చెప్పుకొంటే మరీ అందం. ఇక యమకాను ప్రాసాద్యలంకారాలైతే కుప్ప తెప్పలు – అడుగడుగుకూ ఎదురుపడి ముందుకు సాగకుండా మనలను నిలదీస్తాయి. ఆహా ఓహో ఎంత అద్భుతమిది అని తల ఊపేంత వరకూ మనలను వదిలిపెట్టవు. ఒక్కొక్కరి కొక్కొక్క రంగంలో ప్రావీణ్యమున్నట్టే భట్టుమూర్తికీ శబ్ద చిత్ర విద్యలో ఎనలేని పాండిత్యం. కాబట్టి మనమీ మహాకవి నా క్షేత్రంలోనే స్థాలీపులాక న్యాయంగా పట్టి చూడటం మంచిది.

అసలు తన ఇష్టదైవతమైన ఆంజనేయస్వామిని మొదట స్తోత్రం చేయటమే అద్భుతం.

**తరుణార్క కబళనోద్ధతిఁ జూపె నెవ్వాడు**
**రుచులచే ఫలమోహ రుచుల చేత**
**సకలంక రామ ముద్రికఁ బూనె నెవ్వాడు**
**శయముచే హృత్కుశే శయము చేత**
**మున్నీరు పల్వలంబుగ దాటె నెవ్వాడు**
**జవముచే గుణగణార్ణవము చేత**
**నక్ష శిక్షా ప్రౌఢి నలరారె నెవ్వాడు**
**రణముచే నియమ ధారణము చేత**

ఎంత గొప్పగా ఉందో ఆయా శబ్దాల ఆవృత్తి. అంతకన్నా గొప్పగా ఉంది ఆ మాటలు సూచించే భావం. తరుణార్క మండలాన్ని మ్రింగ బోయాడే హనుమంతుడది దాని రుచుల చేతనే గాదు. ఫలమోహ రుచుల వల్ల కూడా. ఒక రుచి కాంతి. మరొక రుచి భ్రాంతి. రామముద్రిక పూనింది శయము చేతనే గాదు. హృత్కుశేశయము చేత కూడా. ఒక శయము హస్తమైతే మరొక శయము కుశేశయము, పద్మం, ముద్రిక రామమంత్రం కావచ్చు. ఆయన అంగుళీయకమూ కావచ్చు. అంగుళీయకం చేతిలో ఉంచవచ్చు. మంత్రం చేతిలో కాదు హృదయ కమలంలో. ఇక్కడ శయ మనే శబ్దం కుశేశయంలో కూడా కనపడుతుంది. రుచి శబ్దం లాంటిది కాదిది. శబ్ద రూపాలొక్కటే అయినా శబ్దాలు వేరు. మున్నీరంటే సముద్రం. దాన్ని ఒక పిల్లకాలవలాగా దాటిపోయాడు జవం చేతనే గాదు. ఆర్జవం చేత కూడా. ఆర్జవంలో జవమనే మాట దొర్లటం చమత్కారం. పోతే అక్ష శిక్ష అంటే అక్షకుమారుణ్ణి సంహరించటమని ఒక అర్థం. అది రణంలో అయితే అక్ష శిక్ష అంటే ఇంద్రియ నిగ్రహం అది నియమ ధారణంలో. ధారణ శబ్దంలో రణమనే మాట రావటమొక చమత్కారం.

మరి సరస్వతీ ప్రార్థనా పద్యంలో ఒక సారస్యమెంతో చక్కగా చోటు చేసుకొన్నది. **సకలా మోదక తాళ వృత్తగతులన్ సంగీత సాహిత్య నామక విద్యాయుగళంబు పల్కుఁజెలికిం బాలిండ్ల జోడై'** అని వర్ణిస్తాడు కవి. సంగీతం సాహిత్యం సరస్వతికి స్తన ద్వయమని ప్రసిద్ధమైన కవి సమయం. కాని ఇక్కడ విశేషమేమంటే **'తాళ వృత్త గతులనే'** మాట దాన్ని ఎంతో

అందంగా సమర్థిస్తూ ప్రయోగించాడు కవి. తాళఫలంలాగా వృత్తమంటే వర్తులంగా ఉన్న వనీ అర్థమే. అంతేగాక తాళగతి సంగీతానికైతే వృత్తగతి అంటే పద్యరచన సాహిత్యాని కని రెంటికీ రెండు శబ్దాలు వాడినట్టు స్ఫురిస్తుంది.

మరి **'భావంబెక్కడ లేక'** అనే కుకవులను నిందించే పద్యంలో వారిని వేశ్యలతో పోల్చి వర్ణించాడని ఇంతకు ముందు పేర్కొన్నాము. వేశ్య అనే అర్థమెక్కడ ఉందక్కడ. సామాన్యాకృతి అనే మాటలో ఉంది. సామాన్య అంటే వేశ్య. కాని వేశ్య అనే అర్థమక్కడ చెప్పాలనే నిర్బంధం లేదు. చెప్పినా చెప్పవచ్చు. చెప్పకా పోవచ్చు. చెప్పటాని కవకాశ మిస్తున్న దామాట. చెబితే మిగతా మాటలు దానికి దోహదం చేస్తాయి. శ్లేష గాని శ్లేష ఇది. సమాసోక్తి అప్రస్తుత ప్రశంసాలంకారాలలో లాగా అర్థాంతరం ధ్వనిస్తుంటుంది. ఇలాంటి శబ్ద శక్తి మూలధ్వని కూడా ఎంతగానో కనిపిస్తుంటుం దక్కడక్కడా.

కవి అధిష్ఠానపుర వర్ణన కుపక్రమించాడో లేదో ఇక శబ్ద చిత్రం చిత్ర విచిత్ర భంగిమలలో తాండవిస్తూ పోతుంది. కావ్యమంత మయ్యేవరకూ ఆగదు ఆ తాండవం. ఆ పట్టణంలోని బ్రాహ్మణులనూ రాజులనూ కీర్తిస్తున్నాడు చూడండి.

**చాతురాస్యుల్పురుషోత్తము ల్బుధ గురుల్... జగద్బంధు లాక్షితి దేవుల్పురి** వారంతా క్షితి దేవులంటే భూసురులు. దేవత లెలా అయ్యారని అడిగితే సమాధాన మిస్తున్నాయి **చతురాస్యుల్పురుషోత్తములని** ముందు పేర్కొన్న మాటలన్నీ. చతురాస్యులంటే చతురంగా మాటాడేవారనీ

చతుర్ముఖులనీ - పురుషోత్తములంటే పురుష శ్రేష్ఠులనీ విష్ణుమూర్తులనీ మానవపరంగా దేవతా పరంగా ఎలా చెప్పినా చెప్పవచ్చు. **దేవతా మహిమలం జెన్నొందు ట ల్చిత్రమే** అని ముగించాడు కాబట్టి ఇది కేవల శ్లేష కాదు. కేవల ధ్వని గాదు. గుణీభూత వ్యంగ్యం క్రిందికి వస్తుంది. ఇది ఒక విశేషం భట్టుమూర్తి రచనలో.

పోతే ఈ క్షత్రియుల వర్ణన చూడండి. ఎంత బాగుందో.

**పగలైన తెల్వి గోల్పడని రాజులు - శరం**
**బులు చన్న వెల వెల బోని ఘనులు**
**ధన దాశఁగేలు మోడ్చని సార్వభౌమాంకు**
**లని వెన్క ముందు చూడని కుమారు**

లని ఇలా సాగుతుంది పద్యం. ఇక్కడ రాజులు ఘనులు సార్వభౌములు కుమారులనే మాట లెంతో సార్థకం. వద్దనుకున్నా రెండర్థాలు మూటగట్టి అందిస్తాయి మనకు. అలాగే పగలు శరంబులు ధనద వెన్క ముందు చూడని అనే మాటలలో ఎంతో ఉంది గాంభీర్యం. రాజులంటే ప్రభువులు చంద్రులు - చంద్రుడు పగటివేళ తెలివికోలుపోతాడు. అని ఒక అర్థం. పగలంటే కలహమెదురైనా తెలివి తప్పని క్షత్రియులని మరొక అర్థం. అలాగే శరమంటే బాణం. బాణాలు పడిపోయినా తెల్లబోని ఘనులు. గొప్పవారా రాజులు. ఇదొక అర్థమైతే శరములంటే నీళ్లు. నీళ్లు ఖాళీ అయినా వెల వెల బోని ఘనులంటే మేఘాలు. మరి వెన్కముందు చూడరట ఆ రాజులు. జంకులేని వారని అర్థం.

కుమారులంటే వీరాధివీరులు. కుమారుడంటే షణ్ముఖుడని కూడా అర్థమే. ఆయన ఎంత వీరుడైనా వెనక ముందు చూస్తాడు. ఆరుముఖాలు గదా ఆయనకు. పన్నెండు నేత్రాలు. అన్నీ ఒకవైపే చూడవు. కొన్ని ముందు చూస్తే కొన్ని వెనక్కు చూడక తప్పదు. ఈ ఉపమానాలెంత సుందరంగా ఉన్నాయో - ఎంత శ్లేష గర్భితంగా ఉండి కూడా ఎంత మనోహరంగా ఉన్నాయో గదా.

పోతే ఈ శ్లేష చూడండి. ఎంత హృదయా శ్లేషగా ఉందో,

**ఘనుల కొండల పాలుగాఁ జేసిన కొఱంత**
**ద్విజరాజు నెపుడు కుందించు కొదవ**
**కువలయంబు దినంబుఁ గూర్చు నాడిక - బంధు**
**జీవ మామోదిగాఁ జేయని సడి**

ఇవన్నీ నలువ సృష్టిలో దొరలిన దోషాలు. ఆ దోషాలు పోగొట్టుకోటాని కాయన తత్పుర సతుల నెఱికురులు ముద్దు మోములు - ఇలాటి వాటిని సృష్టించి తృప్తిపడ్డాడంటాడు. ఇందులో శ్లేషలు రసజ్ఞులైన అభిజ్ఞులు తమకు తామూహించుకొని సంతోషించవచ్చు. **మరి పొన్నపూవొడి నేల పొదివితే చెలి - యది పొడమె బల్దీవిపైఁ బొదువ వలదె'** అని ప్రశ్నోత్తర రూపంగా పుష్ప లావికలను వర్ణించిన సీస పద్యం చదివితే వారి ఛలోక్తులను వర్ణించటంలో కవి ఎంత చమత్కారియో మీరే తెలుసుకోగలరు.

మరి వసురాజు గుణగణాలు వర్ణించాడెంతో అద్భుతం. **'మీటిన రాజు బల్మి నడంప - లోనైన నభినవ స్థితిఁ బెంప న తడె నేర్చు'** ఎంత నవనవోన్మేషమో ఈ శ్లేష. ఉన్నట్టుండి వసంత మావిర్భవించింది రాష్ట్రంలో. దానితో భట్టుమూర్తి కవితా రాష్ట్రమే కదలి కదను తొక్కింది.

**లలనా జనా పాంగ వలనా వసదనంగ**

**తులనాభికా భంగదోః ప్రసంగ**

**మలసానిల విలోల దళసాసవ రసాల**

**ఫల సాదరశుకాల పన విశాల**

**మలినీ గరు దనీక మలినీ కృత ధునీ క**

**మలినీ సుఖిత కోక కులవధూక**

**మతి కాంత సులతాంత లతికాంతర నితాంత**

**రతి కాంతరణ తాంత సుతను కాంత'**

మనే సీసం చదువుతుంటే ఆ శయ్య ఆ హొయలు చూస్తుంటే పద్యమనే తూగుటుయ్యాల ఎక్కి కూచొని ఇటూ అటూ ఊగుతున్నట్టే ఉంటుంది మనకు. మరి కావ్యాలంకార మనే లక్షణ గ్రంథం కూడా రచించాడు గదా. అందులో సూత్రీకరించిన శయ్యా వృత్తిరీతి పాకాదులకు పాత్రీకృతం చేయాలి గదా కవి తన కావ్యాన్ని. అలాగే చేశాడు. అనుప్రాస యమకాది శబ్దాలంకారాలను కూడా చూపించి ఎంతో గొప్పగా నిర్మించాడు పద్యం. మరి **అరిగా పంచమమేవగించి** అనే పద్యమిక చెప్పనే అక్కరలేదు.

సంగీత కళే గాక అది సరి అని అక్షరావృత్తిరూపమైన సాహిత్య కళకు కూడా తార్కాణమే.

ఇక చూడండి. భట్టుమూర్తి పట్టు పట్టి మనలను వద్దంటున్నా వదలి పెట్టక చిత్ర విచిత్ర వీధులలో తీసుకెళ్లిపోతున్నాడు. ఎలా ఉన్నాయో మార్గాలు.

**ఏపారు పొదరిండ్ల నాపాట లాశోక**
**దీపార్చిఁ గన క కలాప మరసె**
**సాలావలులు దాటి యేలా లతావార**
**బాలాతతి పరాగ పటము లూడ్చె**

అశోక పుష్పాలు ఎఱ్ఱగా ఉంటాయి. అవే దీపకాంతులు గంధవాహుడికి. ఆ దీపాల కాంతిలో కనకాభరణా లెక్కడ ఉన్నాయో అని వెదుకుతున్నాడు. కనకమంటే బంగారమనే గాదు సంపెంగ అని కూడా అర్ధమే. అలాగే సాలవృక్షాలు దాటి యేలా లతలనే బాలికల పరాగమనే పైటలు తొలగిస్తున్నాడట. ఎంత గడుసరి ఆ గంధవహుడు. ఇలా నడుస్తుంది పద్యం. ఇందులోనూ శ్లేషే. దానితోపాటు ఏపారు ఆ పాటల దీపార్చి - సాలా ఏలా బాలా అని అక్షరావృత్తి ఎంతో ఒయ్యారాలు చూపుతూ ఓహో అని మనమెప్పు నందుకొంటున్నది.

ఈలోపుగా ఒక రిలీఫు ఇస్తున్నది వెంటనే ఒక పద్యం.

**ఆ యారమ్ములఁబొల్చు కొమ్మల బెడంగా పల్లవశ్రేణి రం**
**గాయా తాపుల మించు పూఁబఱపు లాహాయెన్నగాశక్యమే**

మామూలుగా వ్రాస్తున్నట్టున్నది. కాదు. కొమ్మలతో పాటు కొమ్మలున్నారక్కడ. పల్లవాలతో పాటు వారి పల్లవులు కూడా ఉన్నారు. వారికి పఅచిన పూఁబఱుపులున్నాయి. జాగ్రత్త అంటున్నాడు కవి. ఇంకా ఏమంటాడో తెలుసా.

**'ఆయుద్యానము సాటి చైత్రరథ మెట్లౌ** – కుబేరుడి ఉద్యానానికి చైత్ర రథమని పేరు. అన్ని చెట్లూ కలిసి అది చైత్రరథమైతే **ఒక్కొక్క నగంబె చైత్రరథ** మిక్కడ పొమ్మంటాడు. చైత్రుడెక్కి పోయే రథం చైత్ర రథమని విగ్రహం సమాసానికి. ప్రతి చెట్టూ పుష్పించి ఫలిస్తే చైత్రుడా వృక్షమనే రథమెక్కి కూచున్నట్టే గదా. శ్లేషలో ఎంత శిల్పం.

మరలా ఊపందుకున్నాడు కవి.

**ఇమ్ములై మరుహజారమ్ము లైపొదలుండ**
**పూజవికెలు వేఱె పూన వలదు**
**తెప్పలై నెత్తావి కుప్పలై పుప్పొళ్ల**
**రుల గంద వొడి త్రోవఁ జిలుక వలదు.**

ఇమ్ము రమ్ము తెప్పకుప్ప – ఈ శబ్ద చిత్రమే గాదు. ఒక అర్థచిత్రం కూడా ఉందిక్కడ. ఏమిటది. పూలపొదలుంటే అవే చాలు. చలువలు చల్లే చవికలక్కర లేదు. కుప్పలు కుప్పలుగా పుప్పొళ్లు పడి ఉంటే వేరే గందవొడి చల్లటం దేనికంటాడు. ఎందుకీ హడావుడి అంటే వసురాజుగారు వస్తున్నారా ఉద్యానానికి. మరి చైత్రుడాయనకు రాజమర్యాదలు జరపాలి గదా. సహజంగానే జరుపుతున్నాడు. అందుకోసం యత్నమే అక్కర లేదని కవి

అర్థచిత్రమే జవాబిస్తున్నది. అది వనపాలురు విన్నవించారో లేదో ఆరాజుకు **సాలాళీ నూతనపాళీ ఘనకేళీ వనపాళీ** దర్శనం చేయాలని ఉత్సాహ మిగలరొత్తిందట. **తమ్ము సేరంగ వచ్చిన యవని జాని కవని జానీక మచట సాష్టాంగ** పడ్డదట. ఒక అవనిజాని రాజు గారయితే ఇంకొకటి అవని జనీకం చెట్ల వరసలు. అవి గాలికి తలలు వంచితే అదే సాష్టాంగపడటం. ఏమి మర్యాద. ఇంకా ఎన్ని రకాల ఉపచారాలు చేస్తున్నదో తెలుసా ఆ ఉపవనం. **చిగురు కెంగేలు సాచింది రసాల వల్లరి. తేట చూపులఁ జూచింది తిలకలత.** పికగీతి ఎలాంటిదో పాడి చూపింది **ప్రియాళువు. కీర భాషతో పలకరించింది కర్ణికారం** – ఇలా సకలోప చారాలూ పొందుతూ ఆ రాజు గారి **కతిలోక వయః కోలాహల కోలాహల లీలా పాలిక చెంగలించి** దంటాడు కవిగారు.

ఇంతలోనే రాజుగారి నర్మ సచివుడాయ ననొక అద్భుతమైన దృశ్యం నేను చూచాను మీకూ చూపుతానంటాడు. అదేదో గాదు. ఆరాజు నిత్యమూ విహరించే కేళిశైలమే. కోలాహల పర్వతమే. అది మనకు పరిచితమే గదా చూతాము రా అంటాడు రాజు. కాని అక్కడి అద్భుతమైన దృశ్యమెప్పుడూ చూడని దొకటి కంటబడు తుందానాడు. ఏమిటది. **వైమానిక మానినీ మధురగాన స్వానం** అది ప్రత్యక్షంగా వినాలంటే ఆదారిలో కొంత దూరం వెళ్లాలి. ఆ దారి ఎంత సొగసుగా ఉందో చూపుతున్నాడు చూడండి కవి.

ఒక చాయ నవపాయ శుకగేయ సముదాయ
మొక సీమ నానామయూర నినద

**మొకవంక నకలంక మకరాంక హయవేష**

**లోకక్రేవ వనదేవ యువతి గీత**

**మొక చెంత సురకాంతల కరాంత తతనాద**

**మొకదారి నవశారి కోదితంబు**

**లోక యోర పటుచారణ కుమార ఫణితంబు**

**లోకదండ నలిమండ లికల గాన**

**మొక్కమొగి మ్రోసే దారి**

ఇంత చిత్రమైన దారి. అతివేలమైన ఈ కోలాహలముల కలిమి వల్లనే అది కోలాహలమనే పేరు తెచ్చుకొన్నదని నర్మ సచివుడి చిత్రమైన వ్యాఖ్యానం. కాదు. చిత్రకవి భట్టుమూర్తి చిత్ర విచిత్రమైన సమాధానం. ఇక ఆ పర్వతాన్ని వర్ణిస్తాడు కవి ఆ నర్మ సచివుడి వ్యాజంతో. అవి పద్యాలే గావు. గద్యమే గాదు. అవి ఎంత అర్థచిత్రాలో – అంత శబ్ద చిత్రాలు. అక్కడి కన్యాజన సంగీత శబ్దాలనే చిత్ర విచిత్ర భంగిమలలో కర్ణ రసాయనం చేస్తున్నాయా శబ్దాలు – ఎలాంటి వంటారవి.

**'వీనుల విందై – యమృత పు**

**సోనల పొందై యమంద సుమచల దలినీ**

**గానము క్రందై – యా స్వన**

**మానంద బ్రహ్మమైన'** దట. అది ఆ అధిపతికే కాదు. మనబోటి అధ్యయన పరులకు కూడా. అది షట్పదీ నాదమో– కలకంఠ నాదమో – మరున్నారీ మణీ వల్లకీనాదమో వివరింపరాదు.

**నానాగాయన గాయనీ మణుల గానం బుర్వినాలింపమో**
**నానాటన్నగ భేది వీటఁగల గంధర్వాప్సరో గీతవి**
**ద్యానైపుణ్యము లెన్ని యేనిఁగనమో - యందైన నిందైన విం**
**దైనాదం బొన గూర్చునే మదికి నిట్లానంద సందోహమున్'**

అని ఆ రాజు గారానాదం విని ఎలా పరవశుడయ్యాడో అలాగే మనం కూడా పారవశ్యం చెందక తప్పదు. చెందనని ఎంత పట్టుబట్టి కూచున్నా పట్టు వదలిస్తాడు భట్టుమూర్తి తన శబ్ద చిత్రంతో మేళవించి ఆ శబ్దాన్ని మన చెవులకందించి. అంతేకాదు. ఇంకా కొంచెం మీకు సంగీత విద్యలో ప్రవేశమున్నదా అయితే చెబుతాను వినండి. **'పల్లకీర వము సంగతిఁ బాడెదరెవ్వరో తన్మ్రుదు పంచమ షడ్జశయ్య కొయ్యన నెలుగిచ్చె వింటె ప్రమదాకుల కోకిలకేకి లోకముల్'** అని దానిలోతులు బయట పెడతాడు. **'పంచమం వక్తి కోకిలః - షడ్జం వదతి మాయూరః'** అని అభిజ్ఞుల వచనం. వారు గాత్రంతో శ్రుతి కలిపి వీణ వాయిస్తుంటే అక్కడ తిరుగుతున్న కోకిలలు నెమళ్లూ తమ స్వరాలే వినిపిస్తున్నాయని అవీ శబ్దం చేస్తున్నాయట. ఎలాగా. **ఆకుల కోకిల కేకిలోక** కకార ప్రాబల్యం చూడండి. కోకిల మయూరాది ఆ కవుల మాట అలా ఉంచి ఈ క వికీ పిచ్చే గదా సంగీతమంటే. ఆ పిచ్చి మీరూ పట్టించుకోండి కలిగించుకోండన్నట్టు కకక అని పదే పదే పోరు పెడుతున్నాడు మన చెవి దగ్గర.

అదేదో ఎవరు పాడుతున్నారో చూచి రమ్మన్నాడో లేదో ఇక బయలుదేరాడు వాడు. ఎలాంటి దాదారి.

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

ఓరఁగయి వ్రాలిన నమేరువుల పుష్పాదుల
    సౌరువులు వెంట సహకార మిళదేలా
ధారముల జారు హిమ వారి కృత సారణుల
    పైరయిన చెంగలువ యారికలలోఁగా

**శ్మీరకృత సేతువుల దారి** అది. అందులో ఒక మణిమయ సుందర మందిరం. ఆ మందిరంలో కొందరు మందయానలు. ఇక వారిని చూచే దాకా తహ తహ పట్టలేకపోయాడు వాడు. ఎలాంటి **తహతహ. తరువుల పొంతఁ బొంచి - గాంచె తరుణి - తమోవి నీలకచ తామర సోదర సోదర ప్రభ - తరళవిలోచన - తతని తంబ - తటిన్నిభ గాత్ర వల్లరి - తరుణ శశాంక ఫాల - తరంగ వళి - తలోదరి** అయిన ఒక తన్వినట. అంతా తహతహే ఆ సచివుడికి. చూడనప్పుడూ చూస్తున్నప్పుడూ కూడా.

అలా చూచాడో లేదో. ఇకవాడికి కవిత్వం పుట్టుకొచ్చింది చూడండి. కాదు కాదు. వాడికి పుట్టిస్తాడు భట్టుమూర్తి.

'తనకప్పునెతి గొప్పుననె పూని గౌరీస
    మాఖ్యమించ జనించి నట్టి యార్య
తన చాపలము చూపులనె చూపి సిరులెల్ల
    కడఁజల్ల వచ్చిన కమల పాణి
తన పొండి మము నవ్వులనె యుంచి గాంధర్వ
    మననికిఁ దెచ్చిన హంసయాన
తన యదృశ్యత నడుమనె తాల్చి సొంగయై
    మొనసిన యతను సమ్మోహ విద్య

Valluri Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

అట ఆ నాయిక. చాలా గొప్ప పద్యమిది. శబ్ద శక్తి మూర్తీభవించిన పద్యం. శ్లేషగాని శ్లేష. ఆర్య అంటే పార్వతి. ఆర్య అంటే వయసు వచ్చిన కన్య. గౌరి అన్నా అవే అర్థాలు. పార్వతి శరీరం కప్పు అంటే నలుపు. ఈ కన్య మరి పార్వతి ఎలా అయింది. ఆ నలుపంతా కొప్పులోనే కప్పుకొని వచ్చిందట ఆవిడ ఈ కన్యారూపంలో. అలాగే కమల పాణి అంటే లక్ష్మి. లక్ష్మికి చపల చంచల అని గదా పేరు. ఆ చాపల్యమేమయింది. అది ఆవిడ తన చూపులలోనే దాచుకొని సిరు లొలుకుతూ వచ్చిందీ కన్యరూపంలో. అలాగే సరస్వతి శరీరం తెలుపు. అది తన నవ్వులలోనే దాచుకొని గాంధర్వ విద్యలో అవతరించిందట ఈ నాయికగా. మరి మన్మథుడి సమ్మోహ విద్య నిరాకారం గదా. అంటే ఆ అదృశ్యత నడుములోనే దాచుకొని మిగతా శరీరంగా మూర్తీభవించి ఈ గిరికా రూపంగా కనిపిస్తున్నదట ఆ విద్య. ఇక్కడ చూడండి పార్వతీ లక్ష్మి సరస్వతీ. సమ్మోహ మనే మాటలు రెండువైపులా పదునున్న కత్తులు. ఆర్యగౌరి నాయికకు కూడా అన్వయిస్తాయి. లక్ష్మి కమలపాణి అయితే ఈ కన్యా కమలంలాంటి పాణి గలిగినదే సరస్వతి హంసయాన అయితే ఈ అమ్మాయీ హంసయానే. ఆ విద్య అదృశ్య అయితే ఇది దృశ్య విద్య. కనుకనే ఈ దివ్యస్వరూపిణిని వర్ణించి '**ఆ మహేశు నానగోద్ధారకుని నా ప్రజాధి నాథు నా జగమ్మోహనుని ఇటకు దెత్తు**' నని బయలుదేరుతాడు నర్మ సచివుడు. ఈ నాలుగూ చూడండి ఇవీ ఆ నాలుగింటికీ సరిపడే మాటలే. మహేశుడంటే ఈశ్వరుడు. మహారాజు, నగోద్ధారకుడంటే మంథర పర్వాతాన్నెత్తిన విష్ణుమూర్తి – కోలాహలనగాన్ని దూరంగా గోట మీటిన వసురాజు. ప్రజాధి నాథుడంటే

ప్రజాపతి బ్రహ్మదేవుడు నరపతి వసురాజు. జగన్మోహనుడంటే జగత్తు నంతా మోహింపజేసే మన్మధుడు. జగన్మోహనాకారుడైన మహారాజు– ఆ మగవారికి తగినవారే ఈ మగువలు. చూచారా ఎంత శబ్ద శక్తి మాహాత్మ్యమో భట్టుమూర్తిది. చూస్తారా ఇంకా ఆ శబ్ద మాహాత్మ్యం –

**నాళీకాకర తీరసారకదళీ నారంగ పూగావళీ**
**పాళీవాసితమైన కోనఁగని యా బల్కోనలోగానలో**
**లాళీ ప్రేరక రత్నకోరక మయూఖాళీ సమాలీఢమౌ**
**కేళీధామం** చూపగలదాయన గీచిన శబ్ద చిత్రం. అంతేకాదు. అక్కడ ఒక కన్యకా మణి దివ్య సుందర విగ్రహాన్ని కూడా చూపగలదు. ఏ అవయవానికా అవయవ మద్భుతమైన సౌందర్య మొలకబోస్తుంది.

**క్షణ విలాసమె గాని గజనిమ్మ పండులు**
**సరియె దుర్గాధి వాసమున మనిన**
**పైఁబూత రుచి గాక ప్రతియె కిన్నెర కాయ**
**లరిది కురువు తలయంపి నిడిన –**

ఇలాంటి లోపాలున్న వా తరుణి చనుదోయి కెలా సాటి రాగలవంటాడు కవి. క్షణ విలాసం – పైపూత పోతే ఏముంది వాటి అందం – మరి ఏపూతా లేక సహజంగా ఎప్పటికీ ఒప్పులొలికే గుబ్బలావిడవని చెప్పట మెంత అబ్బురం. మరి **కొమ్మ వాతెఱతో గుణమ్ము గైకొన వచ్చి కఠిన విద్రుమము చేకట్ల బడియె – కోమలి యధ రమ్ముతో**

**మొనల్పచరించి యరుచి బింబ ఫలమ్ములవిసి పడియె** – ఇది ఆవిడ అధర వర్ణన. ఇందులో విద్రుమము చేకట్ల పడటం – బింబఫల మవిసి పడట మనే నుడికార మెంత చమత్కారంగా వాడాడో చూడండి కవి. **పోతే ఇంతిమృదూక్తి మాధురికి నిక్షురసం బెన వోలఁజాల కాద్యంతము నోడి మధ్యమ గుణాశ్రయమై** చెఱకుగడ రెండు కొసలలో మాధుర్య ముండదు. అది ఆ ఇంతి మృదూక్తి మాధురికి తట్టుకొలేక ఓడిపోయిందట. ఓడిపోయి తన పాటికి తానే ముక్కలయిందట. చెఱకు విషయంలో సహజంగా కనిపించే లక్షణమెలా ఉత్ప్రేక్షిస్తున్నాడో చూడండి కవి. ఇక ఆ కన్య కన్ను లెలా ఉన్నాయో తెలుసా.

**'తన రాజీవ శరం బెఱుంగ దునిశా తత్త్వంబు'** మన్మథుడి బాణమొకటి తామర. దానితో పోలుద్దామా ఆవిడ చూపులంటే దానికి నిశాతత్త్వం లేదు. అంటే రాత్రి కాలమెలాంటిదో తెలియదు. ముడుచుకు పోతుందని ఒక అర్థం. నిశాతత్త్వమంటే వాడి. అది లేదని మరొక అర్థం. అలాగే కలువలతో పోల్చి చెబుదామంటే వేగ లీల లేదట దానికి. వేగట మంటే తెల్లవారటం. తెల్లవారితే పనికిరావవి. వేగలీల అంటే మరొక అర్థం వేగంగా దూసుకు పోవటం. అది లోపించిందని ఇంకొక అర్థం. ఇలా సాగుతూ పోతుంది నాయికా సౌందర్య వర్ణన. అన్నీ శబ్ద శక్తి వైభవాభి రామాలే పద్యారామాలు.

అలా వర్ణిస్తూ వర్ణిస్తూ తానా మహిళా జన మధ్యంలోకి హడావుడిగా వెళ్లితే సారసలోచనలు రసభంగమై సాలోచనలయ్యే ప్రమాదముందని

Yallamraju Srinivasa Rao www.andhravedanta.in

వెళ్లకుండా వచ్చానంటాడా సచివుడు. ఇక వాడి మాటలు బాగా తల కెక్కి అంతో ఇంతో మదనోన్మాదం కూడా తలకెక్కి బయలుదేరుతాడు వసురాజు. వెళ్లినంత దూరం దారి పొడవునా ఆ సచివుడి హడావుడే.

**ఈఊాల బోరాదు హేరాళము జవాది**

**యూరాల నడుచక్కి నేగలయు**

**నాకాన నేకాల మడరు తేనియ వాన**

**లా కాన నేర్పున నరుగ వలయు**

**నీవంక నేవంక నెనసిన తుహినాంబు**

**లీవంక పూదెప్ప నీదవలయు**

అని చిత్ర విచిత్రమైన మాటలతో దారి చూపుతూ పోతుంటే చెవులలో బడుతున్నాయి అక్కడి కన్నెలాడుకొనే మాటలు కొన్ని. విందామేమిటో.

**ప్రకటితో న్మేషకీ పద్మిని కినకర**

**కౌతుకా వాప్తి వేగనె ఘటించు**

**తతవయో విభవ కీ ల తకూన కాసన్న**

**పున్నాగ విహృతి గొబ్బుననె యబ్బు**

చూడండి. పద్మిని కన్య అయితే ఇన కరకౌతు కావాప్తి జరగకుండా ఎలా పోతుంది. లత కూన ఆవిడ అయితే పున్నాగ విహారం లేకుండా ఎలా పోతుంది. ఏమి శబ్ద శిల్పమిది. ఎంత చిత్ర కల్పమిది. ఇనక రకౌతు కావాప్తి పద్మినికైతే ఇనకరావాప్తి అంటే వసురాజు కరగ్రహణం ఈ పద్మినీ

జాతి నాయికకూ కావలసిందే. ఆ లతకూనకు పున్నాగ వృక్ష సంపర్కంలాగే ఈ లతాంగికీ పున్నాగ అంటే పురుషశ్రేష్ఠుడైన వసురాజుతో సాంగత్యం కావలసిందే.

**ఆలో కాంచన మందిరంబు నవరత్నా లోకముల్లోకమై**

**యాలోకోత్సవ మాచరిస్తుంటే** ముందుకు సాగాడు రాజుగారు. అన్నీ ఆలోకాలే. కాని దేని అర్థం దానిదే.

అంతలో కొంత విశ్రాంతి చెందింది శ్లేష. దానితో రసా శ్లేషానికి విశ్రాంతి లభించింది కొంచెం. చూడండి ఈ పద్యం.

**కనుగవ పూర్ణ కామమగు - కన్గవ కన్నను పూర్ణ కామమై**

**మన మతిచిత్ర వృత్తియగు - మానస వృత్తికి మున్న చిత్రమై**

**తనువు రసోత్తర రంగమగు - తత్తనువైఖరి కన్న సంభ్రమం**

**బెనసి రసోత్త రంగమగు నీప్సిత మానగమాన భేదికిన్**

నాయకుని అనుభవమెంత అద్భుతంగా సహజ సుందరంగా వర్ణిస్తాడో చూడండి కవి. శ్లేషాడంబరం లేని కేవల రసభావాల సంబరమిది.

మళ్లీ శివమెత్తింది భట్టుమూర్తికి. శ్లేష మరలా ఆశ్లేషించింది మనస్సును. **పదముల పల్లవింపగ నోపు - తొడల మంగళ మహారంభాప్తిఁ గాంచనోపు'** అని ప్రారంభించాడు రచనా సంరంభం. పదములు చూస్తే పల్లవాలు - తొడలు చూస్తే మహారంభాలు. అరటి బోదలు. కనిపించకే మవుతాయి. ఆ వనిత సౌందర్యం కొనియాడే కొద్దీ దాన్ని సృష్టించిన

**'వనరుహసూతి చేతి యాని వారిత చాతురి** మెచ్చుకోక తప్పలేదా రాజుకు. ఆ **వనరుహసూతి** బహుశా భట్టుమూర్తేనేమో. ఇంకేమి Verify చేసుకొన్నాడా సచివుడు. తన మాటా ఆయన అనుభవమూ సరిపోయాయని. యతి వేషం ధరించిపోయి నేర్పుగా కార్యం నెరవేరుస్తానని బయలుదేరాడు. ఎలా ఉందా వేషం.

**కనక వల్లిమ తల్లి కలపెంపు జడ గుంపు**

**పుష్పపరాగసంభూతి భూతి**

**కమనీయ శాఖా ప్రకాండంబు దండంబు**

**తరుణ పల్లవ కోటి ధాతుశాటి-**

అక్కడి సురభూజానికీ తనకూ ఎందులోనూ తేడాలేకుండా తయారయ్యాడు. **తేరి గడిదేరి యొక జడదారి** అయ్యాడట **ఆమాయ తపసి నియమ స్థే మాయత నక్షసరము ద్రిప్పుచు నెలమిన్ వామాయత నయ నాజన హైమాయతనంబు ఁజేరనరుగు** తుంటే ఎక్కడ చూచినా **ఆయతనాలే.** ఎన్ని ఆయతనాలో చూపిన సచివుడికి తెలుసు. వ్రాసిన మూర్తి కవికి తెలుసు. ఇంతలో **గంధ గజయాన గీత ప్రబంధ కలన నలరి యతిలియ్యమై వచ్చు నరిది చూచారా** అని ఒక చెలికత్తె ఏదో అభిప్రాయంతో అంటే నిజమే యతిలియ్యమై వస్తాడని ఎలా తెలిసిదంటూ ప్రవేశిస్తాడు వాడు ఆడువారి మందిరంలో. మాటేగాక సాక్షాత్తూ యతీశ్వరుడు రావటమే చూచి ఆశ్చర్య పోయారు వారు. మంజువాణి అనే మంజువాణి ఆ యతికి వినిపించే మంజువాణి ఏమిటో తెలుసా.

**'భవచ్చరణాబ్జన ఖేందు యుక్తిచే'** మీపాద నఖకాంతి అనే చంద్రకాంతి ప్రసరించిందో లేదో మాకందరికీ తెలివి వచ్చింది - తమమంతా విరిసి పోయింది. కళాకలాపాలన్నీ హెచ్చయినాయి. మదాళి భాగ్యమిక దేవేంద్రుని అర్ధాంగికి కూడా లేదంటుంది. చంద్ర జ్యోత్స్నలో జరిగేవన్నీ అవే గదా. ఇక ఆవిడ అడగటం అతడు చెప్పటం. అంతా అర్థాంతర వాసనా వాసితమే. ఆఖరుకు తెగేసి ఒక మాట అంటాడు. **'ఆనవ పద్మినీ మనోహరునకు తగిన పద్మిని ఇక్కడ** దొరుకుతుందా అని వచ్చానిక్కడికి. **అనుపమ భాగ్య లక్షణ సమన్విత యీరమణీలలామ** యీ రమణీ లలామను చూస్తుంటే **సింధు నందన యచ లేంద్రనందన యనంగన నయ్యెడి'** అంటాడు. నిజమే. సింధునందనే అచలేంద్ర నందనే ఆ గిరిక. లక్ష్మీపార్వతుల లాంటిది గాక పోవటమేమిటిక - అని శ్లేషభాషతో పలకరిస్తాడు మనలను భట్టుమూర్తి.

ఆ తరువాత గిరికాదేవి జన్మ వృత్తాంత మంతా ఏకరువు పెడుతుంది మంజువాణి. మాటలన్నీ పద్యాలే. పద్యాలన్నీ శ్లేషలతో నిర్మించిన కోటలే. **బాలకూర్మ విలాస పదముల** దగ్గరి నుంచీ మొదలవుతుంది శ్లేషాలంకార ధాటి. కోలాహలుడు తన్ను కామిస్తే శుక్తిమతి సమాధానమివ్వట మెంత అందంగా వర్ణిస్తాడో కవి చెప్పలేము.

**'నిలువెల్ల నీచాతి నీచోప సరణంబు**
**ప్రకృతి యెల్లను జాడ్యపరిణతంబు**
**పెంపెల్ల నియత గాంభీర్య మానవిహీన**
**మంతరంబెల్ల పంకావిలంబు**

**జీవనంబెల్ల నంచిత బుద్బుద ప్రాయ**

**ముదయ మెల్లను దుర్దినోన్ముఖంబు**

అని ఇలా ఆ నది మాటాడుతుంటే నదీపరంగా నారీపరంగా కవి కూర్చిన విశేషణాలను తరచిచూస్తే తజ్ఞులైన పెద్దల కర్థం కాకపోవట మంటూ ఉండదు. **నీచ - ప్రకృతి జాడ్య - మాన విహీన జీవన - దుర్దిన** అనే మాటలలోని లోతు కొంచెం లోతుకు దిగి చూడండి. మీకే తెలుస్తుంది. శుక్తిమతి ఎంత బ్రతిమాలి చెప్పినా వినలేదా అచలేంద్రుడు. అతడిచ్చే సమాధానమేమిటో తెలుసా. **'భవత్కమనీయ కాంతి ధారావళిలో మునింగితి'** నంటాడు. ధారలో అతణ్ణి ముంచటం దాని పొరబాటు. **సుళ్ళుఁబెట్టెదో** అంటాడు. సుళ్లలో చుట్టటందాని తప్పు. **నన్ను గ్రుచ్చి యెత్తి తెప్పల దేల్ప వచ్చుగదా** అని కూడా అంటాడు. నదిలో నుంచి పైకి లేచి తెప్పలలోతేలటం సహజమే గదా. శ్లేషగాని శ్లేషలివి. ఎంత అందం. అన్నీ ఇలాంటి పద్యాలే. కవిశబ్ద శక్తి వైభవ మిక్కడ ఆకాశ మంత ఎత్తు కెదిగి కనిపిస్తుంది.

**అతను భూతి ఘటింప దయ్యేనే చదలేటు**

**సిక దాల్చు నింధాన చిత్రకునకు** - నిజమే అతనుణ్ణి దగ్ధం చేసినా చదలేరు సిగలో దాలిస్తే దాని ప్రభావంతో అతను అనల్పమైన విభూతి భస్మమని కూడా అర్థమే. అది ఘటిల్ల లేదా ఈశ్వరుడి కంటుంటే ఎంత హాయి గొలిపే శ్లేష ఇది. అయినా వాడు బలాత్కరించ బోతే ఆ నది ఎలా కలవరం చెందిందో వర్ణిస్తాడు చూడండి భట్టుమూర్తి.

**వేణి చలింప కంపిత నవీన మృణాల భుజాగ్ర కంకణ**

**శ్రేణి నటింప లోల శఫరీనిబిరీ సకటా క్షకాంతి వి**

**న్నాణము చూప - హంసక గణక్వణనంబులు మీఱ సైకత**

**శ్రోణి వివర్తితాబ్జ ముఖ శోభితయై కడు సంభ్రమించిందని** వర్ణిస్తాడు. నదీపరంగా కాంతాపరంగా మేము అర్థం చూపుతామని ముందుకు వస్తాయి **వేణి కంకణ - శఫరీ కటాక్ష హంసక క్వణన సైకత శ్రోణి అబ్జముఖి** అనే మాటలన్నీ మూకుమ్మడిగా. ఇక ఆ నది తన్ను కాపాడమని మొఱపెట్టిందో లేదో అంతకన్నా పెద్ద మొఱపెడుతూ వచ్చారు వసురాజు వద్దకు దేశ ప్రజలందరూ. అయ్యా మీ పరిపాలన ఎంత ధార్మికమో జనాను రంజకమో చెప్పలేము.

**ఇష్టకృత్యము నిర్వహించు గాని దినంబు**

**శుచి మలీమసగతు ల్సాపవెఱచు**

అగ్నిహోత్రుడు మలినమైన ధోరణిచూపడట. మలినమైన ధోరణి ధూమం. పనికి మాలిన మార్గమని కూడా అర్థమే. మరేమి చేస్తాడు. ఇష్టకృత్యమంటే ఇష్టమైన పని. ఇష్టమంటే యజ్ఞం యజ్ఞ కార్యమే నిర్వర్తిస్తాడని మరొక అర్థం.

**దాక్షిణ్యము వహించి తనరుగాని సదాగ**

**తిరజో భర భ్రాంతిఁ దిరుగవెఱచు**

సదాగతి అంటే వాయువు. అది దాక్షిణ్యమంటే దక్షిణ దిశ నుంచి వీస్తుంది. దాక్షిణ్యమంటే మంచితనం - రజోభ్రాంతి లేదు. అంటే దుమ్ము

Yalamanchili Srinivasa Rao
www.advaitavedanta.in

ధూళి చల్లదు. రాజసగుణం లేదనీ అర్థమే. ఇలా పంచభూతాలూ నీ ఆజ్ఞ పాటిస్తూ ఉంటే ఇప్పుడు చూచారా ఎంత ఘోరం జరిగిందో అని ఆక్రందన చేస్తారు. ఆ కోలాహలుని కోలాహలం వినిపిస్తారు. వెంటనే అది నివారించటానికి బయలుదేరే వసురాజు సంరంభమెంతో మనోహరంగా వర్ణిస్తాడు కవి. **'కరి భరణ కరణ పరిణత కరుణా పరిణాహి యగు జగత్పతి లీలన్'** బయలుదేరి వచ్చి దాన్ని –

**పోటన బంతి మీటు గతి భూవరు దంఘ్రి నఖాంచలంబునన్**

**మీటిన గట్టు బిట్టగసి మేది ని వ్రాలిందట ఘన స్వనంబుతో'**

అప్పుడంత కన్నా ఘన స్వనంబుతో మ్రోగాయట **సురవార వధూ మురజార వార్భటుల్'** దీనితో రెండవ ఆశ్వాసం కూడా ఒక దీర్ఘమైన నిశ్వాసం విడిచి ఉపశమించింది.

ద్వితీయం నుంచి తృతీయంలో అడుగుపెట్టామో లేదో దేవేంద్రుడు బయలుదేరి వస్తున్నాడు రాజుగారి దగ్గరికి. ఎలాటి వాడా ఇంద్రుడు.

**గోత్ర వర్గము పాదుకొల్పిన నయశాలి**

**కరమున శత కోటి కలుగు మేటి**

**కల్యాణ మయధామ గరిమఁగాంచిన ధన్యు**

**డహిత బలచ్ఛేది యైన జోదు**

**భూరి సంపదఁ దల పువ్వువాడని భోగి**

**వరసు ధర్మావాప్తిఁ బరగు సుకృతి**

Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

**సకల భారము పూను సైదోడు గల పెద్ద**

**విద్యాధరుల నేలు వినుత కీర్తి -**

ఇంద్ర లక్షణాలూ, నరేంద్ర లక్షణాలూ రెండూ ధ్వనిస్తున్నాయీ పద్యంలో. తనలాంటివాడీ నరేంద్రుడు తనలాగే **పర్వత గర్వ నిర్వాపణం** చేశాడని మెచ్చి బహుమాన మివ్వటానికి దివి నుండి భువి కేతెంచాడు. అతణ్ణి ప్రశంసిస్తూ **'ప్రబలఖలగోత్ర హృతికి నీపదనఖంబె చాలు శతకోటి సాధనం బేలమాకు'** అంటాడు - శతకోటి అంటే వజ్రాయుధం. శతకోటి అంటే అనేకం. అనేక సాధనాలు దేనికని కూడా అర్థం. ఇంతకు ముందు కూడా వచ్చిందీ శతకోటి. అక్కడ కోటాను కోట్ల ధనమని అర్థమే. **సుమనోమనోరథము లెల్ల సాధించిన నీకు సుమనోరథ మొక్కటి** ఇస్తానంటాడు పారితోషికంగా. ఇక దాని వైభవం వర్ణిస్తున్నాడు దేవేంద్రు డద్భుతంగా. ఇంద్రుడికి శ్లేషేమి తెలుసు రంభా మేనకాద్యా శ్లేషం తప్ప. శ్లేష సమ్రాట్టు భట్టుమూర్తి ఆయన మీద నెపం పెట్టి చేసే వర్ణన.

**పటుగాత్ర! యీ చిత్రభానూజ్జ్వల మఖర్వ**

**సర్వలోకాలోక సౌఖ్య మొసగు**

**ధాత్రీశ! యీ దివ్య ధామోన్నత మనంత**

**వాహినీ విభవంబు వఱల - జేయు**

**చిత్రభాను - చిత్ర విచిత్ర కాంతులు - ఆలోక సౌఖ్యం** దర్శనమివ్వక ఏమవుతుంది. భానుడు సూర్యుడు ఆలోక సౌఖ్యం - తన వెలుగును ప్రసరించటం ద్వారా సౌఖ్యమివ్వక ఏమవుతాడు. అంతా శ్లేషమయమే.

ఇంతేనా ఇంకా దీని చేయి మరొకటందుకొని ముందుకు నడుస్తున్నది శ్లేష.

**మానసీయానంత మణి కాంత ధామమై**

**ఇది హిమానీవేళ నింపు నింపు**

**శోణ ప్రవాళ మంజులతా నిశాంతమై**

**యలరించు నిది వసంతాగమమున**

అన్ని ఋతువులలో సౌఖ్యమిచ్చే విమానమట. విమానానికి ఋతువులకూ సరిపోయే అర్థాలు. అర్థాలను ఒకే మారు మన ముందు కుమ్మరించే శబ్దాలు. చెప్పనలవి కాదు - అభిజ్ఞు లెవరికి వారు చూచుకొనవలసిందే.

విమాన వర్ణన అయింది. దివికీ భువికీ రాకపోకలు చేయవచ్చునని హామీ ఇచ్చి వెళ్లాడు దేవేంద్రుడు. దానితో వసురాజు పరిచర వసువయ్యాడు కూడా. పోతే ఇక కోలాహలుని ఆగడం పైకుపశమించినా ఆ గడుసరి ద్వారా శుక్తిమతి గర్భవతి అయి కూచుంది. ఇక చూడండి ఆవిడ గిరికా వసుపదులనే కుమారీ కుమారులను ప్రసవించేదాకా అంతా శ్లేషమయమే. ఒకటి నదీపర మొకటి నారీపరంగా అర్థద్వయం చెప్పుకోక తప్పదు. మచ్చుకొకటి రెండుదాహరిస్తా.

**నాళీక ముఖికి నెన్నడుము గానగనయ్యె** - నదికి మధ్యభాగం కనిపించిందని - నారీమణికి మధ్యం పెద్దదిగా కనిపించిందని

**'శఫరాక్షికున్నత స్థలుల గమ్యములయ్యె** - ఎత్తైన ప్రదేశాలకు నది వెళ్లలేదని - గర్భవతి ఎక్కలేదని.

**కనుపట్టె విశదమై గండరేఖ**

గండశిలలని ఒక అర్థం. చెక్కిళ్లని మరొక అర్థం.

**కంబుకంఠికి చారు కంకణంబులు జాతె**

జలకణాలని ఒక అర్థం. చేతి మురుగులని ఒక అర్థం. అంతగా చిక్కుపెట్టని శ్లేష ఇది. ఇంకొక మంచి పద్యం వింటారా. సూతికా గృహోపకరణాలు ఆనదీమ తల్లికి సహజంగానే అలవడ్డాయని చెప్పే పద్యం చాలా చక్కని పద్యం.

**గురుతర నవ్యవేతస నికుంజము రంజిలు చోట - హల్లకో**
**త్కరకర దీపదీధితులు గ్రమ్మెడుచోట - నవారవింద బం**
**ధుర మకరంద తైలములు నూల్కొనుచోట - పరాగ రక్షచే**
**కరమరుదైన చోట - నది గాంచె కుమారు కుమారికామణిన్**

నది. అది అని రెంటికీ అన్వయించే పరికరాలెంత అద్భుతంగా వర్ణించాడో చూడండి కవి.

తరువాత **'జలకము లార్చి -'** అనే పద్యం పుట్టిన బిడ్డకు చేసే పనులన్నీ నదీపరంగా కూడా సరిపడేలా వర్ణించట మింకా అద్భుతం. అంతేనా.

**మందయానము నేర్పునిందిందిరా జీవ**
**రాజీవ రాజన్మ రాళ రాజి**

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

**నటన లీలలు నేర్పు తటరూఢ కల్హాగ**

**కల్హాగ చర నీలకంఠ వితతి**

ఇందులో శ్లేషేగాక య మకాను ప్రాసాది శబ్ద చిత్రం మిన్ను ముట్టింది - అంతేకాదు. హంసలు మయూరాలు శుకపికాదులు అన్నీ ఆ నదీ తీరవాసులే. అవే ఆ బిడ్డకు ఆటపాటలన్నీ నేర్పే ఉపాధ్యాయు లయ్యాయని వర్ణించట మెంతైనా చమత్కారం. ఇక **'పంకజ పాణి శంఖ పరిభావక'** అనే పద్యమింతకు ముందుదాహరించిందే గదా. మాతా పితృ వాత్సల్య భావ చిత్రణ కిది అతిమాత్ర నిదర్శనం. **'అన్నగ శేఖరుండు** నసే పద్యమో. తండ్రిగా ఆ పర్వతరాజు కూతురికి సంగీత సాహిత్యాది విద్యలు నేర్పించటంలో ఎంత శ్రద్ధాసక్తులు చూపుతున్నాడో కన్నులకు కట్టినట్టు చూపుతున్నాడు భట్టుమూర్తి తన అక్షరమైన అక్షర శిల్పం ద్వారా.

అయింది. మాయామౌని మంజువాణి చెప్పిన గిరికా జన్మ వృత్తాంత మంతా విన్నాడు. **'లలనా యీ యెలనాగc బెండ్లియగు వాలాయంబు చేది క్షమాతల నాధుండ'**ని హామీ ఇస్తాడు. మీరు **నమ్మరేని నిజమంత్ర ప్రౌఢి రప్పింతునని** కూడా హవాల్దా పడతాడు. ఇంకేమి ప్రత్యక్షమయ్యాడు వసురాజు అక్కడ. ఎలా ఉందాయన వేషం.

**తలిరుంబ్రాయము వాని వలరాజు నలరాజు**

**నలరాజు దెగడు సోయగము వాని**

వలరాజా - నలమహారాజా - అలరాజా చంద్రుడా - అని బిత్తర పోయి చూచారా కన్యలు. అప్పుడు వారు గాదు. ఇప్పుడు మనం కూడా

ఆ శబ్ద చిత్రం చూస్తే. ఇంతే ఇలాగే చూస్తూ పోవాలి చివరదాకా. పోతే ఇక ఆ రాజు సౌందర్యాన్ని తిలకించి పులకించిన ఆ గిరికా పార వశ్యమింత అంతా కాదు. వారిద్దరి అవస్థ చూచి మంజు వాణి నోరు దెఱచి వినిపించే ముంజులవాణి వినండి.

**నేడుగా మా కనిందిత పర్వ సామగ్రి**

**సవరించె నీరాక కువలయేశ**

**నేడుగా మాత మో నివహంబులడ చె నీ**

**యాలోక మహిమ లోకైక మిత్ర**

కువలయేశుడంటే రాజు చంద్రుడు. పర్వమంటే పండగ పూర్ణిమ. మరి కువలయేశుడు వస్తే పర్వసామగ్రికి లోటేముంది. అలాగే మిత్రుడంటే లోకానికి హితుడు రాజు సూర్యుడు. ఆయన ఆలోకం దర్శనం కావచ్చు. ప్రకాశం కావచ్చు. మరి మిత్రునిరాక వల్ల తమస్సు తొలగిపోక ఏమవు తుంది. శ్లేష చూడండి ఎంత సుకుమారంగా ఉందో **'అనయమునీ మహా వనము నందిన వారము గాని - యేము కడ వారము గాము** - మరి ఈ తన్వంగి **'అడుగు వెట్టదు నవ్యహరిచందన లతాంత సరణి పైగాని యీ యరుణ చరణ - కేలనంటదు కోరకిత పారిజాత వల్లరిగాని యీ యతి లలిత బాహ'** అని తన భర్తృదారిక నారాజుకు పరిచయం చేస్తున్న మాట లెంత మాటకారితనాన్ని చాటుతాయో చెప్పలేము. మరి **'పద మెత్తంగల హంసలీల'** అని ఆవిడ సంగీతా భినివేశం కూడా చాటుతుంది. నాయిక కుండవలసిన లక్షణాలన్నీ ఉన్నట్టే ఇక లేనిదేముంది. ఇలాటి చోట రసభావ

పోషణ మమోఘం రామరాజ భూషణుడిది. ఇంతలో వేషం మార్చివచ్చాడు నర్మసఖుడు. ఆడంగులంత సరదాగా మాటాడుతూ **'ఈనృపమణిరాకచే నలరియీ గిరికానన మిప్పుడెంత చొక్కపుసిరి దాల్చిందోచూడమంటుందొక** ఎలనాగ. **గిరి కాననమని** ఒక అర్థం. గిరికానన మని ఒక అర్థం. సభంగ శ్లేష. ఎంత సొగసుగా ఉందో. అలాగే **కుచార్పిత హారనా యకోజ్జ్వలరుచి గంటి రే'** అని మరొక మగువ ఛలోక్తులాడితే భావి నాయికా నాయక సమాగమము చెప్పకుండా చెప్పినట్టయింది. తెరచాటు కేగింది గిరిక. ఉండబట్టలేక పోయాడు రాజు.

**మెఱుగొప్పు నెఱిగప్పు నెఱులొప్పు తఱిగప్పు**

**జలద మాలిక చొప్పు దెలుపలేదొ**

**బలు వాలుగల నేలు తెలివాలు గను డాలు**

**కలువ పూదెర మేలు దెలుపలేదో'**

తెరలిప్పుడే ఉన్నాయి గదా కప్పటాని కింకా తెరచాటు జేరటం దేనికని యమకాదులతో యమగా వర్ణిస్తూ పోతాడు. ఇక ఆవిడ వెళ్లిపోవటం మొదలుకొని రాజు కూడా అక్కడి నుంచి – తన సఖునితో నిర్గమించటం దగ్గరి నుంచి – నాయికా నాయికులు చెందిన పరితాపం పొందిన అనుతాపం వర్ణిస్తాడు కవి – ఆలంకారికులు చెప్పిన విభావాను భావ సంచారి సాత్త్విక భావాలన్నీ ఒక్కసారిగా మూర్తీభవించి కనిపిస్తాయి మన కళ్ల ముందు.

**'శతపత్రే క్షణ వెంటనంటిన వసుక్ష్మాపాలకా లోకమున్** ఏదీ ప్రతి **రోధింప లేకపోయింది.** వారి విరహ వర్ణన అత్యద్భుతం.

ఆ తన్వంగి **యనంగ ఝూంకరణవ జ్జ్యా ముక్త నారాచని**

**ర్ఘాతం బోర్వక తమ్ములంచు తటినీ గర్భైక సంజాత కంజాత వ్రాతము మాటుఁజెంద - నవియేచన్ సాగెమున్మున్నుగా జ్ఞాతి శ్ఛేదన లేన కిమ్మనెదు వాచారూఢి సత్యమ్ముగన్'** అనే మాట ఎంత లోకానుభవం చాటుతున్నదో. ఇందులో తమ్ములు గర్భైక సంజాత - అనే శ్లేష అత్యద్భుతం. దాని కుపోద్బలకంగా 'జ్ఞాతిశ్చేత్త'నే భర్తృహరి సుభాషిత ముదాహరించటం దానికదే సాటి.

చిత్రమేమంటే ఇంత చిత్ర కవితా ప్రవాహంలో పడిపోతున్నా పూర్తిగా మరచిపోడీ కవి పాత్రల మనోభావ చిత్రణం. అక్కడక్కడా తన మైకంలో నుంచి తేరుకొని వాటిని వర్ణించటంలో గల తన పరిపాకాన్ని కూడా చూపుతూనే పోతాడు. **'మనోవ్యథం బొగుల గ్రుచ్చి కవుంగిట జేర్చి తల్లి శుక్తిమతి తదీయతాప శిఖి కీలల నింకగఁబోలు కానిచో రమణి మెయిన్ బిసాంకుర పరంప రలున్ ఘనసారవాలుకా సముదయమున్ సుజాత జలజాత దళంబులు నుల్లసిల్లునే'** తన కూతురు విరహ తాపంతో బాధలు పడుతుంటే అది చూచి అంతకన్నా బాధపడుతూ ఆవిడను గ్రుచ్చి కవుగిలించు కొన్నదట కన్నతల్లి శుక్తిమతి. వెంటనే ఆ శరీర తాపవహ్ని కానదీ జలమంతా ఇంకి పోయిందా అని తోస్తున్నదట - అది ఎలా తెలిసిందంటే వర్ణిస్తున్నాడు కవి. అలా కాకుంటే ఆ నాయిక ఒంటిమీద

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

తల్లి తామరతూడులూ, కర్పూర ధూళి - కమల దళాలూ కనిపిస్తాయా. నీళ్లన్నీ ఇంకిపోయి అవి మూడూ ఇంకిపోక మిగిలి పోయాయన్న మాట. ఇక్కడ చమత్కార మేమంటే అవి మూడూ నాయిక విరహా నలానికి శైత్యోపచారం క్రింద పనికివచ్చే ద్రవ్యాలు. నీరు కనపడకుండా అవి మాత్రం కనపడటం - తల్లి మనోవేదనతో కృశించిపోవటాన్ని సూచిస్తున్నది. ఇందులో తల్లి దుహితృ వాత్సల్య మెలా తొంగి చూస్తున్నదో చూడండి.

పోతే ఆ తరువాతి పద్యం చూస్తారా. అది ఒక విలక్షణమైన భావన. ఇంతకు పూర్వమే చెప్పాము గదా. భట్టుమూర్తి అనేక రహస్య విద్యలలో కూడా పారంగతుడని. హేమ విద్య అని ఒక విద్య ఉన్నది. రాగి మొదలైన లోహాలను బంగారంగా మార్చే విద్య. దాన్ని పరామర్శిస్తున్నదీ పద్యం.

**ప్రసవశరాఖ్య యోగి బహుభంగుల భావన లిచ్చి మర్దనం**

**బెసగగ ధాతు వేర్చి బలియించి రసంబు నిశాంత మంతయు**

**వసువుగఁజేయ** - మన్మధుడనే వాడొక రససిద్ధుడు. వాడు రాత్రంతా కూచొని పాదరసాన్ని మర్దించి భావన చేసి మర్దించి దాన్ని భస్మం చేసి ఆ పొడి చల్లి ఆ నాయిక మనస్సును వసువుగా మార్చాడు. అంటే బంగారమని ఒక అర్థం. వసురాజు భావనలో నిండిపోయిందని మరొక అర్థం. అలా మార్చే సరి కావిడ **మైమఱచి నాతి దళన్మణి భూషలెన్న దాప్తసఖులు చేరి పల్కినను పల్కదు చూచియుఁజూడ దెంతయున్** అంత పెద్ద ఎత్తులో బంగారం చేతికి వస్తే ఇక ఒంటిమీద ఎన్ని సొమ్ములుంటే మాత్ర మేమిటి. లెక్కలేదు. చెలికత్తెలు పిలిచినా బదులివ్వదు. వారిని చూచీ చూడదట.

అంటే బంగారం రాసులు రాసులు ఆర్జించిన వాడికి ఒంటిమీద స్పృహ ఉండదు. మిగతా ధన కనక వస్తువాహనా లెన్ని ఉన్నా లెక్క లేదు. తన స్నేహితులతో మాటాడటమే గొప్ప. వారిని చూచీ చూడకుండా వెళ్లిపోతుంటాడు. అంటే ఒళ్లు పై తెలియని నిర్లక్ష్య భావమేర్పడుతుంది. అలాగే ఈ గిరిక వసురాజు మూర్తిని మనసంతా నింపుకొని తన్మయత్వంతో తన శరీరమే తాను మరచిపోయింది. చుట్టూ ఉన్న చెలికత్తెలతో కూడా మాటా పలుకు లేకుండా మౌనం వహించింది. కావ్య కళకూ మంత్ర తంత్రాది కళలకూ జుట్టూ జుట్టూ కలిపి ఎలా ముడి వేస్తాడో చూడండి. భట్టుమూర్తి.

ఇక మళ్లీ జారిపోయిన అలంకారాలన్నీ ఏరి తెచ్చుకోవాలను కొంటున్న దెవరు ఆ కన్యకా కాదు. మూర్తిగారి కావ్యకన్యక. **మదినున్న మరుడు** – ఇందులో ముక్తపద గ్రస్తం – **వరగుణజాల సంవదన సామగ్రితో కాంతయౌ వనరేఖలో కలయ మెలగి** – శ్లేషాది అర్థాలంకారాలు. అంతలో మళ్లీ జ్ఞప్తికి వచ్చి – **బిసాంకుర పన్నగాళికి – చల్లగాలికి – పూవిలుతువ యాళికి చిగురు విందుల నీలిగయాళికి – దుర్మద ఘనాళికి – ఆళికి** – ఇలాంటి శబ్దాలంకారాలకు చేతులు చాస్తాడు. అందులోనూ **తంత్రి చాయగల కన్యలు ధన్యలని – భాగ్యాయత్తము ల్గాసిరులని** **అర్థాంతర** వ్యాజాలతో కొన్ని లోకోక్తులు విసురుతాడు. వెంటనే జరిగిపోయిన వృత్తాంతాన్ని స్మరిస్తూ నాయిక '**ప్రసూనాంబక ధాటీ శుక ఘోటీ నికరాటీ కనము మనము నివ్వెఱ** పరిస్తే ఇకత ట్టుకోలేక ప **వమాన మాన వష్టవమాన**

**కైరవ చ్యవమాన రజ మేమిటి – కరసారసాగ్ర తామర సాతి సాంద్ర సీధురసాప్తి** ఏమిటి – దేహత్యాగం చేయాలనుకొన్నా ఆవిడను సాలంకారంగానే సాగనంప జూస్తాడు కవి.

మరి ఈ లోపల చెలికత్తెలు వచ్చి అక్కడ ఆవిడను కానక వెదుకుతూ వచ్చి ఎక్కడో తిరుగుతున్న ఆవిడను పట్టుకొని చేసే ప్రసంగమెంత ముచ్చటగా వర్ణించాడో కవి చెప్పలేను. **తేనెవాక లీవెటు వలె నీదితమ్మ తెరువెల్లను పుప్పొడి నీపదాంబుజం బెటువలె నోర్చెసమ్మ – ఒంటిఁజరింప వచ్చునే ఇచ్చటి యన్య పుష్పచయ మిచ్చటి మత్త మధు వ్రత వ్రజం బిచ్చటి పల్లవోత్కరంబని వారు వాపోతుంటే** ఆ భావాలెంత కావ్యశిల్ప జ్ఞానమో అంత లోక వృత్త జ్ఞానాన్ని చాటుతాయి చాటుమాటుగా. **కలికియలికీర మండలి కలికి చూడవేల యీవేళఁబలుక వీ వేల గోల –** ఇలాటి మాటలు మీకు గోలగా కనిపించినా అక్కడ మంజువాణికి గాని దాని వాణిని వర్ణించే కవిగారి మంజువాణికిగాని గోల గాదు సరిగదా – ఒక కుంభమేళ.

అయినా **విముక్త కాంచనంబగు మాధుకర కులమూ శారిఁబేర్కొను శుకసంతతీ – వనప్రియ సంతతీ – బ్రహ్మాధీన గతులైన హంసతతులూ – ఎవరికేమి ఎగ్గొనరి** స్తాయని కవి వర్ణిస్తుంటే అది ఎంత కర్ణ రసాయనమో ఆయా శబ్దాలలోని లౌకికా లౌకిక భావాలను భావించిన ప్రతి భావుకుడికీ స్వానుభవైక వేద్యం.

**'సారస కైరవంబులకు చంద్ర దినేంద్ర విరోధ – మంచకుం**
**బారములేని మందగతి భారము – తెమ్మెర కున్ ఫణి గ్రహ**
**క్రూర విఘాత – మంగజునకుంగడ తేఁని భీమ వీక్షణాం**

Yalamanchili Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

**గారకవైర'** మని ఇంతలో అంత లోకాతీత వేదాంత ధోరణిలో మూర్తిగారికి జ్యోతిశ్శాస్త్ర వాసనలింకా పోలేదా ఏమనిపిస్తుంది.

అసలెక్కడ ఏమి భావించినా వర్ణించినా అది సాహిత్యమా సంగీతమా శాస్త్రమా వేదాంతమా మంత్రమా తంత్రమా - ఆయనగారి మనో మహానసంలో ఎక్కడ ఏ వంటకాలు రెడీగా ఉంటే వాటిని తెచ్చి మన జిహ్వకు రుచి చూపుతూనే పోతాడా కవిపాక శాసనుడు. చూడండి. **నమ్మిక మీఱనెత్తువ దనమ్మిక** అని శబ్ద చిత్రం మనకు చూపుతూ వెంటనే **'సోలుచు చెలికెదురాడక తూలుచు - కైదండ యొసగు తొయ్యలి మేనన్ వ్రాలుచు** అని నాయిక భావచిత్రం చూపగలడంటే ఎప్పటికప్పుడెలా రంగులు మారుస్తూ పోతుందో చూడండాయన చిత్ర ప్రదర్శనం. అంతేనా. ఉద్యానవనంలో ఆ లలనామణుల కలకలనాదాలు ఆలకిస్తే తెలుస్తుంది మూర్తి కవి ఎన్ని కలనాదాలు వినిపించగలడో. **కనక గంధము లెఱుంగని వానికిష్టాప్తి - కాయ హీనునకును కరణ పటిమ** నందివ్వ గలడు. మరునికి చైత్ర మంత్రిని కూర్చగలడు. రతిపతిని ధర్మకర్తను చేయగలడు. తుమ్మెద ద్రిమ్మరీడులను అలి కుమారులను పట్టుకురాగలడు. ప్రమదా వనమంతా గాలించ గలడొక వృషభగతితో. ముందుకూ వెనక్కూ కదను తొక్కుతూ పోయే ఆ రగడ చూచి తీరాలి మనం. దానికి తోడు ఒక పెద్ద గద్య - అదంతా తిరిగి తిరిగి శ్రమపడ్డ రసజ్ఞుల సేద తీర్చటానికి జలక్రీడ. అది ఒక లోకం. వరుణలోకంలో విహరిస్తున్న ట్టుంటుంది మనమంతా.

ఇక చూడండి. కావ్యధ్యానం ఒక ధ్యాన కావ్యంగా మర్చి పారేశాడు కవి. మన్మథుడనే దేవుడికి షోడశోపచారాలు చేయిస్తాడా మహిళా

భక్తకోటితో. అవి **అళినాద మంత్రాలేగాదు. ప్రసవాసనార్ఘ్య ప్రదానాలే గాదు. కళికా ప్రదీపాలేగాదు. తలిరాకు టారతులేగాదు. కప్రంపుటనటుల కప్పురాలే** గాదు. **వలిగాడ్పు ధూపాలే** గాదు. ధ్యానా వాహన అర్ఘ్యపాద్య అభిషేక గంధ దీపనైవేద్యాదులన్నీ సమర్పించి '**మానమథనాయ మదనాయ మధుసఖాయ మనసిజాయ నమోనమో** యని సాష్టాంగ ప్రణామం కూడా చేస్తారు. ఇక్కడ మకారాది నామావళి చూడండి. మకార ప్రాచుర్యం మంగళ ప్రదంగా కనపడుతుంది. సహస్రనామాలు చతుర్థీ విభక్త్యంతంగా చదువుతూ ఉన్న ధోరణి ఎంత శ్రావ్యంగా చెవులలో పడుతున్నదో ఆలకించండి. అంతా చేసి **ఏతాత్కాన నజాత వస్తు నిచయం బే మిచ్చి పూజించట మేమి** గొప్ప నీ సొమ్మే నీకిచ్చాము స్వామీ. **శీతాంశోరమృతార్పణ** మన్నట్లు చంద్రుడికి అమృతం నివేదించి నట్టుందంటా రామగువలు. ఎంత నిర్లిప్తమైన నిరహంకారమైన భక్తి భావమెంత విరహ శృంగారంలో తొంగి చూస్తున్నదో చూడండి. శ్రీవిద్యా పారంగతుడయి ఉండాలి కవి. మన్మథుడు కూడా ఆ మాటకు వస్తే దేవీ భక్తుడే గదా మంత్రశాస్త్రరీత్యా మనం భావిస్తే.

అసలు శ్రీవిద్యోపాసకుడయి ఉండాలని ఎందు కూహిస్తున్నా నంటే మానమథనాయ మదనాయ అని మకారాన్ని వదలకుండా నామావళి మొదట తగిలించి పదే పదే అక్షరావృత్తి చేయటమే కాదు. **కామకమలాస్త్ర కమలా కాముకసుత – కామనీయక నిధి** అని కకారాది నామాలు మళ్లీ ఆవృత్తి చేసి చూపుతున్నాడు కవి. ఇలా ఆ వృత్తి కావటంలో ఒక విశేషమేమంటే నమశ్శబ్దం చివర తగిలించి చెబితే నామం చతుర్థ్యంతంగా

ఉండాలి. అలాకాక ఊరక పారాయణం చేస్తూ పోతే ప్రథమాంతంగానే ఉండాలి నామం. చూడండి - **మానమథనాయ మనసిజాయ నమః** అన్నారు కాబట్టి మొదట చతుర్థీ విభక్తినే ప్రయోగించాడు. పోతే ఇక్కడ నమః శబ్దం చివర లేదు గనుక **కామ కమలాస్త్ర** అని కేవలం ప్రథమా విభక్తినే ప్రయోగిస్తాడు. అంతేగాక లలితాత్రిశతి మొదలగు నామాలలో ఆద్యక్షర మదే పనిగా కకారమో ఏకారమో 10 15 నామాల వరకూ ఆ వృత్తి అవుతుంది. అది ఒక నియమం. అలాగే ఇక్కడ మకార కకారాలు ఆవృత్తికావటం కవి ఉపాసనా దృష్టి నావిష్కరించి చూపుతున్నది.

అంతేగాదు. సంకల్ప సిద్ధుడైన వాడికొక తుంట విల్లు చేత దాల్చినా అది అఖండ బలోపేతమే. అంటిన కందిపోయే బాణాలైనా భయంకరమేనట. కవిగారు చెబుతున్నారు. ఎవడా సంకల్ప సిద్ధుడు. ఎవడున్నాడిక. మన్మథుడు. సంకల్పభవుడని గదా మన్మథుడికి పేరు. అందుకే సంకల్ప మాత్రం చేతనే ఏదైనా సిద్ధిస్తుందని చమత్కరిస్తున్నాడు కవి. ఇందులో కవి మంత్రసిద్ధి కళాజ్ఞాన రహస్యమెలా తొంగిచూస్తున్నదో గమనించండి. అంతేగాక మన్మథబాణం **ధాతకు శరమై** కూడా **రజస్సు** పోలేదట. అంటే **నీళ్లలో** ప్రవేశించినా **మాలిన్య** మంటుకొనే ఉంది. కైలాస గుహలో ప్రవేశించినా **ఈశ్వరుడికి తమస్సు** అంటే **చీకటి** తొలగలేదట. శ్రీహరికి **శ్రీదేవిని వక్షస్థలంలో** ఉంచుకొన్నా **సత్త్వగుణం** మానలేదట. ఏమి కల్పన ఇది. సత్త్వరజస్తమో గుణాత్మకులే గదా త్రిమూర్తులు. దాంపత్య జీవన మున్నంత వరకూ ఆ గుణాలెలా పోతాయి వారికి. అది మన్మథ బాణా ధీనమే గదా ఆ త్రిగుణాత్మక జీవితం.

ఇలాటి అభంగశ్లేషతో తృప్తి పడక మరలా సభంగ శ్లేష నాశ్రయిస్తున్నాదా కళాకారుడు. ఏమని. **మొన యంగనకా కటకట - మొనయం గనకాద్రి ధరుడె** - అని మొనయంగన అనే అక్షరాలొక చోట ఒక రకంగా ఇంకొక చోట ఇంకొక రకంగా విరిగితే - **ముదితనుపవనా తను పవనాహతి కొసగక** అనే అక్షర విన్యాసంలో **తనుపవనా** అనే వర్ణాల నొక అర్థంలో వినిపిస్తూ **తను ప వనా** అని వాటినే మరో అర్థంలో వినిపిస్తూన్నాడు సహృదయులకు వీనుల విందుగా ఈ శబ్ద మాంత్రికుడు.

ఇక విరహ వేదనా దోదూయ మాన మానస అయిన ఆ గిరికా దేవికి చెలికత్తెలు చేసే శిశిరోపచారాలిన్నీ అన్నీ కావు. అందులో ప్రక్కన కూచొని చిత్ర విచిత్రమైన మాటలతో వారిచేత చేయించే కవివాక్కు లాపాలూ అన్నీ ఇన్నీ కావు. వింటారా కొన్ని. **అటమి రమాకుమారుడపు డగ్ర తలంబున వచ్చినిల్చి నట్లయిందట** ఆ యెలనాగకు. ఎలాగని. **అటియాటి** గా దో చిందామూర్తి. **రమాకుమారుడు** గదండీ. **అటిముటి** అంటే ఆటూ ఇటూ తిప్పి చదవండి. ఎటు తిప్పినా రమాకుమారే అది. రమా కుమారుడు మన్మథుడే కానక్కర లేదు. వసురాజు కూడా కావచ్చు. వసువంటే రమాగదా. కుమారుడంటే యువకుడే. మరి **మోహోపదేశ తమోముద్రితములైన కనుదమ్ముల హిమాంబు లనుప రాదనే** సీసం సీసం కాదు. రసిక జన హృదయావాసం.

పోతే చెలికత్తె లెంత చేసినా ఆవిడ మూర్ఛ నుంచి తేరుకోకపోతే వారు పడే ఆందోళన ఎలాంటిదో తెలుసా. అది తెలిసినవాడు ప్రత్యక్షంగా

Valluri Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

చూచిన ఆ కవి సహస్రాంశుడే. **‘ఏమంద మేమి సేయుద, మేమందని మందలింత మేముంద మొ యిందేమంద యాన నడుగుద – మేమందఱ మనుచు తరళ హృదయాంబుజలై** – అంతగా చలించిపోతున్నది వారి హృదయం. ఎంతగా. ఏమందని మందలించాలో తెలియక. మందమంద అని అరుస్తూ కూచున్నారు. మందయానలయి కూడా అమందంగా యానం చేస్తున్నది వారి ఆరాటం. కాగా ఇంకా చిత్రమేమంటే అంత కలవరపాటులో కూడా వారి పరిచర్యలొక దానికొకటి విజ్జోడు పడకుండా యథాక్రమంగా సాగిపోతూనే ఉన్నాయి. చూడండి.

**జవరాలి యడుగుల చివురాకులే అంటిస్తున్నారు.** మరొకటి గాదు. **పొలతి యూరుల నంటి పొరలే పొదుపుతున్నారు.** ఇంకొకటి గాదు. ఏమిటిలా గురి తప్పకుండా చేయటమని అడిగితే కవిగారి జవాబేమిటో తెలుసా. **నవనవ గుణానుబంధ బాంధవములైన చలువలట** అవి. నాయిక ఆయా అవయవాలకూ ఆయా ఉపచారాలకూ రెంటికీ ఉన్న గుణాను బంధమది. మనమెంత ఏమరి చేసినా అది మారదు. అదీ అనుబంధమంటే. ఇక లాభం లేదని **నెలత కీవ సులాభంబు నించు మంచు ఇంచువిల్కాని** మరలా ప్రార్థిద్దా మనుకొన్నారట ఆముద్దియలు. ఆ సుద్ది విన్నదో లేదో కళ్లు తెరచి చూచిందట ఆ కన్నియ. ఎందుకో తెలుసా చెబుతాడు వినండి కవి. **ఈవ సులాభంబు – నీవే మా చెలికి అసులాభమంటే** ప్రాణదానం చేయమని ఒక విరుపైతే – ఈ వసులాభం వసురాజు ప్రాప్తి కలిగించమని మరొక విరుపు. ఆవిడకీ రెండవ విరుపే విరిచేసింది మోహాంధకారాన్ని

అని కవిగారి వ్యాఖ్యానం. పోతే ఆ మందయానలిక కొందల మంతా మాని ఎంతో ఉల్లాసంగా ఆ బాలికను తీసుకొని బయలుదేరారు మరలా ఆ దివ్యభవనానికి. ఎంత ఉల్లాస మంటారు. **కేళి కమనీయ కానన పాళిక వెలువడి. కురంగ పాళి కళా బిం బాళికలు బాళి కలిమిన్ బాలిక దెచ్చారట.** పాళికో బాళికో బాలికో – ఎవరినో ఏమిటో మీరే నిర్ణయించుకోండి కళాకేళి కాశయులు. మీరు నిర్ణయించుకొనే లోపలే మూడవ ఆశ్వాసం ముగిసింది.

వారా భవనం చేరారో లేదో – ఇక కొంత విరామం దొరికినట్టుంది భట్టుమూర్తికి. ఇంకేమి. కట్టలు తెంచుకొని పారిందాయన గారి కవితాధార. దానితో సూర్యాస్తమయ మేమి – సంధ్యాసమయమేమి – చక్రవాకా లేమి – రాత్రికాల మేమి – నక్షత్ర కాంతులేమి. చంద్రికా శోభ ఏమి – అది పద్యమా గద్యమా కదను దొక్కుతూ వచ్చి వెంటనే వసురాజుకు చెలివృత్తాంతం చెవిలో వేసి వస్తావా లేదా అని మంజువాణిని తరిమి కొట్టింది. అంతేనా. ఆవిడ బయలుదేరిందో లేదో. మదనతాపం మరలా విజృంభించింది నాయికకు. దానితో చంద్రోపాలంభమే గాదు. మన్మథో పాలంభమే గాదు. మలయానిలోపాలంభమే గాదు. అన్నీ ఉపాలంభాలే ఆలంబాలిక నోట, చివర **కాజాబిల్లి వెలుంగు వెల్లికల దాయన్ లేక మోమున పటాగ్రం బొత్తి యెల్గెత్తి యారా జీవాననయేడ్చె**' చివరకు చేసేదేమీ లేక ఏడుస్తూ కూచున్నది. అదైనా ఊరక ఏడవనిస్తాడా కవి. సంగీత కళానిధి గదా. ఆ రోదనంలో కూడా సంగీత నాదమే వినిపిస్తున్నదాయన వీనులకు. **'కిన్నర వధూరాజత్కరాంభోజ కాంభోజీ మేళ విపంచికారవ సుధాపూరంబు**

**తోరంబు గా తానా** స్వాదించి మనబోటి రసజ్ఞులను కూడా ఆస్వాదింప జేస్తాడు.

అయ్యో **మనమంజు వాణి యుంజని తడవయ్యె నేమిటికి జాగొ నరించెనొకో'** అని వారు తహ తహలాడుతుంటే అంతలోనే ప్రత్యక్ష మయింది మంజువాణి వసురాజు ముద్రికతో. ఇక తన ఆకాశగమనం దగ్గరి నుంచీ వారందరికీ వర్ణించ సాగింది. ఆకాశంలో ఎగురుతూ ఉంటే తనకు కలిగిన అనుభవం వర్ణిస్తుంది. అది అతిలోకం, ఆలకించండి.

**ఒడివాయ కిలనగ ప్రతతితో టివ్వన**
**నెగిరిన ట్లైతోచు మగువలార**
**పై పై సమీరణార్భటి నింగి బోరున**
**నఱచిన ట్లై తోచు నతివలార**
**నిఖిల భూములు జవనిక వాప దారున**
**నెదిరి నట్లై తోచు నింతులార**
**చనఁజన వెడదయై శశి మేను గ్రక్కునఁ**
**బెరిగి నట్లై తోచు దరుణలార**
**కొండ లచ్చన గండ్లయి - నిండు చెఱువు**
**లెల్ల నద్దంపు బిళ్లలై - యేర్లు ముత్తి**
**యంపు సరులై యరణ్యంపు గుంపు లెల్ల**
**నారులైతోచు పొదవున నారులార**

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఎంత గొప్ప అనుభూతో ఇది చెప్పనలవి గాదు. అయినా చెప్ప గలిగాడు కవీశ్వరుడంటే గొప్ప. ఈనాడు విమాన ప్రయాణాలు చేసేవారికే గాదు. ఆఖరుకు చంద్రమండలానికి వెళ్లిన వ్యోమగాములకు కూడా భేష్ ఇలాగే కలుగుతుందా అనుభవమని మెచ్చి తలలూప వలసిన వర్ణన ఇది. ముఖ్యంగా చివరి తేటగీతిలో వర్ణించిన దృశ్యాలచ్చంగా అలాగే కనిపించే దృశ్యాలు. భట్టుమూర్తి భౌతిక విమానమెక్కి పోకున్నా ఆయన మానసిక విమాన యానమే ఈనాటి భౌతిక వైమానికుల అనుభవాన్ని పట్టి తెచ్చి మన కళ్ల ముందు నిలబెట్టగలుగుతున్న దంటే ఎంత అద్భుతమిది.

ఇక వసురాజు రాజధానిని వర్ణించాడు కవి. **'సాలము యంత్ర పీఠము'** నేపద్యంలో. కవి కాదక్కడ భట్టుమూర్తి. ఒక సమాధిలో కూచున్న యోగి. ఇక వేశ వాటికా వర్ణనే గాదు. రాజగృహ వర్ణనే గాదు. అందులో రాజుగారి క్రీడా సౌధమే గాదు. అది నిజంగా ఒక మయసభ. **'మాయాతిరోహితాంగి** ఆయన మంజువాణినే అది మాయా విమోహితను చేసింది. అందులో శయ్యాగతుడైన వసురాజు గిరిక కోసం పడే వలపంతను వర్ణిస్తూ పోతాడిక కవి. విరహ శృంగార రసపారం గతుడయి ఉండాలి రామరాజ భూషణుడు. కాళిదాసు భవభూతి మొదలైన మహాకవులందరూ మన కనుల ముందు సాక్షాత్కరిస్తారు. అంత సహజ రమణీయ వర్ణన అది. అంత హృదయంగమం కూడా. ఇంకా చిత్రమేమంటే తిరస్కరిణీ విద్యాతిరోహిత గదా మంజువాణి. ఆ రాజుగారు చూచి నిష్ఠురమాడే చిత్రాలలో ఒక చిత్తరువులో తాను ప్రవేశించి ఆయన నిష్ఠురోక్తులకు బదులుగా తానూ

మగవారిని నిష్ఠూరంగా మాటాడుతుంది. **మాయాశీలురు చంచలాత్ములని** పురుష మనస్తత్వాన్ని ఆవిడ ద్వారా బయట పెడతాడు భట్టుమూర్తి. ఎంత లోకజ్ఞతో కవిది చెప్పలేను. ఎవరా ఈ మాటాడుతున్నది చిత్తరువా మరెవరైనా అని రాజు బిత్తరపోయి చూస్తుంటే నాయిక ముత్యాలహారం నాయకుడి మెడలో వేస్తుంది. అది ఎక్కడిదీ ఇంతకు ముందెప్పుడో చూచినట్టుందే అని గుర్తు చేసుకొని ఇది నాకు తెచ్చి ఇచ్చావంటే నీవేమి బొమ్మవో - కొమ్మో నాతో నీవేల మాటాడవని బ్రతిమాలితే ఆరాజు - అప్పుడు బయటపడుతుందా చెలికత్తె. మొత్తానికా మాట ఈ మాట చెప్పి ఆయన గారిచ్చిన ముద్రిక మరలా తెచ్చి తన ప్రాణసఖి గిరిక కందజేస్తుంది. మధ్యలో ప్రభాత వర్ణనా - సూర్యోదయ వర్ణనా వర్ణనా తీతం. దీనితో చతుర్థాంకం ముగిసి పంచమంలో ప్రవేశిస్తాము.

ప్రవేశించామో లేదో ఒక అద్భుతమైన దృశ్యాన్ని మనకు చూపు తున్నాడు కవి. ఆకాశంలో దివి నుంచి భువికి దిగివస్తున్నారు దేవతలూ మునులూ దేవాంగనలూ. దేవేంద్రుడూ. ఎలాగా. ఎంత సహజంగా ఎంత సుందరంగా ఉందో తెలుసా ఆ దృశ్యం. వినండి. ఆ కవీశ్వరుడే మీకు వర్ణించి చెబుతాడు.

**తొలు దొల్త పారిజాత లతాంత మాలికా**

**పవనంబు ఘుమ్మున పరిమళించె**

పారిజాత వాసనలు మొట్టమొదట భూలోక వాసుల నాసా పుటంలో ప్రవేశిస్తున్నాయి. దివ్యకుసుమ పరిమళం గనుకనే అంత దూరం నుంచి ముందుగా ప్రసరిస్తున్నది.

**ఆవెన్క ఆకాండి కాభ్ర గర్జార్భటి**

**ఋభుదుందుభు భుల్గుభు ల్గుభులు మనియె**

తరువాత దేవదుందుభులు మ్రోగుతుంటే ఆ మ్రోతలు వినిపిస్తున్నాయి వారి చెవులకు. అవి అయిన తరువాత నిదానంగా

ఆ పిమ్మట **వియచ్చరీ పాణి వల్లకీ**

**గుంభస్వరంబులు ఘుమ్మురనియె**

పెద్ద పెద్ద ధ్వనులన్నీ అణిగిపోయిన తరువాత గాని గంధర్వాంగనలు వీణా గానం వినిపించరు.

**ఆపిదప నఖండ మైదండిమై నొక్క**

**దివ్యతేజముధిగ ధ్ధిగ వెలింగె**

గంధమూ శబ్దమూ గానమూ అయిన తరువాత రూపం కనిపిస్తున్నది. ఏమిటిది. దివ్యమైన తేజస్సు. అయినా అవన్నీ ఏమిటో ఎలాంటివో ఇంకా పోల్చుకోలేక పోతున్నారు పట్టణవాసులు. క్రమక్రమంగా ఒక్కొక్కటీ బయట పడుతున్నది. ఎలాగ. ఒక **కొంతసేపున కిది విమాన పంక్తియని - వీరు దిక్పాలురని మునులని - లేఖభామినులని -** తెలియగానే **అవనిజనుల** కద్భుతంగా కనిపించారట. వారి కవునో కాదో గాని మనకు మాత్ర మద్భుతమే. ఈ దృశ్యమింకా అద్భుతంగా సాగుతూనే ఉంది. మొదట **జేజే రాచ తేజి డిగింది ఉచ్చైశ్శ్రవం.** తరువాత **వేల్పు కన్నియలు** దిగారట. తరువాత **చౌదంతి** ఐరావతం దిగింది. అనంతరం **బాసవాల్దొరలు** దిగారు.

Brahmasri Vallabhajosyula Srinivasa Rao
www.advaitavedanta.in

పిమ్మట **దివ్యరథ కదంబంబు** దిగుతుంటే అందరూ **ఉద్గ్రీవులై** చూస్తున్నారని వర్ణిస్తాడు. స్వభావోక్తిలో ఎంత చతురోక్తో చూడండి.

పోతే ఇక తన ఇంటికి వచ్చిన దేవేంద్రుని కోలాహలుడు పూజిస్తాడు. **గంగనలరించి క్రమమెస గంగ క్రతుభు గంగ నలనం దర** నాదరిస్తాడు. కూతురి చేత దేవతలందరికీ మ్రొక్కిస్తాడు. అప్పుడా గిరికా సౌందర్యాన్ని చూచి అప్సర లెలా అయ్యారో తెలుసా.

**తల యెత్తదయ్యె కేవల జడస్థితి రంభ**

**జళుకు చూపుల జూడ సాగె హరిణి**

రంభ గనుకనే తలయెత్త లేకపోయింది. రంభ అంటే అరటి అని కూడా అర్థమే. హరిణి గనుకనే బెదురు చూపులతో చూస్తూ నిలబడింది. హరిణి అంటే జింక అనీ అర్థమే. ఎంత సుకుమారంగా ఉందో ఈ శ్లేష. గంగ ఆశీర్వదించింది. ఇంద్రుడు గిరికను వసురాజుకిచ్చి వివాహం చేయమంటాడు. కోలాహలుడలాగే నంటాడు. నదులూ కొండలూ పెళ్లి పెద్దలుగా వస్తారు. పోతే ఇంద్రుడు కోలాహలుడికొక దివ్యమైన పురాన్ని నిర్మించి ఇస్తాడు. బృహస్పతిని శుభలగ్నం నిర్ణయించమని దేవేంద్రు డడుగుతాడు. ఎలాగో తెలుసా. **ఈ రే యొక శుభలగ్నం - బీరే వివరించి వరున కింతికి కుశలం బీరే'** యనగానే ఆ వాచస్పతి **ఈరేడు జగంబు లేలునేలిక(బలికెన్.**

ఇక నగరాన్ని అలంకరించారు చూడండి. అద్భుతం - పర మాద్భుతం. పెండ్లికి వచ్చిన జనంతో క్రిక్కిరిసి పోయింది కళ్యాణ మండపం. ఝుమ్మని మారుమోగింది నానావిధ గాత్ర జంత్రగానంతో. ఎలాగని.

Vijayalakshmi Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

వైణిక వల్లకీ శ్రేణి నిమ్ముల మీటె
గాయక గాంధర్వ గమక రేఖ
గాంధర్వ గమక రేఖఁ బరాహతము చేసె
వాంశిక వంశికా వైభవంబు
వాంశిక వంశికా వైభవం బెగనూదె
తాళి కాధరకర తాళగరిమ
కరతాళ గరిమంబు కంచు మించుగ నొత్తె
నానద్ధ చటుల తూర్యవ్రజంబు

తత ఘన సుషిర ఆనద్ధ వాద్య చతుష్టయంతో శ్రోతలకు చెవుల విందు చేస్తున్నదా నాద మాధుర్యం ఒక దాన్ని మించి మరొకటి. ఆ కోలాహలం నాదాత్మక బ్రహ్మమై రోదసీ కుహరమంతా నిండిపోయిందంటాడు కవి. రోదసి అంతా నిండకపోతే బ్రహ్మమెలా అవుతుందని సంగీత ధ్వనిలో వేదాంత ధ్వని.

ఇక చూడండి. దేవాంగనలు వసురాజును పెండ్లి కుమారుణ్ణి చేసే ఘట్టం గాని – గిరకను పెండ్లి కుమార్తెను చేసే సన్నివేశంగాని పేరటాండ్రు కటక కుండలాద్యలంకారాలతో వారిని నింపారో లేదో గాని యమక శ్లేషాద్యలంకారాలతో ఆపాదమస్తకమూ నింపుతూనే పోతాడు రామరాజ భూషణుడు మాత్రం.

అయింది. ఈ కోలాహలంతో వధూవరులు కోలాహలపురంలో కళ్యాణోత్సవానికి తయారైన సీను ముగిసింది. దానితోపాటు పంచమం కూడా ముగిసి షష్ఠంలో ప్రవేశిస్తాము మనం. మొత్తం మీద పంచమషష్ఠా

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

శ్వాసాలు రెండూ పెండ్లి హడావుడే. కన్యాదానం యధావిధిగా చేశాడు కోలాహలుడు. వధూవరు లొకరి మీద ఒకరు తలంబ్రాలు చల్లుతున్నారు. అందులోనూ ఒక చమత్కారం. **అతివ సతీ కరోన్న మితయై విభునౌ దలసేస జల్లింది** నలుగురు ముత్తైదువలూ చేతులతో పట్టి ఎత్తారట పెండ్లి కూతురిని. అలా ఎత్తి పట్టుకొంటే చల్లుతున్న దావిడ సేసలు. చల్లుతూ ఉండగా '**తత్పతి నవమౌళి రత్నగత భార్యనిజాకృతి చూచారా** అయిదువలు. చూచి '**పతి శిరమెక్కె నీక్షణమె'** అని వేళాకోళం చేశారంటాడు. ఎంత మనోహరమీ సన్నివేశం. అంతే కాదు. **ధరా ధరోపరిస్థిత సరిదాత్మ సంభవకు చెల్లదె'** అని చెలికత్తెలు సబబు కూడ వెతుకుతారందులో. ఇంకా మూడుముళ్లు పడ్డాయో లేదో అప్పుడే పెనిమిటి నెత్తి నెక్కి కూచుందెంత గడుసరి అని మేలమాడితే అది అంతేమరి – ఎక్కడో పర్వత శిఖరం మీద ఉన్న నదీమ తల్లి కూతురు గదా నెత్తిమీది కెక్కటంలో ఆశ్చర్యమే ముందట. ఇక్కడ ధరా ధర అంటే కోలాహలుడు తండ్రి. ఉపరిస్థిత సరిత్తంటే శుక్తిమతి తల్లి. తల్లి తండ్రి నెత్తికెక్కినట్టే కూతురూ తన పెనిమిటి తలకెక్కింది. తల్లి బుద్ధులు కూతురికి కూడా అబ్బాయని ఒక చమత్కారం. మరొక చమత్కారమేమంటే ధరా ధరు డసలు వసురాజే. ఆయన మీద ఎక్కి కూచున్నది సరిదాత్మ సంభవ గిరికే. కవిగారి శబ్ద శక్తి ఎంత దూరం పనిచేసిందో చూడండి.

ఇక మామ కోలాహలుడు తదితర దేవతా నీకం ఆ వసురాజు కిచ్చే కానుకలెలా ఉన్నాయో తెలుసాండీ.

Valluri Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

**గండ శైలములకు కరపాదములు వచ్చెనో** యన్నట్టున్న గజయూధం – **హరిణ జాతికే మరున్న రసనోద్ధతి** కలిగిందా అన్న వేగంతో పరుగెత్తే సైంధవ సమూహం. మేఘాలకే ఎప్పుడూ ఎడబాయని విద్యుల్లతలుంటే ఎలా ఉంటుందో అలాంటి మణిమయ రథాలూ – **లతావళికే గమన విలాస మబ్బిందా ఏమన్నట్టు** ఒయ్యారంగా నడచే కన్యకా సమూహం – అంతే కాదు. తన చరియలలో శిఖరాలలో సహజంగా దొరికే మణి హేమ రజతాదులే శరీరాలు తాల్చి వచ్చాయా అన్నట్టున్న అమూల్యా భరణాదులూ అన్నీ సమర్పించారట. ఎంత రమణీయమైన వర్ణన ఇది. శబ్దాలను వాహనాలుగా చేసుకొని ఆయా అర్థాలన్నీ పిలిస్తే పలుకుతూ వచ్చాయా అన్న అనుభూతి నిస్తుంది రసజ్ఞులకు. ఔనా కాదా, మీరే చెప్పండి **'సహృదయ హృదయ మేవ ప్రమాణ'** మన్నాడు పండితరాయలది అడుగడుగునా సాక్షాత్కరిస్తూనే ఉంటుంది భట్టుమూర్తి శబ్ద చిత్రాలలో.

అంతేనా **'సురభిసంతాన విస్ఫురణ మిచ్చె న గారి యిష్టార్థ సంసిద్ధి నిడి యె వహ్ని'** అని దిక్పాలు రందరూ మహామునులతో సహా వసురాజు కొసగిన కానుకలేమి – ఆశీస్సులేమి – చదువుతుంటే మనం – వారందరూ నోటితో శబ్దాలుచ్చరిస్తూ తమ చేతులలో అమూల్యమైన అర్థాలు సమర్పిస్తున్నట్టు కనిపిస్తుంది మన మనోనేత్రానికి. అంతే కాదు. ఇందులో ఇంకా ఒక విశేషమేమంటే దేశమేలే చక్రవర్తి విష్ణ్వంశ సంభూతుడనే గాక అఖిల దిక్పాలకుల అంశలతో జన్మిస్తాడని ఒక శాస్త్రవచన ముంది. అది కూడా ధ్వనిస్తున్నది దిక్పాలురందరూ సమర్పించారు కానుకలంటే. అవి

వారి అంశలే ఆ రూపంతో వసురాజుకు సంక్రమించాయని వెంటనే స్ఫురిస్తుంది భావుకుడి మనస్సుకు. ఇక ఇంద్రుడు స్వయంగా ఆ రాజుగారికిచ్చే కానుక అమోఘం. అది ఎంత శక్తిమంతమో ఆయన బాహాటంగా వర్ణించటమే గాదు. భట్టుమూర్తి మౌనంగా ఏమీ ఎరుగనట్టు తన శబ్ద శక్తి మూలంగానే బయటపెడుతున్నాడు. ఒక అఖండ వేణుకాండ మిస్తాడు. ఒక దండమిస్తాడు ఒక గద నిస్తాడు. ఒక్కొక్కదాని మహత్త్వం కవి వర్ణిస్తుంటే శబ్దం కంటే అర్థం ముందైతే అర్థం కంటే శబ్దం ముందు పరుగెడుతున్నదా మన హృదయాలను స్పృశించటానికని ముచ్చట పడి చూడాలి మనం.

అనంతరం కోలాహలుడు తన కూతురిని అత్తవారింటికి పంపుతూ అక్కడ ఎలా నడుచుకోవాలో బుద్ధులు చెప్పటం కూడా ఎంతో ముద్దుగానే ఉంటుంది. అందులోనూ **పతికృత ధర్మ కౌశలము పట్టున తోడగు నారి నారి – పితృశరణ ప్రచింత మదిఁబెట్టక యీ శనివేశి తాత్మయౌ సతిసతి–** అని చెబుతుంటే ఆ తండ్రి భట్టుమూర్తే ఆ తండ్రి వేషం వేసుకొని మాటాడుతున్నాడా అని తోస్తుంది నాకు. నారి అంటే స్త్రీ – నారి అంటే వింటి నారి. ధర్మమంటే శాస్త్రవిహిత కర్మ. ధర్మమంటే ధనుస్సు. సతి అంటే దాక్షాయణి. పతివ్రత. ఈ శనివేశితాత్మ అంటే ఈశ శబ్దం శివుణ్ణి చెబుతుంది. వసుధేశుణ్ణి చెబుతుంది. శబ్దశక్తి తోపాటు అర్థ గాంభీర్యం చూడండి అందులో ఔచిత్యం చూడండి. ఎంత హృదయంగమమో. **ఈ శైవాల వతీ ప్రతీర భజనంబీ నిర్మల ప్రస్తరోద్దేశావాసము** – ఇవన్నీ నాకిక

Valluri Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

ఉండబోవే అని బెంగ పెట్టుకోవద్దమ్మా – **అభీష్టవరలక్ష్మీధన్యవు** నీకవి లేకున్నా కొఱత లేదంటాడు తండ్రి. ఎంత గొప్ప మాటో చూడండి. **అభీష్ట వరలక్ష్మీ ధన్య** అనే మాటలో ఉన్నది మర్మమంతా.

**అని తెలుప న శ్రుధారా వినివేశ విలీయమాన వినతాననై** అయిందట ఆ కుమార్తె. తండ్రి దగ్గర అలాగే ప్రవర్తిస్తుంది. ఏ ఆడ బిడ్డయినా కండ్లనీళ్లు పెట్టుకొంటుంది. మాటాడటానికి నోరు పెగలదు. ఎంత సహజంగా ఉందో ఈ వర్ణన. ఇందులో ఎంత సాత్త్విక భావం తొంగి చూస్తున్నదో చూడండి. వెంటనే తండ్రి దగ్గరి నుంచి తల్లి ఆ పిల్లను చేతుల్లోకి తీసుకొని

**తమ్ములఁబంపు దున్ మణిశ తమ్ముల బంపుదు రాజహంస పో**

**తమ్ములఁ బంపుదున్ ద్రుతగతమ్ముల నేనను సారణీ ప్రపా**

**తమ్ముల వత్తు** – అమ్మా బెంగ పెట్టుకోకు. నీ తమ్ములను వాళ్లనూ నీ దగ్గరికి పంపిస్తానులే. అసలు నేనుకూడా ఎప్పుడంటే అప్పుడు ఒక్క అంగలో వచ్చి చూస్తానులే. **'విశ్వవిదితా ముదితా మదితాప మేటికిన్'** నీకు తెలియదా అన్నీ తెలిసి ఎందుకు తపన చెందుతావని బుజ్జగిస్తుంది. ఇక్కడ తమ్ముల అనే మాట శబ్ద చిత్రమే అయినా తరుచుగా వారిని పంపుతానని పలికే తల్లి ఆరాటాన్ని చూపుతున్నది. **విదితా ముదితా మదితాపమని** అంటున్నా మా అమ్మగదూ మా బంగారు గదూ ఊరుకోమని బుజ్జగించే ధోరణిని ధ్వనింప జేస్తున్నది. శబ్ద చిత్రమని గాదు మనం చూడవలసింది. పాత్రల చిత్తవృత్తులందులో ఎంత స్ఫుటంగా కని పిస్తున్నాయో వాటి మీద దృష్టి పెట్టాలి. పైకి శబ్దం ఆ వృత్తి అవుతున్నా దాని అర్థం మీదనే పడుతుంది భావుకుడి దృష్టి. సందేహం లేదు.

ఇంకా చూడండి ఆ తల్లి ఏమంటుందో. ఆవిడ పడే ఆవేదన ఎలాటిదో, **'బెగడవలదనుచు బెట్టిద మగు నెవ్వగ నగడు పడుచు'** దిగులు పడకు తల్లీ అని అన్నదో లేదో తరువాతి మాట నోట రాలేదావిడకు. డగ్గుత్తిక పడ్డది. ఒక్కక్షణమలా ఉండిపోయి ఏమంటుందో తెలుసా **'ఆడుబడుచు లేపగవారికి వలదన - నాపగ వారికి నేలయొసగె పద్మజు'** డంటుంది. ఎంత మాట ఇది. ఆడపిల్లలు పగవారికైనా ఉండగూడదు బాబూ. ఉంటే ఇలాగే వారి వియోగ వేదన ననుభవించాలి తలిదండ్రులు. అయినా **ఆ పగవారికే** ఇచ్చాడా బ్రహ్మదేవుడు ఏమి చెప్పాలని వాపోతుంది. ఇక్కడ ఆ పగవారికి అంటే ఒక అర్థం. ఆ పగవారి కంటే నదీజలాని కని ఒక అర్థం. శబ్ద ప్రయోగంలోనే చమత్కారం. కాని శబ్దమనే తెర చీల్చుకొని అర్థంలోని లోతునెలా బయటపెడుతున్నదో చూడండి తల్లి వాత్సల్యం. సరిగా మనకిలాటి చోట పోతన మహాకవి గుర్తు వస్తాడు. ఆయన ఇలాగే యమకాను ప్రాసాద్యలంకారా లెక్కడ బడితే అక్కడ కుమ్మరిస్తూ పోతాడు. సందర్భమెలాటిదైనా సరే. పాత్ర ఎలాంటిదైనా సరే. ఆ వితరణకు హద్దులుండవు. అయినా గొప్పతనమేమంటే అది ఉంటే ఉండనీ. తంబుర నాదంలాగా అది అనుస్యూతంగా వస్తున్నా కవి గాయకుడి గాత్ర కచ్చేరిలో లీనమై పోయి ఉంటుంది. వచ్చీపోయి మూర్తి కవి శబ్దమూర్తి కూడా ఇంతే.

ఏతావతా చెప్పేదేమంటే ఇలా తవ్వుతూ పోతే ఎంత దూరమైనా పోవచ్చు రామరాజ భూషణుని కవితా హిరణ్య నిధి. అది ఒక కోలారుగని లాంటి పెద్ద వాలారుగని. అంతా బంగారమే. భూషణకవి గదా తాను.

దానితో ఎన్నెన్నో భూషణాలు చేయించి ఆపాదమస్తకమూ దిగేశాడు తన కావ్యకన్య కను అత్యాశగా. ఆవిడను సర్వాంగ సుందరంగా అలంకరించి రసికజన సమాజానికి ప్రదర్శించాలనుకొన్నాడు. పెద్దనాది ప్రబంధ కవులందరి కంటే ముందుగా తెచ్చి స్వయంవరంలో ఆ కన్యను నలుగురి ఎదుటా నిలబెట్టాలని ఆయన తహ తహ. కాని ఆ కన్య అన్ని బరువైన సొమ్ములు ధరించి తేలికగా చరచరా నడచి రాగలదా అని అంతగా ఆలోచించలేదా మహాకవి. ఏ పద్యం వ్రాసినా అందులో ఎన్ని గారడీలు చేసి చూపినా ఎన్ని శబ్దార్థ చిత్రాలు గుప్పించినా ఒక గొప్ప విశేషమేమంటే ఏమాత్రమూ కుంటుపడదు పద్యం. ఎన్ని విరుపులు విరిగినా ఒయ్యారంగా ధారాళంగా ముందుకు దూసుకుపోతుంది. ఎన్ని శ్లేషలు వాడినా అనాయాసంగా అతి సహజంగా అప్రయత్నంగా అహమహమికతో దొర్లిపోతుంటాయి పద్యాలు. పద్య గమనంతో తృప్తిపడితే అక్కడికే పడవచ్చు. అలంకారం కూడా తడవి చూచినా చూచి ఆనందించవచ్చు. అందులో ఎంత వైచిత్రి ఉందో అది చూచి అక్కడికీ ఆగిపోవచ్చు. అలా కాక ఇంకా లోతుకు దిగి అందులో సవసవగా హృదయాన్ని సోకే మానవ మనస్తత్వ విభూతిని భావించి పారవశ్యం చెందినా చెందవచ్చు సహృదయుడు. అలాంటి విభావాను భావ సంచారి సాత్త్విక భావావిష్కరణలో కూడా మరే కవికి తీసిపోడు మూర్తికవి. అందులోనూ అందె వేసిన చేయే. కాని శోచనీయ మేమంటే దాని వైభవాన్ని దర్శించి ఆనందించటానికీ శబ్దార్థ చిత్రప్రాభవ మడుగడుగునా అడ్డు తగులుతూ

సహృదయుడి సహనాన్ని తరుచు పరీక్షిస్తుంటుంది. ఈ ఒక్క చాపల్యం లేకుంటే కనీసమంత తరుచుగా గాక అరుదుగా ఎక్కడైనా దాన్ని చూపుతూ పోయి ఉంటే చూడండి. రామరాజ కవి కవితా చాపగుణ ధ్వని పరంపర మన హృదయ మందిరంలో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆయన మన ఎదుట నిలిపిన నానావిధ చిత్ర విచిత్ర భావ చిత్రాలూ నేత్రోత్సవం కొలుపుతూనే ఉంటాయి. సందేహం లేదు.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in